www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 11-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 245 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం, తిథి: సప్తమి రా.11:09 తదుపరి అష్టమి, నక్షత్రం: పుష్యమి రా.6:18 తదుపరి ఆశ్లేష, వర్జ్యం: లేదు, దుర్ముహూర్తం: ఉ.8:36-9:21, రా.9:47-10:37, అమృతఘడియలు: మ.12:02-1:36, రాహుకాలం: మ.3:00-4:30, సూర్యోదయం: 6:21, సూర్యాస్తమయం: 5:36

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆదుకోండి

మొంథాతో అంచనాకు మించి అపార నష్టం

రూ.901 కోట్ల తక్షణ సాయం అందించండి

కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

ప్రజెంటేషన్ ఇచ్చిన రెవెన్యూ, 'విపత్తు' శాఖలు

నాలుగు జిల్లాల్లో బృందం పర్యటన 14

దెబ్బతిన్న పంటల వివరాలు నమోదు

ఢిల్లీలో భారీ పేలుడు

9 మంది మృతి

24 మందికి గాయాలు

ఎర్రకోట సమీపంలో పేలిన కారు

ముగ్గురి పరిస్థితి విషమం.. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం

ఛిద్రమైన శరీర భాగాలతో ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు

పేలుడు ధాటికి తీవ్రంగా దెబ్బతిన్న పలు వాహనాలు, దుకాణాలు

పేలుడు సమయంలో కారులో ఉన్న ముగ్గురి మృతి

ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ ఆరా

ఘటనాస్థలికి హోం మంత్రి షా

ఆస్పత్రిలో క్షతగాత్రులకు పరామర్శ

ఉగ్ర కుట్ర కోణంలో ఎన్ఐఏ దర్యాప్తు

కారు కదలికలపై వివరాల కోసం సీసీటీవీ కెమెరాల జల్లెడ



ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడుతో మంటల్లో కాలిపోతున్న వాహనాలు.. క్షతగాత్రులను రక్షించడానికి స్థానికుల యత్నం

న్యూఢిల్లీ, నవంబరు 10: దేశ రాజధాని ఢిల్లీ.. భారీ పేలుడుతో దద్దరిల్లింది! దేశంలోని అత్యంత హై ప్రొఫైల్ ప్రాంతాల్లో ఒకటి.. పంద్రాగస్టునాడు దేశ ప్రధాని జాతినుద్దేశించి ప్రసంగించే ఎర్రకోటకు సమీపంలోని మెట్రోస్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం 7 గంటల సమయంలో కారు పేలి 9 మంది మరణించగా.. 24 మంది తీవ్రంగా గాయపడ్డారు! క్షతగాత్రులను హుటాహుటిన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి తరలించారు. మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని.. గాయపడ్డవారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని సమాచారం. ఢిల్లీకి కేవలం 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న హరియాణాలోని ఫరీదాబాద్‌లో 2900 కిలోల బాంబు తయారీ పదార్థాలను పట్టుకున్న రోజునే.. అదీ హరియాణా రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉన్న కారులో పేలుడు జరగడంతో.. దీని వెనుక ఉగ్ర కుట్ర ఏమైనా ఉందా అనే కోణంలో పోలీసులు, కేంద్ర దర్యాప్తు సంస్థల అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా.. పేలుడు తీవ్రతకు ఘటనాస్థలి వద్ద భీతావహ దృశ్యాలు కనిపించాయి. మృతదేహాలు ఛిద్రమై శరీర భాగాలు చెల్లాచెదురుగా రోడ్డుపైన, పక్కనే ఉన్న వాహనాలపైనా పడ్డాయి. పేలుడు ధాటికి.. చుట్టూ ఉన్న వాహనాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆరు కార్లు, రెండు ఈ-రిక్షాలు, ఒక ఆటో అగ్నికి ఆహుతైపోయాయి. మొత్తం 22 కార్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఘటనాస్థలికి సమీపంలోని పలు దుకాణాలు ధ్వంసమయ్యాయి. భవనాలు కంపించాయి. ఈ పేలుడు జరిగిన మూడు నిమిషాలకే అగ్నిమాపక శాఖకు ఫోన్ కాల్

మిగతా 2వ పేజీలో...



పేలుడుకు కారణమేంటో ఇప్పటికిప్పుడు చెప్పలేం

అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తాం

వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతాం: అమిత్ షా

రాష్ట్రంలో హై అలర్ట్

పోలీసులతో డీజీపీ టెలికాన్ఫరెన్స్

రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర సోదాలు

అన్ని ప్రాంతాల్లో పూర్తి అప్రమత్తత 11

ఢిల్లీ విమానాశ్రయం పరిధిలో జీపీఎస్ స్పూఫింగ్! 11

విమానాలకు తప్పుడు సంకేతాలు అందినట్లు పైలట్ల ఫిర్యాదు

దర్యాప్తు చేపట్టిన ఎన్ఎస్‌పీ కార్యాలయం

భారీ ఉగ్ర కుట్ర భగ్నం

3 రాష్ట్రాల్లో 8 మంది ఉగ్రవాదుల అరెస్టు

వీరిలో ముగ్గురు వైద్యులు, వారిలో ఒకరు మహిళా డాక్టర్

2,900 కేజీల పేలుడు పదార్థాల స్వాధీనం

ఏకే 47 రైఫిళ్లు, పిస్తోళ్లు, టైమర్లు గుర్తింపు

మహిళా డాక్టర్ కారులో అసాల్ట్ రైఫిల్

హైదరాబాద్ డాక్టర్ అరెస్టుతో కలిపి నలుగురు వైద్యులకు ఉగ్ర లింకులు

శ్రీనగర్‌లో వెలసిన పోస్టర్లపై కూపీ లాగితే బయటపడ్డ కుట్ర

హరియాణా, కశ్మీర్ పోలీసుల ఆపరేషన్



మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు, అధికారులు

లక్ష కోట్ల పెట్టుబడులకు క్యాబినెట్ ఓకే

విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు అసైన్డ్ భూములు

చట్టంలో కీలక సవరణలతో ఆర్డినెన్స్ జారీకి ఆమోదం

విశాఖలో పలు ఐటీ సంస్థలకు భూ కేటాయింపులకు అంగీకారం

కుప్పం, ఓర్వకల్లు, నాయుడుపేటల్లో పలు పరిశ్రమలకు కూడా..

క్యాబినెట్ నిర్ణయాలను వెల్లడించిన మంత్రి పార్థసారథి

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సోమవారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన అమరావతి సచివాలయంలో క్యాబినెట్ సమావేశం జరిగింది. 70 అంశాలకు ఆమోదం తెలిపింది. సమావేశం అనంతరం రాష్ట్ర సమాచార-పౌరసంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి కొలుసు పార్థసారథి విలేకరులకు వివరాలు వెల్లడించారు. అభివృద్ధి , యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా దాదాపు లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు క్యాబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పాలసీల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 13వ పేజీలో...

సొంత ఊర్లో ఐటీ ఉద్యోగం..!

మండలానికో వర్క్‌స్పేస్ సెంటర్

కనీసం 610 మంది పనిచేసేలా సదుపాయాలు, రోజంతా కరెంట్

హైస్పీడ్ నెట్, వీసీ సౌకర్యం తప్పనిసరి

సమావేశాలకు ప్రత్యేక గది, స్కానింగ్, ప్రింటింగ్, లాకర్ సౌకర్యం 13

వర్క్‌స్పేస్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

'క్వాంటమ్' బొనాంజా!

రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ ఏర్పాటుకు సానుకూల వాతావరణం కల్పించే దిశగా చర్యలు

పరిశోధనలు, హార్డ్‌వేర్ పార్కులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం

ప్రత్యేక క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీకి ఆమోద ముద్ర 13

ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతోంది!

వారు చెబితేనే పనులవుతున్నాయి: పవన్ కల్యాణ్

మనం చెప్పే గవర్నెన్స్‌కు, క్షేత్రస్థాయి పరిస్థితికి చాలా తేడా ఉంది

దీనిని సరిదిద్దుకోకపోతే ప్రజాపాలనకు అర్థం ఉండదు

సీఎం జోక్యం చేసుకుని హెచ్చరించాలి

క్యాబినెట్ భేటీలో డిప్యూటీ సీఎం సూచన

కూటమి ఎమ్మెల్యేలు ఎవరు తప్పుచేసినా ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలి

వారి తప్పులు సరిదిద్దే ప్రయత్నం చేయండి

వినకుంటే నా దృష్టికి తీసుకురండి: సీఎం

ఎర్రచందనంపై క్షేత్రస్థాయికి వెళ్లి పవన్ బాగా చేస్తున్నారని ప్రశంస

ఏడాదిలోగా పేదలందరికీ ఇళ్ల స్థలాలు

పెట్టుబడుల కోసం ఎంత కష్టపడుతున్నదీ హైస్కూల్ స్థాయి పిల్లలకూ తెలియాలి: బాబు

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'కూటమి ప్రభుత్వం పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని పదే పదే చెబుతోంది. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. చాలా చోట్ల ఎమ్మెల్యేలు చెబితేనే పనులవుతున్నాయి. దీనిని సరిదిద్దుకోకపోతే మనం చెప్పే గవర్నెన్స్‌కు.. ప్రజాపాలనకు అర్థం మారిపోతుంది' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని, పార్టీలతో సంబంధం లేకుండా.. కూటమి ఎమ్మెల్యేలను గట్టిగా హెచ్చరించాలని కోరారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన క్యాబినెట్ సమావేశం సోమవారం సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేల పనితీరుపై వాడీవేడి చర్చ జరిగినట్లు సమాచారం. రెవెన్యూ వివాదాలను త్వరితగతిన పరిష్కరించాలని సీఎం సూచించినప్పుడు.. భూవివాదాల విషయంలో కొందరు

మిగతా 12వ పేజీలో...



లీటరు పాలు కొనలేదు. పావుకిలో వెన్న కూడా తియ్యలేదు. కానీ.. ఏకంగా 68 లక్షల కిలోల నెయ్యిని సరఫరా చేశారు. ఎలాగంటారా.. అంతా కల్తీనే! పలురకాల నూనెలు, రసాయనాలు కలిపేసి దానికే నెయ్యి కలరింగ్ ఇచ్చేశారు! ఇది.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడో, కూటమి ప్రభుత్వమో చెబుతున్న విషయం కాదు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు.. సీబీఐ భాగస్వామిగా ఏర్పడిన ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తేల్చి చెప్పిన సంగతి! దీంతో జగన్ రోత మీడియాకు కక్కలేని, మింగలేని పరిస్థితి ఏర్పడింది. 'బాబాయ్' వైవీ సుబ్బారెడ్డిని వెనకేసుకొచ్చేందుకు, చిత్రవిచిత్ర కథనాలతో కూటమి ప్రభుత్వంపై బురద జల్లేందుకు ప్రయత్నిస్తూనే ఉంది.

భోలేబాబా మాయ!

పాలు లేవు.. వెన్న తియ్యలేదు

టన్నులకొద్దీ కల్తీ నెయ్యి తయార్

పామాయిల్, రసాయనాలతో 'నెయ్యి'

తిరుమల ప్రసాదాలకు అదే సరఫరా

ఏఆర్, శ్రీవైష్ణవీ డెయిరీలకూ అదే సరుకు

అక్కడి నుంచి టీటీడీకి పంపిన సంస్థలు

'సుగంధ్ ఆయిల్స్' యజమాని అరెస్టుతో కీలక విషయాలు

రిమాండ్ రిపోర్టులో వెల్లడించిన 'సిట్'

అయినా ఆగని జగన్ మీడియా బొంకులు

(అమరావతి/తిరుపతి - ఆంధ్రజ్యోతి)

కల్తీ నెయ్యి గుట్టు వీడుతోంది. పరమ పవిత్రమైన తిరుమలేశుడి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి యథేచ్ఛగా వాడినట్లు సీబీఐ భాగస్వామిగా ఉన్న 'సిట్' తేల్చింది. జగన్ ప్రభుత్వ హయాంలో పామోలిన్ నూనెలో రసాయనాలు కలిపేసి తయారు చేసిన నెయ్యిని తిరుమలకు సరఫరా చేసినట్లు నిర్ధారణ అయ్యింది. కల్తీ నెయ్యి కేసును దర్యాప్తు

మిగతా 12వ పేజీలో...



అందెశ్రీ హఠాన్మరణం

హైదరాబాద్‌లో ఇంట్లోనే కుప్పకూలిన సహజ కవి 14

హుటాహుటిన గాంధీ ఆస్పత్రికి తరలింపు.. అప్పటికే మృతి

నేడు అంత్యక్రియలు

సాహితీ లోకానికి తీరని లోటు: చంద్రబాబు

మొబైల్ కొట్టేసి.. ఫోన్ పేలో దోచేసి..

రైల్వేస్టేషన్లో చార్జింగ్ పెట్టిన ఫోన్ను మాయం చేసి నయా దోపిడీ 3

బిహార్లో నేడే తుది పోరు

122 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్

3.7 కోట్ల మంది ఓటర్ల చేతిలో 1,302 మంది అభ్యర్థుల భవిత

1.75 కోట్ల మంది మహిళా ఓటర్లు

నవయువ ఓటర్లు 7.69 లక్షలు

ఈ నెల 14న ఓట్ల లెక్కింపు

నేడే జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ కూడా..



బిహార్‌లోని మోతీహారిలో ఎన్నికల సామగ్రితో విధులకు వెళ్తున్న సిబ్బంది

పట్నా, నవంబరు 10: బిహార్ అసెంబ్లీ ఎన్నికలు చివరి అంకానికి చేరాయి. రెండోది, చివరి విడత ఎన్నికల్లో 122 స్థానాలకు మంగళవారం పోలింగ్ జరుగనుంది. వివిధ ప్రధాన పార్టీల నేతలు సహా 1,302 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 3.75 కోట్ల మంది ఓటర్లు వీరి భవితవ్యాన్ని ఈవీఎంలలో నిక్షిప్తం చేయనున్నారు. వీరిలో 1.75 కోట్ల మంది మహిళలే. 18-19 ఏళ్ల వయసుగల నవయువ

మిగతా 11వ పేజీలో...

'రాజంపేట'లో కోవర్టుల రాజ్యం

లోక్‌సభ స్థానం పరిధిలో 'ఫిక్సింగ్' రాజకీయం

కొందరు తమ్ముళ్లు మోసేది పసుపు జెండా..

పెద్దిరెడ్డి ప్రయోజనాలే రహస్య అజెండా

2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి

ఆ పార్టీ అభ్యర్థులకు ఆర్థిక సాయం

నాడు పెద్దిరెడ్డి ఎన్నో అరాచకాలు, అక్రమాలు

2023లో చంద్రబాబుపై వైసీపీ శ్రేణుల రాళ్ల దాడి

అక్రమార్కులకు కొందరు టీడీపీ నేతల సహకారం

వైసీపీ పాలనలో అన్నమయ్య జిల్లాలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబం, వాళ్ల అనుచరులు చేసిన అక్రమాలకు అంతే లేదు. జిల్లాలో కొందరు టీడీపీ నేతలు తప్ప ముఖ్య నాయకులు ఎవరూ వీటి గురించి ఇప్పుడు మాట్లాడటం లేదు. పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయ ప్రత్యర్థిగా చూడకపోగా.. 'మాకు మీరు.. మీకు మేము' అన్నట్టుగా సర్దుబాటులో ఉన్నారనే ఆరోపణలు ఉన్నాయి. 14

కేసును ఎలా రాజీ చేశారు?

మీకు తెలియకుండా జరిగే వీలు లేదు

ఎవరైనా అధికారి లేక నేత ఒత్తిడి చేశారా?

దొరికింది 12 నోట్లయితే, తొమ్మిదే చూపారే?

డాలర్ విలువ పెంచి నమోదు చేశారేం?

'పరకామణి' కేసులో అప్పటి సీఐ జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, వీజీవో గిరిధర్‌పై సీఐడీ ప్రశ్నల వర్షం 14

పేలుడు ఘటనపై మోదీ ఆరా

» పరిస్థితిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమీక్ష

న్యూఢిల్లీ, నవంబరు 10: ఢిల్లీ ఎర్రకోట సమీపంలో పేలుడు ఘటనపై ప్రధాని మోదీ ఆరా తీశారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షాను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోదీ పోస్ట్ పెట్టారు. ఘటనలో మృతిచెందినవారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. హోంమంత్రి షాతో పాటు ఇతర అధికారులతోనూ మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు మోదీ ఎక్స్‌లో తెలిపారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు అమిత్ షా తెలిపారు. సమాచారం అందిన 10 నిమిషాల్లోనే ఘటనా స్థలానికి ఢిల్లీ క్రైం బ్రాంచ్, ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ చేరుకున్నాయని చెప్పారు. ఘటనపై ఎన్ఐఏ, ఎన్ఎస్‌జీ, ఫోరెన్సిక్ బృందాలు లోతుగా దర్యాప్తు చేస్తున్నాయన్నారు. అన్ని కోణాల్లో దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతామన్నారు. మంగళవారం ఉన్నతాధికారులతో కీలక సమావేశం నిర్వహిస్తామన్నారు. మరోవైపు పేలుడు ఘటనలో బాధిత కుటుంబాలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతాపం తెలిపారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలంటూ ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ఢిల్లీ సీఎం రేఖా గుప్తా పేలుడు మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. పుకార్లను నమ్మవద్దని రేఖాగుప్త ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పేలుడు ఘటనలో మరణాలు బాధాకరమంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. బాధిత కుటుంబాలకు సంతాపం తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, కేరళ సీఎం విజయన్, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్, కర్ణాటక సీఎం సిద్ధరామయ్య తదితరులు పేలుడు ఘటనపై తీవ్ర దిగ్ర్భాంతి వ్యక్తం చేశారు.

ఢిల్లీలో గతంలో పలు ఉగ్రదాడులు

న్యూఢిల్లీ, నవంబరు 10: ఢిల్లీలో గతంలోనూ పలుచోట్ల ఉగ్ర దాడులు, బాంబు పేలుళ్లు జరిగాయి. 1996 వేసవిలో అత్యంత రద్దీగా ఉండే లజపత్ నగర్ మార్కెట్‌లో బాంబు పేలుడులో 13 మంది మరణించగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. తర్వాతి ఏడాదే సదర్ బజార్, కరోల్ బాగ్, రాణి బాగ్, చాందిని చౌక్‌లలో పేలుళ్లు చోటు చేసుకున్నాయి. పంజాబీ బాగ్‌లో బస్సులో పేలుడు సంభవించింది. 2000 సంవత్సరం డిసెంబరులో ఒక ఉగ్రమూక ఎర్రకోట లోపల కాల్పులు జరపగా ఇద్దరు మృతి చెందారు. ఆ తర్వాత 2001 డిసెంబరులోనే పార్లమెంటుపై దాడి జరిగి 9 మంది ప్రాణాలు కోల్పోయారు. 2005లో దీపావళికి రెండు రోజుల ముందు పహర్‌గంజ్, సరోజిని నగర్, గోవింద్‌పురిలో డీటీసీ బస్సులో జరిగిన వరుస పేలుళ్లలో 67 మంది ప్రాణాలు కోల్పోగా 200 మందికి పైగా గాయపడ్డారు. ఆ తర్వాత మూడేళ్లకు అంటే 2008లో కనాట్ ప్లేస్, కరోల్ బాగ్, గ్రేటర్ కైలాష్‌లలో ఐదుచోట్ల ఒకేసారి జరిగిన పేలుళ్లలో 20 మంది ప్రాణాలు కోల్పోగా డజన్ల మంది గాయపడ్డారు. తర్వాత 2011లో ఢిల్లీ హైకోర్టు బయట బ్రీఫ్‌కేస్‌లో పెట్టిన బాంబు పేలి 15 మంది మరణించగా.. 79 మంది గాయపడ్డారు.

సామూహిక విష ప్రయోగానికి కుట్ర!?

» దేశంలో వేలాదిమందిని చంపడానికి మొహియుద్దీన్ ప్లాన్

» రిసిన్‌ను మంచినీళ్లు, ప్రసాదాల్లో కలిపేందుకు పావులు

హైదరాబాద్ సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుజరాత్ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్) పోలీసులు ఆదివారం అరెస్టు చేసిన హైదరాబాదీ డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ సామూహిక విష ప్రయోగానికి ప్రణాళిక రచించినట్లు పోలీసులు తమ విచారణలో గుర్తించినట్లు తెలిసింది. రాజేంద్ర నగర్ సర్కిల్ ఫోర్ట్‌వ్యూ కాలనీలో నివాసం ఉంటున్న మొహియుద్దీన్.. చైనాలో ఎంబీబీఎస్ చదివాడు. ఆన్‌లైన్‌లో కన్సల్టెంట్ డాక్టర్‌గా పనిచేస్తూనే ఉగ్రవాదులతో పరిచయం పెంచుకున్నాడు. పాకిస్థానీ హ్యాండ్లర్ల నుంచి అందిన ఆదేశాల మేరకు దేశంలో ప్రాణాంతకమైన రిసిన్ కెమికల్ (అత్యంత విషపూరితమైనది)తో దాడులు చేసేందుకు పథకం రచించినట్లు తెలిసింది. రిసిన్‌ను ప్రపంచంలోనే అత్యంత ప్రాణాంతకమైన జీవ విషాల్లో ఒకటిగా నిపుణులు చెబుతున్నారు. రుచి, వాసన లేకపోవడం దీని ప్రత్యేకత. గ్లాసు నీటిలో కలిపి ఇస్తే ఎవరూ అనుమానించలేరని నిపుణులు చెబుతున్నారని పోలీసు వర్గాల ద్వారా తెలుస్తోంది. సులభంగా దొరికే ఆముదం గింజల నుంచి దీనిని తయారు చేస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. దేశంలోని ప్రధాన నగరాల్లో మంచినీళ్లు, గుడి ప్రసాదాల్లో ఈ విషాన్ని కలిపి, ప్రపంచంలోనే అతి పెద్ద సామూహిక విష ప్రయోగానికి పాల్పడి వేలాదిమంది మృత్యువాత పడేలా ప్రణాళికలు తయారు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలుస్తోంది.

భారత్ సహకారంతో మాల్దీవుల్లో ఎయిర్‌పోర్టు

» ప్రారంభించిన ముయిజ్జు.. పాల్గొన్న రామ్మోహన్ నాయుడు

మాలే, నవంబరు 10: భారత్ అందించిన ఆర్థిక సహకారంతో మాల్దీవుల్లో హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణం పూర్తయింది. దీన్ని ఆ దేశ అధ్యక్షుడు మహ్మద్ ముయిజ్జు ఆదివారం భారత పౌరవిమానయాన శాఖ మంత్రి కె.రామ్మోహన్‌నాయుడుతో కలిసి ప్రారంభించారు. ముయిజ్జు మాట్లాడుతూ ప్రపంచంతో మాల్దీవులను మరింత అనుసంధానించే మార్గంగా ఎయిర్‌పోర్టు పనిచేస్తుందన్నారు. ఈ విమానాశ్రయం 'పొరుగు దేశాలే ముందు, మహాసాగర్ విజన్' విషయాల్లో భారత్ కట్టుబాటుకు నిదర్శనమని భారత హైకమిషన్ పేర్కొంది. హనిమాధూ విమానాశ్రయం అభివృద్ధికి భారత్‌కు చెందిన ఎగ్జిమ్ బ్యాంక్ సుమారు రూ.7 వేల కోట్లు రుణ సహకారం అందించింది.

'వాటర్‌షెడ్'తో పర్యావరణ పునరుద్ధరణ: పెమ్మసాని



గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశంలో పర్యావరణ వ్యవస్థల పునరుద్ధరణే వాటర్‌షెడ్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఏటా కనీసం 25 వేల చెరువుల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రజల భాగస్వామ్యం, అవగాహనతో అద్భుత ఫలితాలు సాధించగలమన్నారు. రెండు రోజుల జాతీయ వాటర్‌షెడ్ సదస్సు సోమవారం గుంటూరులో ప్రారంభమైంది. పెమ్మసాని మాట్లాడుతూ.. ఏటా తలసరి నీటి వినియోగం 1,700 క్యూబిక్ మీటర్లుగా ఉందని, ప్రస్తుత ట్రెండ్‌ని చూస్తే 2031 నాటికి ఇది 1,367కి తగ్గిపోయే ప్రమాదం ఉందన్నారు.

సీఎంతో నేడు శివరాజ్‌సింగ్ భేటీ

కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మంగళవారం ఏపీకి రానున్నారు. గుంటూరులో జరుగుతున్న వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో పాల్గొననున్నారు. అనంతరం సీఎం చంద్రబాబుతో శివరాజ్‌సింగ్ భేటీ కానున్నారు.

సత్యసాయి ఉత్సవాలకు రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ

» ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధాని మోదీ, 22న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలూ తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సోమవారం సచివాలయంలో మంత్రులు, అధికారులతో సీఎం సమీక్షించారు.

కొట్టివేసిన నిబంధనలతో కొత్త చట్టం తెస్తారా?

» కేంద్రానికి సుప్రీం ప్రశ్న.. ట్రైబ్యునళ్ల చట్టంపై విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 10: న్యాయస్థానాలు కొట్టివేసిన నిబంధనలతో కొత్త చట్టం ఎలా తీసుకొస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. ఏవో చిన్న చిన్న మార్పులు చేసి, తీర్పును ఏ మాత్రం పట్టించుకోకుండా పాత నిబంధనలతోనే కొత్త చట్టాన్ని రూపొందించడం ఏమిటని అడిగింది. ట్రైబ్యునళ్ల సంస్కరణలు, హేతుబద్ధీకరణ, సర్వీసు నిబంధనల చట్టం-2021ని సవాలు చేస్తూ మద్రాసు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ప్రశ్నలు వేసింది.

ఢిల్లీలో భారీ పేలుడు

(మొదటి పేజీ తరువాయి)



పేలుడు ధాటికి కాలిపోతున్న పలు వాహనాలు

వెళ్లింది. వెంటనే ఏడు యూనిట్ల అగ్నిమాపక సిబ్బంది 20 ఫైరింజన్లతో అక్కడికి చేరుకుని మంటలార్పేందుకు రంగంలోకి దిగి.. 7.29 గంటలకల్లా.. అంటే పేలుడు జరిగిన 40 నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ పేలుడుకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని ఢిల్లీ పోలీసు కమిషనర్ సతీశ్ గోల్చా వెల్లడించారు. "సాయంత్రం 6.52 గంటలకు.. రెడ్‌ఫోర్ట్ మెట్రోస్టేషన్ గేట్ నంబర్ 1 వద్ద ట్రాఫిక్ రెడ్ సిగ్నల్ పడడంతో నిదానంగా వచ్చిన ఒక కారు అక్కడ ఆగీ ఆగగానే పేలిపోయింది. ఆ సమయంలో ఆ కారులో ప్రయాణికులున్నారు. పేలుడు ధాటికి దాని చుట్టుపక్కలున్న వాహనాలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయి" అని ఆయన తెలిపారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు బలగాలతోపాటు.. జాతీయ దర్యాప్తు సంస్థ, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, సీఆర్పీఎఫ్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్ సహా పలు ఏజెన్సీల అధికారులు అక్కడికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించినట్లు వివరించారు. పరిస్థితిని అనుక్షణం పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సమాచారాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు తెలుపుతున్నట్లు వెల్లడించారు. పేలిపోయిన కారులో ముగ్గురు ఉన్నట్టు మరో సీనియర్ పోలీసు అధికారి తెలిపారు. "పేలుడు జరిగిన చోట ఎలాంటి గుంతా పడలేదు. పేలుడు ధాటికి గాయపడ్డవారి శరీరాల్లో ఎలాంటి పెల్లెట్లూ కనిపించలేదు. బాంబు పేలుడు అయితే ఇలా జరగడం అసాధారణం. దీనిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. అందులో భాగంగా.. ఆ కారు ఏయే ప్రాంతాల్లో తిరిగిందో తెలుసుకోవడానికి నగరంలోని అన్ని సీసీటీవీ కెమెరాలనూ జల్లెడపడుతున్నారు. పేలుడుకు ముందు ఏదైనా అనుమానాస్పదంగా కనిపించిందా? అని స్థానికులను, ప్రత్యక్షసాక్షులను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్రాంతంలో పేలుడుకు ముందు నమోదైన ఫోన్‌కాల్స్ డేటాను విశ్లేషిస్తున్నారు.



పేలుడు తీవ్రతకు ఎగిరి దూరంగా పడ్డ ఓ వ్యక్తి మృతదేహం

కారెవరిది?

హరియాణా రిజిస్ట్రేషన్‌తో ఉన్న హ్యూందాయ్ ఐ20 కారులో పేలుడు జరిగినట్టు పోలీసులు తెలిపారు. ఈ కారు నదీం అనే వ్యక్తి పేరిట ఉన్నట్టు సమాచారం. కారు యజమానిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిజానికి ఈ కారును ఏడాదిన్నర క్రితం సలీం అనే వ్యక్తి.. దేవేంద్ర అనే వ్యక్తికి విక్రయించాడని సమాచారం. గురుగ్రామ్ పోలీసులు వారిద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. దేవేంద్ర ఆ తర్వాత ఆ కారును హరియాణాలోని అంబాలకు చెందిన వ్యక్తికి అమ్మినట్టు తెలిసింది.

భయంతో పరుగులు..

"అంత పెద్ద భారీ పేలుడు శబ్దాన్ని మా జీవితంలో ఎప్పుడూ వినలేదు" అని ఘటనాస్థలికి సమీపంలో ఉన్న ప్రత్యక్ష సాక్షులు పలువురు తెలిపారు. "పేలుడు జరిగిన సమయంలో నేను నా దుకాణంలో ఉన్నాను. పేలుడు ధాటికి నా కుర్చీలోంచి కింద పడిపోయాను. వెంటనే లేచి బయటకు పరుగెత్తాను. చాలామంది ఆ సమయంలో తలోదిక్కుకూ పరుగులు తీయడం కనిపించింది" అని అక్కడి ఒక దుకాణదారు చెప్పారు. "నేను మా ఇంటి టెర్రస్ మీద ఉండగా.. పెద్ద పేలుడు శబ్దం వినిపించింది. చూస్తే దూరంగా అగ్ని జ్వాలలు. పేలుడు ధాటికి భవనాల కిటికీలు కదిలిపోయాయి" అని మరో ప్రత్యక్ష సాక్షి తెలిపారు. పేలుడు ఘటనతో ఢిల్లీని అనుకుని ఉన్న యూపీ జిల్లాల్లో పోలీసు ఉన్నతాధికారులు అప్రమత్తమయ్యారు. మతపరంగా, ఇతరత్రా సున్నితమైన ప్రార్థన మందిరాలు, ఢిల్లీ సరిహద్దుల్లో భద్రత కట్టుదిట్టం చేశారు.

మా వాళ్లని చూడనివ్వట్లేదు..


ఈ పేలుడులో గాయపడ్డవారి కుటుంబసభ్యులు, బంధువులు.. విషయం తెలియగానే ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి చేరుకుని తమవారి కోసం ఆందోళనతో ఆరా తీశారు. గాయపడ్డ తమవారిని చూడ్డానికి ఆస్పత్రి సిబ్బంది తమను అనుమతించట్లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, పేలిన కారు కదలికల కోసం సీసీటీవీ కెమెరాలను జల్లెడ పట్టిన పోలీసులు.. ఆ కారు దరియాగంజ్ మార్కెట్ నుంచి బయల్దేరి సాయంత్రం 4 గంటల సమయానికి సునెహ్రీ మసీదు పార్కింగ్ ఏరియా వద్దకు చేరుకున్నట్టు గుర్తించారు. అనంతరం ఆ కారు మళ్లీ ఛత్తా రైల్‌చౌక్ వద్ద యూటర్న్ తీసుకుని.. లోయర్ సుభాష్ మార్గ్ దిశగా వెళ్తున్న దృశ్యాలను గుర్తించారు. అక్కడ ఆ కారు సిగ్నల్ వద్దకు చేరుకుంటూ నెమ్మదించిందని.. అప్పుడు పేలుడు జరిగిందని ఓ అధికారి తెలిపారు. పేలుడు దెబ్బకు కారులో ఉన్న ముగ్గురూ ఛిద్రమైపోయారని తెలిపారు.



ఘటనా స్థలంలో అమిత్ షా

పేలుడుకు కారణం ఇప్పుడే చెప్పలేం..

పేలుడు ఘటనపై కేంద్రం హోంమంత్రి అమిత్ షా ఢిల్లీ పోలీసు కమిషనర్‌తో, ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్, ఎన్ఐఏ చీఫ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పేలుడు ఘటనపై అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పేలుడుకు కారణం ఏంటి అనేది ఇప్పుడే చెప్పలేమన్నారు. అనంతరం ఆయన ఎల్ఎన్‌జేపీ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. అక్కణ్నుంచీ నేరుగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఇక.. సోమవారం రాత్రి 12 గంటల సమయానికి.. మృతుల్లో.. అశోక్, అమర్ అనే ఇద్దరిని మాత్రమే పోలీసులు గుర్తించారు. మిగతా మృతదేహాలు ఎవరివో ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ పేలుడు తమ పనేనని ఇంతవరకూ ఏ ఉగ్రసంస్థా ప్రకటించలేదు.



హైదరాబాద్‌లో హై అలర్ట్

హైదరాబాద్ సిటీ, శంషాబాద్ రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో భారీ పేలుళ్లు జరగడంతో కేంద్ర హోం శాఖ ఢిల్లీతోపాటు ముంబై, బెంగళూరు, కోల్‌కతా, హైదరాబాద్‌ల్లో హైఅలర్ట్ ప్రకటించింది. దాంతో, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ఆదేశాలతో పాతబస్తీతోపాటు నగరంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఎంజీబీఎస్, జేబీఎస్, ఇతర బస్టాండ్లు, సికింద్రాబాద్, కాచిగూడ రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లలో సోదాలు నిర్వహించారు. ఆర్పీఎఫ్ పోలీసులు డాగ్ స్క్వాడ్, బాంబు స్క్వాడ్‌లతో వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేశారు. అనుమానితులను ప్రశ్నించారు. దేశంలో ఎక్కడ ఎప్పుడు ఉగ్రవాద కార్యకలాపాలు వెలుగులోకి వచ్చినా.. ఉగ్రవాద సానుభూతిపరులు అరెస్టయినా హైదరాబాద్‌తో వారికి లింకు ఉంటోంది. ఆదివారం గుజరాత్‌లో ఏటీఎస్ పోలీసులు ముగ్గురు ఉగ్రవాదులను అరెస్టు చేయగా.. వారిలో ఒకరు హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సయ్యద్ అహ్మద్ మొహియుద్దీన్ అని తేలిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, హైదరాబాద్ నగరంలోనూ హై అలర్ట్ ప్రకటించి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.

శంషాబాద్ ఎయిర్ పోర్టులో తనిఖీలు

ఢిల్లీలో బాంబు పేలుళ్ల నేపథ్యంలో శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో భద్రతను కట్టుదిట్టం చేశారు. సీఐఎస్ఎఫ్, సీఆర్పీఎఫ్ బలగాలతో పాటు స్థానిక పోలీసులు ఎయిర్ పోర్టులోకి వచ్చిపోయే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లతో ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. ప్రవేశ పాసులను రద్దు చేశారు.

వైట్‌కాలర్ ఉగ్రభూతం

మూడు రాష్ట్రాల్లో 8 మంది టెర్రరిస్టుల అరెస్టు



ఫరీదాబాద్‌లో పోలీసుల తనిఖీలు

» వీరిలో ముగ్గురు వైద్యులు, వారిలో ఒకరు మహిళా డాక్టర్

» 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం

శ్రీనగర్/ఫరీదాబాద్, నవంబరు 10: అత్యంత ప్రమాదకరంగా దేశంలో కొత్త రూపంలో వేళ్లూనుకుంటున్న వైట్ కాలర్ ఉగ్రవాదానికి కేంద్ర నిఘా, దర్యాప్తు సంస్థలతో కలిసి జమ్మూకశ్మీర్, హరియాణా, ఉత్తరప్రదేశ్ పోలీసులు చెక్ పెట్టారు. దేశ చరిత్రలోనే అత్యంత భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. 15 రోజుల పాటు అత్యంత పకడ్బందీగా నిర్వహించిన ఆపరేషన్‌లో జైషే మహ్మద్, అన్సార్ ఘజవత్ ఉల్ హింద్ (ఏజీయూహెచ్) సంస్థలకు చెందిన 8 మంది ఉగ్రదులను అరెస్టు చేశారు. వీరిలో ముగ్గురు వైద్యులు ఉండటం, వారిలో ఒక మహిళ కూడా ఉండటం కలకలం రేపుతోంది. ఇటీవల హైదరాబాద్‌లో అరెస్టు చేసిన డాక్టర్‌తో కలుపుకుంటే ఈ ఉగ్రనెట్‌వర్క్‌లో అరెస్టు అయిన వైద్యుల సంఖ్య నాలుగుకు పెరిగింది. అరెస్టయిన వారిలో ఏడుగురు జమ్మూకశ్మీర్‌కు చెందినవారే ఉన్నారు. వీరి నుంచి మొత్తం 2,900 కిలోల పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు జమ్మూకశ్మీర్ పోలీసులు సోమవారం వెల్లడించారు. ఇందులో అమోనియం నైట్రేట్, పొటాషియం నైట్రేట్, సల్ఫర్ వంటి పదార్థాలు ఉన్నాయి. ఒక ఏకే 56, ఒక ఏకే క్రింకోవ్ తుపాకితో పాటు చైనీస్ స్టార్, బెనెట్టా పిస్తోళ్లు, బాంబుల తయారీలో ఉపయోగించే బ్యాటరీలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వివరించారు.

పోస్టర్లపై కూపీ లాగితే..

జమ్మూకశ్మీర్ పోలీసుల కథనం ప్రకారం శ్రీనగర్‌లో అక్టోబర్ 19న జైషే మహ్మద్‌కు మద్దతుగా వెలసిన పోస్టర్లపై కూపీ లాగడంతో ఈ భారీ ఉగ్ర నెట్‌వర్క్ బట్టబయలైంది. ఈ పోస్టర్ల వెనుక జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాకు చెందిన డాక్టర్ అదీల్ రాథర్, హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉంటున్న అల్ ఫలాహ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ముజమ్మిల్ గనయి ఉన్నట్లు గుర్తించారు. ఈ నెల 6న అదీల్‌ను అరెస్టు చేశారు. అతడు ఇచ్చిన సమాచారంతో ఆదివారం ముజమ్మిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఉంటున్న అదీల్‌ను, హరియాణాలోని ఫరీదాబాద్‌లో ఉంటున్న ముజమ్మిల్‌ను విమానంలో శ్రీనగర్‌కు తరలించారు. ముజమ్మిల్ అద్దెకు తీసుకున్న రెండు ఇళ్లలో కనిపించిన పేలుడు పదార్థాలు, ఆయుధాలు చూసి పోలీసులే నివ్వెరపోయారు. ముజమ్మిల్ వద్దనే ఏకంగా 360 కిలోల పేలుడు పదార్థాలు, ఏకే తుపాకీ లభించాయి. ముజమ్మిల్, అదీల్ ఫోన్లలో పాకిస్థాన్‌కు చెందిన నంబర్లను గుర్తించారు. ముజమ్మిల్‌కు ఇంటిని అద్దెకు ఇచ్చిన ఒక మౌలానాను కూడా సోమవారం అరెస్టు చేశారు.

అరెస్టయిన ఉగ్రవాదులు

ఉగ్రవాది పేరు	ప్రాంతం
అరిఫ్ నసార్ దార్ అలియాస్ సాహిల్	నౌగావ్, జమ్మూకశ్మీర్
యాసిర్ ఉల్ అష్రఫ్	నౌగావ్, జమ్మూకశ్మీర్
మఖ్సూద్ అహ్మద్ దార్ అలియాస్ షహీద్	నౌగావ్, జమ్మూకశ్మీర్
మహ్మద్ ఇర్ఫాన్ అహ్మద్	షోపియాన్, జమ్మూకశ్మీర్
జమీర్ అహ్మద్ అహంగర్	గందర్‌బల్, జమ్మూకశ్మీర్
డాక్టర్ ముజమ్మిల్ గనయి	పుల్వామా, జమ్మూకశ్మీర్
డాక్టర్ అదీల్	కుల్గావ్, జమ్మూకశ్మీర్
డాక్టర్ షహీన్	లఖ్‌నవూ, యూపీ

చారిటీల ముసుగులో ఉగ్ర ప్రచారం

దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలపై నిఘా పెరగటంతో పాకిస్థాన్‌కు చెందిన జైషే మహ్మద్‌తోపాటు, భారత్‌లో ఐఎస్ఐఎస్‌కు అనుబంధంగా పనిచేస్తున్న ఉగ్ర సంస్థ ఏజీయూహెచ్‌లు కొత్త మార్గాలను అనుసరిస్తున్నట్లు ఈ కేసు తేటతెల్లం చేసింది. సమాజంలో మంచి పేరున్నవారు, ఉన్నత విద్యావంతులను ఉగ్రవాదం వైపు మళ్లిస్తున్నట్లు తేలింది. అరెస్టయిన ఉగ్రవాదులు చారిటీలు, విద్యా సంస్థలకు నిధుల సేకరణ ముసుగులో ఉగ్రవాదులకు నిధులు సమకూరుస్తున్నారని జమ్మూకశ్మీర్ పోలీసులు వెల్లడించారు. 'దేశంలో వైట్‌కాలర్ ఉగ్రవాద వ్యవస్థ క్రమంగా వేళ్లూనుకుంటున్నట్లు ఈ దర్యాప్తులో తేలింది. ఉగ్రవాదం వైపు ఆకర్షితులైన ప్రొఫెసర్లు, విద్యార్థులు పాకిస్థాన్, ఇతర విదేశీ ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు ఏర్పరుచుకుంటున్నారు. ప్రొఫెషనల్, విద్యా సంస్థల ద్వారా నిధులు సమీకరిస్తున్నారు. ఉగ్రవాద సంస్థలకు ఆయుధాలు, ఐఈడీ బాంబులు తయారు చేసే పేలుడు పదార్థాలు, ఇతర మౌలిక వసతులు సమకూరుస్తున్నారు' అని పోలీసులు వెల్లడించారు.

అరెస్టయిన ఉగ్ర డాక్టర్లు

డాక్టర్ అదీల్ రాథర్: ఇతడి స్వస్థలం జమ్మూకశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లా కాజీగుండ్. అనంత్‌నాగ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలో గత ఏడాది అక్టోబర్ 24 వరకు ఇతడు రెసిడెంట్ డాక్టర్‌గా పనిచేశాడు. ఇతడికి జైషే మహ్మద్‌తో పాటు ఏజీయూహెచ్‌తోనూ సంబంధాలున్నట్లు గుర్తించారు. ఉత్తరప్రదేశ్‌లోని సహరాన్‌పూర్‌లో ఈ నెల 6న అతన్ని అరెస్టు చేశారు.

డాక్టర్ ముజమ్మిల్ షకీల్ గనయి: ఇతడు కూడా జమ్మూకశ్మీర్‌కు చెందినవాడే. హర్యానాలోని ధౌజ్‌లో ఉన్న అల్ ఫలాహ్ యూనివర్సిటీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ అక్కడే రెండు వేర్వేరు ఇళ్లను అద్దెకు తీసుకొని ఉంటున్నాడు. ఇతడి వద్దనే బాంబుల తయారీకి ఉపయోగించే సామగ్రి భారీ మొత్తంలో పట్టుబడింది. రాథర్ ఇచ్చిన సమాచారంతో ఇతడిని ఆదివారం అరెస్టు చేశారు. శ్రీనగర్‌లో జైషే మహ్మద్ పోస్టర్లు వేయటంతో ఇతడి హస్తం కూడా ఉంది.

మహిళా డాక్టర్: అల్ ఫలాహ్ యూనివర్సిటీలోనే పనిచేస్తున్న మరో మహిళా డాక్టర్‌ను కూడా ఈ నెల 7న అరెస్టు చేశారు. ఆమె కారులో ఒక కారన్ అసాల్ట్ రైఫిల్ లభించటం గమనార్హం. ఆమె పేరు ఇతర వివరాలను పోలీసులు బయటపెట్టలేదు.

డాక్టర్ అహ్మద్ సయీద్ మొహియుద్దీన్: హైదరాబాద్‌కు చెందిన ఈ డాక్టర్‌ను గుజరాత్ ఏటీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. ఇతడు ఇంట్లో సొంతంగానే రెసిన్ అనే విషపదార్థం తయారుచేస్తున్నట్లు గుర్తించారు.

ధర్మేంద్ర ఆరోగ్యం కోసం ప్రార్థించండి

» అభిమానులకు హేమమాలిని వినతి



ముంబై, నవంబరు 10: అలనాటి సినీహీరో ధర్మేంద్ర (89) అనారోగ్యం కారణంగా గత కొన్ని రోజులుగా ముంబయిలోని బ్రీచ్ కాండీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని, ఆయన కోలుకోవాలంటూ ప్రార్థించాలని ప్రముఖ నటి, భార్య హేమమాలిని అభిమానులను కోరారు. సోమవారం ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. "ధరంజీ ఆరోగ్యంపై ఆందోళన వ్యక్తం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు చెబుతున్నా. ఆయన ఆస్పత్రిలో వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారు. వైద్యులు నిరంతరం ఆయనను గమనిస్తున్నారు. మేమంతా ఆయన పక్కనే ఉన్నాం. ఆయన సత్వరమే కోలుకోవాలని, సుఖంగా ఉండాలంటూ ప్రార్థించాలని కోరుకుంటున్నా" అని పేర్కొన్నారు. ధర్మేంద్ర పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నప్పటికీ, ప్రస్తుతానికయితే నిలకడగా ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఆయన వెంటిలేటర్‌పై ఏమీ లేరని పేర్కొన్నాయి. క్రమేణా కోలుకుంటున్నారని తెలిపాయి.

వరుస రోడ్డు ప్రమాదాలు అసమర్థతకు పరాకాష్ఠ

» వ్యవస్థ వైఫల్యం కాదా?

» టోల్ వసూలు దేనికి? ప్రజల ప్రాణాలు తీయడానికా?

» సుప్రీంకోర్టు ఆగ్రహం

» తెలంగాణ, రాజస్థాన్‌ల్లో జరిగిన ప్రమాదాలపై సుమోటోగా విచారణ

న్యూఢిల్లీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశంలో వరుస రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఇవి వ్యవస్థలోని వైఫల్యాలకు నిదర్శనం కాదా? అని ప్రశ్నించింది. టోల్ వసూలు దేనికి, ప్రజల ప్రాణాలు తీయడానికా? అంటూ అసహనం వ్యక్తం చేసింది. ప్రమాదాలపై రెండు వారాల్లోగా సమగ్ర నివేదిక ఇవ్వాలని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ), కేంద్రంతో పాటు తెలంగాణ, రాజస్థాన్ రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది.



తెలంగాణ, రాజస్థాన్‌లలో ఇటీవల జరిగిన ఘోర రోడ్డు ప్రమాదాలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. సోమవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా రోడ్ల నిర్వహణపై కీలక వ్యాఖ్యలు చేసింది. 'రోడ్ల పరిస్థితి దారుణంగా తయారైంది. నిర్వహణ లోపంతో రోడ్లన్నీ గుంతలమయం అయ్యాయి. రెండు ప్రమాదాల్లో నలభై మంది చనిపోయారు. ఇది ముమ్మాటికీ అసమర్థకు పరాకాష్ఠ కాకపోతే మరేమిటి? ఇది సహించరాని, భరించలేని దారుణం' అని వ్యాఖ్యానించింది. తెలంగాణలో నవంబర్ 3న హైదరాబాద్ - బీజాపూర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ -163)పై 20 మంది మరణించిన విషయాన్ని ధర్మాసనం గుర్తు చేసింది. 'పత్రికల కథనాల ప్రకారం హైవేపై ఉన్న ఓ పెద్ద గుంతను తప్పించే ప్రయత్నంలోనే లారీ అదుపు తప్పి బస్సును ఢీకొట్టింది. ఇది వ్యవస్థ వైఫల్యం కాదా?' అని ప్రశ్నించింది. ఆ జాతీయ రహదారికి సంబంధించిన భద్రతా ప్రమాణాలు, నిర్వహణ, కాంట్రాక్టర్ల పనితీరుపై తక్షణమే ఆరా తీయాయని ఆదేశించింది. రాజస్థాన్‌లోని ఫలోడి వద్ద 18 మంది మృతికి అక్రమ దాబాలే కారణమని ధర్మాసనం అభిప్రాయపడింది. 'జాతీయ రహదారుల పక్కన గుర్తింపులేని అక్రమ దాబాలు వెలుస్తున్నాయి. ట్రక్కులు ప్రమాదకర రీతిలో వాటి పక్కనే నిలిపివేస్తున్నారు. దీనివల్లే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని ఎలా నియంత్రిస్తారు?' అని ప్రశ్నించింది. ఈ రెండు జాతీయ రహదారులు విస్తరించి ఉన్న అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. వాటి పరిధిలోని అక్రమ దాబాలు, రోడ్ల వాస్తవ పరిస్థితి, కాంట్రాక్టర్ల నిర్వహణ నిబంధనలపై రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందించాలని ఆదేశించింది.



జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులకు జ్ఞాపికను అందజేస్తున్న వేద పండితులు

పెదకాకాని మల్లన్న సన్నిధిలో జస్టిస్ తుహిన్ కుమార్

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థానాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తుహిన్ కుమార్ దంపతులు సోమవారం దర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజల అనంతరం వారికి వేద పండితులు ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాలు, మల్లేశ్వర స్వామి వారి జ్ఞాపికను అందజేశారు.

శ్రీవారి సేవలో ఏపీ ఉప లోకాయుక్త



తిరుమల ఆలయం ముందు జస్టిస్ రజిని

తిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఉప లోకాయుక్త జస్టిస్ రజిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆమెకు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

జస్టిస్ చీమలపాటి రవికి పితృ వియోగం



చీమలపాటి శ్రీరామమూర్తి

విశాఖపట్నం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవి తండ్రి, సీనియర్ న్యాయవాది శ్రీరామమూర్తి (93) సోమవారం విశాఖపట్నం రామ్‌నగర్‌లోని ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయన భీమునిపట్నంలో మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టు ఏర్పాటుచేసినప్పటి నుంచి (1966) న్యాయవాదిగా పనిచేశారు. 1998 వరకూ న్యాయవాద వృత్తిని కొనసాగించారు. శ్రీరామమూర్తి మరణం తీరని లోటని, ఆయన కొత్త తరం న్యాయవాదులకు మార్గదర్శనం చేసేవారని న్యాయవాదులు సంతాపం వెలిబుచ్చారు. ఆయన పార్థివదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఫ్రెండ్లీ ప్రభుత్వంలో క్రీడోత్సవాలు సక్సెస్

- బొప్పరాజు హర్షం

అనంతపురం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'రెండు దశాబ్దాల్లో ఇప్పటి వరకు ఆరుసార్లు రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడోత్సవాలను నిర్వహించాం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫ్రెండ్లీ ప్రభుత్వం సహకారంతో అనంతపురం ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్రస్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాం' అని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. అనంతపురంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నెల 7, 8, 9వ తేదీల్లో ఆర్డీటీ స్టేడియంలో 7వ రాష్ట్ర స్థాయి రెవెన్యూ క్రీడా, సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించామని, మొత్తం 27 జట్ల తరపున 1,870 మంది ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపారు. సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం సహాయ, సహకారాలతో క్రీడా ఉత్సవాలు విజయవంతం చేశామన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వంలో రెవెన్యూ శాఖకు ప్రత్యేక గుర్తింపు ఇచ్చారని, ఇదే స్ఫూర్తితో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చేలా ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందిస్తామని వెల్లడించారు.

పెరిగిన చలి.. 3-5 డిగ్రీలు తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు

విశాఖపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఉత్తరాది నుంచి వీస్తున్న శీతల గాలుల ప్రభావంతో శివారు, తెలంగాణకు ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో సోమవారం చలి తీవ్రత కొనసాగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 12 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో రాష్ట్రంలో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది.

మొబైల్ కొట్టేసి.. ఫోన్ పేలో దోచేసి..

- రైల్వేస్టేషన్లో చార్జింగ్ పెట్టిన ఫోన్లు మాయం
- బాధితులు ఫోన్ చేయగానే రైల్వే పోలీస్‌నంటూ నాటకం
- ఫోన్ లాక్, ఆధార్ వివరాలు కావాలని బురిడీ
- ఆధార్ వివరాలివ్వగానే కొత్త సిమ్‌తో లాగిన్
- ఫోన్ పే, గూగుల్ పే ద్వారా ఖాతాలో సొమ్ము ఖాళీ
- విజయవాడ రైల్వే పోలీసులకు చిక్కిన కిలాడీ దొంగలు
- 9 లక్షల విలువ చేసే 45 సెల్‌ఫోన్లు స్వాధీనం

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'నేను రైల్వే పోలీసును మాట్లాడుతున్నా.. మేం ఒక దొంగను పట్టుకున్నాం.. వాడి నుంచి మీ ఫోన్ రికవరీ చేశాం.. ఈ ఫోన్ మీదే అయితే లాక్ చెప్పండి. అలాగే ఆధార్ వివరాలు కూడా పంపిస్తే.. సరిచూసుకుని దీన్ని మీకు అందజేస్తాం...' రైల్వేస్టేషన్లలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులకు ఆ ఫోన్ కాజేసిన దొంగ చెప్పే మాయ మాటలివి..! అవతలి వ్యక్తి నిజంగానే రైల్వే పోలీసు అని నమ్మిన బాధితులు తమ ఫోన్ లాక్, ఆధార్ వివరాలు ఇవ్వగానే... ఫోన్ పే, గూగుల్ పే ద్వారా బ్యాంకు ఖాతాలో ఉన్నదంతా ఊడ్చేస్తాడు. ఆ తర్వాత ఆ ఫోన్‌ను కూడా అమ్మేసుకుని క్యాష్ చేసుకుంటాడు. కొన్ని నెలలుగా సాగుతున్న కిలాడీ దొంగ చేతివాటానికి విజయవాడ రైల్వే పోలీసులు ఎట్టకేలకు సంకెళ్లు వేశారు. రూ.9 లక్షల విలువ చేసే 45 సెల్ ఫోన్లను రికవరీ చేసి.. మరో ఇద్దరు తోడు దొంగల్ని కూడా జైలుకు పంపారు. ఆ వివరాలను విజయవాడ రైల్వే పోలీసులు వివరించారు.

పది ఫిర్యాదులు.. 45 ఫోన్ల రికవరీ..

విజయవాడ రైల్వే పోలీసులకు ఇటీవల వరుసగా సెల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితుల నుంచి పది ఫిర్యాదులు వచ్చాయి. దీనిపై నిఘాపెట్టిన రైల్వే పోలీసు అధికారి వెంకటరమణ బృందానికి ఎట్టకేలకు కిలాడి దొంగ బంగారు రాంబాబు (21) పట్టుబడ్డాడు. తమదైన శైలిలో విచారించడంతో తనకు గుర్తున్న 45 నేరాలను అంగీకరించాడు. ఆయనకు సహకరించిన బురడగంటి నవీన్ (23)తో పాటు దొంగలించిన మొబైళ్ల విక్రయించి వాటా తీసుకున్న ఆటో డ్రైవర్ వంకూరి ప్రకాశ్ (38)ను సైతం అరెస్టు చేశారు. ఈ గ్యాంగ్ మరిన్ని చోరీలు చేసిందని, ఇంకా విచారించాల్సి ఉందని రైల్వే పోలీసులు చెబుతున్నారు. కాగా, విజయవాడ రైల్వే పోలీసులు పది కేసుల దర్యాప్తులో దొంగల్ని అరెస్టు చేయగా 45 సెల్ ఫోన్లు రికవరీ అయ్యాయి. మిగతా 35 ఫోన్లకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదులు లేక పోవడంతో పోగొట్టుకున్న వ్యక్తులు తగిన ఆధారాలతో (బిల్లు, ఖాళీ బాక్స్) తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు సూచించారు. రైల్వే పోలీసుల పేరుతో ఎవరైనా వివరాలు అడిగితే ఫోన్లో వెల్లడించొద్దని, జీఆర్‌పీ స్టేషన్‌కు వచ్చి నేరుగా ఆధారాలు అందజేసి ఫోన్లు తీసుకెళ్లాలని చెప్పారు. కాగా, సెల్‌ఫోన్లతో పాటు అందులో ఫోన్ పే, గూగుల్ పే ద్వారా కాజేసిన సొమ్ము లక్షల్లోనే ఉందని, బాధితులంతా వచ్చి చెప్పిన తర్వాతే ఎన్ని లక్షలు కాజేశారో తెలుస్తుందని అన్నారు.



దొంగల నుంచి విజయవాడ రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్లు



పట్టుబడిన సెల్‌ఫోన్ దొంగలతో విజయవాడ రైల్వే పోలీసులు

ఫోన్ చార్జింగ్ పెడుతున్నట్టు నటిస్తూ..

విజయవాడ రైల్వేస్టేషన్లో సెల్ ఫోన్లు ఎక్కువగా దొంగతనం అవుతున్నాయంటూ ప్రయాణికులతో పాటు రైల్వే సిబ్బంది నుంచి ఇటీవల వరుస ఫిర్యాదులు వచ్చాయి. రైల్వే డీఐజీ సత్యయేసుబాబు.. రైల్వే పోలీసు అధికారి వెంకటరమణ నేతృత్వంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో విజయవాడ రైల్వే స్టేషన్లో సెల్‌ఫోన్లు కొట్టేస్తున్న బంగారు రాంబాబు అనే దొంగ పట్టుబడ్డాడు. విచారణలో తాను ఫోన్లు ఎలా దొంగిలించేవాడో పోలీసులకు వివరించాడు. తన ఫోన్ చార్జింగ్ పెట్టేందుకు తీసుకొచ్చినట్లు నటిస్తూనే అక్కడ ఇతర ప్రయాణికులు చార్జింగ్ పెట్టుకున్న ఫోన్లను లేపేసేవాడు. అలా కొట్టేసిన ఫోన్లను స్విచాఫ్ చేయకుండా బాధితుల నుంచి ఫోన్ వచ్చేదాకా ఎదురు చూసేవాడు. వారు ఇతరుల ఫోన్ తీసుకుని కాల్ చేయగానే ఆ దొంగ లిఫ్ట్ చేసేవాడు. అవతలి వ్యక్తి ఆ ఫోను నాదే అనగానే.. 'నేను రైల్వే పోలీస్‌ని మాట్లాడుతున్నా ఒక దొంగను పట్టుకున్నాం' అంటూ తన తెలివి ప్రదర్శించేవాడు. అవతలి వ్యక్తి తనదే మొబైల్ అని నిరూపించేందుకు నంబర్ లాక్, లేదంటే లాక్ ప్యాట్రన్ చెబుతాడు. ఇదే అవకాశంగా ఆధార్ కార్డు కూడా వాట్సా‌ప్‌కు పంపమని అడుగుతాడు. వెంటనే ఆ ఆధార్ ప్రూఫ్‌తో మరో సిమ్ కొనుగోలు చేసేవాడు. ఆ సిమ్‌ను ఫోన్‌లో వేసుకుని వేసుకుని ఫోన్‌పే యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటాడు. అందులో కొత్తగా లాగిన్ అయ్యి.. దగ్గర్లోని ఏటీఎం వద్దకు వెళ్తాడు. అక్కడ డబ్బు డ్రా చేసే వ్యక్తులను 'మీకు ఫోన్ పే చేస్తా.. నాకు క్యాష్ ఇస్తారా.. ప్లీజ్' అంటూ రిక్వెస్ట్‌గా అడుగుతాడు. అలా పలుమార్లు పలువురికి ఫోన్ పే పంపి ఖాతాలో ఉన్నదంతా ఖాళీ చేసేస్తాడు. తర్వాత చిన్న చిన్న మొబైల్ షాపులకు వెళ్లి.. ఆ ఫోన్‌ను వచ్చినకాడికి అమ్మేస్తాడు.

కారుణ్య మరణానికి అనుమతి ఎలా కోరతారు..?

- ఆ తరహా అభ్యర్థనకు అనుమతించబోమని తెలుసు కదా?
- ప్రచారం కోసం న్యాయస్థానాలను వేదిక చేసుకోవద్దు
- పిటిషన్‌లోని అభ్యర్థనను సవరించండి
- న్యాయవాదికి హైకోర్టు ఆదేశం.. విచారణ 14కు వాయిదా


అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కారుణ్య మరణానికి అనుమతించాలని కోరుతూ దాఖలైన రిట్ పిటిషన్‌పై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, రాయపూడి గ్రామానికి చెందిన నెల్లూరి శేషగిరమ్మ, ఆమె కుమార్తె వెంకాయమ్మ, మనవరాలు శ్యామల తరఫు న్యాయవాది రిట్ పిటిషన్‌లో ఈ విషయాన్ని ప్రస్తావించగా.. ఆ తరహా అభ్యర్థనను కోర్టు అనుమతించదని తెలిసి కూడా ఇలాంటి ప్లీడింగ్స్ ఎలా కోరతారని ప్రశ్నించింది. ఒకవేళ పిటిషనర్లు ఒత్తిడి చేసి ఉంటే వ్యాజ్యం దాఖలుకు నిరాకరించి ఉండాల్సిందని వ్యాఖ్యానించింది. ప్రచారం కోసం న్యాయస్థానాలను వేదికగా చేసుకోవద్దని హెచ్చరించింది. రిట్ పిటిషనలో అభ్యర్థనను సవరించాలని ఆదేశించింది. శేషగిరమ్మ మనవరాలు శ్యామల మానసిక వైకల్యంతో బాధపడుతున్నారని, పిటిషన్‌లో ఏముందో తెలియపర్చకుండా ఆమె నుంచి వకాలత్‌పై సంతకం ఎలా తీసుకున్నారని నిలదీసింది. పిటిషనర్లు ప్రస్తుతం ఉన్న నివాసం నుంచి పక్కకు వెళ్లేందుకు ఇష్టపడడం లేదని చెబుతున్న నేపథ్యంలో ఆ మేరకు అఫిడవిట్ దాఖలు చేయాలని పిటిషనర్ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. ప్రస్తుతం పిటిషనర్ల నివాసం ఎక్కడ ఉంది..? అక్కడ ఏమైనా ప్రాజెక్టులు రాబోతున్నాయా? సీఆర్‌డీఏ చేపట్టే నిర్మాణాలకు ఆ ఇళ్లు ఏమైనా అడ్డంకిగా ఉన్నాయా? తదితర వివరాలను తమ ముందుంచాలని సీఆర్‌డీఏ తరఫు న్యాయవాదిని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 14వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. రాయపూడి గ్రామ పరిధిలో తమకున్న ఐదు సెంట్ల ఇంటి స్థలాన్ని నిరక్షరాస్యత కారణంగా పొరపాటున ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద సీఆర్‌డీఏకు అప్పగించామని, దాన్ని తిరిగి తమకు అప్పగించేలా సీఆర్‌డీఏ అధికారులను ఆదేశించాలని కోరుతూ రాయపూడి గ్రామానికి చెందిన 90 ఏళ్ల వృద్ధురాలు నెల్లూరి శేషగిరమ్మ, చెరుకూరి వెంకాయమ్మ, మనవరాలు చెరుకూరి శ్యామల హైకోర్టును ఆశ్రయించారు. తాము నివాసం ఉండేందుకు ఆ స్థలం తప్ప మరొకటి లేదని, తిరిగి ఇవ్వడం వీలుకాకుంటే కారుణ్య మరణానికి అనుమతించాలని కోరారు. ఈ వ్యాజ్యంపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం... పిటిషనర్ల స్థితిగతులను పరిశీలించి వివరాలు సమర్పించాలని న్యాయవాది రూపేశ్ కుమార్‌ను ఆదేశించింది. ఈ వ్యాజ్యం సోమవారం మరోసారి విచారణకు వచ్చింది.

నా తల్లి, తమ్ముడు దెయ్యాలు... చంపేశా!

దారుణ హత్యలు చేసి...పోలీసులకు ఫోన్

- పోలీసుల అదుపులో నిందితుడు
- భీమవరంలో కలకలం
- మతిస్థిమితం లేకే ఈ హత్యలు: ఎస్పీ





మృతులు గునుపూటి మహాలక్ష్మి, రవితేజ



నిందితుడు శ్రీనివాస్

భీమవరం క్రైం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): "నా తల్లి మహాలక్ష్మి, నా తమ్ముడు రవితేజ పెద్ద దెయ్యాలు. నా మనస్సులో ఏదనుకుంటే అది వారికి తెలిసిపోతుంది. నన్ను పిచ్చివాడిని చేసి ఇంట్లో బంధించి బయటకు వెళ్లకుండా చేస్తున్నారు. అందుకే వారిద్దరిని చాకుతో పొడిచి పొడిచి హత్య చేశా. వారి శరీరాలు చాలా గట్టివి. చాకు కూడా దిగడం లేదు. మళ్లీ ఇప్పుడు లేచి వచ్చేస్తారేమో.!" అంటూ జంట హత్యలు చేసిన గునుపూటి శ్రీనివాస్ మాటలు కలకలం రేపాయి. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం పట్టణంలో సోమవారం జంట హత్యలు కలకలం రేపాయి. వన్‌టౌన్ సీఐ ఎం.నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక రెస్ట్ హౌస్ రోడ్డు మన్నా చర్చి ఎదురుగా నివాసం ఉండే గునుపూటి శ్రీరాములుకు భార్య మహాలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమై బెంగళూరులో ఉంటున్నారు. శ్రీరాములు కరోనా సమయంలో మృతి చెందగా మహాలక్ష్మి (60), కుమారులు శ్రీనివాస్ (37), రవితేజ (33) ముగ్గురూ కలిసి ఉంటున్నారు. వీరి ఫైనాన్స్ వ్యాపారం దెబ్బతింది. ప్రస్తుతం షాపులు, ఇంటిపై వచ్చే అద్దెలతో జీవనం సాగిస్తున్నారు. ఇటీవల శ్రీనివాస్ మతిభ్రమించినట్టు మాట్లాడుతుండటంతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లకుండా చూస్తున్నారు. అప్పుడప్పుడూ డబ్బుల విషయంలో వారు ఘర్షణ పడేవారని ఇంటి చుట్టుపక్కలవారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో శ్రీనివాస్ చాకుతో తల్లి మహాలక్ష్మిని, తమ్ముడు రవితేజను ఇష్టానుసారం పొడిచాడు. అనంతరం 4 గంటల సమయంలో శ్రీనివాస్ 112కు కాల్ చేసి తాను తల్లిని, తమ్ముడిని హత్య చేశానని, తన ఇల్లు ఫలానా చోట అని చెప్పడంతో పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకునే సరికి రవితేజ, మహాలక్ష్మి రక్తపు మడుగులో పడిఉన్నారు. ఒక్కొక్కరి శరీరంపై 20 కత్తిపోట్లు ఉన్నట్టు పోలీసులు నిర్ధారించారు. అప్పటికే శ్రీనివాస్ మొదటి ఫ్లోర్ నుంచి కిందికి దిగి రోడ్డుపై ఉండటంతో పోలీసులు అతన్ని అదుపులోకి తీసుకున్నారు. బంధువులు ఎవరూ స్పందించకపోవడంతో బెంగళూరులో ఉంటున్న వారి కుమార్తెకు సమాచారం అందించారు. ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, డీఎస్పీ ఆర్‌జి జయసూర్య, సీఐ నాగరాజు సంఘటనా స్థలాన్ని సోమవారం ఉదయం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ శ్రీనివాస్‌కు మతిస్థిమితం లేక ఈ హత్యలు చేసినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి అతనిపై చర్యలు తీసుకుంటామన్నారు.



క్యాన్సర్ ఆస్పత్రి నూతన భవనంలో హోమం నిర్వహిస్తున్న ఆర్‌జే రత్నాకర్ తదితరులు

పుట్టపర్తిలో క్యాన్సర్ ఆస్పత్రి

- సత్యసాయి పూర్వ విద్యార్థుల చొరవతో అందుబాటులోకి
- నూతన భవనాన్ని ప్రారంభించిన ఆర్‌జే రత్నాకర్

పుట్టపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సత్యసాయి విద్యాసంస్థల పూర్వవిద్యార్థులు క్యాన్సర్ బాధితుల కోసం 'శ్రీసత్యసాయి పాలియేటివ్ కేర్ అండ్ క్యాన్సర్ కేర్ సెంటర్‌'ను అందుబాటులోకి తెచ్చారు. ఈ ఆస్పత్రి కోసం శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నూతనంగా నిర్మించిన భవనాన్ని సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు హోమాన్ని నిర్వహించారు. హోమంలో ఆర్‌జే రత్నాకర్ పాల్గొని పూజలు చేశారు. పూర్వ విద్యార్థులు మొదట దీర్ఘకాలంగా క్యాన్సర్‌తో బాధపడే వారికి పాలియేటివ్ సెంటర్ ద్వారా సేవలు అందించారు. అనంతరం ప్రశాంతి నిలయం వెస్ట్ గేటు దగ్గరలో 71 సెంట్ల స్థలాన్ని సేకరించి, అందులో భవనాన్ని నిర్మించారు. నూతన భవనంలో 24 బెడ్లు ఏర్పాటు చేశామని, త్వరలో డయాలసిస్, క్యాన్సర్ సర్జరీ, కీమో థెరపీ సేవలను అందుబాటులో తెస్తామని పూర్వ విద్యార్థులు తెలిపారు. వారిని రత్నాకర్ అభినందించారు.

దళారీ అవతారమెత్తిన ఏఆర్ కానిస్టేబుల్

- అరెస్ట్ చేసిన తిరుమల వన్‌టౌన్ పోలీసులు

తిరుమల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దర్శనాల దళారీగా వ్యవహరిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్‌పై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఏఆర్ కానిస్టేబుల్ ప్రసాద్ గతంలో ఫైర్ డీజీ వద్ద ప్రోటోకాల్ విధులు నిర్వహించేవాడు. ప్రోటోకాల్ విధుల నుంచి తొలగించిన తర్వాత కూడా ఇతను దర్శనాలు చేయిస్తున్నట్టు విజిలెన్స్ విభాగానికి సమాచారం అందింది. ఆదివారం బెంగుళూరుకు చెందిన నలుగురు భక్తులకు తిరుపతిలో ఎస్ఎస్‌డీ టోకెన్లు ఇప్పించి, వారిని వీఐపీ బ్రేక్ అనంతరం అడ్డదారిలో తీసుకువెళ్లి దర్శనం చేయించినట్టు గుర్తించారు. ఈ భక్తులను లడ్డూ కౌంటర్‌కు తీసుకెళ్లి లడ్డూలు ఇప్పించే సమయంలో విజిలెన్స్ అధికారులు ప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆశ వర్కర్ల నూతన కమిటీ ఎన్నిక

అనకాపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధ) రాష్ట్ర కమిటీని సోమవారం ప్రకటించారు. కమిటీ అధ్యక్షురాలిగా జి.రమణకుమారి (నంద్యాల), ప్రధాన కార్యదర్శిగా కె.ధనలక్ష్మి (అమరావతి), కోశాధికారిగా ఎ.కమల (ఎన్టీఆర్ జిల్లా), ఉపాధ్యక్షులుగా బి.సుధారాణి (విజయనగరం), వి.సత్యవతి (అనకాపల్లి), డి.అన్నపూర్ణ (నెల్లూరు), పి.ధనశ్రీ (కృష్ణా), జి.అమరావతి (శ్రీకాకుళం), ఎం.శివానీ (మన్యం), కె.కల్పన (ప్రకాశం), ఎస్.పద్మ (విశాఖ), ఎం.నాగమణి (అనంతపురం) ఎన్నికయ్యారు. 23 మంది ఆఫీస్ బేరర్స్, 53 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిందితుడి ప్రాథమిక హక్కులు హరించారు

- 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచలేదు
- నష్ట పరిహారం కింద రూ.10 వేలు చెల్లించండి
- విజయవాడ సైబర్ క్రైమ్ ఎస్‌హెచ్‌వోకు హైకోర్టు ఆదేశం

అమరావతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో నమోదైన కేసులో నిందితుడు తిరుపతి లోకేశ్‌ను పోలీసులు 24 గంటల్లో మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. నిందితుడి ప్రాథమిక హక్కులను పోలీసులు హరించారని అభిప్రాయపడింది. ఆయనకు నష్టపరిహారం కింద రూ.10 వేలు చెల్లించాలని విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోను ఆదేశించింది. సొమ్ము చెల్లించి లోకేశ్ నుంచి రశీదు తీసుకోవాలని, దాన్ని రిజిస్ట్రార్ జ్యుడీషియల్‌కు అందజేయాలని స్పష్టం చేసింది. సొమ్ము చెల్లించారా..? లేదా అనే వివరాలను డిసెంబరు 15న తమ ముందు ఉంచాలని రిజిస్ట్రీని ఆదేశించింది. ఉత్తర్వులు అమలుకాకుంటే ఆ రోజు తదుపరి ఆదేశాలు ఇస్తామని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ టీసీడీ శేఖర్‌తో కూడిన ధర్మాసనం సోమవారం తీర్పు ఇచ్చింది.

భార్య, మామ, బావమరిదిపై దాడి

- స్థానికుల జోక్యంతో ఉడాయింపు.. ఆస్తి తగాదాలే కారణం

పాలకోడేరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కుటుంబ తగాదాల నేపథ్యంలో భార్య, బావమరిది, మామపై అల్లుడు, అతని మేనమామ కలిసి కత్తితో దాడి చేసిన ఘటన ఆదివారం రాత్రి పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం గొల్లలకోడేరు గ్రామ శివారు తుమ్మలగుంటపాలెంలో చోటు చేసుకుంది. అత్తిలి మండలం మంచిలి గ్రామానికి చెందిన వీరవల్లి రామచంద్రరావుకు తుమ్మలగుంటపాలేనికి చెందిన శ్రీలక్ష్మికి 17 ఏళ్లక్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె ఉంది. ఉపాధి నిమిత్తం రామచంద్రరావు గల్ఫ్ దేశంలో కొంతకాలం ఉన్నాడు. తిరిగి వచ్చిన నాటి నుంచి ఆస్తి విషయంలో భార్యతో గొడవలు జరుగుతున్నాయి. ఇది పోలీస్ స్టేషన్ వరకు వెళ్లింది. పలుమార్లు పెద్దల సమక్షంలో రాజీ ప్రయత్నాలు జరిగినా ఫలితం లేదు. దీంతో తుమ్మలగుంటపాలెంలోని ఆమె పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ నేపథ్యంలో రామచంద్రరావు, అతని మేనమామ మట్టపర్తి కృష్ణతో కలిసి శ్రీలక్ష్మి వద్దకు ఆదివారం వచ్చారు. శ్రీలక్ష్మి కుటుంబ సభ్యులకు, రామచంద్రరావుకు మధ్య మాటామాటా పెరిగి ఘర్షణ తలెత్తింది. ఈ క్రమంలోతో శ్రీలక్ష్మి, ఆమె తండ్రి సత్యనారాయణపై రామచంద్రరావు కత్తితో దాడి చేశాడు. సత్యనారాయణ కుమారుడు రాజేశ్ అడ్డుకునే ప్రయత్నం చేయగా అతడిపైనా దాడి చేయడంతో చేతి నాలుగు వేళ్లు తెగిపోయాయి. దీంతో ఇరుగు పొరుగు వారు అక్కడికి చేరుకోవడంతో రామచంద్రరావు, కృష్ణ అక్కడి నుంచి జారుకున్నారు. గాయపడిన శ్రీలక్ష్మి, సత్యనారాయణ, రాజేశ్‌ను స్థానికులు 108లో భీమవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం నిమిత్తం రాజేశ్‌ను విజయవాడ తరలించారు. భీమవరం డీఎస్పీ జయసూర్య, పాలకోడేరు ఎస్ఐ రవివర్మ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పాలకోడేరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బైకుపై నలుగురితో ప్రయాణం.. ప్రమాదం కాదా?

వాహనాన్ని ఆపి అవగాహన కల్పించిన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



బైక్‌పై వెళుతున్నవారిని ఆపి.. అవగాహన కల్పిస్తున్న మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'మహిళలు ఇబ్బంది పడకుండా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కల్పించారు. అయినా ఇలా బైక్‌పై పరిమితికి మించి ప్రయాణిస్తే ఎలా?' అని శ్రీసత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ప్రశ్నించారు. అనంతపురం నుంచి సోమవారం మడకశిరకు వస్తున్న ఆయన.. మడకశిర నగర పంచాయతీ పరిధిలోని చౌటిపల్లి వద్ద ఒక బైక్‌పై ముగ్గురు మహిళల సహా నలుగురు ప్రయాణిస్తుండటాన్ని గమనించారు. తన వాహనాలను ఆపి, వారితో మాట్లాడారు. ఒక బైక్‌పై నలుగురు ప్రయాణించడం ప్రమాదకరం అని, ఇలా ఎప్పుడూ చేయొద్దని వారికి సూచించారు. తన వెంట వచ్చిన ఓ వాహనంలో ముగ్గురు మహిళలను ఎక్కించి, వారి గ్రామానికి పంపించారు. వారిని ఇంటి వద్ద దించి రావాలని సిబ్బందికి సూచించారు. వారు చౌటిపల్లి నుంచి వారు గౌడనహళ్లి గ్రామానికి వెళుతూ ఎమ్మెల్యే కంటపడ్డారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఆచరణకు సంకల్పం

వాతావరణ మార్పుపై మానవ పోరాటానికి ఉద్దేశించిన సభ్యదేశాల మహాసదస్సు (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్–కాప్) సోమవారం బ్రెజిల్‌లో ఆరంభమైంది. ఈ ఏడాది సదస్సును 'ఇంప్లిమెంటేషన్ కాప్' అంటున్నారు. అంటే హామీలకు పరిమితం కాకుండా, ఈ 30వ సదస్సులో ఆచరణకు కట్టుబడాలన్నది సంకల్పం. దేశాధినేతలు, పారిశ్రామికవేత్తలు, పర్యావరణప్రేమికులు, ఉద్యమకారులు, చమురు లాబీయిస్టులు, మరోపక్క మండుటెండలకు మాడి, వర్షాలూ వరదలకు మునిగిపోతున్న దేశాలనుంచి వచ్చే నిరసనకారులతో రాబోయే పదిరోజులూ బ్రెజిల్ కళకళలాడబోతోంది. ముప్పై కీలకమైన అంశాల్లో ముందడుగువేయాలని ఈ సదస్సు సంకల్పించింది.

వేడెక్కుతున్న ధరిత్రిని 'కాప్' కాపాడుతుందని, మనిషి పట్ల ప్రేమతో అతని మనుగడకోసం నిర్దిష్టమైన నిర్ణయాలు తీసుకుంటుందన్న ఆశ నిజానికి గత ఏడాది మరింత తగ్గిపోయింది. అజర్‌బైజాన్ రాజధానిలో 29వ సదస్సు ఆరంభానికి కొద్దిరోజుల ముందే అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ఎన్నికయ్యారు. పర్యావరణ పరిరక్షణ, వాతావరణ మార్పు ఇత్యాది పదజాలానికి బద్ధవ్యతిరేకి అయిన ట్రంప్ అధికారంలో ఉన్నన్నాళ్ళూ ధరిత్రికి రక్షణ ఉండదని అందరికీ అర్థమైపోయింది. డ్రిల్ బేబీ డ్రిల్ అన్న ఒక్క మాటతో శిలాజ ఇంధనాలు తవ్విపోయడమే తన ఎజెండా అని స్పష్టంచేసిన ట్రంప్ ఏలుబడిలో ఈ ఏడాది సదస్సుకు అమెరికా ఏకంగా గైర్హాజరైంది. గతంలో మాదిరిగా మాటమార్చడమో, తప్పడమో కాదు, ఏకంగా సదస్సునే కాదనడం అమెరికా చరిత్రలో ఇదే తొలిసారి. గత ఏడాది సదస్సుకు 'ఫైనాన్స్ కాప్' అని నామకరణం చేసుకోవడంలో ప్రధానోద్దేశం, వాతావరణంలో ప్రతికూల మార్పులమీద పోరాడేందుకు వర్ధమానదేశాలకు ధనికదేశాలు అందించే ఆర్థికసాయాన్ని అధికం చేయడం. ఇప్పుడు ట్రంప్ బాయ్‌కాట్‌తో ఆ మొత్తానికి పెద్ద ఎత్తున గండం వచ్చిపడినట్టు లెక్క.


ఈ సదస్సులో కొత్త తీర్మానాలు, హామీలు వద్దనీ, అనుకున్నదానిని అమలు చేయడం గురించి మాత్రమే ఆలోచించాలని బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వా అంటున్నారు. ఈ సదస్సు పరిష్కారాల గురించి మాత్రమే మాట్లాడుతుందని ఆయన నమ్మకం. గ్లోబల్ వార్మింగ్ ఒకటిన్నర డిగ్రీలు దాటనివ్వకూడదని పారిస్ ఒప్పందంలో దేశాలన్నీ నిర్దేశించుకున్నాయి. అయినా కూడా, ఇప్పుడది రెండున్నర డిగ్రీల సెల్సియస్ వరకూ రికార్డవుతోంది. కర్బన ఉద్గారాలను తగ్గించుకుంటామని ఇచ్చిన హామీని ప్రపంచదేశాలు నిలబెట్టుకోకపోతే, లక్ష్మణరేఖంటూ దాటిన తరువాత కాలువెనక్కుతీసుకోవడం కూడా కష్టమైపోతుందని ప్రపంచస్థాయి సంస్థలు, నివేదికలు అనేకం హెచ్చరిస్తున్నాయి. ఈ కారణంగానే, ఐక్యరాజ్యసమితి అధినేత కూడా ముమ్మారు 'ఆచరణ...ఆచరణ..ఆచరణ' అంటూ సదస్సు లక్ష్యాన్ని నొక్కిచెబుతున్నారు.

అభివృద్ధి చెందుతున్న దేశాలకు నిధులు సమకూర్చడం, నష్టాలను భర్తీచేయడం, ఉద్గారాలను నియంత్రించుకోవడం వంటి పలు అంశాల్లో 2023దుబాయ్ సదస్సులో అడుగులు బాగాపడ్డాయి. మూడుదశాబ్దాల కాప్ సదస్సుల చరిత్రలో శిలాజ ఇంధనాలు అన్న పదం సంయుక్త ప్రకటనలో చేరడం అదే తొలిసారి. భూ ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5డిగ్రీల సెల్సియస్‌కు పరిమితం చేయడానికి వీలుగా కర్బన ఉద్గారాలను వేగంగా తగ్గించుకొని, 2050కల్లా తటస్థత సాధించాలని ఆ సదస్సు నిర్ణయించింది. ఆ లక్ష్యానికి అనుగుణంగా విధానాలు రాసుకుంటానని అమెరికా కూడా హామీ ఇచ్చింది. ఇక, వాతావరణమార్పుపై సమర్థ పోరాటానికి వీలుగా ఎదుగుతున్నదేశాలకు ధనికదేశాలు అందించాల్సిన సాయం 1.3 ట్రిలియన్ డాలర్లు ఉండాలన్నది అంచనా. దీనికి భిన్నంగా, పదేళ్ళపాటు ఏటా మూడువందల బిలియన్ డాలర్లు ఇవ్వడానికి మాత్రమే ధనికదేశాలు గత ఏడాది సిద్ధపడ్డాయి. ఉద్గారాల్లో డెబ్బయ్‌ఐదుశాతం వాటాతో ప్రకృతిని నాశనంచేస్తున్న సంపన్నదేశాలు విపత్తులనూ, పర్యవసానాలను మాత్రం పేదదేశాలమీద రుద్దుతున్నాయి. అధిక పారిశ్రామికీకరణతో, అవధులులేని ఉత్పత్తితో లాభపడుతున్న సంపన్నదేశాల నుంచి ఆర్థికసాయంతో పాటు, పర్యావరణ అనుకూల సాంకేతిపరిజ్ఞానాలను కూడా ఉచితంగానో, చవుకగానో వర్ధమానదేశాలు పొందవలసి ఉంటుంది. అయితే, ప్రపంచంలో అత్యంత ధనికదేశం, రెండవ అతిపెద్ద కాలుష్యకారక దేశమైన అమెరికా ఈ సదస్సుకు గైర్హాజరై మానవాళి సంఘటిత పోరాటాన్ని దెబ్బతీసింది. అమెరికాను వదిలిపెట్టి, ఈయూ, చైనా, భారత్ వంటివి 'కాప్' ఆశయాన్ని నెరవేర్చేందుకు కృషిచేయాలి.

అజ్ఞాన చీకటిలో.. విజ్ఞాన జ్యోతి

'ప్రపంచంలో అణుబాంబు లాంటి శక్తిమంతమైన ఆయుధం ఏదైనా ఉందంటే అది కేవలం విద్య మాత్రమే.' ప్రపంచాన్ని జయించాలన్నా, చంద్రునిపైకి ఎగరాలన్నా, ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడాలన్నా, దేశ జీడీపీ పెరగాలన్నా, కుటుంబ సంక్షేమం, జ్ఞాన సముపార్జన, మానవ సంబంధాలు, శాంతి స్థాపన... తదితరాలన్నిటికీ మూలం విద్య మాత్రమే. భారతదేశాన్ని విద్యావంతుల దేశంగా మార్చడానికి ఎన్నో ప్రముఖ విద్యాలయాలను నెలకొల్పిన 'భారత విద్యా వ్యవస్థ' సృష్టికర్త, విద్యా వైతాళికుడు, దేశ ప్రథమ విద్యామంత్రి మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతినే నేడు 'జాతీయ విద్యా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం.

భారత స్వాతంత్ర్య సంగ్రామంలో మౌలానా ఆజాద్ కీలక పాత్ర పోషించారు. గాంధీజీ ప్రారంభించిన సహాయ నిరాకరణ ఉద్యమానికి తోడుగా నిలిచారు. 1920లో భారత జాతీయ కాంగ్రెస్‌లో ప్రవేశించారు. ఖిలాఫత్ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని పదేళ్లు జైలుశిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం తొలి విద్యామంత్రిగా పదకొండేళ్లపాటు విశిష్ట సేవలందించారు. ఆజాద్ విద్యా సంస్కరణలు నేటికీ ఆదర్శనీయం. దేశంలో సంస్కృతీ సంప్రదాయాలు, కళలు, సంగీతం, సాహిత్య వికాసానికి తోడ్పడ్డారు. ప్రాథమిక, ఉన్నత విద్య కోసం 1948లో, సెకండరీ విద్య కోసం 1952లో ప్రత్యేక కమిషన్‌లు ఏర్పాటు చేసిన ఘనత కూడా



ఆయనదే. బాలికల, గ్రామీణ విద్య కోసం ఎంతగానో కృషి చేశారు. వయోజన విద్య, సార్వత్రిక ప్రాథమిక విద్య కోసం అనేక విద్యాలయాలు నిర్మింపజేశారు. యూజీసీ (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్)ను స్థాపించిన ఘనతా ఆయనదే. దేశంలోనే ప్రప్రథమంగా ఖరగ్‌పూర్‌లో ఐఐటీ నిర్మింపజేసి, సాంకేతిక విద్యకు బీజం వేశారు. ICCR, AICTE.. వంటి ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలను ప్రారంభించారు. ఢిల్లీలో 'సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్', సాహిత్య అకాడమి, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ & ప్లానింగ్ వంటి సంస్థలను స్థాపించిన మహనీయుడు అబుల్ కలాం. ఆయన విద్యావేత్త, రాజనీతిజ్ఞుడు, మేధో సంపన్నుడు మాత్రమే కాదు, బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషా కోవిదుడు. అంతేకాదు కవి, రచయిత, తత్వవేత్త కూడా.

నేడు చదువు అంగడి సరుకుగా మారిపోయింది. ప్రైమరీ పాఠశాలల్లో ఫీజులు వేలల్లో, లక్షల్లో ఉంటున్నాయి. ఇంటర్, డిగ్రీ, మెడికల్ సీటు, ఇంజనీరింగ్ వంటి ఉన్నత విద్య సీట్లు డబ్బున్నవాళ్లే కొనగలుగుతున్నారు. పేద విద్యార్థులు విద్యా దోపిడీకి గురవుతున్నారు. 'నూతన విద్యా విధానాల రూపకల్పన, నూతన ప్రణాళికలు, విద్య అభివృద్ధి' వంటివాటిలో ప్రభుత్వాలు, అధికారులు కొంతమేరకు విఫలమైనట్లు కన్పిస్తోంది. విద్యా సంబంధిత విషయాలపై నేటి విద్యావేత్తలు, మేధావులు చేసే విమర్శలే దీనికి నిదర్శనం. మరోవైపు, విద్య కోసం తల్లిదండ్రులు ఫీజుల భారాన్ని మోస్తున్నప్పటికీ వారి పిల్లలకు నాణ్యమైన విద్య అందడం లేదు. కార్పొరేట్ విద్యాసంస్థల రాకతో 'ధనవంతులకో విద్య, పేదలకో విద్య' అన్నట్టుగా మారిపోయింది నేటి విద్యారంగం పరిస్థితి.

విద్యా సంబంధిత ప్రవేశాల్లో కూడా జ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వకుండా కుల, మత రిజర్వేషన్లు ఉంటుండడంతో ఎంతో మంది చురుకైన, మేధోశక్తి గల విద్యార్థులు ఉన్నత విద్యా ప్రవేశాలకు దూరమవుతున్నారు. మరోవైపు, ప్రభుత్వ విద్యాలయాలకు అవసరమైన నిధులు లేక, సరైన మౌలిక సదుపాయాలు లేక అనేక ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు మూతపడే పరిస్థితి ఉంది. విద్యాలయాల్లో ఉపాధ్యాయుల నియామకాలు అవసరమైన మేరకు ఉండడం లేదు. 70 ఏళ్ల క్రితం మన దేశంలో మౌలానా అబుల్ కలాం అజాద్ తెచ్చిన విద్యా సంస్కరణలను నేటి ప్రభుత్వాలు, విద్యాధికారులు ఆదర్శంగా తీసుకోవాలి. మౌలానా అజాద్ లాంటి ఆలోచనాపరులు, మేధావులు మన విద్యా వ్యవస్థను చక్కదిద్దడానికి పుట్టుకురావాలని ఆశిద్దాం.

○ సయ్యద్ జబీ

(నేడు జాతీయ విద్యా దినోత్సవం)

గూగుల్ హబ్‌తో గ్లోబల్ మ్యాప్‌పై విశాఖ!

విశాఖపట్నంలో ఒక గిగావాట్ సామర్థ్యంతో దేశంలో తొలి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డేటా హబ్‌ను స్థాపించడానికి 15 బిలియన్ డాలర్ల పెట్టుబడిని ప్రకటించిన తరుణంలో సర్వత్రా హర్షాతిరేకాలతోపాటు కొన్ని సహజమైన సందేహాలు వ్యక్తమయ్యాయి. ఇంతటి భారీ సౌకర్యం స్థానిక పవర్ గ్రిడ్‌పై భారం మోపదా? నీటి వనరులను హరించివేయదా? అసలు ఈ స్థాయి పెట్టుబడికి తగినన్ని ఉద్యోగాలను సృష్టించగలదా? వంటి ప్రశ్నలు సామాన్యులలోనూ నిపుణులలోనూ రేకెత్తాయి. కానీ వాస్తవాలను, సాంకేతిక అంశాలను, అంతర్జాతీయ నమూనాలను నిశితంగా పరిశీలిస్తే ఈ ఏఐ హబ్ ఒక భారం కాదనీ భవిష్యత్ తరాలకు మార్గనిర్దేశం చేసే ఒక సుస్థిర ప్రగతి నమూనా అనీ స్పష్టమవుతుంది.

అందరి మదిలో మెదిలే తొలి ప్రశ్న విద్యుత్. కానీ ఈ ప్రాజెక్టు రూపకల్పనే 'స్వయం సమృద్ధి' లక్ష్యంగా జరిగింది. గూగూల్ సంస్థ ఈ హబ్ కోసం అవసరమైన విద్యుత్‌లో 80శాతాన్ని సహజ ఇంధన వనరుల ద్వారా సమకూర్చుకోనున్నది. దీనికోసం ప్రత్యేకంగా ఒక గిగావాట్ సామర్థ్యంతో ఒక సోలార్ పార్క్‌ను నిర్మిస్తోంది. ఇది మామూలు విషయం కాదు. ప్రజల అవసరాలకోసం ఉద్దేశించిన గ్రిడ్‌పై భారం మోపకుండా, ఒక పారిశ్రామిక దిగ్గజం తన సొంత హరిత ఇంధన వనరులను సృష్టించుకోవడం ఇదే ప్రప్రథమం. దీని వల్ల ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ గ్రిడ్‌పై ఈ ప్రాజెక్టు కారణంగా పడే భారం సున్నా! ఇక సాంకేతిక సామర్థ్యం విషయానికి వస్తే గూగుల్ డేటా సెంటర్లు అద్భుతమైన పనితీరుకు మారుపేరు. విద్యుత్ వినియోగ సామర్థ్యానికి కొలమానమైన 'పవర్ యూసేజ్ ఎఫెక్టివ్‌నెస్' (పీయూఈ) గూగుల్ సెంటర్లలో సగటున 1.10శాతం. అంటే కంప్యూటింగ్ శక్తికి 10శాతం మాత్రమే అదనపు విద్యుత్ అవసరం. అదే సగటు పరిశ్రమ పీయూఈ 1.58గా ఉంది. అంటే అక్కడ కంప్యూటింగ్‌కు వాడినంత శక్తిలో 58శాతం అదనంగా వృథా అవుతోందన్నమాట. గూగుల్ సాంకేతికత ఎంత శక్తిని ఆదా చేస్తుందో, ఎంత పర్యావరణ భారాన్ని తగ్గిస్తోందో దీనినిబట్టి అర్థం చేసుకోవచ్చు. ఈ 1 గిగావాట్ సోలార్ పార్క్ డేటా సెంటర్‌కు మాత్రమే కాదు. రాష్ట్ర రెన్యూవబుల్ ఎనర్జీ లక్ష్యాలకు కూడా భారీ ఊతం ఇస్తున్నది. పారిశ్రామిక ప్రగతి, పర్యావరణ బాధ్యత కలిసే సాగగలవని నిరూపిస్తోంది.

నీటి వినియోగంపై కూడా ఆందోళనలు సహజం. కానీ వాస్తవ గణాంకాలను పరిశీలిస్తే ఈ భయాలు నిరాధరమైనవని అర్థమవుతుంది. ఉదాహరణకు విశాఖ ఉక్కు కర్మాగారం రోజువారీ నీటి వినియోగం సుమారు 38 మిలియన్ గ్యాలన్‌లు (ఎంజీడీ). దీనితో పోల్చినప్పుడు, ఈ భారీ ఒక గిగావాట్ డేటా సెంటర్ మొత్తం వినియోగ అంచనా కేవలం 5 ఎంజీడీ మాత్రమే. అంటే ఇది స్టీల్ ప్లాంట్ వాడకంలో 15శాతం కంటే తక్కువ. ఇది కూడా గరిష్ఠ అంచనా మాత్రమే. అంతేకాకుండా విశాఖకు ఉన్న తీరప్రాంతం ఒక సహజవరంగా ఉపయోగపడనున్నది. ఈ ప్రాజెక్టులో మంచినీటి వాడకాన్ని దాదాపు సున్నాకు తగ్గించే సాంకేతికత అందుబాటులో ఉంది. ఆధునిక సముద్రపు నీటి ఆధారిత శీతలీకరణ వ్యవస్థ (సీ వాటర్ కూలింగ్)ను ఇక్కడ వినియోగిస్తారు. సముద్రపు నీటిని నేరుగా కాకుండా హీట్ ఎక్స్‌చేంజర్ల ద్వారా వేడిని చల్లార్చడానికి ఉపయోగిస్తారు. దీనివల్ల అమూల్యమైన మంచినీటి వనరులపై ఆధారపడాల్సిన అవసరం ఉండదు. హైదరాబాద్ లేదా బెంగళూరు వంటి లోతట్టు నగరాలలో ఇలాంటి ప్రాజెక్టు వస్తే వారు ఖచ్చితంగా తాగునీటి వనరులపైనే ఆధారపడాల్సి వచ్చేది. కానీ విశాఖతీరం మనకు వ్యూహాత్మక ప్రయోజనాన్ని ఇచ్చింది. ఇవి క్లోజ్డ్ లూప్ వ్యవస్థలు, అంటే నీటిని ఒకసారివాడి వదిలేయకుండా దాన్నే శుద్ధి చేసి చల్లార్చి పదే పదే అంతర్గతంగా వినియోగిస్తారు. దీనివల్ల నీటి వృథాకు ఆస్కారం ఉండదు. ఇది స్థానిక జలవనరులపై ఎలాంటి ప్రతికూల ప్రభావం చూపని ప్రణాళిక.

కేవలం నిర్మాణ సమయంలోనే ఉద్యోగాలు లభిస్తాయనేది ఒక అపోహ మాత్రమే. అమెరికా డేటా సెంటర్ పరిశ్రమపై 2025 పీడబ్ల్యూసీ అధ్యయనం దీనికి సంబంధించిన వాస్తవాలను కళ్లకు కట్టేలా చూపింది. ఈ అధ్యయనం ప్రకారం ప్రత్యక్ష ఉపాధి 2017లో 4,00,100 నుంచి 2023 నాటికి 6,03,900 ఉద్యోగాలకు పెరిగింది. కానీ అసలు కథ ఇక్కడే ఉంది. పరోక్ష ఉపాధిని కూడా కలిపితే ఈ పరిశ్రమ ద్వారా పొందిన ఉద్యోగాలు అదే కాలంలో 2.9 మిలియన్ల నుంచి 4.7 మిలియన్లకు పెరిగాయి. ఇది ఏడు రెట్ల ప్రభావాన్ని సూచిస్తుంది. ఈ లెక్కన విజన్ ఏఐ హబ్ ద్వారా లభించే 25వేల ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు మొత్తం ఉపాధి వ్యవస్థపై చూపే ప్రభావం 2లక్షలకు పైమాటే. అతి ముఖ్యమైన విషయం ఏమిటంటే– ఈ ఉద్యోగాలు తాత్కాలికం కావు. ఇక్కడ లభించే నైపుణ్యాలు (హైటెక్ నిర్మాణం, ఫైబర్ ఆప్టిక్స్, నెట్‌వర్క్ నిర్వహణ) కేవలం ఒక ప్రాజెక్టుకే పరిమితం కావు. ఇవి మొత్తం డిజిటల్ పరిశ్రమలకు అవసరం. 2030 నాటికి భారతదేశ డేటా సెంటర్ సామర్థ్యం 5–6 గిగా వాట్‌లకు చేరనుంది. ఈ దూకుడుగల పైప్‌లైన్‌కు, ఇక్కడ శిక్షణ పొందిన నిపుణులకు నిరంతరంగా జాతీయ డిమాండ్ ఉంటుంది. ఇక ఒక ప్రాజెక్టు కాదు. ఒక నైపుణ్యభరిత పారిశ్రామిక శక్తికి పునాది.



> గూగుల్ ఏఐ హబ్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.22వేల కోట్ల ప్రోత్సాహకాలను కొందరు ఉచితాలుగా తప్పుగా అన్వయించుకుంటున్నారు. ఇది ఉచితం కాదు. రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టిన వ్యూహాత్మక పెట్టుబడి. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అంచనాల ప్రకారమే ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తికి (జీఎస్‌డీపీ) ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరనుంది. అంటే కొన్ని సంవత్సరాలలోనే ప్రోత్సాహకాల విలువ తిరిగి రాబడుతుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన నమూనా.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన రూ.22వేల కోట్ల ప్రోత్సాహకాలను కొందరు ఉచితాలుగా తప్పుగా అన్వయించుకుంటున్నారు. ఇది ఉచితం కాదు. రాష్ట్ర భవిష్యత్తుపై పెట్టిన వ్యూహాత్మక పెట్టుబడి. దీని ద్వారా రాబోయే ప్రతిఫలం అపారమైనది. రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక అంచనాల ప్రకారమే ఈ ప్రాజెక్టు ద్వారా రాష్ట్ర స్థూల జాతీయ ఉత్పత్తికి (జీఎస్‌డీపీ) ఏటా రూ.10,518 కోట్లు అదనంగా సమకూరనుంది. అంటే కొన్ని సంవత్సరాలలోనే ప్రోత్సాహకాల విలువ తిరిగి రాబడుతుంది. ఇది కేవలం సిద్ధాంతం కాదు. ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైన నమూనా. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు వ్యూహాత్మక ప్రోత్సాహకాలను ఇచ్చి దీర్ఘకాలిక, అధిక విలువగల రాబడిని పొందుతున్నాయి. మన రాష్ట్రం అనుసరిస్తున్నదీ అదే విజయవంతమైన మార్గం.

డేటా సెంటర్ల రాక కేవలం సాంకేతిక పెట్టుబడి కాదు. అది ఒక సంపూర్ణ ప్రాంతీయ పరివర్తనకు నాంది పలుకుతుంది. ప్రపంచవ్యాప్త ఉదాహరణలే ఇందుకు సాక్ష్యం. అమెరికాలోని వర్జీనియా రాష్ట్రంలో యాష్‌బర్న్ పట్టణం చుట్టుపక్కల ప్రాంతాల్ని డేటా సెంటర్ అల్లీ (డేటా సెంటర్ల వీధి) అని పిలుస్తారు. యూరప్‌లోని డబ్లిన్ (ఐర్లాండ్) వంటి ప్రాంతాలలో ఈ హైపర్‌స్కేల్ సౌకర్యాలు వచ్చిన ఐదేళ్లలోనే రియల్‌ఎస్టేట్ విలువ 25శాతం నుంచి 40శాతం వరకు పెరిగాయి. ఇది కేవలం నివాస గృహాలకు పరిమితం కాదు. దానికి అనుబంధంగా కొత్త లాజిస్టిక్ పార్క్‌లు, సేవారంగ సంస్థలు, హాస్పిటాలిటీ (హోటళ్ళు), మౌలిక సదుపాయాలు వేగంగా విస్తరించాయి. విశాఖపట్నం కూడా ఇదే తరహా పరివర్తనకు సిద్ధమవుతోంది. ఈ ఏఐ హబ్, దానికి అనుబంధంగా వస్తున్న సబ్ సీ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో కలిసి వాణిజ్య, నివాస విస్తరణకు, పర్యాటక రంగానికి, మౌలిక సదుపాయాల ఆధునికీకరణకు భారీ ఊతం లభిస్తుంది. ఇది తీరప్రాంత ఆంధ్రప్రదేశ్‌కు పూర్తిస్థాయిలో పట్టణ, ఆర్థిక ఉన్నతిని అందిస్తుంది.

80శాతం సంప్రదాయేతర ఇంధనం (రెన్యూవబుల్ ఎనర్జీ), ఉక్కు కర్మాగారం వాడకంలో 15శాతంకన్నా తక్కువ నీటి వినియోగం, ఏటా రూ.10,500 కోట్లకుపైగా జీఎస్‌డీపీకి ఆదాయం, లక్షలాదిమందికి నిరంతర నైపుణ్య ఉపాధి, పూర్తిస్థాయిలో రియల్ ఎస్టేట్ పరివర్తన... ఇవన్నీ చూశాక కూడా ఇది వనరుల హరణం అని చెప్పగలమా? దీనిని విజయవంతంగా అమలుచేస్తే విశాఖపట్నం కేవలం ఒక డేటా సెంటర్‌కు ఆతిథ్యం ఇవ్వడమే కాదు, ప్రపంచానికి భారతదేశ డిజిటల్ ముఖద్వారంగా సగర్వంగా నిలుస్తుందని చెప్పవచ్చు.

■ రవికుమార్ ఈటంశెట్టి

సీఈఓ, టైర్ ఎక్స్ డేటా సెంటర్ సొల్యూషన్స్, బెంగళూరు

కాలం మలచిన కవి

కవీ! నీ గురించి నివాళి రాయాలంటే అక్షరాలు కళ్ల నీళ్లు పెట్టుకుంటున్నాయి. అందెశ్రీ! నిన్ను తలంచుకోవాలంటే కలం గద్గద స్వరమై రాయలేక నిలువెల్లా వణికిపోతుంది. మొన్న నాతో మాట్లాడిన అందెశ్రీ ఇలా అర్ధాంతరంగా అకస్మాత్తుగా మాట మాత్రంగానైనా చెప్పా పెట్టకుండా వెళ్లిపోతాడని అనుకోలేదు. ఒకప్పటి వరంగల్ జిల్లా జనగాం తాలూకాలోని రేబర్తి గ్రామం అందెశ్రీ స్వంత గ్రామం. ప్రస్తుతం సిద్దిపేట జిల్లా మద్దూరు మండలంలో ఉంది. చిన్నప్పుడే తల్లిని కోల్పోయాడు. ఆ గ్రామంలో మల్లారెడ్డి పటేల్ వద్ద పెరిగాడు. బడికి పోవాల్సిన వయసులో పశువుల కాపరిగా పనిచేశాడు. చిన్నప్పటినుండి దైవభక్తి మిక్కిలిగా ఉండేడిది. ఊరిలోని అన్ని కులాల ప్రజల నోటిలో పండుగా మెదిలాడు.



జీవితంలో సంభవించిన అనేక పరిణామాల కారణంగా నిజామాబాద్ జిల్లాలోను హైదరాబాద్‌లోను కూడా మేస్త్రిగా పనికి కుదిరాడు. బతుకు పాఠశాలలో అనేక పాఠాలు నేర్చుకున్నాడు. నాలుగో తరగతి చదువుకున్నారని ఆయన చెప్పాడు. ప్రారంభంలో అందెశ్రీ వివిధ పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలను చూస్తే సంభ్రమాశ్చర్యాలు కలుగక మానవు. కొత్త పాట రాసిన ప్రతిసారి తాపీ పని నుంచి సరాసరి పత్రిక ఆఫీసులకు వచ్చేవాడు. మిత్రులైన వారిని కలిసేవాడు. వారి కోరికపై కొత్త పాటను వినిపించేవాడు. మొదట్లో బిరుదురాజు రామరాజు దగ్గర ఎక్కువగా కనిపించేవాడు. తర్వాత తర్వాత ఆయన సాహితీ ప్రపంచం విస్తృతమైన కొద్దీ, ఎంత ఎదిగినా ఒదిగి ఉండేవాడు. "నెత్తి మీద సుట్ట బట్ట ఆపైన పండ్ల బుట్ట తెనుగోల్ల ఎల్లవ్వా ఏది" – తెలంగాణ అస్తిత్వంలో కింది కులాల పైన రాసిన గొప్ప పాట ఇది. "మాదిగయ్యల మేధ నుండి పురుడు పోసుకున్నది మానవ జాతులను ఎప్పుడు మేలుకొలుపుతున్నది" వంటి పాటలను రాసి పాడిన అద్భుతమైన జానపద వాగ్గేయకారుడు. "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు మచ్చుకైనా లేడు చూడు మానవత్వం లేని వాడు" అంటూ ప్రపంచీకరణ నేపథ్యంలో మనిషి ఎలా చిరునామా కోల్పోతున్నాడో వివరంగా తన కలం ద్వారా, గళం ద్వారా గొంతెత్తి వినిపించాడు.


ఇకపోతే తెలంగాణ మలిదశ ఉద్యమంలో కవిగా, వాగ్గేయకారుడుగా ఆయన పాత్ర అమోఘమైనది, అద్వితీయమైనది. ఆయన సాహితీ ప్రస్థానం అంతా ఒక ఎత్తు, తెలంగాణ ప్రజల రాష్ట్ర గీతం 'జయ జయ జయహే తెలంగాణ' ఒక ఎత్తు. ఈ గీతంలో తెలంగాణ ఖ్యాతిని చరిత్రను నిక్షిప్తం చేసి ప్రజల నాలికల పైన అజరామరమయ్యాడు అందెశ్రీ. అతని లాంటి కవి ఇక ముందు తెలంగాణలో జన్మిస్తాడనుకోవడం అసాధ్యమైన అంశం. ఆయన పాటల, మాటల సారాంశం అంతా తెలంగాణ అస్తిత్వంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఆయన మరణం తెలుగు సాహిత్యానికి అందులో తెలంగాణ సాహిత్యానికి ఒక తీరని లోటు.

– జూకంటి జగన్నాథం

కులోన్మాదంతో అభివృద్ధికి ఆటంకం

'భారతీయ సమాజంలో సర్వాంతర్యామి భగవంతుడు కాదు... కులమే' అంటారు ప్రఖ్యాత చరిత్రకారుడు బిపిన్ చంద్ర. మనదేశంలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు కులం ఆవరించి ఉందన్నది ఓ చేదు వాస్తవం. కుల సమస్య ఈ దేశంలో ఉన్న రూపంలో ప్రపంచంలో మరెక్కడా లేదు. భారతదేశంలో కులానికి బలమైన పునాదులు ఉన్నాయి. వాటిని పెకిలించే ప్రయత్నాలు గతంలో, ప్రత్యేకించి జాతీయోద్యమ సమయంలో చిత్తశుద్ధితో జరిగాయి. కుల జాడ్యం, కులాధిక్యత, కులాల కట్టుబాట్ల వల్ల భారత సమాజానికి జరిగిన చెరుపును మాటల్లో చెప్పలేం. అనేక శతాబ్దాల పాటు భారత సమాజంలో కులం సామాజిక అనైక్యతకు, సమాజ విచ్ఛిన్నానికి కారణం అయింది. జాతీయ సమైక్యతాభావం వికసించకుండా, ప్రజాస్వామ్య స్ఫూర్తి విస్తరించకుండా, అభివృద్ధి ఫలాలు అందరికీ చెందకుండా 'కులం' అడ్డుపడింది.

1950లో రాజ్యాంగ చట్టం అమలులోకి రాక ముందే దేశంలో కుల ప్రభావాన్ని తగ్గించడానికి, కులాధిపత్య ధోరణుల్ని అరికట్టడానికి, కులాల మధ్య సానుకూల వాతావరణం పెంచడానికి అనేక ఉద్యమాలు జరిగాయి. ముఖ్యంగా జాతీయోద్యమం, హేతువాద ఉద్యమాలతోపాటు, బ్రహ్మ సమాజం, ఆర్య సమాజం, దివ్యజ్ఞాన సమాజం వంటి సంస్థలు, సంఘ సంస్కర్తలు ఎంతో కృషి సల్పారు. కొన్ని ఫలితాలు కూడా సాధించారు. దేశంలో పారిశ్రామిక, వ్యవసాయ విప్లవాలు వచ్చాక మరికొంత మార్పు వచ్చింది. నూతన ఆర్థిక కార్యకలాపాలు ముమ్మరం అయ్యాక కులమత భేదాలు లేకుండా ప్రజలు కలసి మెలసి పనిచేసే వాతావరణం నగరాలు, పట్టణాలలో చాలావరకు ఏర్పడింది.



> ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొన్నా, దానిని కులం కోణం నుంచి చూసి సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేయడం, తమ కులస్థుల్ని రెచ్చగొట్టడం వారికి సర్వసాధారణంగా మారింది. ఈ కుల మేధావులు ఎంత దూరం వెళ్తున్నారంటే.. సీఎం, డిప్యూటీ సీఎం ఏ విధంగా పరిపాలించాలో, ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో కూడా సోషల్ మీడియా ద్వారా వారే నిర్దేశిస్తున్నారు!

దేశ స్వాతంత్ర్యం తర్వాత అన్ని రంగాలలో అమలు కావాల్సిన ప్రజాస్వామ్య స్ఫూర్తి వ్యక్తుల స్వార్థంతోను, రాజకీయ పార్టీల అధికార దాహంతోను మృగ్యంగా మారింది. రాజ్యాంగకర్తలు ఆశించిన విధంగా మన రాజకీయ ప్రజాస్వామ్య వ్యవస్థ విజయవంతం కాకపోవడానికి కారణం, అది సామాజిక ప్రజాస్వామ్య వ్యవస్థగా రూపుదిద్దుకోలేకపోవడమే. అనేక దశాబ్దాలపాటు దేశంలోను, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ అణగారిన కులాలకు రాజ్యాధికారంలో సముచితమైన భాగస్వామ్యం లేకుండాపోయింది.

కులాలను ఓటు బ్యాంకులుగా చూసే వైఖరిని దేశంలో కొన్ని రాజకీయ పార్టీలు చాలా రోజులుగా ఓ వ్యూహంగా మార్చుకొన్నాయి. దాంతో, ఒక్కో కులం నుంచి పదుల సంఖ్యలో స్వయం ప్రకటిత నాయకులు తయారవుతున్నారు. ఎన్నికల సమయంలో వారు ప్రెజర్ గ్రూప్స్‌గా తయారై రాజకీయ పార్టీలను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకొన్నా, దానిని కులం కోణం నుంచి చూసి సామాజిక మాధ్యమాల్లో కామెంట్లు చేయడం, తమ కులస్థుల్ని రెచ్చగొట్టడం వారికి సర్వసాధారణంగా మారింది. ఈ కుల మేధావులు ఎంత దూరం వెళ్తున్నారంటే.. సీఎం, డిప్యూటీ సీఎం ఏ విధంగా పరిపాలించాలో, ఎటువంటి నిర్ణయాలు తీసుకోవాలో కూడా సోషల్ మీడియా ద్వారా వారే నిర్దేశిస్తున్నారు! ఆ మధ్య హిందూపురం శాసనసభ్యుడు, సినీ హీరో నందమూరి బాలకృష్ణ, మరో సినీ హీరో చిరంజీవిల మధ్య ఏర్పడిన స్వల్ప వివాదంలోకి కూడా ఈ కులోన్మాదులు దూరిపోయారు. వాళ్లిద్దరి ప్రమేయం లేకుండానే వీరు సవాళ్లు, ప్రతిసవాళ్లతో సోషల్ మీడియాలో రెచ్చిపోయారు. ఎంతో సున్నితమైన అంశంగా, కులాల మధ్య వైషమ్యాలను పెంచడం నేరంగా భావించే ప్రధాన మీడియా స్రవంతి కూడా ఇందులో ప్రధానపాత్ర పోషించడం ఆశ్చర్యం. తాజాగా, నెల్లూరు జిల్లా కందుకూరులో జరిగిన ఓ ఘటనలో ప్రధాన పార్టీకి చెందిన మీడియా అత్యంత బాధ్యతారహితంగా ప్రవర్తించింది. ఇద్దరు వ్యక్తుల మధ్య చోటు చేసుకొన్న వివాదం చివరకు దారుణ హత్యకు దారితీసింది. ఈ ఘటనలో కొందరు కుల నాయకులు, ప్రతిపక్షం వ్యవహరించిన తీరు అమానుషంగా ఉంది.

ఓ వైపు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో పెట్టుబడుల కోసం, పరిశ్రమలను రప్పించడం కోసం ఎంతో ప్రయాస పడుతున్నారు. శాంతిభద్రతలు సవ్యంగా ఉన్న చోటనే పారిశ్రామికాధిపతులు తమ సంస్థలు ప్రారంభిస్తారు. రాజకీయ అస్థిరత, అనిశ్చితి, రౌడీయిజం ఉండే చోటుకు ఎవరూ రారు. ఈ వాస్తవం చంద్రబాబు నాయుడుకు తెలిసినంతగా మరెవరికీ తెలియదేమో! ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొమ్మిదేళ్లు నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రంలో కుల, మత ఘర్షణలకు తావులేదు. 2014–19 మధ్య అయిదేళ్లలో గానీ, గత 16 నెలల్లో గానీ ప్రజల మధ్య కులపరమైన విభేదాలు లేవు. ముఖ్యంగా విశాఖపట్నంలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు ఖరారైనప్పట్నుంచీ ఏపీ రాజకీయాల్లో కొన్ని అవాంఛనీయ ధోరణులు మొదలైన సంకేతాలు వెలువడుతున్నాయి. కొన్ని శక్తులు తమకు అడ్డూ అదుపూ లేనట్టు రెచ్చిపోతున్నాయి. ఇటువంటి ధోరణులను ఆదిలోనే తుంచివేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది.

● సి. రామచంద్రయ్య

శాసనమండలి సభ్యుడు

అమెరికాపై మోజు తగ్గించుకుందాం

భారత్‌ను అమెరికా నానాటికీ శత్రుదేశంగా చూస్తోంది. మన ఎగుమతులపై పలు రకాల ఆంక్షలు, సుంకాలు విధించటమేగాక, అమెరికాకు వలస వెళ్లే భారతీయులపై వీసా చార్జీలు కూడా భారీగా పెంచింది. ఉన్నత విద్య కోసం అమెరికా వెళ్లిన మన విద్యార్థుల నుంచి కూడా అక్కడి విద్యాసంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. మన ఐటీ నిపుణులు, విద్యార్థుల వల్ల అమెరికానే అధిక ప్రయోజనం పొందిన విషయం మరిచి, మనం వారిని దోచుకుంటున్నట్లు ట్రంప్, మరికొందరు నేతలు ప్రచారం చేస్తున్నారు. ఇది దురదృష్టకరం. విశాఖలో స్థాపించబోయే డేటా సెంటర్‌తో పాటు పలు సంస్థల్లో కనీసం అయిదారు వేల ఉద్యోగాలు ఉండే అవకాశముంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాల్లో వ్యక్తుల నైపుణ్యాన్ని బట్టి లక్షన్నర నుంచి రెండు లక్షల రూపాయల వరకూ వేతనం పొందే అవకాశం కూడా ఉంది. అమెరికాలో జీతాలు భారీగా కనిపించినా అక్కడి జీవనవ్యయం కూడా భారీగానే ఉంటుందనే విషయాన్ని యువత గుర్తించాలి.

మన ప్రధాని మోదీ కోరినట్లు స్వదేశీ ఉత్పత్తులనే మన ప్రజలు ముఖ్యంగా యువత కొనుగోలు చేయాలి. అమెరికా ఉత్పత్తుల వాడకం తగ్గించాలి. ఆ దేశంలో తయారయ్యే టెస్లా కార్లు, బైకులు, యాపిల్, ఐఫోన్లు వంటి వాటి మీద ఈ మధ్య యువతకు మోజు పెరిగింది. ఇలా అమెరికా వస్తువుల దిగుమతులతోనే నానాటికీ డాలర్ విలువ పెరుగుతూ రూపాయి విలువ సుమారు 88 రూపాయలకు పైగా తగ్గిపోయింది. అందుకే స్వదేశీ ఉత్పత్తులకు ఆదరణ పెరగాలి. అభివృద్ధి చెందిన చైనా, రష్యా వంటి దేశాలే గాక, బ్రెజిల్, ఆఫ్ఘనిస్థాన్ వంటి చిన్న దేశాలు కూడా అమెరికా బెదిరింపులకు లొంగబోమని స్పష్టం చేస్తుంటే మనమెందుకు తగ్గాలి? దిగుమతుల నిలిపివేతతో తాత్కాలికంగా నష్టపోయే కొన్ని రంగాలను ప్రభుత్వం ఆదుకోవాలి. ఈ అదనపు భారాలను సామాన్య ప్రజానీకంపై విధించకుండా, అమెరికా వంటి దేశాల్లో మిలియనీర్లపై విధిస్తున్నట్లుగా మన దేశంలోనూ సంపన్నులపై సంపద పన్ను, వారసత్వ పన్నులు విధిస్తే నల్లధనం తగ్గి ప్రభుత్వాదాయం కూడా పెరుగుతుంది. తాత్కాలిక లాభనష్టాల కంటే దేశ గౌరవం ముఖ్యం. అభివృద్ధి చెందిన దేశాల్లో పర్యావరణ రక్షణ కోసం అక్కడి ప్రభుత్వాలు కొత్త పరిశ్రమలపై ఎన్నో నిబంధనలు విధిస్తుంటే, మన తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పేరుతో పర్యావరణానికి హాని కలిగించే విదేశీ కంపెనీలకు అతి చౌకగా భూములు కట్టబెడుతూ ఎన్నో రాయితీలు ఇస్తున్నాయి. సుందర్ పిచాయ్ వంటి ప్రవాస భారతీయ పారిశ్రామికవేత్తలకు మాత్రమే ఇకముందు మన ప్రభుత్వం రాయితీలు ఇవ్వడం సముచితం. మొదటి నుంచి అమెరికాలో 'మా ఇంటికి వస్తూ ఏమి తెస్తావ్? మీ ఇంటికి వస్తే ఏం పెడతావ్' అనే వ్యాపార అనుకూల ప్రభుత్వాలదే ప్రాభవం కనుక, అమెరికా బెదిరింపులను లెక్క చేయకుండా దేశ భద్రత దృష్ట్యా సహజ మిత్రదేశమైన రష్యా దేశపు చౌక చమురు సరఫరాను కొనసాగించాలి.

– తిరుమలశెట్టి సాంబశివరావు, గుంటూరు

కార్తికం.. కమనీయం



ఆలయాలకు.. పోటెత్తిన భక్తులు ● వైభవంగా కార్తిక సోమవారం పూజలు

అమరావతి, కోటప్పకొండ (నరసరావుపేట), బాపట్ల రూరల్, పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తికమాసం మూడో సోమవారాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అన్ని ప్రాంతాల్లోని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే పెద్దసంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణాల్లో కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. శివనామస్మరణతో దేవాలయాలు మార్మోగాయి. రోజంతా కొందరు మహిళలు ఉపవాస దీక్ష చేపట్టారు. పంచారామ క్షేత్రాల్లో ప్రథమ ఆరామమైన అమరావతిలోని అమరేశ్వరాలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. తొలుత కృష్ణానదిలో స్నానమాచరించిన భక్తులు నదీతీరంలో, ఆలయ పరిసరాల్లో కార్తిక దీపాలను వెలిగించారు. అనంతరం క్యూల్లో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో త్రికోటేశ్వరస్వామి సన్నిధిలో భక్తుల కోలాహలం నెలకొంది. మేధా దక్షిణా మూర్తి స్వరూప త్రికోటేశ్వరస్వామికి పంచామృతాలతో విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు వైభవంగా జరిగాయి. విశేష పుష్పాలంకరణ సేవ జరిగింది. ఆలయ ప్రాంగణం, నందీశ్వరుని విగ్రహం వద్ద భక్తులు దీపారాధనలు చేశారు. పెదకాకాని మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శివయ్య దర్శనం కోసం భక్తులు భారీగా తరలివచ్చారు. యజ్ఞాలబావి వద్ద స్నానాలు ఆచరించిన భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తిక దీపారాధనలు చేశారు. అనంతరం స్వామివారికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కాకాని శివయ్యను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గేదెల తుహిన్‌కుమార్ దంపతులు, విజయవాడ డీసీపీ కెజివి సరిత, గుంటూరు ఆర్డీవో శ్రీనివాస్ తదితరులు దర్శించుకున్నారు.


ప్రత్యేక అలంకరణలో అమరావతి అమరేశ్వరుడు

సముద్రుడికి తాంబూలం

బాపట్లలోని సూర్యలంక సముద్రతీరం తెల్లవారుజాము నుంచే భక్తులతో సందడి నెలకొంది. తీరంలో మహిళలు, పురుషులు పుణ్యస్నానాలు ఆచరించారు. మహిళా భక్తులు తీరం ఒడ్డున ఇసుకతిమ్మెలతో శివలింగాన్ని ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సముద్రదేవుడికి తాంబూలాన్ని సమర్పించారు.


అమరావతిలో భక్తుల పూజలు

బాపట్ల : సూర్యలంక తీరంలో భక్తుల స్నానాలు



గుంటూరులో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

వాటర్‌షెడ్ పర్యావరణానికి పునాది

- నీటి నిర్వహణతోనే దేశాభివృద్ధి
- జాతీయ సదస్సులో డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- గుంటూరులో అట్టహాసంగా ప్రారంభమైన సదస్సు
- వివిధ రాష్ట్రాల నుంచి హాజరైన అధికారులు, ఎన్జీవోలు
- వెంగళాయపాలెం చెరువు సందర్శనకు నేడు కేంద్ర మంత్రి చౌహాన్



బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, అధికారులు

నేడు వాటర్‌షెడ్ మహోత్సవ్ సభ

వాటర్‌షెడ్ డెవలప్‌మెంట్ కాంపొనెంట్ ఆఫ్ ప్రధానమంత్రి కృషి సించాయి యోజన (డబ్ల్యూడీసీ-పీఎంకేఎస్‌వై) 2.0తో గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో అభివృద్ధి చేసిన చెరువును మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సందర్శించనున్నారు. సోమవారం రాత్రి గుంటూరుకు చేరుకున్న ఆయన ఐటీసీ హోటల్‌లో బస చేశారు. ఆయన మంగళవారం ఉదయం కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారు లతో కలిసి వెంగళాయపాలెం చెరువుని సందర్శిస్తారు. అనంతరం లయోలా పాఠశాలలో జరిగే వాటర్ షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొంటారు. మధ్యాహ్న భోజన విరామం అనంతరం జాతీయ వాటర్ షెడ్ సదస్సు ముగింపు కార్యక్రమం ఐటీసీ హోటల్‌లో జరుగుతుంది. సాయంత్రం పెమ్మసాని నివాసంలో డిన్నర్‌కి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హాజరౌతారు.

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాటర్‌షెడ్ అంటే చెక్‌డ్యాం కాదని ఇది గ్రామీణ భారత పునర్నిర్మాణానికి బలమైన పర్యావరణ పునాది అని కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. రెండు రోజుల వాటర్‌షెడ్ జాతీయ సదస్సు గుంటూరులో ఐటీసీ వెల్‌కం హోటల్‌లో సోమవారం అట్టహాసంగా ప్రారంభమైంది. కేంద్రం, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అధికారులు, ఎన్‌జీవోలు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ దేశాన్ని ప్రగతిపథంలో నిలిపేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ కృషికి అండగా కేంద్ర ప్రభుత్వ పథకాలను విజయవంతంగా అమలు చేయాలన్నారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వెంగళాయపాలెంలోని 21 ఎకరాల విస్తీర్ణంలోని చెరువుని కేవలం రూ.కోటి ఖర్చు చేసి 15 రోజుల్లోనే సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఆ చెరువుని మంగళవారం ఉదయం ప్రతినిధులంతా సందర్శించాలని కోరారు. దేశాభివృద్ధి నీటి నిర్వహణపై ఆధారపడి ఉందని, వర్షం వచ్చినప్పుడే ఆ నీటిని సేకరించి నిల్వ చేసుకుని ఆ తర్వాత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాటర్ షెడ్ కార్యక్రమాల ద్వారా భూగర్భ జలాలను పెంపొందించుకోవచ్చన్నారు. తద్వారా రైతులకు పంట ఆదాయం పెరుగుతుందన్నారు. రెండో పంట సాగు చేసే అవకాశం అందుబాటులోకి వస్తుందని చెప్పారు. వచ్చే ఏడాది ప్రారంభించబోయే వాటర్ డెవలప్‌మెంట్ కన్వర్జెన్స్ - పీకేఎస్‌వై 3.0ని ఏ విధంగా రాష్ట్రాలు (మిగతా 6వ పేజీలో)


వివిధ రాష్ట్రాల నుంచి సదస్సుకు హాజరైన అధికారులు

ఢిల్లీ ఘటనతో... రెడ్ అలర్ట్



- ఎక్కడికక్కడ అప్రమత్తమైన పోలీసులు
- హోటళ్లు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలో తనిఖీలు

జిల్లా వ్యాప్తంగా రెండు గంటల పాటు నాకాబందీ



గుంటూరు: నాకాబందీలో భాగంగా తనిఖీలు చేస్తున్న పోలీసులు


గుంటూరు: రైల్వే స్టేషన్ వద్ద డాగ్స్‌తో తనిఖీలు చేస్తున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం బాంబు పేలుళ్ల నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా పోలీసులు రెడ్అలర్ట్ ప్రకటించారు. ఐజీ, ఎస్పీలతో డీజీపీ హరీష్‌కుమార్‌గుప్త అత్యవసరంగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. నాకాబందీ పేరుతో విస్తృత తనిఖీలకు ఆదేశాలు ఇచ్చారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా సోమ వారం రాత్రి 8:30 నుంచి 10:30 గంటల వరకు పోలీసులు విస్తృతంగా తనిఖీ చేపట్టారు. రోడ్లపైనా, అన్ని ప్రధాన కూడళ్లలోనూ వాహన తనిఖీలు చేపట్టారు. రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లతో పాటు జన సమర్థంగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేశారు. జాతీయ, రాష్ట్ర రహదారుల్లోనూ ఆయా తనిఖీలు కొనసాగాయి. కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు, బస్సులు ఇతర రవాణా వాహ నాలను ఆపి ఎక్కడికక్కడ తనిఖీలు నిర్వహించారు. ఆయా తనిఖీల్లో అనుమానాస్పద వ్యక్తులను పూర్తిస్థాయిలో విచారించి వారి ఆధారాలు పరిశీలించిన తర్వాతే వదిలేశారు. బాంబుడిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లు సైతం రంగంలో దిగి తనిఖీలు నిర్వహించాయి. మరోవైపు కౌంటర్ ఇంటెలిజెన్స్, యాంటీ టెర్రరిస్ట్ నిఘా బృందాలు రంగంలో దిగి క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఆరాతీస్తున్నాయి.పోలీసులు అన్ని ప్రాంతాల్లో ఏకకాలంలో రంగంలోకి తనిఖీలు చేపట్టడంతో ఏం జరిగిందో అర్థం కాక వాహన చోదకులు అయోమయానికి గురయ్యారు. మరోవైపు ఆయా జిల్లాల్లో వీఐపీల కదలికలు ఉన్న ప్రాంతాల్లో భద్రతను మరింత కట్టు దిట్టం చేశారు. ఇక జిల్లా కేంద్రాలైన గుంటూరు, నరసరావుపేట, బాపట్ల తో పాటు అన్ని పట్టణ ప్రాంతాల్లోనూ ఆకస్మిక తనిఖీలు కొనసాగాయి. గుంటూరు శివారు వెంగళాయపాలెంలో జరగనున్న జాతీయ వాటర్ షెడ్ మహోత్సవానికి కేంద్ర మంత్రులు హాజరవుతున్న నేపథ్యంలో ఎస్పీ వకుల్ జిందాల్ ఆయా ప్రాంతాల్లో బందోబస్తును పటిష్ఠం చేశారు.

మల్టీ డ్రగ్ చికిత్సతో కుష్ఠు నయం

- 17 నుంచి 30 వరకు జిల్లాలో ప్రత్యేక సర్వే
- సర్వే పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్ అన్సారీయా

గుంటూరు సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే మల్టీ డ్రగ్ చికిత్సతో(ఎండీటీ) కుష్ఠువ్యాధి పూర్తిగా నయం అవుతుందని కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమ (ఎల్‌సీడీసీ) పోస్టర్లను కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కుష్ఠు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం ఈ నెల 17 నుంచి 30 వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని 5,56,616 గృహాలను 1167 బృందాలు సర్వే చేస్తాయన్నారు. ఒక్కో బృందంలో ఆశా కార్యకర్త, పురుష వలంటీర్ ఉంటారని తెలిపారు. సర్వే ద్వారా వ్యాధిగ్రస్తులను గుర్తించి అవసరమైన మందులు ఉచితంగా అందించి చికిత్స అందిస్తామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎండీటీ మందులు ఉచితంగా అందిస్తామన్నారు. అనుమానిత లక్షణాలు ఉంటే సర్వే బృందంతో పరీక్షించుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, డీఎంహెచ్‌వో డా.విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈవో రేణుక, పశుసంవర్ధకశాఖ జేడీ సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.ఎస్.వి.రమణ, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏడీ వజ్రశ్రీ, ఆర్‌బ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, కలెక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



సర్వే పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రూ.66.38 కోట్ల పనులకు ఆమోదం

- స్థాయి సంఘ సమావేశంలో మేయర్ కోవెలమూడి

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో రూ.66.38 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపినట్లు స్థాయి సంఘం అధ్యక్షుడు, మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. సోమవారం మేయర్ చాంబర్‌లో స్థాయి సంఘ సమావేశం జరిగింది. వివిధ డివిజన్లకు సంబంధించి అభివృద్ధి పనులను స్థాయి సంఘం ప్రతిపాదించగా సమావేశంలో ఆమోదించారు. ఆయా డివిజన్లకు సంబంధించిన ప్రజాప్రతినిధులు, అధికారులు 173 అంశాలకు సంబంధించిన పనులను ప్రతిపాదించారు. వీటిపై సంఘ సభ్యులు చర్చించి ఆమోదించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కుల, మత, పార్టీలకు అతీతంగా మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి పైపు లైన్లు, పచ్చదనం అభివృద్ధికి ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు ప్రతిపాదనలపై చర్చించి ఆమోదించా మన్నారు. ఈ సమావేశంలో కమిషనర్ పులి శ్రీనివాసులు, స్థాయి సంఘ సభ్యులు ఈరంటి వరప్రసాద్, షేక్ మీరావలి, కొమ్మినేని కోటేశ్వరరావు, దాసరి లక్ష్మీదుర్గ, ముప్పవరపు భారతి, నగర పాలక సంస్థ విభాగాధిపతులు పాల్గొన్నారు.


సమావేశంలో ప్రసంగిస్తున్న మేయర్ కోవెలమూడి

పెదకాకాని ఎంపీపీపై నెగ్గిన అవిశ్వాసం

- అనుకూలంగా 14 మంది ఎంపీటీసీలు ఓటు
- పదవి కోల్పోయిన తులిమిల్లి

పెదకాకాని, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పెదకాకాని వైసీపీ ఎంపీపీ తులిమిల్లి శ్రీనివాసరావుపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. సోమవారం గుంటూరు ఆర్డీవో కే శ్రీనివాసరావు పర్యవేక్షణలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. మొత్తం 21 మంది ఎంపీటీసీలు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో అవిశ్వాస తీర్మా నాన్ని ప్రవేశ పెట్టారు. ఇందుకు అను కూలంగా 14 మంది ఎంపీటీసీలు చేతులెత్తి మద్దతు తెలిపారు. దీంతో ఎంపీపీగా తులిమిల్లి శ్రీనివాసరావును తొలగిస్తున్న ట్లు ఆర్డీవో ప్రకటించారు.

తులిమిల్లి అక్రమాలకు చరమగీతం : ఎమ్మెల్యే నరేంద్ర

పెదకాకాని ఎంపీపీగా తులిమిల్లి శ్రీనివాసరావు అన్యాయాలు, అక్రమాలకు, నియంతృత్వ ధోరణులకు వ్యతిరేకంగా జరిగిన అవిశ్వాసంతో టీడీపీ, వైసీపీ ఎంపీటీసీలు చరమగీతం పాడారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. అవిశ్వాస తీర్మానం నెగ్గిన తర్వాత ఎంపీటీసీలకు ఆయన అభి నందనలు తెలిపారు. ఇది ధర్మం గెలిచిన రోజుగా తాను భావిస్తున్నట్లు చెప్పారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎమ్మెల్యే రోశయ్య హయాంలో ఎంపీపీగా తులిమిల్లి అనేక అరా చకాలు చేశారని ఆరోపించారు. ప్రభుత్వ పథకాల్లో అవినీతికి పాల్పడ్డారన్నారు. పర్సంటేజ్ ఇవ్వాలని వైఎస్సార్ జలకళ గుత్తేదారుడ్ని బెదిరించడంతో అతడు ఆ పనిని వదిలేసుకున్నారన్నారు. ఆ సమయంలో ఉప్పలపాడుకు చెందిన వైసీపీ నాయకుడి భార్య పేరుపై ఓ కంపెనీ సృష్టించి జలకళ టెండర్లు చేజిక్కించుకుని అవినీతికి పాల్పడ్డారన్నారు. అను మర్లపూడి గ్రామంలో 40 ఏళ్లగా ఉన్న భూవివాదానికి సంబంధించి కోర్టులో ఉన్న కేసులను బలవంతంగా ఉపసం హరింప చేసి ఎమ్మెల్యే బినామీదారుల పేర్లపై ఆ భూములను రిజిస్ట్రేషన్ చేయించారన్నారు. అనుమర్లపూడిలోని చెరువులో క్వారీ పరిశీలనకు వెళ్తుంటే అప్పట్లో తమపై దాడులు చేయించారన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

రెవెన్యూ అధికారులను బెదిరించి గ్రామంలో వేరొకరు భూమిని తన కుమార్తె పేరుపై ప్రభుత్వ రికార్డులో ఎక్కించుకున్నారన్నారు. వైసీపీ హయాంలో అనేక దౌర్జన్యాలు దోపిడీ లకు తులిమిల్లి శ్రీనివాసరావు కారకుడని ఆరోపించారు. వైసీపీ హయాంలో డీవీసీ ఆస్పత్రిని లాక్కోవాలని చూశారని, తాను కోర్టుకు వెళ్లి రక్షించుకున్నట్లు చెప్పారు. డీవీసీ ఆస్పత్రిని వైద్య కళాశాలగా మార్చడానికి ప్రయత్నిస్తున్నట్లు నరేంద్ర తెలిపారు. పెదకాకాని ఎంపీపీ పదవి బీసీ యాదవ సామాజిక వర్గానికి కేటాయించినట్లు ప్రకటించారు. సమావేశంలో ఉప్పలపాడు ఎంపీటీసీ మోపర్తి శ్రీనివాసరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మోసిన్, ఏఎంసీ వైస్ చైర్మన్ తాళ్ళ శ్రీనివాసరావు, నాయకులు విన్నకోట పూర్ణ శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

లాంలో రూ.కోట్లలో అవినీతి

కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన వార్డు సభ్యులు

తాడికొండ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తాడికొండ మండలం లాం పంచాయతీలో రూ.కోట్లలో అవినీతి జరిగిందని 13వ వార్డు మెంబరు షేక్ నసీబ్‌మియా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల దినం సందర్భంగా సోమవారం కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన నసీబ్‌మియా ఈ మేరకు ఫిర్యాదు అందజేశారు. 2021-22 నుంచి ఇప్పటి వరకు పంచాయతీ నిధుల వినియోగంలో అవినీతి జరిగిందని ఆమె ఆరోపించారు. ప్రజారోగ్య, పీడబ్ల్యూఎస్, విద్యుత్ సామగ్రితో పాటు పెట్రోల్, డీజిల్ కొనుగోళ్లలో అక్రమాలు జరిగాయన్నారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులతో వేసిన సీసీ రోడ్లు, సీసీ కల్వర్టులు, డ్రెయిన్స్, గ్రావెల్ రోడ్లకు సంబంధించి పను లు చేయకుండానే తీర్మానాలు మార్చి రాసి రెండు సార్లుగా నిధులు గోల్‌మాల్ చేసినట్లు తెలిపారు. ఒకే పనికి వేర్వేరుగా బిల్లులు డ్రా చేశారన్నారు. పీడబ్ల్యూఎస్ స్కీం ద్వారా ఫిల్టర్ ట్యాంకుల నిర్మాణాల్లో అవకతవకలు జరిగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పుట్టా మణికుమార్ అనే వ్యక్తి పంచాయతీ కార్యాలయంలో ఉంటూ, రికార్డు రూమ్ తాళాలు తన వద్దే ఉంచుకుని అజమా యిషీ చేస్తున్నాడన్నారు. ఈ అవకతవకలపై తక్షణమే విచారణ చేపట్టాలని కలెక్టర్‌ను ఆమె కోరారు.

ఐకమత్యంతోనే అద్భుత విజయం

- టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు రాష్ట్రాభివృద్ధికి పాటుపడాలి
- అడిగొప్పుల నేతల పనితీరు భేష్
- నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

దుర్గి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఐకమత్యంతో పనిచేస్తే అద్భుత విజయం సాధించవచ్చని, అందరూ కలిసి మెలిసి రాష్ట్రాభివృద్ధికి దోహదపడాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. సోమవారం మండలంలోని ధర్మవరంలో హరిహర బాలానాగేంద్రస్వామి తిరునాళ్లను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఎడ్లబండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రజలంతా సంతోషంగా ఎడ్లపోటీలకు హాజరవడం ఆనందంగా ఉందన్నారు. గతంలో ఎక్కడ చూసినా పల్లెలు పశువులతో కళకళలాడేవని, పశు సంపదను ముందు తరాలకు అందించేలా ఎడ్ల పోటీలు నిర్వహించడం శుభపరిణామమన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు రైతులకు అనుకూలంగా ఉన్నాయని, మిర్చి, పత్తి, కంది ధరలు ఆశాజనకంగా ఉండడంలో కూటమి ప్రభుత్వం కృషి ఉందన్నారు. గతంలో ఎన్నో ప్రాజెక్టులు మూలనపడ్డాయని, వాటికి జీవం పోసేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఎంతగానో శ్రమిస్తున్నారన్నారు. పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయకుండా గ్రామాభివృద్ధికి ఉపయోగించుకోవాలన్నారు. అడిగొప్పుల గ్రామ కూటమి నేతలు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, వారిని అందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని లావు కృష్ణదేవరాయలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వంగలూరి అంజయ్య, కుర్రి శివారెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, బూసా రామారావు, జానకి రామయ్య, వజ్రం నాయక్, దిగమర్తి సుబ్బారావు, మేకల దాసు, యాగంటి నరేశ్, తోటకూర శ్రీనివాసరావు, సింగు నాగేశ్వరరావు, జక్కా రమేశ్, వంకమళ్ల కోటేశ్వరరావు, వెలిదండి శ్రీనివాసరావు, నాగెండ్ల శ్రీను, కూటమి నేతలు పాల్గొన్నారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదిపాడు పుష్కర ఘాట్ వద్ద ఆదివారం గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యమైంది. తెలంగాణలోని హుజూర్‌నగర్ మండలం లింగగిరి గ్రామానికి చెందిన ముజాహిద్దీన్ తన స్నేహితులతో కలిసి పులిచింతల ప్రాజెక్టు సందర్శనకు వచ్చాడు. మాదిపాడులోని పుష్కర ఘాట్ వద్ద స్నానాలు చేస్తుండగా కాలు జారి నదిలో పడి గల్లంతయ్యాడు. ముజాహిద్దీన్ మృతదేహాన్ని సోమవారం పోలీసులు వెలికి తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య



చింతకాయల వెంకట్రావు (ఫైల్ ఫోటో)

యడ్లపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధతో ఓ వృద్ధ కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యడ్లపాడు మండలం కొత్తపాలెం గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపాలెం గ్రామానికి చెందిన చింతకాయల వెంకట్రావు (72) ఏటా పొలం కౌలుకు తీసుకుని సాగుచేస్తుంటాడు. పెట్టుబడుల కోసం రూ.11లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది కూడా కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసినప్పటికీ ఆశాజనకంగా లేకపోవడంతో ఆందోళనకు గురయ్యాడు. గత కొన్నేళ్లుగా దిగుబడులు రాక వరుస నష్టాలు వస్తుండడం.. అప్పులు తీర్చలేనేమోనన్న భయంతో తల్లడిల్లిపోయాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 7న కొత్తపాలెం గ్రామ శివారులో పురుగుల మందు తాగి చిన్న కుమారుడు లక్ష్మీనారాయణకు ఫోన్‌చేసి చెప్పాడు. వెంటనే ఘటనా స్థలికి చేరుకున్న కుటుంబసభ్యులు హుటాహుటిన వెంకట్రావును గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి అటు నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 8న వెంకట్రావు మృతిచెందాడు. వెంకట్రావు పెద్ద కుమారుడు గోపి సోమవారం యడ్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



సూర్యప్రకాశ్ (ఫైల్ ఫోటో)

కొల్లిపర, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలోని గాజువాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో కొల్లిపర మండలం అన్నవరం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. అన్నవరం గ్రామానికి చెందిన కె.సూర్యప్రకాశ్ (44) పనిమీద విశాఖపట్టణంలోని గాజువాకకు వెళ్ళాడు. ఆదివారం సూర్యప్రకాశ్ గాజువాకలో జాతీయ రహదారిపై వెళుతుండగా లారీ ఢీకొట్టింది. దాంతో సూర్యప్రకాశ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని సోమవారం పోలీసులు కుటుంబసభ్యులకు తెలియజేశారు. సూర్యప్రకాష్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. అతడికి భార్య, ఇద్దరూ పిల్లలు ఉన్నారు.

కాలువలో పడి విద్యార్థిని మృతి



నరసమ్మ (ఫైల్ ఫోటో)

ఈపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు కాలవలోకి జారి పడి ఏడో తరగతి విద్యార్థిని మృతి చెందిన ఘటన ఈపూరు మండలంలోని ఇనుమెల్లలో సోమవారం జరిగింది. భద్రపాలెం గ్రామానికి చెందిన గండికోట సుబ్బారావు, మల్లేశ్వరి దంపతుల చిన్న కుమార్తె నరసమ్మ (12) ఇనుమెల్ల హైస్కూల్‌లో ఏడో తరగతి చదువుతోంది. సోమవారం పాఠశాల విడిచి పెట్టిన తర్వాత ఇంటికి వచ్చే క్రమంలో బస్సు కోసం మేజర్ కాలువ వద్ద దిమ్మెలపై కూర్చుంది. దాహం వేయ డంతో బాటిల్‌తో నీళ్లు తీసుకోవడానికి కాలువలోకి దిగింది. ఈ క్రమంలో కాలుజారి కాలువలో పడి గల్లంతయింది. ఆ సమయంలో అక్కడే దుస్తులు ఉతుకుతున్న ఓ మహిళ నరసమ్మను కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. గల్లంతయిన నరసమ్మ కోసం గాలింపు చేపట్టగా కొంత దూరంలో ఆమె మృతదేహం లభ్యమైంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నరసమ్మ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

చిక్కీలో పురుగులు

- పట్టించుకోని విద్యాశాఖాధికారులు

చుండూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చుండూరు మండల ప్రాథమిక పాఠశాలలోని చిన్నారులకు ఇస్తున్న చిక్కీ ప్యాకెట్లలో నుంచి పురుగులు బయటకు వస్తున్నా అధికారులు వాటిని పాఠశాలలకు పంపిణీ చేశారు. సోమవారం ఆలపాడులోని 1వ వార్డు ప్రాథమిక పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న పాప పాఠశాలలో ఇచ్చిన చిక్కీని సాయంత్రం ఇంటికి తెచ్చుకొంది. చిక్కీ కవర్ చించమని తండ్రిని కోరింది. ఆయన కవర్ చించగా చిక్కీ నుంచి పురుగులు బయటకు వచ్చాయి. మండలంలోని 32 ప్రాథమిక పాఠశాలలకు ఇటీవల ఈ చిక్కీలను పంపిణీ చేశారు. విద్యార్థులు పురుగులు ఉన్న చిక్కీలను గుర్తించక వాటిని తిని ఉంటారని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా విద్యాశాఖాధికారి చుండూరు మండలంలోని పాఠశాలల పనితీరును పరిశీలించి రెండు సంవత్సరాలకు పైగా అవుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల వ్యక్తిగత పర్యవేక్షణ కనిపించడం లేదని అందువల్లే చాలా మంది తల్లిదండ్రులు ఇంటి నుంచి పిల్లలకు క్యారేజీలు ఇచ్చి పంపుతున్నారని తెలుపుతున్నారు. నానాటికి ప్రభుత్వ పాఠశాల్లో నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో మండలంలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు విడిచి ప్రైవేటు విద్యా సంస్థల్లో చేరుతున్నారని చెబుతున్నారు. ఒక్కసారైన ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న అవకతవకలపై జిల్లా విద్యాశాఖాధికారి వ్యక్తిగతంగా పరిశీలించాలని కోరుతున్నారు. పురుగుల చిక్కీలను అందించిన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్థిక మోసాల నివారణపై ఏఎన్‌యూలో సదస్సు

ఏఎన్‌యూ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మోసాలను అధిగమించడంపై మంగళవారం ఏఎన్‌యూలో ఒక రోజు సదస్సు నిర్వహిస్తున్నామని సోమవారం కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం అధిపతి ఆర్.శివరాం ప్రసాద్ తెలిపారు. ద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా అమరావతి చాప్టర్, కామర్స్ అండ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఏఎన్‌యూ ఆధ్వర్యంలో సంయుక్తంగా దీన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ ఆర్థిక మోసాలు, పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ పరిస్థితుల గురించి ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఏఎన్‌యూలోని బాలమోహన్ దాస్ సెమినార్ హాల్లో ఈ సదస్సు జరుగుతుందని శివరాం తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

తుళ్లూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాయపూడి లాంచీ రేవు వద్ద కృష్ణానదిలో ఆదివారం గల్లంతైన ఇద్దరిలో నాగులపల్లి పవన్ (29) అనే యువకుడి మృతదేహం లభ్యమైంది. స్నానానికి దిగిన కొద్ది దూరంలో పవన్ మృతదేహాన్ని ఎన్డీఆర్ఎఫ్, గజ ఈతగాళ్లు వెలికి తీశారు. మృతుడు కోనసీమ జిల్లా అమరాపురం వాసి, రాజధానిలో హ్యాపి నెస్ట్ నిర్మాణం చేపట్టిన ఎన్‌సీసీ కంపెనీ స్టోర్‌లో పనిచేస్తున్నాడు. గల్లంతైన మరో యువకుడు దినేశ్ ఆచూకి ఇంకా లభించలేదు. ఎన్డీఆర్ఎఫ్ బృందాలు గాలిస్తున్నాయి.

కాలువలో స్నానానికి దిగి యువకుడి గల్లంతు



కుంచాల ఏసుబాబు (ఫైల్‌ఫొటో)

మంగళగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి లక్ష్మీనరసింహస్వామి కాలనీ సమీపంలోని గుంటూరు చానల్‌లో స్నానానికి దిగి ఓ యువకుడు గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం జరిగింది. తాడేపల్లికి చెందిన కుంచాల ఏసుబాబు (22) తల్లిదండ్రులు లేకపోవడంతో బంధువుల వద్ద ఉంటూ తాపీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవల భవానీ మాల వేసుకున్న ఏసుబాబు లక్ష్మీనరసింహస్వామి కాలనీలో పనికి వచ్చాడు. తన మిత్రుడైన సహచర భవానీ శేషయ్యతో కలిసి గుంటూరు చానల్‌లో స్నానానికి దిగాడు. నీటి పారుదల ఎక్కువగా ఉండడంతో ఏసుబాబు నీటి ఒరవడికి కొట్టుకుపోయాడు. ఏసుబాబును రక్షించేందుకు శేషయ్య ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఎన్‌డీఆర్ఎఫ్ బృందం సంఘటనా స్థలానికి చేరుకుని గల్లంతయిన ఏసుబాబు ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

చంద్రబాబు విజన్ వల్లే పారిశ్రామిక విప్లవం

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, సమర్థత వల్లే ఏపీలో పారిశ్రామిక విప్లవం మొదలైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ప్రభుత్వ రాయితీలు, ప్రోత్సాహకాలతో పాటు, గతంలో పరిశ్రమల్ని తరిమేసిన రాజకీయ భూతం మరలా రాదన్న ముఖ్యమంత్రి భరోసా పారిశ్రామిక వేత్తల్ని ధైర్యంగా రాష్ట్రం వైపు ముందడుగు వేయిస్తోందన్నారు. 410 ఒప్పందాలు, రూ 9.80 లక్షల పెట్టుబడులతో విశాఖ భాగస్వామ్య సదస్సు సాక్షిగా నవ్యాంధ్రప్రదేశ్ పేరు ప్రపంచ వ్యాప్తంగా ప్రతిధ్వనిస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతే లక్ష్యంగా, పెట్టుబడుల ఆకర్షణే ధ్యేయంగా ప్రపంచాన్ని చుట్టేస్తున్నా రని అన్నారు. సుదీర్ఘ సముద్రతీరం, మానవనైపుణ్యాలు, స్పీడ్ ఆఫ్ డూయింగ్ పాలసీ కూటమి ప్రభుత్వ సత్వర స్పందన పారిశ్రామి కవేత్తలను ఆకర్షిస్తున్నామని కొమ్మాలపాటి సోమవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

సీఐఐ సమ్మిట్‌కు ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధులు

- అమరావతిలో పెట్టుబడి అవకాశాలపై విస్తృత ప్రదర్శన

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) బృందం నవంబరు 14, 15వ తేదీలలో విశాఖపట్నంలో జరగనున్న సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2025లో పాల్గొంటుందని కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. సోమవారం రాయపూడి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ, దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, ప్రముఖ సంస్థల సీఈవోలు, డెవలపర్లు, విద్యా, వైద్యా, ఎలక్ట్రానిక్స్, మౌలిక వసతుల సంస్థలకు అమరావతి రాజధాని ప్రాంతంలో పెట్టుబడికి ఉన్న అవకాశాలను ఏపీ సీఆర్‌డీఏ బృందం విస్తృతంగా వివరిస్తుందని చెప్పారు. సమ్మిట్‌లో మౌలిక వసతులు, పట్టణాభివృద్ధి, లాజిస్టిక్స్, మొబిలిటీ, హరిత ఇంధనం వంటి పలు విభాగాల అభివృద్ధి క్లస్టర్లను ఏపీ సీఆర్‌డీఏ ప్రతినిధి బృందం ప్రదర్శించనుందని చెప్పారు. పెట్టుబడిదారుల కోసం పబ్లిక్-ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో రూపొందించిన ప్రాజెక్టు నమూనాలు, వ్యూహాత్మకంగా ఉన్న భూభాగాలు, అమరావతిలో నిర్మిస్తున్న 9 థీమ్ సిటీల గురించి వివరించనుందని చెప్పారు. అలాగే ఏపీసీఆర్‌డీఏ అందిస్తున్న సౌకర్యాలు, పెట్టుబడిదారుల కోసం అవలంబిస్తున్న విధానాలను ఈ సమ్మిట్‌లో ఏపీ సీఆర్‌డీఏ బృందం ప్రదర్శిం చనుందని కమిషనర్ కన్నబాబు తెలిపారు.

ఎంఎస్కే క్రికెట్ అకాడమీకి భూమిపూజ



ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలోని పిచుకలపాలెం రెవెన్యూలో 12 ఎకరాలలో నిర్మించనున్న ఎంఎస్కే ప్రసాద్ ఇంటర్నేషనల్ క్రికెట్ అకాడమీ నిర్మాణానికి సోమవారం భూమి పూజ జరిగింది. భూమి పూజలో భారత మాజీ క్రికెటర్ ఎంఎస్కే ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు. 12 ఎకరాల విస్తీర్ణంలో ఈ అకాడమీ రూపుదిద్దుకోనుంది. ఈ అకాడమీలో 400 మంది శిక్షణార్థులు, 1,000 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చే విధంగా నిర్మించనున్నారు. సందర్శక జట్ల కోసం వసతి, హాస్టల్ సౌకర్యాలు స్థానికంగా టోర్నమెంట్ల నిర్వహణకు మినీ క్రికెట్ స్టేడియం, అత్యాధునిక జిమ్‌లు, ఫిజియోథెరపీ, పునరావాస కేంద్రం ఆధునిక ఫిట్‌నెస్, కండిషనింగ్ సదుపాయాలతో ఈ అకాడమీని నిర్మిస్తున్నారు. అమరావతిని క్రీడలకు కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సీఆర్డీఏ ఈ అకాడమీ నిర్మాణానికి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తోంది.

వాటర్‌షెడ్.. పర్యావరణానికి పునాది

(5వ పేజీ తరువాయి)

అమలు చేసుకుంటాయనే దానిపై అభిప్రాయాలు సేకరించారు. రాజస్థాన్‌లో అభివృద్ధి చేసిన సరోవరం గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఝాన్సీలో వాటర్‌షెడ్ కార్యక్రమం కింద అభివృద్ధి చేసిన నీటి వనరులను ప్రతీ ఒక్కరూ సందర్శించి స్ఫూర్తి పొందాలని అధికారులు సూచించారు. ల్యాండ్ స్కేపింగ్, వనరుల పరిరక్షణ ద్వారా పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణ గురించి ఇక్రిశాట్ సంస్థ పవర్ పాయింట్ ప్రజంటేషన్ అందర్నీ ఆకట్టుకుంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఝాన్సీ జిల్లాకు చెందిన ఇక్రిశాట్ థీమ్ లీడర్ డాక్టర్ రమేష్ సింగ్ దీని గురించి వివరించారు. సాంప్రదాయ నీటి పొదుపు విధానాల గురించి న్యూఢిల్లీకి చెందిన అంతర్జాతీయ నీటి యాజమాన్య సంస్థ ప్రిన్సిపల్ సైంటిస్టు డాక్టర్ గోపాల్‌కుమార్ విశ్లేషించారు. నదులు, సాంప్రదాయ నీటి సంరక్షణ విధానాల పునరుద్ధరణ, పర్వతశ్రేణుల్లో నీటి బుగ్గల పునరుద్ధరణ, గడ్డి మైదానాల అభివృద్ధి, వాటర్‌షెడ్ ప్రాజెక్టుల అమలులో హైడ్రాలజీ ప్లానింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో డీవోఎల్ఆర్ సెక్రెటరీ మనోజ్ జోషి, జాయింట్ సెక్రెటరీ నితిన్ ఖడే, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి ప్రిన్సిపల్ సెక్రెటరి శశిభూషణ్‌కుమార్, డైరెక్టర్ కృష్ణ తేజ, గుంటూరు కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకునేలా నమూనా

సదస్సులో భాగంగా ఐటీసీ హోటల్‌లో గ్రామీణాభివృద్ధి శాఖ వాటర్‌షెడ్ 3డీ నమూనా ఏర్పాటు చేసింది. పచ్చని సోయగాల నడుమ, సరోవరం నుంచి నీరు జాలువారుతున్నట్లు రూపొందించిన ప్రదర్శన అతిథులను ఆకట్టుకుంది. చూడముచ్చటైన ల్యాండ్ స్కేపింగ్, ప్రజలకు నడక మార్గాలు వంటివి ఇందులో పొందుపరిచారు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు

- ప్రయాణికులు సురక్షితం



అదుపుతప్పి పక్కకు ఒరిగిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

రాజుపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా రాజుపాలెం మండలం రెడ్డిగూడెం సమీపంలో హైదరాబాద్ నుంచి బాపట్ల వెళ్తున్న ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు కల్వర్టు వద్ద అదుపుతప్పి పక్కకు ఒరిగిపోయింది. రెడ్డిగూడెం సమీపంలో ఉన్న చప్టా వద్దకు బస్సు వచ్చే సమయానికి బస్సును డ్రైవర్ అతి వేగంగా నడపడం వల్ల రోడ్డు మార్జిన్‌లోకి దిగి బస్సు పక్కకు ఒరిగిపోయింది. వర్షానికి ఉన్న సిమెంట్ పైపుల సపోర్టుతో బస్సు కింద పడకుండా ఆగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. బస్సులో 30 మంది ప్రయాణికులు ఉండగా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

4 స్టార్ హోటల్‌కు నేడు భూమి పూజ

- వర్చువల్‌గా పాల్గొననున్న సీఎం చంద్రబాబు

తుళ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ హోటళ్ల సంస్థ దసపల్లా గ్రూపు రాజధాని అమరావతిలో నిర్మించ తలపెట్టిన 4 స్టార్ హోటల్ నిర్మాణానికి మంగళవారం భూమి పూజ చేయనుంది. ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు వర్చువల్‌గా పాల్గొని శుభాకాంక్షలు చెప్పనున్నారు. పురపాలక మంత్రి పి.నారాయణ, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పలువురు సీనియర్ ఐఏఎస్ అధికారులు, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు ఈ కార్యక్రమానికి హాజరుకానున్నారు. శాఖమూరు రెవెన్యూ పరిధిలోని ఎన్జీవో క్వార్టర్స్ సమీపంలో దసపల్లా గ్రూపు చైర్మన్ ఎం.రాఘవేంద్ర రావు చేతుల మీదుగా ఈ భూమిపూజ జరగనుంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాంట్ ట్రేడ్ సరఫరా చేసే పారం గేటు గుడ్డు ధర రూ.6.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	121, 129, 140
చికెన్ విత్ స్కిన్(కిలో)	228.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	238.00

42,823 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 44,605 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 42,823 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 8,346 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	16200	ఏసీ కామన్ వెరైటీ		
నెంబరు. 5	10000	14300	334	10500	16000
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	16800	273	----	----
4884	----	----	341	10000	17000
సూపర్ 10	----	----	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16500
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	----	----	తాలుకాయలు	5000	8800



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ రవీంద్ర, పక్కన కమిషనర్ పులి శ్రీనివాసులు, హాజరైన అధికారులు

అభివృద్ధి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి అయ్యేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని, పూర్తి చేసిన పనులకు సంబంధించిన బిల్లుల చెల్లింపునకు నిధి పోర్టల్లో అప్ లోడ్ చేయాలని నగర మేయర్ కోవెల మూడి రవీంద్ర ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. సోమవారం కమిషనర్ చాంబర్ లో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన అత్యవసర సమీక్షా సమావేశంలో మేయర్ పాల్గొన్నారు. మేయర్ మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ మంగళ, బుధవారాల్లో ఏఈల వారీగా పూర్తి అయిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్స్‌ని నిధి పోర్టల్లో అప్ లోడ్ చేయడమే అధిక ప్రాధ్యాన్యతగా చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ (ఇన్‌చార్జి) సుందర్రామిరెడ్డి, ఈఈలు కోటేశ్వరరావు, విష్ణు, వేణు, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రజల ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్‌కు ప్రజలు అందించే ఫిర్యాదులు, అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు విభాగాధిపతులకు స్పష్టం చేశారు. సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ లో డయల్ యువర్ కమిషనర్, నగరపాలక సంస్థ కౌన్సిల్ హాల్లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. కమిషనర్ తొలుత డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 24 ఫిర్యాదులు తీసుకొని, అధికారులతో మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి విభాగాధిపతులే క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్లాలన్నారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు తీసుకొని కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పీజీఆర్ఎస్, ఇతర వేదికల ద్వారా ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ ద్వారా 26 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, ఉపా సెల్ పీవో సింహాచలం, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను గడువులోపు పూర్తి చేయాలి

నగరపాలక సంస్థ పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులను నిర్దేశిత గడువు మేరకు పూర్తయ్యేలా పర్యవేక్షణ చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కమిషనర్ నాయీబ్రాహ్మణ కాలనీ, ఎస్వీఎన్ కాలనీ, స్వర్ణభారతీ నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పనుల వేగవంతం, నాణ్యత పాటించేలా ఎమినిటి కార్యదర్శులు, ఏఈలే బాధ్యత వహించాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ శ్రీరాంప్రసాద్, డీఈఈ రమేష్ బాబు, ఇంజినీరింగ్, ప్రజారోగ్య, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

వాటర్ షెడ్ మహోత్సవం విజయవంతం చేయాలి

గుంటూరు మెడికల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్లెలే దేశానికి పట్టుకొమ్మలు అన్న మహాత్మాగాంధీ స్ఫూర్తితో గ్రామ సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ సరోవర్ మిషన్‌లో భాగంగా మంగళవారం నగరంలో జరిగే వాటర్ షెడ్ మహోత్సవాన్ని కూటమి పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని జిల్లా జనసేన పార్టీ అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఒక ప్రకటనలో కోరారు. మంగళవారం ఉదయం 9 గంటలకు ఐటీసీ హోటల్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభం అవుతుందని, అనంతరం లయోలా కాలేజీలో భారీ బహిరంగ సభ జరుగుతుందని ఆయన వివరించారు.

ఏపీ ఎన్జీజీవో నగర కమిటీ ఎన్నిక

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్జీవో కల్యాణ మండపంలో నగర ఏపీఎన్జీజీవో సంఘ ఎన్నిక కార్యక్రమం నిర్వహించారు. నగర అధ్యక్షుడిగా ఎస్‌పీఎస్ సూరి, కార్యదర్శిగా సిహెచ్ కళ్యాణ్ కుమార్, కోశాధికారిగా కోటేశ్వరరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా డాక్టర్ వి.విజేత, ఉపాధ్యక్షులుగా కె.చిన్నారావు, బి.సాంబశివరావు, ఎస్.రామకృష్ణారావు, పీవీ భావనారాయణ, మహిళా ఉపాధ్యక్షురాలిగా బి.విజయలక్ష్మి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎన్.రామకృష్ణారావు, సంయుక్త కార్యదర్శిగా ఎం. శ్రీనివాసరావు, డి.వి మురళీకృష్ణ, బి. దుర్గారావు, జి. పాండు రంగారావు, బి అంకమ్మరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా పి.సునీత, డీఈసీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు డీడీ నాయక్, సహాయ ఎన్నికల అధికారిగా అమరావతి యూనిట్ అధ్యక్షుడు అశోక్ కుమార్ వ్యవహరించారు. నూతన కార్యవర్గాన్ని జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూరు షరీఫ్ అభినందించారు. అనంతరం ఎన్నికైన కార్యవర్గ సభ్యులతో ఎన్నికల అధికారి డి.డి నాయక్ ప్రమాణ స్వీకారం చేయించారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో విజిలెన్స్ దాడులు



దుకాణాలపై దాడులు నిర్వహిస్తున్న విజిలెన్స్ సభ్యులు, లీగల్ మెట్రాలజీ అధికారులు

గుంటూరు (తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎన్టీఆర్ బస్టాండ్‌లోని దుకాణాలపై విజిలెన్స్ సభ్యులు, లీగల్ మెట్రాలజీ అధికారులు దాడులు నిర్వహించారు. తినుబండారాలు, కూల్‌డ్రింక్స్‌లను ఎమ్మార్పీ ధర కంటే అధికంగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు అందడంతో ఈ దాడులు నిర్వహించారు. బస్టాండ్‌లో ఓ దుకాణంలో కూల్‌డ్రింక్ రూ.20 ఎమ్మార్పీ ఉండగా, రూ.30కు అమ్ముతున్నట్టు గుర్తించి కేసు నమోదు చేశారు. నిబంధనలను ఉల్లంఘించిన మరో ఆరు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యుడు డాక్టర్ చదలవాడ హరిబాబు, లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ ఇన్‌చార్జ్ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర రైఫిల్ పోటీలలో జిల్లాకు పతకాలు

గుంటూరు(క్రీడలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులో ఈనెల 8, 9 తేదీలలో జరిగిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ పోటీలలో జిల్లా క్రీడాకారులు మూడు బంగారు, ఒక వెండి, రెండు కాంస్య పతకాలను సాధించినట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కె.నాగ శిరీష తెలిపారు. అండర్ 17 విభాగంలో కార్తికేయని, గ్రీష్మ సందేశి బంగారు పతకాలను సాధించగా ప్రణవి సాయి, లోహిత్ కాంస్య పతకాలను గెలుపొందారు. అండర్-19లో రాజరాజేశ్వరి బంగారు, అండర్-14 విభాగంలో ఫణి దీక్షిత రజిత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను, శిక్షకులను అభినందించారు.

ఉర్దూ భాష అభ్యున్నతికి ప్రభుత్వ కృషి అభినందనీయం

గుంటూరు (విద్య), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి):రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ భాష అభివృద్ధికి, ఉర్దూ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నదని గుంటూరు విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి ఎండీ ఖాసీం అన్నారు. సోమవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పదవ తరగతి ఉర్దూ మీడియం విద్యార్థినులకు సెంటర్ ఫర్ మైనార్టీ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిపుణులైన ఉపాధ్యాయులచే తయారు చేసి రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందించిన స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి పద్మజ, సీనియర్ ఉపాధ్యాయుడు అబ్దుల్ ఖయ్యూమ్ పాల్గొన్నారు.

ప్రజల సంతృప్తి స్థాయి మెరుగుపడాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా
● పీజీఆర్ఎస్‌కు 261 అర్జీలు



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్వో ఖాజావలీ తదితరులు

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అందిన అర్జీలను సకాలంలో పరిష్కరించి ప్రజల సంతృప్తి స్థాయిని పెంచాలని అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో ఖాజావలీ, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీ కుమారితో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 261 అర్జీలు అందాయి. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు అందించిన అర్జీలను క్షేత్రస్థాయిలో సక్రమంగా విచారించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈవో రేణుక, పశుసంవర్థక శాఖ జేడీ ఏ.సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహిపాల్‌రెడ్డి, మైక్రో ఇరిగేషన్ ఏడీ వజ్రశ్రీ, ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, డీటీసీ సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● వైద్య, ఆరోగ్య శాఖలో పని చేస్తున్న రెండవ ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై నేతాజీ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు అర్జీలు అందజేశారు. ఏఎన్ఎంలకు హెచ్ఆర్ పాలసీ అమలు చేసేందుకు కేంద్రం అనుకూలంగా ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో ఉమ్మడి జిల్లా కార్యదర్శి జి.సంధ్యారాణి, జిల్లా అధ్యక్షురాలు లింగమ్మ, కే.పరిమళ, బి.సుజాత, వై.రోజారాణి, జి.చిన్నకోటమ్మ ఉన్నారు.

ఆమె టిఫిన్ బండికి మళ్లీ కష్టాలు

● ఆ కలెక్టర్ లేరు.. నువ్వు ఇక్కడ బండి పెట్టవద్దు
● కుమారుడు యశ్వంత్‌తో కలిసి కలెక్టర్‌ను ఆశ్రయించిన తల్లి



కలెక్టర్‌ను కలిసేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన యశ్వంత్, రాధిక

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు విస్తరణ, ట్రాఫిక్ సమస్య అంటూ నగర పాలక సంస్థ అధికారులు టిఫిన్ బండిని తొలిగించారని అప్పటి కలెక్టర్ నాగలక్ష్మిని ఆశ్రయించిన అభయం పొందిన యశ్వంత్ తల్లికి మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. జీజీహెచ్ వద్ద వెంకట్రావుపేటకు చెందిన రాధిక టిఫిన్ బండిని పెట్టుకుని జీవనం సాగిస్తుండగా జూన్‌లో దానిని నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. దీంతో తన తల్లి చనిపోదాం అంటుందని జూన్ 30న ఆమె కుమారుడు యశ్వంత్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి వాపోగా నాగలక్ష్మి స్పందించారు. ఆమెకు గీవింగ్ బ్యాక్ టూ సొసైటీ ద్వారా టిఫిన్ బండిని అందజేసి, వారిని ఇబ్బంది పెట్టవద్దని అధికారులను ఆదేశించారు. కాగా ప్రస్తుతం మళ్లీ అధికారులు రాధికను ఆ ప్రాంతంలో టిఫిన్ బండిని పెట్టుకోకుండా నెల రోజుల నుంచి అడ్డుకుంటున్నారు. బండి పెట్టగానే తోటి వ్యాపారులు విద్యుత్ సరఫరా నిలిపివేయడం, వ్యర్థాలు వేయడం చేస్తున్నారు. దీనిపై అధికారులను ఆశ్రయిస్తే అప్పటి కలెక్టర్ లేరు.. ఇకపై బండి పెట్టవద్దని హెచ్చరిస్తున్నారంటూ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కుమారుడితో కలిసి రాధిక వచ్చి అధికారుల ఎదుట తన గోడు వినిపించుకున్నారు.



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్, అధికారులు

కేంద్ర మంత్రుల పర్యటనకు పటిష్ట భద్రత : ఎస్పీ

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామంలోని మంచినీటి చెరువు వద్ద జరగనున్న జాతీయ వాటర్ షెడ్ కార్యక్రమం, అమృత్ సరోవర్ అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొనడానికి కేంద్ర మంత్రులుతో పాటు పలువురు ప్రతినిధులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న భద్రత, బందోబస్తు ఏర్పాట్లను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అషుతోష్ శ్రీవాస్తవ్‌తో కలసి ఎస్పీ వకుల్ జిందాల్ స్వయంగా పరిశీలించారు. జిల్లా అదనపు ఎస్పీ (ఏఆర్) ఏ. హనుమంతు, ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాస్, సౌత్ డీఎస్పీ భానోదయ, ఎస్‌బీ సీఐ అళహరి శ్రీనివాస్, నల్లపాడు సీఐ వంశీధర్ తదితరులతో కలసి క్షేత్ర స్థాయిలో పర్యటించారు. ఈ కార్యక్రమంలో బాగంగా లయోలా పాఠశాలలో జరగనున్న సమావేశం కోసం ఏర్పాటు చేసిన స్టేజిను పరిశీలించారు. వీవీఐపీలు, వీఐపీలు, ప్రజా ప్రతినిధులు, ఇతర ప్రముఖుల వాహనాల పార్కింగ్‌కి సంబంధించి కేటాయించిన పార్కింగ్ స్థలాలను పరిశీలించి తగు సూచనలు చేశారు.



డివైడర్‌లో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

జీటీ రోడ్డు అభివృద్ధి పనులు చక...చకా

● రహదారికి మరమ్మతులు.. డివైడర్‌పై మొక్కలు

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జాతీయ వాటర్ షెడ్ మహోత్సవంలో భాగంగా గుంటూరులో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, మరో కేంద్ర మంత్రి పెమ్మసానితో పాటు రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో జీటీ రోడ్డుకు మహర్దశ పట్టింది. మొన్నటి వరకు గుంతలు, ఆక్రమణలతో అధ్వానంగా ఉన్న జీటీ రోడ్డు పూర్తిగా మారిపోయింది. ఐటీసీ కార్యాలయం ఎదుట నుంచి చుట్టుగుంట సెంటర్ నుంచి వెంగళాయపాలెం వెళ్ళే మార్గం వరకు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఎక్కడా గుంతలు లేకుండా మరమ్మతులు చేపట్టారు. మెడికల్ క్లబ్ సెంటర్ నుంచి చుట్టుగుంట సెంటర్ వరకు నిర్మించిన డివైడర్‌లో మొక్కలను నాటే కార్యక్రమం చేపట్టారు. అలానే కొత్తగా డివైడర్‌కు రంగులు వేసి రహదారికి ఇరువైపులా ఉన్న ఆక్రమణలను తొలగించారు. రోడ్డును విశాలంగా సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దటంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

'మీ డబ్బు... మీ హక్కు' పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు సిటీ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక రంగంలో క్లయిమ్ చేయని ఆస్తుల ఆర్థిక అవగాహనపై కేంద్ర ఆర్థిక శాఖ 'మీ డబ్బు.. మీ హక్కు' పేరుతో దేశ వ్యాప్త ప్రచారం నిమిత్తం రూపొందించిన పోస్టర్‌ను సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, డీఆర్వో ఎన్ఎస్‌కే ఖాజావలి, డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మి కుమారి, లీడ్ బ్యాంకు మేనేజర్ మహి పాల్‌రెడ్డితో కలసి ఆవిష్కరించారు. జిల్లాలో మొత్తం రూ. 149.47 కోట్లు అన్ క్లెయిమ్ డిపాజిట్స్ ఉన్నాయని ఎల్‌డీఎం అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, డీఈవో రేణుక, పశుసంవర్థక శాఖ జేడీ ఏ.సత్యనారాయణ, జిల్లా ఉపాధి అధికారి దుర్గాబాయి, ఏడీ మైక్రో ఇరిగేషన్ వజ్రశ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ చక్రవర్తి, కలక్టరేట్ ఏవో పూర్ణ చంద్రరావు, హెచ్ సెక్షన్ సుపరింటెండెంట్ మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సత్కారం

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర దేవాలయం అన్నమయ్య కళావేదికపై సోమవారం గురువులకు చిరు సత్కార కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య జ్యోతిప్రజ్వలన కార్యక్రమాన్ని ప్రారంభించారు. సభా కార్యక్రమంలో విశ్వపావని సభాధ్యక్షులుగా వ్యవహరించారు. అతిథులుగా డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగ నాయకి, బెండపూడి లక్ష్మీకుమారి, డాక్టర్ గిరిజా శేషమాంబ, పాటిబండ్ల జానకి, పసుమర్తి పద్మజకుమారి పాల్గొన్నారు. యిమ్మడి అంజనీదేవి బృందం గురు వందనంలో భాగంగా భక్తిమాల కీర్తనలు పుస్తకరూపం అలాగే సీ.డి. రూపంలో తమను ప్రోత్సహించిన అతిథులను ఘనంగా సన్మానించారు. అతిథులు యిమ్మడి అంజనీదేవి బృందం సంగీతానికి చేస్తున్న కృషిని కొనియాడారు. కార్యక్రమాలను యిమ్మడి మల్లికార్జునరావు పర్యవేక్షించారు

లలిత కళలతో మానసిక వికాసం, మనోల్లాసం

● భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పెనుమత్స

గుంటూరు (విద్య), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థి దశలో బాలబాలికలకు విద్యాభ్యాసంతో పాటు మానసిక, శారీరక వికాసానికి దోహదపడే లలిత కళలను అభ్యసించడం అంతే అవసరమని భారతీయ విద్యా భవన్ కార్యదర్శి పెనుమత్స రామచంద్రరాజు అన్నారు. బ్రాడీపేటలోని బాలానంద కేంద్రం, రుద్ర కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలకళా ప్రభ సాంస్కృతిక ఉత్సవాలు, పోటీల సోమవారం ముగిశాయి. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాధాకృష్ణమూర్తి, బాలానంద కేంద్రం కార్యదర్శి నడింపల్లి వెంకట గురుదత్, సహాయ కార్యదర్శులు కేఎస్ఆర్ కుటుంబరావు, బి.శ్రీనివాస్, లోటస్ ఆద్య పాఠశాల అకాడమిక్ డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు, రుద్ర కళాక్షేత్రం అధ్యక్ష, కార్యదర్శులు మాచిరాజు రాజేష్, పీఎస్ఎన్ కిరణ్, న్యాయ నిర్ణేతలు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని ప్రముఖ వైద్యుడు డాక్టర్ షేక్ నాగుర్ బాషా అన్నారు. ప్రముఖ స్వచ్ఛంద సంస్థ బ్రైట్ హారిజాన్ ఫౌండేషన్ ద్వారా మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థుల అభినందన సభ పాత గుంటూరులో సోమవారం జరిగింది. ఈ సభకు ఫౌండేషన్ ఛైర్మన్ మొహియిద్దీన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా నాగుర్‌బాషా మాట్లాడుతూ ఈ విద్యార్థులు సమాజానికి ప్రేరణ కావాలన్నారు. అనంతరం విద్యార్థులను సత్కరించి, ప్రశాంశ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అలివేణి, అధ్యాపకులు గురువారెడ్డి, అమరలింగేశ్వరరావు, సభ్యులు షేక్ అన్సర్ బాబు, షేక్ మస్తాన్‌వలి, సయ్యద్ చాంద్ బాషా, ముహమ్మద్ ఆబిద్ తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో కార్తీక దీపోత్సవాలు



అరండల్‌పేట శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

గుంటూరు (తూర్పు), నవంబరు 10(ఆంధ్ర జ్యోతి): కార్తీకమాస మూడో సోమవారం సందర్భంగా భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. తెల్లవారుజామున, సాయంత్రం మహిళలు, యువతులు పెద్దఎత్తున ఆలయాలకు తరలివచ్చి కార్తీకదీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నగరంలోని రవీంద్రనగర్, కొత్తపేట, అరండల్‌పేట, బ్రాడీపేట, ఆర్ అగ్రహారం, పాతగుంటూరు, బృందావన్‌గార్డెన్స్, సంపత్‌నగర్ ఇతర ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. కార్యక్రమాల్ని ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

దుర్గమ్మ అన్నదాన పథకానికి విరాళం

విజయవాడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో అన్నదాన పథకానికి రూ.లక్షను గుంటూరు విద్యానగర్‌కు చెందిన సిహెచ్ రాధిక, సూర్యతేజ, దివిష పేర్ల మీద అధికారులకు విరాళంగా అందజేశారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు.

ఎలుకల మందు తిని యువకుడి ఆత్మహత్య

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని స్వర్ణభారతి నగర్ నాలుగో లైన్‌కి చెందిన ఎం.నాగరాజు (25) ఎలుకలు మందు తిని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నాగరాజు తండ్రి గతంలోనే మృతి చెందగా, తల్లితో కలిసి నాలుగో లైన్‌లోని ఇంటిలో పై అంతస్తులో ఉంటున్నాడు. కింది అంతస్తులో ఆయన అక్క అర్చన ఉంటుంది. ఏడాదిగా నాగరాజు టీబీ వ్యాధితో బాధపడుతున్నాడు. దీంతో మద్యానికి బానిస అయ్యాడు. తనకు టీబీ వ్యాధి తగ్గకపోవడంతో బతకడం ఇష్టం లేక ఆదివారం రాత్రి ఎలుకల మందు పేస్టు తిన్నట్లు అక్క అర్చనకు చెప్పాడు. వెంటనే నాగరాజును జీజీహెచ్‌కు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి అక్క అర్చన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగతనం మోపి వేధిస్తున్నారు

తాను చేయని నేరానికి తనపై దొంగతనం నెపం మోపి తనను వేధింపులకు గురి చేస్తున్నారని గౌతమినగర్ మూడోలైనుకు చెందిన ముత్తుకూరు సుబ్బాయమ్మ ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను కళ్యాణి రోడ్ లోని ఓ ఇంటిలో సుమారు మూడేళ్ళ నుంచి పని చేస్తున్నానన్నారు. అయితే గత ఆగస్టులో ఇంటిలో వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఎనిమిది లక్షల నగదును దేవుని వద్ద పెట్టానని, ఆ తరువాత డబ్బు కనిపించలేదని యజమానురాలు తనపై పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందన్నారు. అప్పటి నుంచి పోలీసులు తనను స్టేషన్ వద్ద కూర్చోబెట్టి పంపిస్తున్నారని, ఆ డబ్బు తాను తీయలేదన్నారు.

రైలు పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం

ఎన్నారై ఆస్పత్రి సమీపంలోని రైలు పట్టాలపై గుర్తు తెలియని యువకుడి మృతదేహం లభించింది. సుమారు 30-40 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని యువకుడు నంబూరు-మంగళగిరి రైల్వే స్టేషన్ మధ్య ఎన్నారై ఆసుపత్రి సమీపంలో రైలు పట్టాలపై మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు మృతుని గుర్తించిన వారు గుంటూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.



పార్టీ నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్

పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

● టీడీపీ శ్రేణుల సమావేశంలో ఎమ్మెల్యే నసీర్ పిలుపు

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని, ఈ నెల 12 13 తేదీల్లో టీడీపీ కమిటీల వేడుకలు నిర్వహించబోతున్నామని తూర్పు ఎమ్మెల్యే నసీర్ చెప్పారు. స్థానిక తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం ఆయన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీ కేడర్ కూటమి నాయకులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ప్రభుత్వ సేవలను దరి చేరుస్తున్నారని చెప్పారు. ఈ క్రమంలో పార్టీని క్షేత్రస్థాయిలో బలపరిచేందుకు కమిటీల్ని ఏర్పాటు చేశామన్నారు. అన్ని కమిటీలతో ఈ నెల 13వ తేదీన ప్రమాణ స్వీకారం చేయించబోతున్నామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో చెప్పిన విధంగా అన్ని హామీలు అమలు దిశగా చర్యలు చేపట్టిందని చెప్పారు. సూపర్ సిక్స్‌లో భాగంగా స్త్రీ శక్తి పథకంతో మహిళలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు న్యాయం చేశామని చెప్పారు. సూపర్ జీఎస్టీ.. సూపర్‌సేవింగ్స్ ద్వారా పేద, మధ్య వర్గాలకు వరాలు అందించామన్నారు.

సంజీవనిలా ఆదుకుంటున్న సీఎం రిలీఫ్ ఫండ్

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : అనారోగ్యం బారిన పడిన పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి సీఎంఆర్ఎఫ్ అపర సంజీవనిలా పని చేస్తుందని, ప్రాణాలను కాపాడుతోందని పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి అన్నారు. నియోజకవర్గంలోని 72 మందికి సోమవారం ఆమె రూ.71 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.4.63 కోట్లు సహాయనిధి చెక్కులు అందజేశామని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ఆపన్నులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆదుకుంటున్నారని చెప్పారు. కేవలం గత ఒకటిన్నర సంవత్సర కాలంలోనే పశ్చిమ నియోజకవర్గంలోని 337 మందికి రూ.4 కోట్లు 63 లక్షల రూపాయల సహాయ నిధి చెక్కులను అందజేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయపరిచే నాయకుడు చంద్రబాబు నాయుడేనని, ఆయన నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజల క్షేమం కోసం కృషి చేస్తూనే ఉంటుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్లు, సెక్రటరీలు, వైస్ ప్రెసిడెంట్లు, కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

కాసుల కక్కుర్తితో శ్రీవారి నెయ్యి కల్తీ

● ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ



మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాసుల కక్కుర్తితోనే శ్రీవారి లడ్డూలో ఉపయోగించే నెయ్యిని కల్తీ చేశారని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ ఆరోపించారు. గుంటూరులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తిరుమల శ్రీ వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదానికి ఉపయోగించిన కల్తీ నెయ్యి సరఫరా విషయంలో విస్తుపోయే నిజాలు సిట్ నివేదిక ద్వారా బయటకు వచ్చాయని, ఈ వ్యవహారంలో నాటి టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి కీలక పాత్ర పోషించారనే విషయం బట్టబయలైందని ఆయన అన్నారు. సిట్ విడుదల చేసిన రిపోర్ట్‌పై సమాధానం చెప్పే దమ్ము వైసీపీ నేతలకు ఉందా అని మన్నవ మోహనకృష్ణ సవాల్ విసిరారు. ఎ2019-24 మధ్య బోలేబాబా ఆర్గానిక్ డెయిరీ 68 లక్షల కేజీల నెయ్యి సరఫరా చేశారని, అసలు పాలు, వెన్న లేకుండానే నెయ్యి సరఫరా చేశారని విచారణలో తేలిందన్నారు. రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని శ్రీవారి ప్రసాదంలో ఉపయోగించి ఇంకా సమర్థించుకోవడం నీచమన్నారు.

టీడీపీతోనే బీసీల అభ్యున్నతి

● రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

గుంటూరు(తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ, ఆర్థిక, సామాజికంగా బీసీల అభ్యున్నతి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత స్పష్టం చేశారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను నూతన ఎన్నికైన అమరావతి కురుమ సంక్షేమ సంఘ, గుంటూరు జిల్లా శాఖ ప్రతినిధులు సోమవారం మర్యాపూర్వకంగా కలిశారు. పలు సమస్యల పరిష్కారానికి మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వచ్చే ఆదరణ 3.0లో కురమలకు ప్రాధాన్యమిస్తున్నట్లు వెల్లడించారు. బీసీలను జగన్ అణచివేస్తే, సీఎం చంద్రబాబు భుజాన పెట్టుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో నూతన కురమ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్షుడు మర్రి వెంకట సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు బక్కా ఉమమాహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బి.రామకృష్ణ, ట్రెజరర్ కేవీ సత్యనారాయణ, ప్రచార కార్యదర్శి అంకాల శ్రీనివాసులు ఇతర సభ్యులు పాల్గొన్నారు.



సవితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కురుమ సంక్షేమ సంఘ, గుంటూరు జిల్లా శాఖ సభ్యులు

24న ఏఎన్‌యూలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

గుంటూరు(తూర్పు), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈనెల 24న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సింథటిక్ ట్రాక్‌లో జిల్లా స్థాయి అస్మిత అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆర్పోజ్‌ఖాన్, అసోసియేషన్ కార్యదర్శి జీవీఎస్ ప్రసాదు తెలిపారు. స్థానిక బీఆర్ స్టేడియంలో సోమవారం పోటీలకు సంబంధించిన పోస్టర్లును ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. అండర్-14, 16 బాలికల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని చెప్పారు. ఆసక్తిగల్గిన క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు యాప్ ద్వారా లేదా 24న నేరుగా తమ పేర్లును నమోదు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 9666635296 అనే నెంబర్లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మాజీ క్రీడాకారులు పి.వెంకటేశ్వర్లు, కృష్ణమోహన్, అథ్లెటిక్స్ కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వరరావు, పీఈటీ రవి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి యార్డు కూలీలకు చీరలు పంపిణీ

గుంటూరు (విద్య), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రులు సతీమణి పద్మావతి జన్మదినం సందర్భంగా వారి కుటుంబ ఆప్తులు చెరుకూరి రమేష్ ఆధ్వర్యంలో మిర్చి యార్డులో పని చేస్తున్న కూలీలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. నల్లపాడు రోడ్డులోని మిర్చి గోదాముల్లో పని చేస్తున్న 60 మంది మహిళా కార్మికులకు ప్రముఖ విద్యావేత్త డాక్టర్ కన్నా మాస్టర్ చేతుల మీదుగా చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ ఎస్‌కే ఎండి ఖాసీం పాల్గొన్నారు.



నరసరావుపేట మండలం గురవాయపాలెంలో బంతిపూల తోట

బంతిపూల సాగు భలే బాగు

ఓ వైపు వరుస ప్రకృతి వైపరీత్యాలు, మరోవైపు పెరిగిన పెట్టుబడులు, గిట్టుబాటు ధరలు లేక వాణిజ్య పంటలను సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారు. కొంతమంది రైతులు మాత్రం ఉద్యానవన పంటల సాగుకు శ్రీకారం చుట్టి వాణిజ్య పంటల సాగుకు గుడ్ బై చెబుతున్నారు. ముఖ్యంగా బంతి పూల సాగును చేపట్టి లాభాలు గడిస్తున్నారు. పెట్టిన పెట్టుబడికి తక్కువ కాకుండా చేసిన కష్టానికి తగ్గట్టుగా అదనంగా ఆదాయం వస్తుందన్న నమ్మకం పూల తోటల సాగులో లభిస్తుందని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

- ఎకరాకు రూ.లక్ష ఆదాయం
- రైతుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపుతున్న పంట
- వాణిజ్య పంటల సాగుకు రైతుల స్వస్తి

నరసరావుపేట రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట మండలంలో పలు గ్రామాల్లో రైతులు బంతి పూల సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారు. నరసరావుపేట మండలంలోని గురవాయపాలెం, గోనెపూడి, రావిపాడు, ములకలూరు, పమిడిపాడు గ్రామా లకు చెందిన పలువురు రైతులు బంతిపూలను సాగు చేస్తున్నారు. ఎకరం బంతిపూల సాగుకు దుక్కులు దున్నించిన తర్వాత నారుకు సంబంధించి మొత్తం పదివేల మొక్కలు పడతాయి. ఒక్కో మొక్క రూ. 3 చొప్పున వేయడానికి 30 వేల ఖర్చ వస్తోంది. ఎరువులకు రూ. 25,000, పురుగు మందులకు రూ. 30,000, కూలీలకు రూ. 15,000 ఖర్చులు కలిపి మొత్తం ఎకరానికి రూ.లక్ష వరకు అవుతుంది. మొక్క వేసిన దగ్గర నుంచి 120 రోజుల వ్యవధిలో పూలసాగు పూర్తవుతుంది. భూమిలో మరో పంటను కూడా వేయవచ్చు. మొక్కను నాటిన రెండు నెలల తర్వాత నుంచి పూలు పూతకు వస్తాయి. 60 రోజులపాటు పూల దిగుబడి వరుసగా వస్తూనే ఉంటుంది. తక్కువ మంది కూలీలతో ఎక్కువ పూలను కోసే అవకాశం ఉండటంతో కూలీల కొరతను అధిగమించే అవకాశం ఉంటుంది. ఎకరం పూల తోట నుంచి సుమారు 70 క్వింటాళ్ల వరకు పూల దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు. సీజన్‌ను బట్టి పూలకు మంచి ధర ఉంటుంది. నాలుగు నెలల వ్యవధిలో బంతిపూల సాగు పూర్తి కావడంతోపాటు ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తోందని రైతులు తెలి పారు. మార్కెటింగ్ కష్టం లేకుండా పొలం వద్దకే వచ్చి పూలను తీసుకెళ్తుంటారు. కూలీల కొరతను అధిగమించడంతోపాటు రెండు నెలల కాలంలో దిగుబడి పూర్తవడం, ఎకరాకు రూ.లక్ష వరకు ఆదాయం వస్తుండడంతో బంతి పూలసాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు.

నష్టాల నుంచి గట్టెక్కేందుకు పూలబాట

వాణిజ్య పంటలకు స్వస్తి పలికిన రైతులకు బంతి సాగు నష్టాల నుంచి గట్టెక్కించే పూలబాటగా మారింది. పండుగలు శుభకార్యాలతో పాటు కార్తిక మాసంలో భక్తులు ఆచరిస్తున్న వ్రతాలు, ప్రత్యేక పూజలు, దీక్షాపరుల మాలలు ధరించటంతో ప్రతి పూజకు పూలను వినియోగించాల్సి ఉండటంతో పూలకు మంచి గిరాకి ఏర్పడింది. మండపాల అలంకరణలకు కూడా పూల అవసరం ఉండటంతో ప్రస్తుతం కేజీ పూల ధర రూ.40 నుంచి రూ.50 వరకు పలుకుతోంది. ఒక ఎకరం బంతి సాగుకు దిగుబడి కాస్త అటు ఇటు అయినప్పటికీ అన్ని ఖర్చులు పోను నమ్మకంగా రూ.లక్ష ఆదాయం మిగులుతుందని రైతులు చెబుతున్నారు.

వేటపాలెం ఎడ్లకు ప్రథమస్థానం



ప్రథమస్థానంలో నిలిచిన బాపట్ల జిల్లా ఎడ్లజత

దర్శి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో హరిహర బాలనాగేంద్ర స్వామి తిరునాళ్లను పురస్కరించుకొని సోమవారం నిర్వహిస్తున్న ఎడ్ల బండలాగుడు పోటీలు హోరాహోరీగా కొనసాగుతున్నాయి. న్యూ కేటగిరి విభాగం పోటీల్లో బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత ప్రథమస్థానం కైవసం చేసుకుంది. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం మద్దిరాల ముప్పాళ్ల గ్రామానికి చెందిన పుచ్చకాయల శేషాద్రిచౌదరి ఎడ్లజత రెండోస్థానం, గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండబాలవారిపాలెం ఎడ్లజత గూడవల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లజత మూడోస్థానం కైవసం చేసుకున్నాయి. పల్నాడు జిల్లా నాదెండ్ల మండలం వీర్లపాడుకు చెందిన మంగు రమాదేవి ఎడ్లజత నాలుగోస్థానాన్ని, గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం పెదపరిమికి చెందిన మోదుగుల రామిరెడ్డి ఎడ్లజత ఐదోస్థానాన్ని, పల్నాడు జిల్లా మాచవరం మండలం పిన్నెల్లికి చెందిన పిక్కిలి తేజస్సు మురళి ఎడ్లజత ఆరోస్థానంలో, గుంటూరు జిల్లా కొల్లిపర గ్రామానికి చెందిన గుదిబండి శ్రీనివాసరెడ్డి ఎడ్లజత ఏడోస్థానంలో నిలిచాయి. రిఫరీలుగా గూడా శ్రీనివాసరావు, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి వ్యవహరించగా పోటీలను తులసీ సీడ్స్ కంపెనీ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ తులసి కృష్ణచైతన్య, పులి హరి, వెలిదండి గోపాలరావు (రిటైర్డ్ ఎల్ఐ), గుండాల వెంకటేశ్వర్లు, కొత్తా వెంకటేశ్వర్లు, ఆకుల రామలక్ష్మయ్య, తోటకూర శ్రీను, వంకమళ్ల కోటేశ్వరరావు, భీమా అమరయ్య, నాగెండ్ల శ్రీను, వెలిదండి శ్రీను, జక్కా ఏడుకొండలు, గోపిలు పర్యవేక్షించారు. మంగళవారం ఆరుపళ్ల విభాగంలో పోటీలు జరగనున్నట్లు కమిటి సభ్యులు తెలిపారు.

కలెక్టర్‌తో ఎమ్మెల్యే యరపతినేని భేటీ

- గురజాల పారిశ్రామిక కారిడార్ గురించి వివరణ

పిడుగురాళ్ల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గంలో పారిశ్రామిక కారిడార్‌ను ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కలెక్టర్ కృతికా శుక్లా దృష్టికి తీసుకొచ్చారు. సోమవారం పిడుగురాళ్ల ఆర్అండ్‌బి బంగ్లాలో యరపతినేని, కలెక్టర్ శుక్లాతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పిడుగురాళ్లలో ఉన్న సున్నం పరిశ్రమలన్నింటినీ ఒకేచోట ఏర్పాటు చేసే ఆలోచన గురించి ఇప్ప టికే వ్యాపారులతో మాట్లాడామని, అన్ని పరిశ్ర మలను ఒకే ప్రాంతంలో ఏర్పాటు చేస్తే వారికి కావలసిన మౌలిక వసతులు, బ్యాంక్ రుణాల విషయమై ప్రభుత్వంతో మాట్లాడతామని చెప్పామని ఎమ్మెల్యే యరపతినేని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం కలెక్టర్ శుక్లా మాట్లా డుతూ, యరపతినేని చెప్పే ప్రాజెక్టు విజయ వంతమైతే జిల్లాకే హైలెట్‌గా మారు తుందని, దానికి తన వంతు సహకారం అంది స్తానని పే ర్కొన్నారు. రాష్ట్రంలో పారిశ్రామిక రంగాన్ని అభివృద్ధి పరిచే దిశగా మంగళవారం ప్రకాశం జిల్లాలోని కనిగిరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్ విధానంలో ఎంఎస్ఎంఏలను ప్రారంభిస్తున్నారని, అందులో భాగంగా దాచేపల్లి సమీపంలోని నడికూడి ఇండస్ట్రియల్ ఏరియాలో ప్లాటెడ్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వర్చువల్‌గా శంకుస్థాపన జరగనుందని తెలిపారు. పిడుగురాళ్ల, కోనంకి గ్రామాలలో భూసమస్యలను త్వరగా క్లోజ్ చేయాలని గురజాల ఆర్డీవో మురళీకృ ష్ణను కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు.



పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

మాచర్ల కొత్తపల్లిలో సెజ్

- కేంద్రానికి నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆమోదం పొందితే భారీగా పరిశ్రమల రాక

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా మాచర్ల మండలం కొత్తపల్లిలో ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. రాష్ట్ర వ్యాప్తంగా 32 పారిశ్రామికవాడలు (ఎస్ఈజెడ్)ల ప్రతిపాదనలను డీపీఐఐటీకి పంపగా వాటిల్లో మాచర్లను కూడా చేర్చింది. వైద్య పరికరాలు, మెడ్-టెక్ ఎస్ఈజెడ్‌గా దీనిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ఇక్కడ ప్రభుత్వ భూములు అందుబాటులో ఉండటం కూడా ప్లస్ పాయింట్‌గా మారిం ది. కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే కొత్తపల్లి మెడికల్ ఫీల్డ్‌కు హబ్‌గా మారుతుంది. అనేక ఫార్మా, వైద్య పరికరాలు తయారు చేసే సం స్థలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తాయి. దాంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని అధికారవర్గాలు తెలిపాయి.

● అభివృద్ధికి బాటలు

పల్నాడు జిల్లాలో మాచర్ల నియోజకవర్గం వెనకబడిన ప్రాంతంగా ఉంది. ఈ ప్రాంతం కక్షలు, కార్పణ్యాలకు ఒకప్పుడు నిలయంగా ఉండేది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పగలు, ప్రతీకారాలను ఆ పార్టీ నాయకులు పెంచి పోషించారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి అనే ఊసే అక్కడ లేకుండా పోయింది. అటువంటి ప్రాంతంలో ఒక సెజ్‌ను ఏర్పాటు చేస్తే అభివృద్ధికి బాటలు వేసినట్లు అవుతుందని ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. అభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల ద్వారానే మాచర్ల ప్రాంతంలో ఫ్యాక్షనిజాన్ని దూరం చేయొచ్చని విశ్వసిస్తూ మెడ్‌టెక్ సెజ్‌ను ప్రతిపాదించింది. దీనికి కేంద్రం నుంచి తప్పక ఆమోదం లభించే అవకాశాలున్నట్లు సమాచారం. సెజ్ వస్తే అందులో వైద్య, సంబంధిత రంగాల పరిశ్రమలు ఏర్పాటవుతాయి. దాంతో ఆ ప్రాంతానికి రెవెన్యూ సమకూరుతుంది. నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. ఆయా పరిశ్రమలకు వస్తువులు, పరికరాలు సమకూర్చే ఇతర సంస్థల ద్వారా కూడా పరోక్షంగా ఉపాధి లభిస్తుంది.

సీటీ శాఖలో ఇన్‌చార్జ్‌ల పాలన

- కార్యాలయాల్లో నత్తనడకన పనులు ● బాధ్యతా రాహిత్యంగా సిబ్బంది



వాణిజ్యపన్నులశాఖ కార్యాలయం

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య పన్నులశాఖ గుంటూరు నోడల్ డివిజన్ పరిధిలో పలు అధికారుల పోస్టులు ఇన్‌చార్జ్‌లతోనే కొనసాగుతున్నాయి. చాలా కాలం నుంచి ఆయా పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జ్ అధికారులు వాటి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దాంతో సిబ్బంది బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్నారు. కీలకమైన గుంటూరు-2 డివిజన్ మేనేజర్ స్థానం నెలల తరబడి ఖాళీగా ఉంటోంది. అరండల్‌పేట, పట్నంబజార్ డీసీటీవోలు, అలాగే నరసరావుపేట సర్కిల్‌లో ఒకటి, గుంటూరు 2 డివిజన్ కార్యాలయంలో రెండు అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గుంటూరు 1 డివిజన్, బ్రా డీపేట, తెనాలి సర్కిల్స్‌లో పని చేసే అసిస్టెంట్ కమిషనర్‌లు ఇప్పటికే పదోన్న తులు పొంది పోస్టింగ్‌ల కోసం ఎదురు చూస్తున్నారు. అలాగే జోన్ 3కి చెందిన జీఎస్‌టీవో పోస్టులు గుంటూరు నగరంలో నాలుగు, కమిషనర్ కార్యా లయంలో మూడు, రీజినల్ కార్యాలయం విజయవాడలో నాలుగు పోస్టులు ఆరు నెలలకు పైగా ఖాళీగా ఉన్నాయి. ఆయా పోస్టులకు అర్హులైన ఉద్యోగులు పదోన్నతులు లభిస్తాయని ఆశగా ఎదురుచూస్తు న్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పోస్టులకు పదోన్నతులు కల్పించాలని ఇప్పటికే ఆ శాఖ ముఖ్య కమిషనర్‌ను పలు ఉద్యోగ సంఘాలు కలిసి కూడా విజ్ఞప్తి చేశాయి. సిటీ శాఖలో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022 సంవత్సరంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల కారణంగా పలువురు సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు గత మూడేళ్లుగా తమ డివిజన్, జోన్ పరిధి దాటి బయట ప్రాంతంలో పనిచేస్తున్నారు. వారికి డిప్యూటేషన్‌ల అవకాశం కల్పించాలని అనేక దఫాలుగా ఉద్యోగ సంఘాల నాయకులు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు సంబంధిత ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించారు. ఎటువంటి ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● ఉన్నతాధికారులు స్పందించాలి

వైసీపీ ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా చేసిన సంస్కరణల ఫలితంగా వాణిజ్యపన్నుల శాఖలో పలువురు ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగుల సొంత డివిజన్‌లు, జోన్‌ల పరిధి దాటి వేరొక డివిజన్‌లలో విధులు నిర్వహించటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం డిప్యూటేషన్‌లకు అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తులనైనా పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. అలానే అర్హులైన వారికి పదోన్నతులు కల్పించి ఇన్‌చార్జ్‌ల పాలనకు తెరతీయాలని విజ్ఞప్తులు చేస్తున్నారు.

వాటర్ షెడ్ మహోత్సవ్ సభకు

సర్వం సిద్ధం

- పటిష్ట ఏర్పాట్లు చేసిన అధికారులు

గుంటూరు (తూర్పు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రూరల్ మండలం నల్లపాడు లయోలా పాఠశాలలో మంగళవారం జరిగే వాటర్‌షెడ్ మహోత్సవ్ సభకు జిల్లా అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. వాటర్‌షెడ్ మహోత్సవ్ సభలో పాల్గొనేందుకు మంగళవారం కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రానున్నారు. ఆయనతో పాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, స్థానిక ఎమ్మెల్యేలు వివిధ రాష్ట్రాలకు చెందిన 130 మంది ప్రతినిధులు పాల్గొంటున్నారు. తొలుత చెరువును స్వయంగా పరిశీలించి, అ తర్వాత నల్లపాడు లయోలా పాఠశాలలో జరిగే మహోత్సవంతో వారు పాల్గొంటారు. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు. సోమవారం పంచాయతీ రాజ్ కమీషనర్ కృష్ణ తేజ, కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందాల్, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ, ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సభా వేదికను పరిశీలించి, ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. కాగా, వాటర్ షెడ్ మహోత్సవంలో పాల్గొనేందకు విచ్చేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు అపూర్వ స్వాగతం పలికేం దుకు కూటమి నాయకులు, కార్యకర్తలు సిద్ధమయ్యారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వ ర్యంలో రింగు రోడ్డు నుంచి బైక్, కార్ల ర్యాలీతో ఆయనను సభ వరకు తీసుకువెళ్లేందుకు భారీ ర్యాలీ నిర్వహిస్తున్నారు.



కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు స్వాగతం పలుకుతున్న సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరుకు చేరుకున్న కేంద్ర మంత్రి చౌహాన్

గుంటూరు: కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ వాటర్ షెడ్ మహోత్సవ్‌లో పాల్గొనేం దుకు గుంటూరు నగరానికి చేరుకున్నారు. సోమవారం రాత్రి ఆయన భువనేశ్వర్ నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు విమానంలో రాగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అక్కడికి వెళ్లి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఇద్దరూ కలిసి గుంటూరు నగరంలోని ఐటీసీ వెల్కం హోటల్‌కు చేరుకున్నారు.

24న అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు


గుంటూరు (క్రీడలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 24న ఏఎన్‌యూలో అండర్ 14,16 బాలికల విభాగంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ తెలిపారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ అఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం బీఆర్ స్టేడియంలో అస్మిత అథ్లెటిక్స్ లీగ్ పోటీల పోస్టర్‌ను జిల్లా క్రీడల అధికారి అఫ్రోజ్, అంతర్జాతీయ అథ్లెటిక్ క్రీడాకారుడు కృష్ణమోహన్, అథ్లెటిక్స్ సంఘ కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్, సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బాలికల్లో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని గుర్తించే లక్ష్యంతో ఈ పోటీలు నిర్వహిస్తు న్నట్లు చెప్పారు. ప్రతిభ గల బాలికలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా శిక్షణ కేంద్రాలకు, జాతీయ అథ్లెటిక్స్ శిక్షణ శిబిరాలకు ఎంపికవుతారని తెలిపారు. క్రీడాకారిణులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత క్రీడాకారిణులకు ఇది సువర్ణావకాశమని అన్నారు. పోటీలో పాల్గొనే క్రీడాకారిణిలకు ఎటువంటి ప్రవేశ రుసుం లేదని, ఆసక్తిగల క్రీడాకారులు ఈ నెల 21వ తేదీలోపు తమ ఎంట్రీలను యాప్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9666635296 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్మెంట్‌కు చెందిన జాతీయ క్రీడాకారుడు పి.వెంకటేశ్వర్లు, జిల్లా అథ్లెటిక్ సంఘం సభ్యుడు ఏవీ ఆంజనేయులు, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ కోచ్‌లు ఎస్.శివారెడ్డి, వెంకటేశ్వరరావు, హిందూ ఇంజనీరింగ్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ కె.రవి, మాజీ క్రీడాకారుడు ఎస్కే మన్సూర్ వలి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రకాశం బ్యారేజీ వద్ద తగ్గిన వరద ఉధృతి

- దిగువకు 18,125 క్యూసెక్కుల నీటి విడుదల



ప్రకాశం బ్యారేజీ దిగువకు విడుదల అవుతున్న కృష్ణానది వరదనీరు

తాడేపల్లి టౌన్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద కృష్ణానది వరద ఉధృతి స్వల్పంగా కొనసాగుతోంది. ఎగువన ఉన్న పులిచింతల, ప్రధాన వాగుల నుంచి 27,587 క్యూసెక్కుల వరద నీరు సోమవారం ఇన్‌ఫ్లోగా నమోదవగా.. 18,125 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఇరిగేషన్ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజీ రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా తూర్పు డెల్టా కాలువకు 3,709 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 5,527 క్యూసెక్కులు, గుంటూరు చానల్‌కు 226 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్టు జేఈ తెలిపారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 45.56 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 32,040 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద పవర్ జనరేషన్ ద్వారా 16,600 క్యూసె క్కులు, లీకుల ద్వారా నాలుగు వందల క్యూ సెక్కులు, గేట్ల ద్వారా 24,335 క్యూసెక్కుల నీరు, మొత్తం 41,335 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

విజయపురిసౌత్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం సోమవారం నాటికి 589 అడుగులు ఉంది. ఇది 309.05 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10వేల క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 5,654 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 34,226 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లోగా 51,680 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు 51,680 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

సత్రశాల ప్రాజెక్టులో 1.0272 ఎంయూల విద్యుదుత్పత్తి


రెంటచింతల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని కృష్ణానదిపై నిర్మితమైన నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా ఆదివారం అర్ధరాత్రి 12 గంటల వరకు 1.0272 ఎంయూల విద్యుత్ తయారైనట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు చెప్పారు. ప్రాజెక్టుకున్న 20 రేడియల్ క్రస్ట్‌గేట్లకు గాను 4 గేట్ల ద్వారా 22,640 క్యూసెక్కులు, టేల్ రేస్ చానల్ ద్వారా 8,480 క్యూసెక్కులు మొత్తంగా 31,120 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఎగువన ఉన్న సాగర్, ఎత్తిపోతల, హాలియా వాగుల నుంచి 32 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఇది 7.080 టీఎంసీలకు సమానమని చెప్పారు.

ధాన్యం కొనుగోలుకు సర్వం సిద్ధం

- డీసీఎంఎస్ చైర్మన్ హరిబాబునాయుడు

గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) చైర్మన్ వడ్రాణం హరిబాబునాయుడు తెలిపారు. ధాన్యం కొనుగోలుపై గుంటూరు కోర్టు రోడ్డులో ఉన్న డీసీఎంఎస్ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ ఒక్క రైతుకు నష్టం రాకుండా సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్‌కు రూ. 2,389, కామన్ గ్రేడ్‌కు రూ. 2,369 మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ప్రతి రైతు నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు డీసీఎంఎస్ సంస్థ సర్వం సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు.

ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా వినయ్



గుంటూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అనుబంధ విభాగం రాజీవ్‌గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ రాష్ట్ర అధ్యక్షుడిగా గుంటూరు నగరంపాలెంకు చెందిన గంటా వినయ్ నాయుడు నియమితులయ్యారు. ఈ మేరకు ఐదు రాష్ట్రాల ఆర్‌జీపీఆర్ఎస్ రాష్ట్ర అధ్యక్షులను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియామకపు ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు నగరానికి చెందిన గంటా వినయ్ నాయుడు కాంగ్రెస్ విద్యార్థి విభాగం ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో అనేక పదవులు నిర్వహించారు. అనంతరం ఆర్‌జీపీఆ ర్ఎస్ జాతీయ కార్యదర్శిగా తమిళనాడు, తెలంగాణ, గుజరాత్ రాష్ట్రాలకు ఇన్‌చార్జిగా వ్యవహ రించారు. తాజాగా ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడిగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా వినయ్ నాయుడుకు పలువురు కాంగ్రెస్ నాయకులు అభినందనలు తెలియజేశారు.

విమెన్స్ హెల్త్



గర్భాశయం జారితే?

గర్భాశయం కిందకు జారితే అసౌకర్యంతో పాటు మూత్రాశయ, విసర్జక వ్యవస్థలకు కూడా ఆటంకం కలుగుతుంది. కాబట్టి ఈ సమస్యను సకాలంలో సరిదిద్దుకోవాలంటున్నారు గైనకాలజిస్ట్ అండ్ అబ్‌స్టెట్రీషియన్ డాక్టర్ పూజిత సూరనేని.

గర్భాశయం కిందకు జారే పరిస్థితికీ వయసుకూ సంబంధం లేదు. 23 ఏళ్ల యువతుల్లో కూడా ఈ పరిస్థితి తలెత్తవచ్చు. బాల్యం నుంచి కండరాల సమస్యలు ఉన్న యువతుల్లో ఈ సమ స్య తలెత్తే అవకాశాలు ఎక్కువ. సిజేరియన్ ప్రసవాలు చేయించుకున్న మహిళలతో పోలిస్తే, సాధారణ ప్రసవం జరిగిన మహిళల్లో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తూ ఉంటుంది. అలాగని ప్రతి మహిళా ఈ సమస్యను ఎదుర్కొంటుందని అనుకోడానికి వీల్లేదు. కండరాలు, కొల్లాజన్, కణజాలాల పటుత్వం తక్కువగా ఉన్న వాళ్లు, ప్రసవంతో కటి కండరాలు బలహీనపడిన వాళ్లలో, 50 ఏళ్లు పైబడిన తర్వాత ఈ సమస్య తలెత్తే అవకాశాలు ఎక్కువ.



నియంత్రణ ఇలా...

యుటెరస్ ప్రొలాప్స్‌ను నివారించుకోవడం మన చేతుల్లోనే ఉంటుంది. అదెలాగంటే...

- ఈ సమస్య కుటుంబంలో ఉన్నప్పుడు, కటి కండరాలను బలపరిచే వ్యాయామాలు యుక్తవయసు నుంచే మొదలుపెట్టుకోవాలి
- జన్యుపరమైన కండరాల సమస్య ఉన్నప్పుడు, ఆ వ్యాధికి చికిత్స తీసుకోవాలి
- ప్రసవానంతరం ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోవాలి
- ప్రసవానంతరం రెండు నెలల నుంచి వ్యాయామాలు మొదలుపెట్టాలి
- నడకతో మొదలుపెట్టి క్రమేపీ వ్యాయామాల తీవ్రతను పెంచుకోవాలి
- యోగాలో పెల్విక్ ఫ్లోర్ వ్యాయామాలు ఎంచుకోవాలి

వీళ్లలోనే ఎందుకంటే?

సాధారణ ప్రసవమైన మహిళల్లో ఈ సమస్య తలెత్తే అవకాశాలు కాస్త ఎక్కువ. అయితే వైద్యుల పర్యవేక్షణలో సాధారణ ప్రసవం జరిగినప్పుడు, ఎపిషాటమీ అనే కోత సహాయంతో, గర్భాశయం ఒత్తిడికి లోనవకుండా, ప్రసవం సుఖంగా జరిగిపోయేలా వైద్యులు తోడ్పడతారు. అలాగే గర్భంతో సాగిన గర్భాశయం తిరిగి సాధారణ స్థితికి కుంచించుకుపోడానికి ప్రసవానంతరం ఆరు వారాల సమయం పడుతుంది. కాబట్టి అప్పటివరకూ శరీరానికి విశ్రాంతినివ్వాలి. కానీ ఇంటి ప్రసవాలు చేయించుకున్న సందర్భాల్లో ప్రసవం కోసం తొందరపెట్టడం వల్ల గర్భాశయం ఒత్తిడికి లోనై, కండరాలు బలహీనపడతాయి. గర్భధారణతో పెరిగిన బరువును త్వరగా వదిలించుకోవాలనే ఆలోచనతో ఆరు వారాల పాటు విశ్రాంతి తీసుకోకుండానే వెంటనే వ్యాయామాలు మొదలుపెట్టడం కూడా సరికాదు.

దశల ఆధారంగా...

ప్రసవంతో గర్భాశయం కొంత మేరకు కిందకు జారుతుంది. యోని ద్వారం నుంచి 8 సెంటీమీటర్ల మేరకు జారితే ఫరవాలేదు. అయితే అంతకు మించి 6, 5, 2 సెంటీమీటర్ల దూరానికి జారిపోతూ ఉంటే యుటెరస్ ప్రొలాప్స్‌గా పరిగణించాల్సి ఉంటుంది. చివరి దశలో మూత్రవిసర్జన సమయంలో, లేదా బలంగా ముక్కినప్పుడు, పొట్ట మీద ఒత్తిడి పడే వ్యాయామాలు చేసినప్పుడు గర్భాశయం యోని వరకూ జారినట్టు తెలిసిపోతుంది. అయితే మొదటి దశలో ఎలాంటి లక్షణాలు కనిపించవు కాబట్టి ఎవరూ పట్టించుకోరు. కానీ రెండో దశలో పొట్ట మీద ఒత్తిడి పడినప్పుడు, మూడో దశలో ఒత్తిడి పడకుండానే గర్భాశయం జారినట్టు తెలిసిపోతుంది. నాలుగో దశలో గర్భాశయం యోనిద్వారం నుంచి బయట కొచ్చేస్తుంది. ఈ దశను గ్రేడ్ 4 యువి ప్రొలాప్స్ అంటారు. అయితే మెనోపాజ్‌కు చేరుకున్న మహిళల్లో ఈ పరిస్థితి ఎక్కువ. పైబడే వయసులో శరీరంలోని మిగతా కండరాల్లాగే గర్భాశయ కండరాలు కూడా సాగే గుణాన్ని కోల్పోయి, బలహీనపడిపోవడంతో, యుటెరస్ ప్రొలాప్స్ ఒకటి రెండు దశల నుంచి మూడు, నాలుగు దశలకు చేరుకుంటూ ఉంటుంది. యుటెరస్ ప్రొలాప్స్ వంశపారంపర్యం కూడా! కాబట్టి 50 ఏళ్లు దాటిన తర్వాత ఈ కోవకు చెందిన మహిళల్లో గర్భాశయం కిందకు జారే సమస్య తలెత్తుతూ ఉంటుంది.

సమస్యలు ఇవే!

గర్భసంచి ముందు మూత్రాశయం, గర్భాశయం వెనక విసర్జక అవయవాలు ఉంటాయి. కాబట్టి గర్భాశయం కిందకు జారినప్పుడు, ఈ అవయవాలు కూడా స్థాన భ్రంశం చెందుతాయి. దాంతో మూత్ర విసర్జన అసంపూర్తిగా జరుగుతూ, యూరినరీ ఇన్‌ఫెక్షన్లు పెరుగుతాయి. అలాగే మలవిసర్జన కూడా ఇబ్బందిగా మారి, మలబద్ధకం మూలంగా మొలలు, ఫిషర్లు వేధిస్తాయి.

సమర్థమైన చికిత్సలున్నాయి

మొదటి రెండవ దశ యుటెరస్ ప్రొలాప్స్‌తో ఇబ్బంది పడే యువతులకు సర్విక్స్‌కు రింగ్ బిగించి, సర్విక్స్‌ను వెనక్కి నెట్టి పైన కూర్చోబెట్టవచ్చు. అలాగే గర్భాశయాన్ని పైకి లేపి, లోపలి పొట్టకు తగిలించే స్లింగ్ సర్జరీ కూడా తోడ్పడుతుంది. ఈ చికిత్సతో మూత్రాశయ సమస్యను నిరోధించుకోవచ్చు. యుటెరస్ ప్రొలాప్స్ నాలుగో దశకు చేరుకున్నప్పుడు సర్జరీని ఎంచుకోక తప్పదు. వృద్ధులైన మహిళలకు నాలుగో దశ యుటెరస్ ప్రొలాప్స్ ఉన్నప్పుడు, వెజైనల్ హిస్ట్రక్టమీ ద్వారా గర్భసంచిని తొలగించి, మూత్రాశయాన్ని పైకి నెట్టి సమస్యను సరిదిద్దవచ్చు. కొందర్లో గర్భసంచి జారకపోయినా, మూత్రాశయం జారుతుంది. ఇలాంటి సందర్భాల్లో యాంటీరియర్ కాల్పొరఫీ అనే చికిత్స ద్వారా మూత్రాశయాన్ని పైకి నెట్టి, కుట్టు వేసి, దాని స్థానంలో అమర్చుతారు. పోస్టీరియర్ రెక్టోసీల్‌లో భాగంగా కిందకు జారిన విసర్జకాయవాన్ని పైకి నెట్టి కుట్టువేసి, అమరుస్తారు. ఈ రెండు చికిత్సలూ యోని ద్వారం గుండానే జరుగుతాయి. అయితే తాజా ల్యాప్రోస్కోపీ చికిత్సతో ఈ చికిత్సలు మరింత సులభతరం అయ్యాయి. గర్భాశయం పూర్తిగా కిందకు జారినప్పుడు, దానికి మెష్‌ను అమర్చి, ట్యాకర్ ద్వారా శాక్రమ్ ఎముకకు తగిలించవచ్చు. ఈ 'ల్యాప్రోస్కోపిక్ స్కాల్పోకాల్పోప్రెక్సీ' చికిత్సలో మూత్రాశయాన్నీ విసర్జకావయవాన్నీ తాకే అవసరం ఉండదు కాబట్టి అవి రెండూ ఏమాత్రం దెబ్బతినకుండా వాటి స్థానాల్లోకి చేరుకోగలుగుతాయి. ఇలా యుటెరస్ ప్రొలాప్స్ దశ ఆధారంగా చికిత్స కోసం మొదట రింగ్స్‌ను ఎంచుకుంటారు. తర్వాత వెజైనల్ హిస్ట్రక్టమీ, అంతిమంగా ల్యాప్రోస్కోపిక్ స్కాల్పోకాల్పోప్రెక్సీని వైద్యులు ఎంచుకుంటారు.

డాక్టర్ పూజిత దేవి సూరనేని
హై రిస్క్ అబ్‌స్టెట్రీషియన్,
ల్యాప్రోస్కోపిక్ అండ్ రోబోటిక్ సర్జన్,
బర్త్ రైట్ బై రెయిన్‌బో హాస్పిటల్స్,
హైదరాబాద్

ఉధృతంగా పెరుగుతున్న క్యాన్సర్లలో ఊపిరితిత్తుల క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధికి తాజాగా అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. క్యాన్సర్ రోగుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తున్న ఆ సమర్థమైన చికిత్సల గురించి వైద్యులు ఇలా వివరిస్తున్నారు.

ఈ మూడు చికిత్సలతో... లంగ్ క్యాన్సర్‌కు అడ్డుకట్ట

క్యాన్సర్ కేర్



ప్రపంచవ్యాప్తంగా అధికంగా కనిపించే క్యాన్సర్లలో లంగ్ క్యాన్సర్ ఒకటి. ఈ క్యాన్సర్‌కు ధూమపానం ప్రధాన కారణం అయినప్పటికీ, వాయు కాలుష్యం, ప్యాసివ్ స్మోకింగ్, జన్యు మార్పులు, దీర్ఘకాలం పాటు రసాయనాలకు బహిర్గతమవడం వల్ల కూడా ఊపిరితిత్తులకు క్యాన్సర్ సోకుతుంది. అయితే ఇటీవలి కాలంలో ఊపిరితిత్తుల క్యాన్సర్ చికిత్స విప్లవాత్మకమైన పురోగతి సాధించింది. ఈ చికిత్సలో భాగంగా ప్రధానంగా కీమో థెరపీ, టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీ అనే మూడు చికిత్సా విధానాలను వైద్యులు ఎంచుకుంటున్నారు. రెండు, మూడు, నాల్గవ దశల్లోని లంగ్ క్యాన్సర్ రోగులకు ఈ చికిత్సలు సమర్థమైన, ప్రభావవంతమైన ఫలితాలనిస్తాయి.

కీమో థెరపీ

శస్త్రచికిత్స ద్వారా క్యాన్సర్ సోకిన భాగాన్ని తొలగించిన తర్వాత, కీమో థెరపీలో భాగంగా అందించే ఔషధాలు, క్యాన్సర్ కణాల విభజనను అడ్డుకుంటాయి. అలాగే మిగిలి ఉన్న క్యాన్సర్ కణాలను నాశనం చేయడంతో పాటు, వ్యాధి శరీరంలోని ఇతరత్రా అవయవాలకు పాకే మెటాస్టాటిక్ దశల్లో వ్యాధిని నిరోధించడానికి కీమో థెరపీ దోహదపడుతుంది. అలాగే పూర్వం కీమో థెరపీ తదనంతర దుష్ప్రభావాలు రోగులను మానసికంగా, శారీరకంగా కుంగదీసే పరిస్థితి నెలకొని ఉండేది. కానీ ప్రస్తుత ఆధునిక ఔషధాలతో వాంతులు, జుట్టు రాలడం, నిస్సత్తువ మొదలైన దుష్ప్రభావాలను 70 నుంచి 80 శాతం మేరకు తగ్గించే వీలు కలుగుతోంది. నిరంతర పర్యవేక్షణ, పోషకాహారం, సపోర్టివ్ మెడిసిన్స్‌తో కీమో థెరపీని సులభంగా భరించగలిగే వీలుంది.

టార్గెటెడ్ థెరపీ

రోగుల్లో క్యాన్సర్ భిన్న స్వభావాలను కలిగి ఉంటుంది. కొందరి క్యాన్సర్ కణాల్లో జన్యుమార్పులుంటాయి. క్యాన్సర్ కణాల మీద నిర్దిష్టమైన రిసెప్టార్స్, ప్రొటీన్స్ ఉంటాయి. వీటి లక్ష్యంగా సాగే చికిత్సే టార్గెటెడ్ థెరపీ. ఈ చికిత్సలో భాగంగా రోగులకు ఇచ్చే ఇంజెక్షన్లు, ఆ లక్ష్యాల మీద దాడి చేయడం వల్ల, ఆరోగ్యకరమైన కణాలు మినహా, క్యాన్సర్ కణాలు మాత్రమే నాశనమవుతాయి. అయితే ఈ చికిత్స అర్హతను నిర్ధారించుకోవడం కోసం రోగులకు ముందస్తు పరీక్షలు చేపడతారు. నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ పరీక్ష చేసి, వాటిలో మార్పులు ఉన్న రోగులకు వైద్యులు, టార్గెటెడ్ థెరపీని ఎంచుకుంటారు. నెక్ట్స్ జనరేషన్ సీక్వెన్సింగ్ పరీక్షలో భాగంగా 500 నుంచి 600 జన్యువులను పరీక్షించి, జన్యుపరమైన ఉత్పరివర్తనాలు కలిగి ఉన్న వారికి వైద్యులు టార్గెటెడ్ థెరపీని సూచిస్తారు. ఈ చికిత్స నోటి మాత్రల రూపంలోనే సాగుతుంది.

ఇమ్యునో థెరపీ

జన్యు పరివర్తన లేకుండా, పిడిఎల్1 రిసెప్టార్స్ కలిగిన క్యాన్సర్ కణాలు అధిక సంఖ్యలో ఉన్న రోగులకు ఇమ్యునోథెరపీ సత్ఫలితాన్నిస్తుంది. అయితే ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకిన రోగుల్లో ఈ పిడిఎల్1 రిసెప్టార్లు కలిగిన క్యాన్సర్ కణాలు తక్కువ సంఖ్యలో ఉన్నప్పటికీ ఇమ్యునో థెరపీ చికిత్సను ఆశ్రయించవచ్చు. ఇమ్యునోథెరపీ ప్రధానంగా వ్యాధినిరోధకశక్తిని బలోపేతం చేసే చికిత్స. క్యాన్సర్ కణాలతో పోరాడేలా ఈ చికిత్స వ్యాధినిరోధకశక్తిని ప్రేరేపిస్తుంది. సాధారణంగా వ్యాధికారక సూక్ష్మజీవులను మన వ్యాధి నిరోధక వ్యవస్థ సమర్థంగానే గుర్తించి, తుదముట్టిస్తుంది. కానీ క్యాన్సర్ విషయంలో ఈ కణాలు కొన్ని ప్రత్యేకమైన ప్రొటీన్ల సాయంతో, వ్యాధినిరోధక వ్యవస్థను తప్పుదోవ పట్టిస్తాయి. కాబట్టి ఈ పొరపాటు జరగకుండా మన రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను సమర్థంగా గుర్తించగలిగేలా వాటిని ప్రేరేపించడానికి తోడ్పడే ఇంజెక్షన్లను ఈ చికిత్సలో ఇవ్వడం జరుగుతుంది. ఇమ్యునోథెరపీతో చక్కని ప్రతిస్పందన లభించడంతో పాటు, ఆ ఫలితం దీర్ఘకాలం పాటు కొనసాగుతుంది. ఈ చికిత్స తీసుకున్న ప్రతి వంద మంది రోగుల్లో 20 మందిలో ఈ ప్రభావం కనిపిస్తుంది. టార్గెటెడ్ థెరపీ, ఇమ్యునోథెరపీలను రెండు, మూడు, నాల్గవ దశల్లోని ఊపిరితిత్తుల క్యాన్సర్ల చికిత్సకు వాడుకోవచ్చు. అయితే కొన్నిసార్లు ఇమ్యునోథెరపీ చికిత్సను కీమోథెరపీతో కలిపి అందించవలసి వస్తుంది. కొన్ని సందర్భాల్లో టార్గెటెడ్ థెరపీ, కీమోథెరపీ కలిపి ఇవ్వవలసి రావచ్చు. ఏ చికిత్స తీసుకున్నా, క్రమం తప్పక పెట్ స్కాన్స్ చేయించుకుంటూ, వైద్యుల పర్యవేక్షణలో నడుచుకుంటూ ఉండాలి.

డాక్టర్ ఎ. వేణుగోపాల్
సీనియర్ కన్సల్టెంట్ మెడికల్ ఆంకాలజిస్ట్
అండ్ హెమటో ఆంకాలజిస్ట్,
మెడికవర్ హాస్పిటల్స్ హైదరాబాద్

చక్కెర చేటే?



మీకు తెలుసా?

చక్కెర తెచ్చిపెట్టే చేటు గురించి తెలుసు కాబట్టి బదులుగా బెల్లం, తేనెలను ఎంచుకునే వాళ్లుంటారు. అయితే ఆ తీపి ఆరోగ్యకరమేనా?

చక్కెర: అత్యంత ఎక్కువగా శుద్ధి చేసిన చక్కెర 65 నుంచి 75 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. 100 గ్రాముల చక్కెరలో 390 క్యాలరీలుంటాయి.

బెల్లం: చక్కెరతో పోల్చితే, ఇది తక్కువ శుద్ధి చేసిన పదార్థమే! దీన్లో ఇనుము, పొటాషియం పోషకాలు కూడా ఉంటాయి. అయితే ఇది కూడా 60 నుంచి 84 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. 100 గ్రాముల బెల్లంలో 380 క్యాలరీలుంటాయి.

తేనె: దీన్లో యాంటీఆక్సిడెంట్లు కూడా ఉంటాయి కాబట్టి పేగులకు మేలు చేస్తుంది. అయితే తేనె కూడా 45 నుంచి 60 గ్లైసెమిక్ ఇండెక్స్‌ను కలిగి ఉంటుంది. వంద గ్రాముల తేనెలో 240 నుంచి 330 క్యాలరీలుంటాయి.

ఖర్జూరం: దీన్లో ఫ్రక్టోజ్, గ్లూకోజ్ మొదలైన సహజసిద్ధ చక్కెరలుంటాయి. అలాగే పీచు, ఖనిజ లవణాలు, ఇనుము కూడా ఉంటాయి. ఖర్జూరం గ్లైసెమిక్ ఇండెక్స్, 40 నుంచి 55. వంద గ్రాముల ఖర్జూరంలో 314 క్యాలరీలుంటాయి. కాబట్టి రోజుకు రెండు ఖర్జూరాలకు మించి తినకపోవడమే ఉత్తమం.

చక్కెరకు ప్రత్యామ్నాయంగా పోషకాలను కలిగి ఉండే తేనె, బెల్లం, ఖర్జూరాల మీద ఆధారపడే వాళ్లు కూడా వాటిని మితంగానే తీసుకోవాలి.

ఇదీ సంగతి

టూత్‌బ్రష్ సురక్షితమా?

ప్రతిరోజూ ఉదయాన్నే టూత్‌బ్రష్‌తో దంతాలను శుభ్రం చేసుకుంటూ ఉంటాం. అయితే దంతధావనం కోసం ఉపయోగించే టూత్‌బ్రష్ శుభ్రంగానే ఉందా? అన్నది కూడా గమనించుకోవాలి.

టూత్‌బ్రష్‌ను ఉపయోగించిన ప్రతిసారీ పదార్థాలు, లాలాజలం, బ్యాక్టీరియాలు టూత్‌బ్రష్ బ్రిసిల్స్‌లోకి చేరిపోతూ ఉంటాయి. కాబట్టి టూత్‌బ్రష్‌ను తడిగానే వదిలేస్తే, ఆ తేమ వాతారణంలో ఇకొలై, స్ట్రెప్టోకోకస్, స్టాఫ్ బ్యాక్టీరియా లాంటి సూక్ష్మక్రిములు, ఫంగస్‌లు విస్తృతంగా వృద్ధి చెందుతాయి. అలాగే కొన్ని ఇళ్లలో బాత్రూమ్‌లోనే సింక్ కూడా ఉంటుంది. అలాంటప్పుడు టాయ్‌లెట్‌ను ఫ్లష్ చేసిన ప్రతిసారీ, టాయిలెట్ ప్లూమ్ అనే కంటికి కనిపించని బిందువులు గాల్లో కలుస్తూ ఉంటాయి. ఆరు అడుగుల దూరం వరకూ ప్రయాణించే ఈ బిందువుల్లో విసర్జక బ్యాక్టీరియా ఉంటుంది. కాబట్టి ఇవి కూడా టూత్‌బ్రష్‌లోకి చేరిపోయే అవకాశాలుంటాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి. టూత్‌బ్రష్ తడిగా ఉన్నా, మూసిన డబ్బాల్లో, అల్మరాల్లో ఉంటున్నా, వాటిలో మోల్డ్, ఈస్ట్ పెరిగే అవకాశాలుంటాయి. ఇవి అలర్జీలు, శ్వాసకోశ సమస్యలు, నోటి ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. కాబట్టి టూత్‌బ్రష్ రంగు మారినా, దుర్వాసన వేస్తున్నా దాన్ని వెంటనే పారేయాలి. టూత్‌బ్రష్ ద్వారా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా ఉండాలంటే తప్పనిసరిగా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. అవేంటంటే....

- కుటుంబ సభ్యులందరి టూత్‌బ్రష్‌లనూ ఒకే డబ్బాలో ఉంచకూడదు. బ్రష్‌ల మధ్య కనీసం అంగుళం దూరమైనా పాటించాలి.
- వాడిన ప్రతిసారీ టూత్‌బ్రష్‌ను శుభ్రంగా కడిగి, పూర్తిగా ఆరిపోయేలా చూసుకోవాలి
- ప్రతి మూడు నెలలకూ టూత్‌బ్రష్ మారుస్తూ ఉండాలి
- ఫ్లష్ చేయడానికి ముందు టాయిలెట్ లిడ్ మూసేయాలి
- యువి శానిటైజర్‌ను ఉపయోగించాలి లేదా అప్పుడప్పుడూ టూత్‌బ్రష్ బ్రిసిల్స్ మౌత్‌వాష్‌లో నానబెడుతూ ఉండాలి



లంకణం పరమౌషధం అంటారు. ఈ నానుడిని నిరూపించే 'ఆటోఫజీ' సూత్రం సర్వత్రా ఊపందుకుంటోంది. ఉపవాసంతో కణ మరమ్మత్తు జరుగుతుందనీ, కొత్త కణాల పుట్టుకతో వ్యాధులు అదుపులోకొస్తాయనీ ఎంతోమంది నమ్ముతున్నారు. ఇంతకూ లంకణం పరమౌషధమేనా? ఉపవాసంతో ఆరోగ్య ప్రయోజనాలు ఒరుగుతాయా? వైద్యులేమంటున్నారు?

లంకణం పరమౌషధమేనా?



ఆటోఫజీ

శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే మార్గాలు అనేకం ఉంటాయి. వాటిలో 'ఆటోఫజీ' ఒకటి. ఉపవాసంలో భాగంగా శరీరం ఒత్తిడికి లోనైనప్పుడు, దెబ్బతిన్న, క్రమం తప్పిన కణాలను తొలగించుకుని, ఆరోగ్యకరమైన, కొత్త కణాలను వృద్ధి చేసుకుంటుంది. ఈ పరిస్థితినే వైద్యపరిభాషలో 'ఆటోఫజీ' అంటారు. ఆకలేస్తే, శరీరం పోషణను కోరుకుంటోందని అర్థం చేసుకుంటాం. కానీ ఆకలి అన్నది, శరీరంలోని విషాలను హరించే అత్యంత శక్తివంతమైన ప్రకృతిసిద్ధ వ్యవస్థ. అందుకోసం ఉపవాసాన్ని మన సంప్రదాయంలో భాగం చేసుకున్నాం. కొన్ని పండుగల్లో ఉపవాసానికి చోటు కల్పించుకుని, కణ మరమ్మత్తుతో ఆరోగ్యాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాం. అయితే ఆటోఫజీతో అందరికీ ప్రయోజనం కలుగుతుందా? ఉపవాసానికి పరిమితి ఉంటుందా? ఎవరు ఎన్ని గంటల పాటు ఉపవాసం చేస్తే, శరీరంలో ఆటోఫజీ స్థితి ఏర్పడుతుంది?

రోజుకు మూడు భోజనాలతో, శరీరానికి నిరంతర శక్తిని సమకూర్చే చక్రాన్ని ఛేదిస్తూ, సుదీర్ఘ ఉపవాసంతో శరీరాన్ని ఒత్తిడికి లోను చేసినప్పుడు, శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకుంటుంది. ఈ మరమ్మత్తు ప్రక్రియలో భాగంగా శరీరం తనంతట తాను తనలోని అనారోగ్యకరమైన కణాలను ధ్వంసం చేసుకుంటుంది. ఈ క్రమంలో విడుదలయ్యే ప్రొటీన్లు ఆరోగ్యకరమైన ప్రయోజనాలకు తోడ్పడతాయి. సెల్‌ఫోన్ మొరాయించినప్పుడు, ఎలాగైతే దాన్ని రీసెట్ చేసి, కొత్త ఫోన్‌లా మార్చేసుకుంటామో, శరీరం కూడా ఆటోఫజీ ప్రక్రియ ద్వారా తనను తాను రీసైకిల్ చేసుకుంటుంది. ఈ అవకాశానికి తావివ్వకపోతే శరీరంలో కణ వ్యర్థాలు పేరుకుపోయి, ఆరోగ్యం క్షీణిస్తుంది. శరీరంలో కొత్త కణాల పెరుగుదల ఎంత కీలకమో, పాతబడిన, దెబ్బతిన్న కణాల నిర్మూలన కూడా అంతే అవసరం. అయితే ఆటోఫజీని పూర్తి ప్రయోజనకారిగా భావించడానికి కూడా వీల్లేదు. ఇదొక రెండంచుల కత్తి లాంటిది. ఆటోఫజీతో శరీరంలో ఎలా, ఏ మేరకు ప్రయోజనం సమకూరాలన్నది నిర్దిష్టంగా తెలియదు. ఈ కోణంలో మరిన్ని పరిశోధనలు జరగవలసిన అవసరం ఉంది. కాబట్టి ఆటోఫజీతో జరిగే కణ శుద్ధి, వృద్ధి వల్ల వ్యాధులన్నీ నయమైపోతాయనుకోవడం పొరపాటు. క్యాన్సర్ రోగుల్లో క్యాన్సర్ కణాల నుంచి విడుదలయ్యే యాంటిజెన్స్ సాధారణ కణాలను ధ్వంసం చేస్తాయి. దీనికి అదనంగా ఆటోఫజీతో కణ ధ్వంసాన్ని మరింత పెంచుకోవడం వల్ల ఈ రోగులకు నష్టమే ఎక్కువగా జరుగుతుంది. కాబట్టి క్యాన్సర్ రోగులకు ఆటోఫజీతో ఎలాంటి ప్రయోజనం ఉండదనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

ఉపవాసంతో ప్రయోజనకరమే!

ఉపవాసం కచ్చితంగా ఆరోగ్యాన్నీ, ఆయుర్దాయాన్నీ పెంచుతుంది. అలాగని తరచూ, దీర్ఘకాలం పాటు ఉపవాసం ఉండడం వల్ల అదనంగా ఒరిగే ప్రయోజనం ఉండదు. ఇలాంటి ఉపవాసాలతో ఆటోఫజీతో ఒరిగే ప్రయోజనానికి మించి, ప్రొటీన్, కండర నష్టంతో బలహీనత ఆవరిస్తుంది. కాబట్టి ఉపవాసాలను పరిమితంగానే అనుసరించాలి. పండుగ సందర్భాల్లో అప్పుడప్పుడూ ఉపవాసం ఉండడం మంచిదే! కానీ వారంలో మూడు నుంచి నాలుగు రోజుల పాటు ఎక్కువ గంటల పాటు ఉపవాసం ఉండడం వల్ల ఆరోగ్యానికి నష్టం కలుగుతుంది. నిజానికి సరైన ఆహార, నిద్ర వేళలను అనుసరిస్తే, మన శరీరంలో ఆటోఫజీ స్వతఃసిద్ధంగానే ఏర్పడుతుంది. రాత్రి భోజనానికీ, ఉదయం అల్పాహారానికీ మధ్య 12 నుంచి 14 గంటల నిడివి పాటించడం ద్వారా మనం ప్రతి రోజూ ఉపవాస ఫలాన్ని పొందగలుగుతాం! ఇందు కోసం ప్రత్యేకించి భోజనం మానుకోవలసిన అవసరం లేదు. అలా కాకుండా రాత్రుళ్లు ఆలస్యంగా భోజనం ముగించడం, ఉదయాన్నే మళ్లీ బ్రేక్‌ఫాస్ట్ తినేయడం లాంటి అలవాట్లతో శరీరం అవిశ్రాంత స్థితికి లోనవుతుంది. శరీరం తనను తాను మరమ్మత్తు చేసుకునే వ్యవధి దొరకక, ఆరోగ్యం దెబ్బతినడం మొదలవుతుంది.

వేర్వేరు అంశాల ఆధారంగా...

వేలి ముద్రల్లాగే ప్రతి ఒక్కరి శరీరాలు భిన్నంగా ఉంటాయి. కాబట్టి ఎవరికి, ఎంత ఉపవాసం, ఏ మేరకు ప్రయోజనాన్ని అందిస్తున్నది కచ్చితంగా లెక్కించి చెప్పే వీలు లేదు. కాబట్టి ఎవరికి వారు స్వయంగా ఉపవాస దీక్షలు చేసుకుంటూ, ఆటోఫజీ ప్రయోజనాన్ని పొందాలనుకోవడం పొరపాటు. ఆరోగ్య పరిస్థితి, వయసు, శరీర తత్వాల ఆధారంగా పరిమిత కాలం మేరకే ఉపవాసాలను పాటించాలి. మరీ ముఖ్యంగా మధుమేహులు, అధిక రక్తపోటు బాధితులు, ఇతరత్రా దీర్ఘకాలిక రుగ్మతలున్నవాళ్లు వైద్యుల సలహా తీసుకోకుండా ఇష్టారాజ్యంగా ఉపవాసాలు ఉండడం సరికాదు.

భారతీయ సంస్కృతిలో 'ఆటోఫజీ'

భారతీయ సంస్కృతి సహజసిద్ధ ఆటోఫజీని ప్రోత్సహించే జీవనశైలి విధానాలను నొక్కి చెప్తోంది. అవేంటంటే...

ఉపవాసం: ఏకాదశి, నవరాత్రి లాంటి పర్వదినాల్లో ఆహారం తినడం కోసం నిర్దిష్ట సమయ పరిధికే పరిమితమవుతూ ఉంటాం. ఈ ఉపవాస దీక్షలు శరీరంలోని గ్లూకోజ్, ఇన్సులిన్ మోతాదులను తగ్గించడం ద్వారా ఆటోఫజీని ప్రేరేపించి, శరీరంలో నిల్వ ఉన్న కొవ్వు నుంచి శక్తిని స్వీకరించేలా శరీరాన్ని బలవంతపెడతాయి.

యోగా, ప్రాణాయామం: యోగాసనాల్లోని కొన్ని శారీరక కదలికలు రక్తప్రసరణను మెరుగుపరిచి, లింఫ్ స్రావాల పారుదలకు తోడ్పడడంతో పాటు, కణ మరమ్మత్తును ప్రోత్సహించి, ఆటోఫజీకి మద్దతిస్తాయి. ప్రాణాయామంతో కణ మరమ్మత్తుతో ముడిపడి ఉండే ఆక్సిడేటివ్ స్ట్రెస్ తగ్గుతుంది

ధ్యానం: ఆటోఫజీకి అడ్డుపడే కీలక అంశం ఒత్తిడి. ధ్యానంతో ఒత్తిడితో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ తగ్గుతుంది.

జీవ గడియారం: తెల్లవారుఝామునే నిద్రలేవడం, సూర్యాస్తమయానికి ముందే భోజనం ముగించడం మన భారతీయ సంప్రదాయం. ఈ సంప్రదాయం సహజసిద్ధ జీవగడియారానికి తగినట్టు రూపొందింది.

డాక్టర్ నవీన్ పోలవరపు
సీనియర్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్,
లివర్ స్పెషలిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్

'స్టేబుల్ కాయిన్స్'పై ప్రవాసుల మొగ్గు



» స్వదేశానికి పంపించే నగదు విధానంలో మార్పులు
» డాలర్‌కు ప్రత్యామ్నాయంగా యూఎస్‌డీటీ వినియోగం

బ్యాంకింగ్ చానల్స్‌కు ముప్పు!

న్యూఢిల్లీ: ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) స్వదేశానికి డబ్బులు పంపించే విధానం మారిపోతోంది. ఇది వరకటిలా వారు బ్యాంకింగ్ చానల్స్‌ను ఆశ్రయించడం లేదు. డాలర్ మారకంతో ముడిపడిన యూఎస్‌డీటీ వంటి స్టేబుల్ కాయిన్స్‌ను ఆశ్రయిస్తున్నారు. బ్యాంకింగ్ చానల్స్‌తో పోలిస్తే వీటి ద్వారా పంపించే నగదు బదిలీలకు రూపాయల్లో 4 నుంచి 5 శాతం ప్రీమియం లభించడం ఇందుకు ప్రధాన కారణం. ఉదాహరణకు దుబాయ్ లేదా అమెరికాలోని ఒక ఎన్ఆర్ఐ భారత్‌లోని తన లేదా తమ బంధువుల బ్యాంకు ఖాతాకు 1,000 డాలర్లు పంపిస్తే సోమవారం నాటి డాలర్-రూపీ మారకం రేటు ప్రకారం భారత్‌లోని వారి బ్యాంకు ఖాతాల్లో రూ.88,711 జమవుతాయి. అదే క్రిప్టో కరెన్సీకి చెందిన యూఎస్‌డీటీ అనే స్టేబుల్ కాయిన్ కొని అక్కడి స్థానిక మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ల ద్వారా భారత్‌కు పంపిస్తే దాదాపు రూ.94,000 జమవుతాయి.

బదిలీ ఇలా...

కాకపోతే ఆ మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్ ఆ స్టేబుల్ కాయిన్స్‌ను మళ్లీ భారత్‌లోని మరో అనధికారిక మనీ ట్రాన్స్‌ఫర్ ఏజెంట్‌కు అమ్ముతాడు. ఇక్కడి ఏజెంట్ ఆ రోజు ఉన్న డాలర్-రూపీ మారకం రేటు ప్రకారం అమెరికా లేదా దుబాయ్ నుంచి డబ్బు పంపించే లేదా వారు చెప్పిన వ్యక్తుల చేతికి లేదా బ్యాంకులో ఈ మొత్తాన్ని జమ చేస్తాడు. అయితే ఇది అనధికారికం కావడంతో ఎక్కువ మంది దీనికి ఇష్టపడడం లేదు. అయినా ప్రస్తుతం ఎన్ఆర్ఐలు స్వదేశానికి పంపించే డబ్బుల్లో 3 నుంచి 4 శాతం ఈ మార్గంలో వస్తున్నట్టు సమాచారం.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,23,220 ▲	1,12,950 ▲	1,67,000 ▲
విజయవాడ	1,26,000 ▲	1,18,000 ▲	1,56,700 ▲
విశాఖపట్నం	1,26,680 ▲	1,12,950 ▲	1,67,000 ▲
రాజమండ్రి	1,23,220 ▲	1,12,950 ▲	1,51,000 ▲
ప్రొద్దుటూరు	1,22,600 ▲	1,12,790 ▲	1,55,500 ▲
ముంబై	1,22,441 ▲	1,12,156 ▲	1,51,643 ▲

2026 డిసెంబరు నాటికి నిఫ్టీ 29,000



అంతర్జాతీయ బ్రోకరేజీ సేవల దిగ్గజం గోల్డ్‌మన్ శాక్స్ భారత స్టాక్ మార్కెట్‌పై సానుకూల అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది. మన మార్కెట్ రేటింగ్‌ను 'ఓవర్‌వెయిట్' స్థాయికి పెంచింది. 2024 అక్టోబరులో రేటింగ్‌ను తటస్థ స్థాయికి తగ్గించిన గోల్డ్‌మన్ శాక్స్, 13 నెలలకే మళ్లీ తన వైఖరిని మార్చుకోవడం గమనార్హం. అంతేకాదు, నిఫ్టీ-50 సూచీ 2026 డిసెంబరు నాటికి 29,000 స్థాయికి ఎగబాకవచ్చని అంచనా వేసింది. గత వారాంతం స్థాయితో పోలిస్తే ఇది 14 శాతం అధికం. ప్రభుత్వ విధానాల నడిపింపు, పెరుగుతున్న ఆదాయం, ఇన్వెస్టర్ల వద్ద మెరుగైన సెంటిమెంట్ ఇందుకు దోహదపడనున్నాయని తాజా నోట్‌లో పేర్కొంది. ఆర్థిక సేవలు, వినియోగం, రక్షణ, ఇంధన విక్రయ రంగ సంస్థలు వచ్చే ఏడాది మార్కెట్‌లో మెరుగైన పనితీరు కనబరచవచ్చని గోల్డ్‌మన్ శాక్స్ ప్రస్తావించింది. దేశీయ గిరాకీ, మూలధన వ్యయాలు, కార్పొరేట్ల బలమైన బ్యాలెన్స్‌షీట్లు ఇందుకు తోడ్పడనున్నాయని అంటోంది.

3 రోజుల తర్వాత లాభాల్లోకి.. సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ మూడు రోజుల వరుస నష్టాల నుంచి కాస్త తేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్ల ర్యాలీతో పాటు ఐటీ, ఆర్థిక సేవల రంగాల షేర్లలో కొనుగోళ్లతో ప్రామాణిక సూచీలు సోమవారం ఒక మోస్తరుగా లాభపడ్డాయి. ఒక దశలో 538.21 పాయింట్ల వరకు ఎగబాకిన సెన్సెక్స్.. చివరికి 319.07 పాయింట్ల లాభంతో 83,535.35 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 82.05 పాయింట్ల వృద్ధితో 25,574.35 వద్ద ముగిసింది. ఇన్ఫోసిస్ షేరు 2.52 శాతం లాభపడి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది.

లెన్స్‌కార్ట్ లిస్టింగ్...ఫ్లాప్!

లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ ఐపీఓ ఏకంగా 28.26 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను దక్కించుకున్నప్పటికీ లిస్టింగ్ మాత్రం నిరాశపరిచింది. ఐపీఓ ధర రూ.402తో పోలిస్తే, బీఎస్ఈలో ఈ షేరు 2.98% నష్టంతో రూ.390 వద్ద లిస్ట్ అయింది. ఒక దశలో 11.52% వరకు క్షీణించినప్పటికీ, వెంటనే కోలుకుని 2.93% వరకు పెరిగింది. తొలి రోజు ట్రేడింగ్ ముగిసేసరికి కేవలం 0.32 శాతం లాభంతో రూ.403.30 వద్ద స్థిరపడింది.

బిర్లా న్యూ చేతికి క్లీన్ కోట్స్

డీల్ విలువ రూ.120 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నిర్మాణ రంగానికి అవసరమైన ప్రత్యేక రసాయనాలను ఉత్పత్తి చేసే సంస్థ క్లీన్ కోట్స్‌ను రూ.120 కోట్లకు కొనుగోలు చేసినట్టు భవన నిర్మాణ ఉత్పత్తుల రంగంలోని బిర్లా న్యూ (గతంలో హైదరాబాద్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, హెచ్ఐఎల్) ప్రకటించింది. తమ నిర్మాణ రసాయనాల పోర్టుఫోలియో మరింతగా విస్తరించేందుకు, తద్వారా మౌలిక వసతులు, పారిశ్రామిక రంగాలకు ఉత్పత్తులను విస్తరించేందుకు ఈ కొనుగోలు దోహదపడుతుందని తెలిపింది. 1999లో ఏర్పాటైన క్లీన్ కోట్స్ కంపెనీ 27 పైగా దేశాలకు తమ ఉత్పత్తులు ఎగుమతి చేస్తుంది. ఈ కొనుగోలుతో క్లీన్ టెక్ టెక్నికల్ నైపుణ్యాలు, ఫార్ములేషన్లతో పాటు ఎగుమతి సామర్థ్యాలు కూడా తమకు జోడవుతాయని, మార్కెట్ విస్తరణకు దోహదపడతాయని బిర్లా న్యూ ఎండీ, సీఈఓ అక్షత్ సేథ్ అన్నారు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

11వ తేదీ			
హైదరాబాద్	590	విజయవాడ	600
వరంగల్	592	గోదావరి	600
చిత్తూరు	623	విశాఖపట్నం	585
		డజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	100	విజయవాడ	106
వరంగల్	100	గుంటూరు	108
కరీంనగర్	100	ఒంగోలు	108
మహబూబ్‌నగర్	100	చిత్తూరు	108
కర్నూలు	100	నెల్లూరు	113
విశాఖపట్నం	108	అనంతపురం	113
గోదావరి	106		

ఫాస్ట్ ఫుడ్ విభాగంలోకి హల్దీరామ్

న్యూఢిల్లీ: హల్దీరామ్ కంపెనీ పాశ్చాత్య ఫాస్ట్ ఫుడ్ విభాగంలోకి ప్రవేశించబోతున్నట్లు తెలిసింది. ఫాస్ట్ ఫుడ్ సెగ్మెంట్లో సబ్‌వే, టిమ్ హార్టన్స్‌కు పోటీగా అమెరికాకు చెందిన శాండ్‌విచ్ విక్రయ స్టోర్ల బ్రాండ్ 'జిమ్మీ జాన్స్'ను భారత్‌కు తీసుకొచ్చే ప్రయత్నాలు చేస్తోంది. జిమ్మీ జాన్స్ బ్రాండ్ యాజమాన్య సంస్థ ఇన్‌స్పైర్ బ్రాండ్స్‌తో ఫ్రాంఛైజీ ఒప్పందం కుదుర్చుకునేందుకు హల్దీరామ్స్ ఇప్పటికే చర్చలు సాగిస్తున్నట్లు సమాచారం. ఈ డీల్ ద్వారా హల్దీరామ్ జిమ్మి జాన్స్ శాండ్‌విచ్ స్టోర్లను భారత్‌లో ప్రారంభించాలనుకుంటోంది.

మార్కెట్లోకి మరో వెయిట్‌లాస్ ఔషధం

న్యూఢిల్లీ: మార్కెట్లోకి మరో వెయిట్ లాస్ ఔషధం అందుబాటులోకి రానుంది. శరీర బరువును తగ్గించడంలో ఉపయోగపడే పోవిట్రా...సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్‌ను భారత మార్కెట్లోకి ప్రవేశపెట్టేందుకు నోవో నార్డిస్క్, ఎంక్యూర్ ఫార్మా భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. మార్కెట్లోకి వస్తున్న రెండో బ్రాండ్ ఇది. ఈ ఏడాది జూన్‌లో వెయిట్ లాస్ ఔషధం విగోవీని (సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్) ప్రవేశపెట్టారు. పోవిట్రా... సెమాగ్లుటైడ్ 2.4 ఎంజీ ఇంజెక్షన్‌ను వాణిజ్యపరంగా పంపిణీ చేసే ప్రత్యేక హక్కులు కలిగిన తొలి భారతీయ కంపెనీ తమదే అవుతుందని ఎమ్‌క్యూర్ ఫార్మా సీఈఓ సతీష్ మెహతా అన్నారు.

నెఫ్రోప్లస్ ఐపీఓకు సెబీ ఆమోదం

నెఫ్రోప్లస్ బ్రాండ్‌నేమ్‌తో డయాలసిస్ సేవలందిస్తోన్న హైదరాబాద్ కంపెనీ నెఫ్రోకేర్ హెల్త్ సర్వీసెస్ ఐపీఓకు సెబీ ఆమోదం లభించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.353.4 కోట్ల తాజా ఈక్విటీ జారీతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్ల వాటాకు చెందిన 1.27 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనుంది. మొత్తంగా ఐపీఓ ద్వారా కంపెనీ రూ.2,000 కోట్లకు పైగా సమీకరించే అవకాశం ఉంది.

జోరుగా ఇళ్ల అమ్మకాలు



మార్చి నాటికి రూ.6.65 లక్షల కోట్లకు : అనరాక్

న్యూఢిల్లీ: హైదరాబాద్‌తో సహా దేశంలోని ఏడు ప్రధాన నగరాల్లో ఇళ్ల అమ్మకాలు జోరందుకున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల్లో రూ.2.98 లక్షల కోట్ల విలువైన 1.93 లక్షల ఇళ్ల అమ్ముడయ్యాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోలిస్తే సంఖ్యాపరంగా ఇళ్ల అమ్మకాలు 34,000 తగ్గాయి. అయితే విలువపరంగా చూస్తే మాత్రం అమ్మకాలు 7 శాతం పెరిగాయి. అమ్ముడైన ఇళ్ల సంఖ్య తగ్గినా, సగటు అమ్మకం విలువ పెరగడంతో గత ఆరు నెలల్లో మార్కెట్ కోలుకుంది. అమ్మకాల జోరు ఇలానే కొనసాగితే మార్చి ముగిసే నాటికి అమ్మకాల విలువ రూ.6.65 లక్షల కోట్లకు చేరుతుందని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ అనరాక్ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇది 22 శాతం ఎక్కువ. హైదరాబాద్‌లో నివాస గృహాల మార్కెట్ మరింత జోరుగా ఉందని బిల్డర్లు చెబుతున్నారు. నగరంలో పెరుగుతున్న మౌలిక సదుపాయాలు, ఇన్వెస్టర్ల నమ్మకం, మిడ్ టు హై ఎండ్ ఇళ్లకు పెరుగుతున్న గిరాకీ ఇందుకు ప్రధాన కారణం.

'డాక్టర్ రెడ్డీస్'పై సైబర్ కేటుగాళ్ల వల

రూ.2.16 కోట్లు కొట్టేసే యత్నం

బెంగళూరు: సైబర్ కేటుగాళ్లు రెచ్చిపోతున్నారు. సామాన్యులనే కాదు.. బడా కంపెనీలనూ టార్గెట్ చేస్తున్నారు. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఫార్మా కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్‌పైనా కన్నేశారు. బెంగళూరు కేంద్రంగా పనిచేసే గ్రూప్ ఫార్మాస్యూటికల్స్‌కు డాక్టర్ రెడ్డీస్ చెల్లించాల్సిన రూ.2.16 కోట్లు కొట్టేసేందుకు విశ్వ ప్రయత్నం చేశారు. ఇందుకోసం ఈ నెల 3వ తేదీన సైబర్ కేటుగాళ్లు అనధికారికంగా ఈ రెండు కంపెనీల ఈ-మెయిల్స్‌లోకి జొరబడి.. గ్రూప్ ఫార్మాస్యూటికల్స్ పేరు మీద బోగస్ బ్యాంకు ఖాతాలు సృష్టించారు. తర్వాత గ్రూప్ ఫార్మాకు డాక్టర్ రెడ్డీస్ నుంచి రావలసిన రూ.2.16 కోట్ల బకాయిలను ఆ ఖాతాల్లో వేయాలని కోరారు. దీన్ని నమ్మి డాక్టర్ రెడ్డీస్ ఈ నెల నాలుగో తేదీన ఆ మొత్తాన్ని ఆ ఖాతాల్లో జమ చేసింది. అయితే గ్రూప్ ఫార్మాకు చెందిన కే మహేశ్ బాబు అనే సీనియర్ ఎగ్జిక్యూటివ్ వెంటనే ఈ సైబర్ మోసాన్ని గుర్తించి బెంగళూరు సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు వెంటనే రంగంలోకి దిగి బ్యాంకులను అప్రమత్తం చేసి ఈ మొత్తం సైబర్ కేటుగాళ్ల చేతికి చిక్కకుండా స్తంభింప చేశారు. సైబర్ మోసగాళ్లు ఈ బ్యాంకు ఖాతాలను గుజరాత్‌లోని వడోదరలోని ఒక బ్యాంకులో తెరిచినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. కాగా ఈ సైబర్ మోసంతో కంపెనీకి ఎలాంటి ఆర్థిక నష్టం జరగలేదని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

హైదరాబాద్‌లో సోనాటైప్ ఇన్నోవేషన్ హబ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): సాఫ్ట్‌వేర్ సప్లయ్ చెయిన్ సెక్యూరిటీ రంగంలోని సోనాటైప్ హైదరాబాద్‌లో ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించినట్టు ప్రకటించింది. 200 మంది ఇంజనీర్లు, ప్రోడక్ట్ లీడర్లు, డేటా సైంటిస్టులు, ఏఐ నిపుణులు ఉండే ఈ కేంద్రం తమ ఇన్నోవేషన్ హబ్‌లలో అతి పెద్దదని, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్ అండ్ డీ హబ్ అని కంపెనీ సీఈఓ భగవత్ స్వరూప్ తెలిపారు. ఏఐ ఇన్నోవేషన్, ఓపెన్ సోర్స్ సెక్యూరిటీని పటిష్ఠం చేసేందుకు ఈ హబ్ దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం ఈ సెంటర్‌లో 50 మంది నిపుణులు పనిచేస్తుండగా రానున్న రోజుల్లో మరో 150 మందిని నియమించుకోనున్నట్లు ఆయన తెలిపారు. అమెరికా మేరీల్యాండ్‌లోని ఫుల్టన్ ప్రధాన కేంద్రంగా పని చేస్తున్న సోనాటైప్ బ్రిటన్, ఆస్ట్రేలియా, కొలంబియాల్లో కార్యాలయాలు కలిగి ఉన్నదని, తాజాగా హైదరాబాద్ హైటెక్ సిటీలో ప్రపంచంలోనే అతిపెద్ద హబ్‌ను ప్రారంభించిందని సోనాటైప్ ఇండియా హెడ్, సీనియర్ డైరెక్టర్ అభిషేక్ చౌహాన్ తెలిపారు.

స్టార్‌రెజ్ కార్యాలయం ప్రారంభం: స్టూడెంట్ హౌసింగ్ సాఫ్ట్‌వేర్ తయారీదారు స్టార్‌రెజ్ హైదరాబాద్‌లో గ్లోబల్ ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించింది. ఇది ఏఐ ఆధారిత ఇన్నోవేషన్, డేటా ఇంటెలిజెన్స్ కేంద్రంగా పని చేస్తుందని కంపెనీ ప్రకటించింది. ఈ కేంద్రం అత్యాధునిక ప్రోడక్ట్ ఇంజనీరింగ్ సేవలను అందుబాటులోకి తేవడం ద్వారా ఆధునిక సాస్ ఆర్కిటెక్చర్, ప్రపంచ శ్రేణి వ్యవస్థల్లో పని చేసే అవకాశం భారతీయ టెక్నాలజీ నిపుణులకు అందిస్తుందని స్టార్ రెజ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ట్రావిస్ నైప్ అన్నారు. రాబోయే 18 నెలల కాలంలో తమ టీమ్‌ల సంఖ్యను 40 నుంచి 200కి పెంచడం లక్ష్యమని నైప్ చెప్పారు.

స్పోర్ట్స్

ఆంధ్రకు మరో గెలుపు

● 4 వికెట్లతో తమిళనాడు చిత్తు

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన ఆంధ్ర జట్టు రంజీ ట్రోఫీలో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. ఆటకు మూడో రోజైన సోమవారం 201 పరుగుల లక్ష్య ఛేదనలో అభిషేక్ (70), కరణ్ షిండే (51) అర్ధ శతకాలతో రాణించడంతో.. గ్రూప్-ఎలో మ్యాచ్‌లో మరో రోజు ఆట మిగిలుండగానే ఆంధ్ర 4 వికెట్ల తేడాతో తమిళనాడును చిత్తు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 102/3తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన తమిళనాడు 195 పరుగులకు ఆలౌటైంది. సౌరభ్ కుమార్ నాలుగు వికెట్లు పడగొట్టగా.. పృథ్వీ రాజ్, కలిదిండి రాజు చెరో రెండు వికెట్లు దక్కించుకొన్నారు. తొలి ఇన్నింగ్స్‌లో 5 పరుగుల ఆధిక్యాన్ని కలుపుకొని తమిళనాడు 201 పరుగుల టార్గెట్‌ను ప్రత్యర్థి ముందుంచింది. ఛేదనలో ఆంధ్ర రెండో ఇన్నింగ్స్‌లో 201/6 స్కోరు చేసి గెలిచింది. మొదటి ఇన్నింగ్స్‌లో తమిళనాడు 182, ఆంధ్ర 177 పరుగులు సాధించాయి.



న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ప్రఖ్యాత జవహర్ లాల్ నెహ్రూ స్టేడియం క్రీడా నగరంగా రూపుదిద్దుకోనుంది. ఇందుకోసం స్టేడియాన్ని కూల్చివేయనున్నట్టు తెలిసింది. ఈమేరకు కేంద్ర క్రీడాశాఖ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. 102 ఎకరాల్లోని ఈ స్టేడియంలో అన్ని ప్రధాన క్రీడలకు సంబంధించిన అధునాతన సదుపాయాలతోపాటు అథ్లెట్లకు వసతి కూడా కల్పించేలా నిర్మించనున్నారు. ఖతార్, మెల్‌బోర్న్‌లోని స్పోర్ట్స్ సిటీల మాదిరి.. క్రీడా నగరం నిర్మించాలని యోచిస్తున్నట్టు సమాచారం. 1982 ఆసియా క్రీడలను పురస్కరించుకొని జేఎల్ఎన్ స్టేడియాన్ని నిర్మించారు. 2010 కామన్వెల్త్ క్రీడలకోసం రూ. 900 కోట్లతో స్టేడియాన్ని ఆధునికీకరించారు. ఇటీవల ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌కు ఈ స్టేడియం ఆతిథ్యమిచ్చింది. 1984, 1991లో కొన్ని వన్డే మ్యాచ్‌లనూ ఈ స్టేడియంలో నిర్వహించారు.

స్టేడియానికి రిచా పేరు..!

● ప్రకటించిన సీఎం మమతా బెనర్జీ

కోల్‌కతా: సిలిగురిలో కొత్తగా నిర్మించబోయే స్టేడియానికి ప్రపంచకప్ నెగ్గిన భారత మహిళల జట్టు సభ్యురాలు రిచా ఘోష్ పేరు పెట్టనున్నట్టు పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ప్రకటించారు. 'సిలిగురిలో 27 ఎకరాల స్థలం ఉంది. అక్కడ క్రికెట్ స్టేడియం నిర్మించే ఆలోచన చేయాలని మేయర్‌కు సూచించా. దానికి రిచా పేరు పెడితే భవిష్యత్ తరాలకు ప్రేరణగా ఉంటుంద'ని బెనర్జీ అన్నారు.

ఈ ఫిట్‌నెస్ సరిపోదు



టీ20 వరల్డ్‌కప్‌నకు ఇంకా మెరుగవ్వాలి

వ్యక్తిగత ప్రదర్శన కాదు.. సిరీస్ ముఖ్యం

కోచ్ గంభీర్

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జరిగే టీ20 వరల్డ్‌కప్‌లో భారత క్రికెట్ జట్టు చాంపియన్ హోదాలో బరిలోకి దిగబోతోంది. కానీ తమ ఆటగాళ్ల ఫిట్‌నెస్ మాత్రం ఆ స్థాయిలో లేదని ప్రధాన కోచ్ గౌతం గంభీర్ అభిప్రాయపడుతున్నాడు. భారత్, శ్రీలంక ఆతిథ్యమివ్వనున్న ఈ మెగా టోర్నీ వచ్చే ఫిబ్రవరి 10 నుంచి జరుగనుంది. 'ఫిట్‌నెస్ దృక్కోణంలో అత్యున్నత స్థాయికి చేరుకునేందుకు మేమింకా మెరుగవ్వాల్సి ఉంది. అలా అయితేనే టీ20 వరల్డ్‌కప్‌లో పోటీనివ్వగలం. మైదానంలో పాదరసంలా కదలడంతో పాటు అన్నింటా వేగం చూపాలి. ఎందుకంటే మనం ఫిట్‌గా ఉన్నప్పుడే మానసికంగానూ బలంగా కనిపిస్తాం. అలా అయితేనే మ్యాచ్‌ల్లో ఎదురయ్యే ఒత్తిడిని దీటుగా ఎదుర్కొనే అవకాశం ఉంటుంది. ఇంకా మూడు నెలల సమయం ఉంది కాబట్టి ఆలోపు మేం ఆశించిన స్థాయిని చేరుకోగలమని భావిస్తున్నా' అని గంభీర్ తెలిపాడు. అలాగే జట్టులో ఏడు నుంచి ఎనిమిది మంది వరకు బౌలింగ్ చేయగలవాళ్లు ఉండాలని, ఎక్కువగా ఆల్‌రౌండర్ల వైపు మొగ్గు చూపడానికి అదే కారణమని గౌతీ చెప్పాడు.

వ్యక్తిగతంగా రాణిస్తే సరిపోదు..

జట్టులో ఒకరిద్దరి వ్యక్తిగత ప్రదర్శనకన్నా సిరీస్‌లు గెలవడానికే తాను ప్రాధాన్యమిస్తానని గంభీర్ తేల్చాడు. ఇటీవలి ఆసీస్ పర్యటనలో భారత జట్టు ఆడిన మూడు వన్డేల సిరీస్‌లో 1-2 తేడాతో ఓడిన విషయం తెలిసిందే. అయితే ఆ సిరీస్‌లో మాజీ కెప్టెన్ రోహిత్‌తో పాటు విరాట్ ఫామ్ అందుకున్నారు. 'వ్యక్తిగత ప్రదర్శన ముఖ్యం కాదని నేను నమ్ముతాను. ఒకరిద్దరు ఆడితే సంతోషంగా అనిపించినా.. చివరకు సిరీస్ కోల్పోయాం కదా. కోచ్‌గా నేనెప్పుడూ సిరీస్ ఓటమిని అంగీకరించను. మనం ఓ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని గౌతీ స్పష్టం చేశాడు.

అర్ష్‌దీప్‌ను అందుకే ఆడించలేదు..

ఆసీస్‌తో జరిగిన ఐదు టీ20ల సిరీస్‌లో పేసర్ అర్ష్‌దీప్‌నకు చివరి రెండు మ్యాచ్‌ల్లోనే అవకాశం దక్కింది. అతడికన్నా హర్షిత్ రాణాపై కోచ్ గంభీర్ ఎక్కువ నమ్మకం పెట్టుకున్నాడు. అయితే రాణా విఫలమైనా.. అర్ష్‌దీప్ తనకు దక్కిన అవకాశంతో నాలుగు వికెట్లతో ప్రభావం చూపాడు. తాజాగా అర్ష్‌దీప్‌తో పాటు కుల్దీప్‌ను బెంచీకే పరిమితం చేయడంపై గంభీర్ స్పందించాడు. 'ఆ ఇద్దరికి అవకాశం ఇవ్వకపోవడమనేది కోచ్‌గా నాకు కఠిన నిర్ణయమే. కానీ ఫలానా రోజున ఎలాంటి కూర్పుతో బరిలోకి దిగాలనేది ముఖ్యం. అయితే చాన్స్ దక్కని ఆటగాళ్లకు నిజాయతీగా ఏం జరిగిందనే విషయం చెప్పగలగాలి. అదృష్టవశాత్తూ డ్రెస్సింగ్ రూమ్‌లో పరిస్థితి పారదర్శకంగా ఉంది' అని గంభీర్ పేర్కొన్నాడు.

ఏపీ అథ్లెట్లకు పతకాలు

ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్



విజయవాడ స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): చెన్నైలో జరిగిన ఆసియా మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అథ్లెట్లు పతకాలు సాధించారు. 80 ప్లస్ విభాగంలో ఏవీ సుబ్బలక్ష్మి.. డిస్కస్, జావెలిన్ త్రో, ట్రిపుల్ జంప్‌లో స్వర్ణ పతకాలు, లాంగ్‌జంప్‌లో కాంస్యం సాధించారు. ఇక 5 కిలోమీటర్ల పరుగు, రేస్ వాక్‌లో కె. మల్లికార్జునరావు రెండు రజత పతకాలు, అలాగే 70 ప్లస్ విభాగం 10 కిలోమీటర్ల రోడ్‌రేస్‌లో ఎల్. రవీంద్ర రావు స్వర్ణం సాధించారు. వీరంతా ఎన్టీఆర్ జిల్లాకు చెందినవారు. వీరు వచ్చే ఏడాది ఆగస్టులో దక్షిణకొరియాలో జరిగే వరల్డ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈ పోటీల్లో 22 దేశాల నుంచి 4 వేల మందికిపైగా అథ్లెట్లు పాల్గొన్నారు.

టైటిల్‌పై లక్ష్య, ప్రణయ్ గురి

నేటినుంచి జపాన్ ఓపెన్



లక్ష్య

కుమమోటో (జపాన్): భారత షట్లర్లు బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ (బీడబ్ల్యూఎఫ్) టైటిల్ గెలిచి చాలా కాలమే అయ్యింది. ఈనేపథ్యంలో మంగళవారం ప్రారంభమయ్యే సూపర్ 500 జపాన్ ఓపెన్‌లో స్టార్లు లక్ష్యసేన్, హెచ్ఎస్ ప్రణయ్ సత్తా చాటాలని పట్టుదలగా ఉన్నారు. ఏడో సీడ్ లక్ష్యసేన్‌కు తొలి రౌండ్‌లో జపాన్‌కు చెందిన కోకి వటనబే రూపంలో గట్టి ప్రత్యర్థి ఎదురు కానున్నాడు. ఇక..గాయంతో రెండు నెలలపాటు పోటీలకు దూరంగా ఉన్న ప్రణయ్..జున్ హో లియాంగ్ (మలేసియా)తో టోర్నీని ఆరంభించనున్నాడు. యూఎస్ ఓపెన్ విజేత ఆయుష్ షెట్టి..టాప్‌సీడ్ కుల్వంత్ విటిద్‌శర్న్ (థాయ్‌లాండ్)తో మొదటి రౌండ్‌లో అమీతుమీ తేల్చుకోనున్నాడు. తరుణ్ మన్నేపల్లి-జోన్ హోక్ జిన్ (కొరియా)తో తలపడనున్నాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో రుత్విక శివానీ/రోహన్ కపూర్ ద్వయం అమెరికా జోడీ స్మిత్/జెనీని తొలి రౌండ్‌లో ఢీకొననుంది.

ఇషా బృందానికి రజతం



● సమ్రాట్‌కు రెండు స్వర్ణాలు
● షూటింగ్ వరల్డ్ చాంపియన్‌షిప్

కైరో: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ షూటింగ్ చాంపియన్‌షిప్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో ఇషా సింగ్ సారథ్యంలోని భారత మహిళల జట్టు రజతం నెగ్గగా.. యువ ఆటగాడు సమ్రాట్ రాణా టీమ్ ఈవెంట్‌తో పాటు వ్యక్తిగత విభాగం స్వర్ణంతో డబుల్ ధమాకా సృష్టించాడు. సోమవారం జరిగిన పోటీల్లో ఇషా, మను భాకర్, సురుచిల బృందం మొత్తం 1740 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. చైనాకు స్వర్ణం, కొరియా కు కాంస్యం దక్కాయి. 10 మీ. పురుషుల టీమ్ ఈవెంట్‌లో సమ్రాట్, వరుణ్ తోమర్, శ్రవణ్ త్రయం మొత్తం 1754 పాయింట్లతో టాప్‌లో నిలిచింది. ఇటలీ, జర్మనీ జట్లు రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకొన్నాయి. పురుషుల 10 మీ. ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో సమ్రాట్ 243.7 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి పసిడి పతకం అందుకోగా.. వరుణ్ (221.7) కాంస్యం నెగ్గాడు. చైనా షూటర్ కై హు రజతం సాధించాడు.

ఆసియా ఆర్చరీ ఫైనల్లో సురేఖ త్రయం

ఢాకా: ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో భారత ఆర్చర్లు రెండు స్వర్ణాలకు అడుగు దూరంలో నిలిచారు. పురుషుల రికర్వ్ టీమ్, మహిళల కాంపౌండ్ టీమ్ విభాగాల్లో ఫైనల్స్‌కు దూసుకెళ్లారు. మహిళల కాంపౌండ్‌లో తెలుగమ్మాయి జ్యోతి సురేఖ, దీప్షిక, ప్రతికా ప్రదీప్‌లతో కూడిన భారత త్రయం సెమీఫైనల్లో 234-227తో ఆతిథ్య ఢాకా జట్టును చిత్తుచేసి కొరియాతో టైటిల్‌ఫైట్‌కు సిద్ధమైంది. ఇక, పురుషుల రికర్వ్ సెమీస్‌లో యష్‌దీప్, అతాను దాస్, రాహుల్‌లతో కూడిన భారత బృందం 5-3తో కజకిస్థాన్‌ను ఓడించింది. తుదిపోరులో కొరియాతో డిఫెండింగ్ చాంప్ భారత్ అమీతుమీ తేల్చుకోనుంది.

ఆడమంటే ఆడనన్నాడు

షమి చెప్పేవి నిజాలు కావు
బీసీసీఐ అధికారి



న్యూఢిల్లీ: వెటరన్ పేసర్ మహ్మద్ షమి ఈ ఏడాది మార్చిలో జరిగిన చాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు దూరమయ్యాడు. ఆ తర్వాత జరిగిన ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌తో పాటు ఆసియాకప్ టీ20 టోర్నీ, ఆస్ట్రేలియా పర్యటనకు సైతం అతడిని సెలెక్టర్లు పరిగణనలోకి తీసుకోలేదు. షమికి టెస్టులు ఆడే ఫిట్‌నెస్ లేదనే ఆలోచనలో బీసీసీఐ ఉంటోంది. ఇదే విషయమై షమి, చీఫ్ సెలెక్టర్ అగార్కర్ మధ్య మాటల యుద్ధం కూడా జరిగింది. సెలెక్టర్లు తనను సంప్రదించడం లేదని, ఫిట్‌గా లేకపోతే తాను రంజీలు ఎలా ఆడగలనని ప్రశ్నిస్తున్నాడు. అయితే బీసీసీఐ వాదన మరోలా ఉంది. అతడిని ఇంగ్లండ్ పర్యటనకు పంపేందుకు సెలెక్షన్ ప్యానెల్ ప్రయత్నించినా అందుబాటులోకి రాలేదని బోర్డు అధికారి ఒకరు పేర్కొన్నారు. ఈ విషయమై షమి చెబుతున్నవి నిజాలు కాదని ఆయన అన్నారు. 'ఇంగ్లండ్ టూర్‌లో బుమ్రా మూడు టెస్టుల్లో మాత్రమే ఆడతాడు కాబట్టి అక్కడికి షమిని పంపాలని జాతీయ సెలెక్టర్లు భావించారు. ఇందుకోసం సెలెక్టర్లు, సీఓఈ సిబ్బంది అతడిని సంప్రదించేందుకు చాలాసార్లు ఫోన్ ద్వారా ప్రయత్నించారు. ముందుగా ఇంగ్లండ్ లయన్స్‌తో ఆడేందుకు భారత్ 'ఎ' తరపున బరిలోకి దించాలనుకున్నాం. తద్వారా అతడి ఫిట్‌నెస్‌పై అంచనాకు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఈ ఆఫర్‌ను షమి తిరస్కరించాడు. మ్యాచ్ ఫిట్‌నెస్ కోసం తగినంత సమయం కావాలని చెప్పాడు. అంతేకానీ.. షమితో ఎలాంటి సంభాషణ జరగలేదనే కథనాలు నిజం కావు' అని ఆ అధికారి వివరించాడు.

'ఈడెన్'లో సఫారీలు

కోల్‌కతా: భారత్‌తో తొలి టెస్ట్ కోసం దక్షిణాఫ్రికా పూర్తిస్థాయి జట్టు ఈడెన్ గార్డెన్స్‌కు చేరుకొంది. ఆఖరుగా కెప్టెన్ టెంబా బవుమా సోమవారం జట్టుతో కలిశాడు. కండర గాయంతో జట్టు నుంచి అవుటైన బవుమా.. బెంగళూరులో భారత్-ఎతో జరిగిన అనధికార టెస్ట్‌లో సౌతాఫ్రికా-ఎ తరపున ఆడి ఫిట్‌నెస్ నిరూపించుకొన్నాడు. కాగా, తొలి విడతలో కోచ్ షుక్రి కోనార్డ్, పేసర్లు రబాడ, మార్కో జెన్సన్‌తో పాటు పాకిస్థాన్‌తో వైట్ బాల్ సిరీస్ ముగించుకొన్న కొందరు ప్లేయర్లు ఆదివారమే ఇక్కడకు చేరుకొన్నారు. కాగా, ఆస్ట్రేలియా పర్యటన ముగించుకొన్న భారత జట్టు ఆటగాళ్లు విడతల వారీగా ఇక్కడకు చేరుకొంటున్నారు. రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ శుక్రవారం నుంచి ఇక్కడ జరగనుంది.

అది 'సర్' కాదు...ఓట్‌బందీ

▸▸ పీక కోసినా వ్యతిరేకిస్తునే ఉంటా: మమత

కోల్‌కతా, నవంబరు 10: ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ(సర్) కార్యక్రమాన్ని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తప్పుపట్టారు. అది 'సర్' కాదని, ఓటర్లను తొలగించడానికి ఉద్దేశించిన ఓట్ల రద్దు ('ఓట్ బందీ') కార్యక్రమమని, 'సూపర్ ఎమర్జెన్సీ'లాంటి పరిస్థితి అని అభివర్ణించారు. దాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండు చేశారు. సోమవారం ఆమె సిలిగుడిలో విలేకరులతో మాట్లాడుతూ సర్‌ను వ్యతిరేకిస్తున్నందుకు బీజేపీ తనను జైలులో పెట్టొచ్చు, పీక కోయొచ్చు..కానీ ప్రజల హక్కును అణచివేయకూడదని అన్నారు.

అందుబాటులోకి ఆధార్ కొత్త యాప్

▸▸ ఇక నుంచి డిజిటల్ రూపంలో ఆధార్ గుర్తింపు

న్యూఢిల్లీ, నవంబరు 10: భారత విశిష్ట ప్రాధికార గుర్తింపు సంస్థ(యూఐడీఏఐ-ఉడాయ్) కొత్త ఆధార్ యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. మన ఆధార్ కార్డును డిజిటల్ రూపంలో మన స్మార్ట్ ఫోన్‌లో తీసుకొని వెళ్లడానికి ఈ యాప్ పనికొస్తుంది. ఏదేని వెరిఫికేషన్ సమయంలో ఆధార్ కార్డుని మనం భౌతికంగా తీసుకొని వెళ్లనవరం లేదు. బయోమెట్రిక్, ఫేస్ రికగ్నిషన్ వంటి భద్రతా ఫీచర్లు ఈ యాప్‌లో ఉన్నాయి. వీటివల్ల మన వ్యక్తిగత సమాచారం పూర్తి గోప్యంగా ఉంటుంది. ఉదాహరణకి మన పేరు, ఫొటో మాత్రమే సరిపోతుందనుకున్న సమయంలో మన పుట్టిన తేదీ, చిరునామా వంటి వాటిని కనిపించకుండా చేయవచ్చు.ఈ యాప్ గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ లో అందుబాటులో ఉంది.

డిజిటల్ వైపు సహకార బ్యాంకులు

▸▸ సహకార్ డిజి పే, డిజి లోన్ యాప్‌ల ప్రారంభం

న్యూఢిల్లీ, నవంబరు 10: పట్టణ సహకార బ్యాంకు(యూసీబీ)లను ఆధునికీకరించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఇందులో భాగంగా కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా సోమవారం నాడు యూసీబీల కోసం 'సహకార్ డిజి పే', సహకార్ డిజి లోన్' అనే రెండు మొబైల్ అప్లికేషన్లను ప్రారంభించారు. పెరుగుతున్న నగదు రహిత ఆర్థిక వ్యవస్థలో ఈ డిజిటల్ చెల్లింపుల స్వీకరణ యూసీబీల మనుగడకు అత్యవసరం అని పేర్కొన్నారు.

నేడే జూబ్లీహిల్స్ ఉపఎన్నిక

▸▸ గెలుపు తమదేనంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని జూబ్లీ హిల్స్ ఉప ఎన్నిక పోలింగ్ మంగళవారం జరుగనుంది. అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు ఈ ఉప ఎన్నిక కీలకంగా మారింది. దీంతో మూడు పార్టీల యంత్రాంగాలు మొత్తం ఈ నియోజకవర్గంలోనే మోహరించి ప్రచారం చేశాయి. ఇన్ని రోజులుగా నిర్వహించిన ప్రచారం, ఓటర్ల స్పందనను బట్టి ఉప ఎన్నికలో తమ పార్టీ జెండానే ఎగరడం ఖాయమంటూ అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. బీజేపీ సైతం గట్టి పోటీ ఇస్తామన్న ధీమాను వ్యక్తం చేస్తోంది. ఇక సిటింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా హైదరాబాద్ జిల్లాలో తాము పట్టు కోల్పోలేదని చాటుకునేందుకు జూబ్లీహిల్స్ ఎన్నికను బీఆర్ఎస్ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది.

అన్ని విద్యాసంస్థల్లో 'వందేమాతరం' తప్పనిసరి!

▸▸ యూపీ సీఎం యోగి ఆదేశం

గోరఖ్‌పూర్, నవంబరు 10: జాతీయ గేయం 'వందేమాతరం'పై వివాదం కొనసాగుతున్న నేపథ్యంలో ఉత్తరప్రదేశ్(యూపీ) ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విద్యాసంస్థల్లోనూ వందేమాతరం గేయాన్ని తప్పనిసరిగా ఆలపించాలని పేర్కొన్నారు. గోరఖ్‌పూర్‌లో సోమవారం జరిగిన 'ఐక్యతా యాత్ర'లో పాల్గొన్న ఆయన.. 'వందేమాతరం' ఆలపించడం ద్వారా భరతమాత, మాతృభూమి పట్ల మరింత గౌరవం పెరుగుతుందన్నారు.

బిహార్లో నేడే తుదిపోరు

(మొదటి పేజీ తరువాయి)



ఓటర్లు 7.69 లక్షల మంది. సజావుగా పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లూ చేసింది. 45,399 పోలింగ్ కేంద్రాలను సిద్ధంచేసింది. వీటిలో 40,073 కేంద్రాలు గ్రామీణ ప్రాంతంలో ఉన్నాయి. 8,491 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిలో ఒక్క గయాజీలోనే 1,084 కేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు మొత్తం 122 స్థానాల్లోనూ భారీగా భద్రతాబలగాలను మోహరించారు. ఇప్పటికే 500 కంపెనీల కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ముందస్తు ఎన్నికల విధుల్లో ఉండగా.. వీటితో పాటు మరో 500 కంపెనీల సాయుధ సిబ్బందికి పోలింగ్ బాధ్యతలు అప్పటించారు. వీరుగాక 60 వేల మంది బిహార్ పోలీసులు, 30 వేల బిహార్ సాయుధ పోలీసు సిబ్బంది, 20 వేల మంది హోంగార్డులు, శిక్షణలో ఉన్న మరో 19 వేల మంది కొత్త పోలీసులు, ఇతర రాష్ట్రాలకు చెందిన 2 వేల మంది సిబ్బందిని మోహరించారు. నవాదా జిల్లా హిసువా స్థానంలో అత్యధికంగా 3.67 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. లౌరియా, చంపటియా, రక్సౌల్, త్రివేణిగంజ్, సుగౌలీ, బణ్‌మన్‌ఖీ సీట్లలో 22 మంది చొప్పున అభ్యర్థులు బరిలో నిలిచారు. అసెంబ్లీలోని మొత్తం 243 స్థానాలకు గాను 121 స్థానాలకు ఈ నెల 6న జరిగిన మొదటి దశ ఎన్నికల్లో 65 శాతానికిపైగా పోలింగ్ నమోదైన సంగతి తెలిసిందే. రెండు దశల్లో కలిపి ఈ నెల 14న ఓట్లు లెక్కించి తుది ఫలితాలను ప్రకటిస్తారు.

సీమాంచల్‌పైనే పార్టీల దృష్టి

ఎన్నికలు జరిగే జిల్లాల్లో అత్యధికం పూర్వాంచల్ ప్రాంతంలోనే ఉన్నాయి. ఇది ముస్లిం ప్రాబల్య ప్రాంతం కావడంతో బీజేపీ-జేడీయూ నేతృత్వంలోని పాలక ఎన్డీఏ, విపక్ష ఇండి కూటమి పార్టీలతో కూడిన మహాగఠ్‌బంధన్ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ముస్లిం ఓట్లు తనకేనని గఠ్‌బంధన్ భావిస్తుండగా.. చొరబాటుదార్లకు విపక్షం అండగా నిలుస్తోందని ఎన్డీఏ ఆరోపిస్తోంది. నితీశ్ కుమార్ క్యాబినెట్‌లోని పలువురు మంత్రులు బ్రిజేంద్రప్రసాద్ యాదవ్ (సుపౌల్), లేశీ సింగ్ (ధమ్‌దాహా), శీలా మండల్ (ఫుల్‌పరాస్), జమాఖాన్ (చైన్‌పూర్)-జేడీయూ.. ప్రేమ్‌కుమార్ (గయ), రేణు దేవి(బెతియా), నీరజ్‌కుమార్ సింగ్(ఛతర్‌పూర్), మాజీ ఉపముఖ్యమంత్రి తార్‌కిశోర్ ప్రసాద్ (కతిహార్)-బీజేపీ.. పీసీసీ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్ (కుటుంబ), కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత షకీల్ అహ్మద్ ఖాన్ (కద్వా), సీపీఐఎంఎల్-లిబరేషన్ పక్ష నేత మెహబూబ్ ఆలం (బలరాంపూర్) బరిలో ఉన్నారు. కాగా, హెచ్ఏఎంకు కేటాయించిన ఆరు స్థానాలకు, ఆర్ఎల్ఎంకు ఇచ్చిన ఆరు స్థానాల్లో నాలుగింటికి రెండో దశలోనే పోలింగ్ జరుగుతోంది.

స్త్రీ-పురుష వారీ ఓటింగ్ వివరాలేవీ?: తేజస్వీ

బిహార్‌లో జరిగిన తొలి దశ ఎన్నికల్లో స్త్రీ-పురుషుల వారీగా ఓటింగ్ వివరాలను ఎన్నికల కమిషన్ వెల్లడించకపోవడాన్ని ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ప్రశ్నించారు. ఈ నెల ఆరో తేదీన తొలి దశ ఎన్నికలు జరిగాయని, సోమవారం నాటికి నాలుగు రోజులు పూర్తయినా ఆ వివరాలను ప్రకటించలేదని చెప్పారు. గతంలో ఎప్పుడూ ఇలా జరగలేదని, ఇంతకుముందు ఎన్నికలయిన వెంటనే ఈ సమాచారం బహిర్గతమయిదేని గుర్తు చేశారు.



విజయవాడలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రాష్ట్రంలో హై అలర్ట్..!

▸▸ ఢిల్లీ పేలుడు నేపథ్యంలో పోలీసులతో డీజీపీ టెలీకాన్ఫరెన్స్... ముమ్మర సోదాలు..

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశ రాజధాని ఢిల్లీలో బాంబు పేలుడు ఘటనతో రాష్ట్రంలో హై అలర్ట్ నెలకొంది. డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా టెలికాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి.. ఎస్పీలు, రేంజ్‌ల ఐజీలు, డీఐజీలు.. విజయవాడ, విశాఖపట్నం పోలీసు కమిషనర్లను అప్రమత్తం చేశారు. 'మీ ప్రాంతంలోని అన్ని బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వెంటనే తనిఖీలు చేపట్టండి.. మతపరమైన ప్రాంతాలు, పర్యాటక కేంద్రాల్లో సోదాలు చేయండి. పార్కింగ్ చేసిన కార్లు, లాడ్జిల్లో అనుమానితులపై ఆరా తీయండి. మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాలతో పాటు సున్నితమైన అన్ని చోట్లా ముమ్మర తనిఖీలు చేపట్టండి.' అని ఆదేశించారు. పోలీసులు ఎవ్వరూ సెలవు తీసుకోవద్దని, పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఎక్కడ ఏ చిన్న అనుమానం వచ్చినా పోలీసులకు(డయల్ 100, డయల్ 112) వెంటనే సమాచారం ఇవ్వాలని ప్రజలనుకోరారు.

ప్రమాణాలు పాటిస్తారా? మూసేస్తారా?

▸▸ 'దగ్గు సిరప్' మరణాల నేపథ్యంలో ఫార్మా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అల్టిమేటం

న్యూఢిల్లీ, నవంబరు 10: దగ్గు సిరప్ వల్ల మనదేశంతోపాటు విదేశాల్లోనూ మరణాలు సంభవించిన నేపథ్యంలో ఔషధ తయారీ సంస్థలపై కేంద్రం తీవ్రంగా స్పందించింది. అంతర్జాతీయ ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, లేదంటే సంస్థలను మూసుకోవాల్సి ఉంటుందని గట్టిగా హెచ్చరించింది. వచ్చే ఏడాది జనవరి ఒకటినాటికి గ్లోబల్ గుడ్ మ్యానుఫాక్చరింగ్ ప్రాక్టీసెస్(జీఎంపీ) విధానాలకు అనుగుణంగా సంస్థలు తయారవ్వాలని కేంద్ర ఔషధ ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) నిర్దేశించింది. వార్షిక టర్నోవర్ రూ.250 కోట్ల లోపు ఉండి, తక్కువస్థాయి వసతులు కలిగిన 1,470 ఫార్మా యూనిట్లకు ఈ మేరకు ఆదేశాలను జారీచేసింది. నిర్దేశిత తేదీ లోపు విధానాలను మార్చుకోని యూనిట్లు తమ కార్యకలాపాలను నిలిపివేయాల్సి ఉంటుందని, తేదీని పొడిగించే ప్రసక్తి ఉండదని సీడీఎస్‌సీవో స్పష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా తయారవుతున్న జెనిటిక్ ఔషధాల్లో 20% మేర మనదేశంలోని ఫార్మా సంస్థలే అందిస్తున్నాయి. దీంతో నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రభావం వాటిపై గణనీయంగానే ఉంటుందని భావిస్తున్నారు. మన ఫార్మా ఉత్పత్తులపై దేశీయంగా, అంతర్జాతీయం తిరిగి విశ్వాసం కలిగించేందుకు ఈ చర్యలు అవసరమని సీడీఎస్‌సీవో భావిస్తోంది.

ఢిల్లీ విమానాశ్రయం పరిధిలో జీపీఎస్ స్పూఫింగ్!

▸▸ విమానాలకు తప్పుడు సంకేతాలు అందినట్లు పైలట్ల ఫిర్యాదు

▸▸ దర్యాప్తు చేపట్టిన ఎన్ఎస్ఏ అజిత్ డోభాల్ కార్యాలయం

న్యూఢిల్లీ, నవంబరు 10: ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ) వ్యవస్థలో సాంకేతిక లోపం కారణంగా కిందటివారం ఢిల్లీ విమానాశ్రయంలో పలు విమానాలకు అంతరాయం కలిగింది గుర్తుందా! 'జీపీఎస్ స్పూఫింగ్' కారణంగానే అలా జరిగిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో.. జాతీయ భద్రత సలహాదారు అజిత్ డోభాల్ కార్యాలయం దీనిపై దర్యాప్తు ప్రారంభించింది. సాధారణంగా మనం ఒకచోటు నుంచి మరొకచోటుకు వెళ్తున్నప్పుడు జీపీఎస్ సాయంతో వెళ్తాం. విమానాలు కూడా అలా జీపీఎస్ ఆధారంగా ప్రయాణిస్తాయి. కంప్యూటర్లను హ్యాక్ చేసినట్టుగానే.. నకిలీ ఉపగ్రహ సంకేతాలను ప్రసారం చేయడం ద్వారా విమానాల్లోని నేవిగేషన్ వ్యవస్థలకు అంతరాయం కలిగించడమే జీపీఎస్ స్పూఫింగ్. దీనివల్ల విమానాలు వాస్తవంగా ఒక ప్రాంతంలో ఉంటే.. మరోచోట ఉన్నట్టుగా నేవిగేషన్ వ్యవస్థలు భావిస్తాయి. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కిందటి గురువారం సాయంత్రం నుంచి ఏటీసీ వ్యవస్థలో సాంకేతిక లోపాలు తలెత్తగా.. దానికి రెండు రోజుల ముందు నుంచే తమకు తప్పుడు నేవిగేషన్ సమాచారం అందిందంటూ పైలట్లు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. రాజధాని ప్రాంతానికి (ఎన్‌సీఆర్) 60 నాటికల్ మైళ్ల పరిధిలో ఈ తరహా తప్పుడు సమాచారం అందినట్టు పైలట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఎన్ఎస్ఏ కార్యాలయంలోని 'నేషనల్ సైబర్ సెక్యూరిటీ కో-ఆర్డినేటర్ (ఎన్‌సీఎస్‌సీ)' నవీన్‌కుమార్ సింగ్ ఈ కేసు దర్యాప్తును చేపట్టారు. జీపీఎస్ స్పూఫింగ్ జరిగిందా? లేక నిజంగానే సాంకేతిక లోపాలు తలెత్తాయా? సైబర్ దాడా? దీని వెనుక అంతర్జాతీయ జోక్యం ఏమైనా ఉందా? అనే అంశాలపై దర్యాప్తు బృందం దృష్టి సారించింది.


బీబీసీ చీఫ్ డేవీ రాజీనామా!

▸▸ న్యూస్ సీఈవో టర్నెస్ కూడా..

▸▸ ట్రంప్ ప్రసంగాన్ని తప్పుదోవ పట్టించేలా ఎడిట్ చేశారన్న ఆరోపణలతోనే



లండన్, నవంబరు 10: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగాన్ని తప్పుదోవ పట్టించేలా ఎడిట్ చేశారంటూ విమర్శలు రావడంతో ఏకంగా బీబీసీ హెడ్, మరో ఉన్నతాధికారి రాజీనామా చేశారు. 2021, జనవరి 6న ట్రంప్ చేసిన ప్రసంగాన్ని 'పనోరమ' పేరిట డాక్యుమెంటరీ ప్రసారం చేశారు. ఇందులో ఆయన ప్రసంగంలోని రెండు వేర్వేరు భాగాలను కలిపి ఎడిట్ చేయడంతో 2021 జనవరిలో జరిగిన క్యాపిటల్ హిల్ అల్లర్లను ట్రంప్ ప్రోత్సహించినట్లుగా చూపించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలో బీబీసీ డైరెక్టర్ జనరల్ టిమ్ డేవీ, న్యూస్ సీఈవో డెబోరా టర్నెస్‌లు రాజీనామా చేశారు. టిమ్ డేవీ ఐదేళ్లుగా బీబీసీ డైరెక్టర్ జనరల్‌గా పనిచేస్తున్నారు. టిమ్ డేవీ తన రాజీనామాను ప్రకటిస్తూ, సిబ్బందికి లేఖ రాశారు. "మొత్తంగా బీబీసీ చాలా బాగా పనిచేస్తోంది. కానీ, కొన్ని తప్పులు జరిగాయి. డైరెక్టర్ జనరల్‌గా వాటికి నాదే బాధ్యత. రాజీనామా పూర్తిగా నా నిర్ణయమే" అని పేర్కొన్నారు. రాజీనామాకు ఇదొక్కటే కారణం కాకపోయినప్పటికీ, బీబీసీ న్యూస్ చుట్టూ నెలకొన్న వివాదం కూడా తన నిర్ణయంపై ప్రభావం చూపిందని చెప్పారు. ఇక 'పనోరమా' వివాదం తానెంతో ఇష్టపడే బీబీసీ సంస్థకు నష్టం కలిగించే దశకు చేరుకుందని టర్నెస్ పేర్కొన్నారు. జవాబుదారీగా ఉండాలి కాబట్టే తాను పదవి నుంచి తప్పుకుంటున్నట్లు చెప్పారు. బీబీసీ న్యూస్ సంస్థాగతంగా పక్షపాత ధోరణితో వ్యవహరిస్తోందన్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని టర్నెస్ స్పష్టం చేశారు. బీబీసీ డైరెక్టర్ జనరల్, న్యూస్ హెడ్ రాజీనామాలను స్వాగతిస్తున్నట్లు ట్రంప్ చెప్పారు. "జనవరి 6న నేను చేసిన మంచి ప్రసంగాన్ని వక్రీకరించి చూపి, దొరికిపోవడంతోనే వారు వైదొలిగారు లేదా వారిని తొలగించారు" అని అన్నారు.



చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

'శివ' ఓ అద్భుతం



"'శివ' చిత్రం నేటికీ ఓ అద్భుతం. 4కె డాల్బీ అట్మాస్ వెర్షన్ చూస్తున్నప్పుడు కొత్త సినిమా చూసిన అనుభూతి కలిగింది. అన్నపూర్ణ స్టూడియోస్‌కు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ చిత్రం రీ రిలీజ్ కావడం చాలా అనందంగా ఉంది' అని అన్నారు హీరో అక్కినేని నాగార్జున. ఆయన కథానాయకుడిగా రామ్ గోపాల్ వర్మ 36 ఏళ్ల క్రితం తెరకెక్కించిన చిత్రమిది. ఈనెల 14న రీ రిలీజ్ అవుతున్న సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రామ్‌గోపాల్ వర్మ కూడా పాల్గొన్నారు.

ఇట్లు మీ రామసత్యనారాయణ



రవితేజ కథానాయకుడిగా కిశోర్ తిరుమల 'ఆర్‌టీ 76' అనే వర్కింగ్ టైటిల్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి గ్లింప్స్‌ను విడుదల చేశారు మేకర్స్. 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' అనేది టైటిల్. ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. 'నా జీవితంలో ఉన్న ఇద్దరు ఆడాళ్లు నన్ను రెండు ప్రశ్నలు అడిగారు. సమాధానం కోసం చాలా ఆలోచించాను. గూగుల్, కృత్రిమ మేధని ఆశ్రయించడంతో పాటు అనుభవమున్న మగాళ్లని.. మొగుళ్లని అడిగాను.. ఆశ్చర్యపోయారే తప్ప సమాధానం చెప్పలేకపోయారు. ఇలాంటి ప్రశ్న మీకు ఎదురుకాకూడదని.. పెళ్లైన వారికి నాలాంటి పరిస్థితి ఎదురుకాకూడదని.. ఇట్లు మీ రామసత్యనారాయణ' అంటూ రవితేజ చెప్పే సంభాషణలు సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఎస్ఎల్‌వీ సినిమాపై పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు.

మహేశ్‌బాబు సినిమాలో పాట పాడిన శ్రుతి



మహేశ్‌బాబు హీరోగా 'ఎస్ఎస్ఎంబీ29' వర్కింగ్ టైటిల్‌తో రాజమౌళి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. సినిమా తొలి వేడుకను ఈనెల 15న హైదరాబాద్‌లో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ వేడుకలోనే ప్రకటించనున్న టైటిల్, ఇతర అప్డేట్స్ కోసం అభిమానులంతా ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో నటి శ్రుతిహాసన్ అందరూ ఆశ్చర్యపోయేలా ఓ అప్డేట్‌ని పంచుకున్నారు. ఈ చిత్రంలో తాను ఓ పవర్‌ఫుల్ పాట పాడినట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపారు. కీరవాణి సంగీత దర్శకత్వంలో పాడటం ఆనందంగా ఉందంటూ పోస్టు పెట్టారు. ఆయనతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేశారు.



ర్యాపిడో... స్విగ్గీ... జొమాటో... 'మత్తు' సరఫరాకు మడ్డీ మార్గాలు

- ఎండీఎంఏను సమకూర్చిన నైజీరియన్
- డ్రగ్స్‌ను తరలిస్తూ దొరికిన ప్రేమికుల కేసులో కొత్త ట్విస్ట్

విజయవాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎండీఎంఏను తరలిస్తూ విజయవాడలో సెప్టెంబరులో ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడిన ప్రేమికుల కేసులో కొత్త ట్విస్ట్ బటయపడింది. మధుసూదన్‌రెడ్డి బెంగళూరులో ర్యాపిడో... స్విగ్గీ... జొమాటో డెలివరీ బోయ్ ముసుగులో భారీగా డ్రగ్స్ విక్రయించేవాడని తెలిసింది. జీవనోపాధి పొందుతున్నట్టుగా పైకి కనిపిస్తూనే, చీకట్లో అనేక వ్యవహారాలు చక్కబెట్టేవాడు. మాదకద్రవ్యాల కేసులో జరిగిన అరెస్టులతో సరిపెట్టుకోవద్దని, ఎంతదూరాన ఉన్నా వాటి మూలాలను ఎలాగైనా బయటకు లాగాలని విజయవాడ పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు అధికారులను కొద్దిరోజుల క్రితం ఆదేశించారు. కేసుల్లో నిందితులుగా ఉంటూ చిక్కకుండా అజ్ఞాతంలో ఉన్న వారిపై నిఘా పెట్టిన పోలీసులు....ఒక్కొక్కరిని ఏరి బయటకు తీసుకొస్తున్నారు. ఇందులో భాగంగానే మధుసూదన్‌రెడ్డికి సంకెళ్లు వేశారు. అతడిని విచారించగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చినట్టు తెలిసింది. మధుసూదన్‌రెడ్డి బీటెక్ చదువును సగంలోనే వదిలేసి ఉపాధి కోసం బెంగళూరు వెళ్లాడు. అక్కడ ర్యాపిడో, స్విగ్గీ, జుమాటో డెలివరీ సంస్థల్లో చేరాడు. ఈ క్రమంలోనే బెంగళూరులో డ్రగ్స్ అమ్ముతున్న ఓ నైజీరియన్‌తో పరిచయమైంది. అప్పటినుంచి ఎండీఎంఏ, ఎల్ఎస్‌డీ వంటి మాదకద్రవ్యాలను అడిగిన వారికి సరఫరా చేయడం మొదలుపెట్టాడు. దీనికోసం 10-15 డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకున్నాడు. డ్రగ్స్‌ను తీసుకొచ్చి డ్రాపింగ్ పాయింట్లలో కొనుగోలుదారులకు అందజేసి కమీషన్ తీసుకునేవాడు. కొన్నిసార్లు కొనుగోలుదారులను కలిసి స్వయంగా అందజేసేవాడు. డ్రాపింగ్ పాయింట్ల వద్ద తుప్పలు, గడ్డిలో సరుకుని వదిలిపెట్టి వెళ్లేవాడు. ఆ ఫొటోలను వాట్సాప్‌లో కొనుగోలుదారులకు పంపేవాడు. కేసులో ఇప్పటివరకు ప్రాథమికంగా జరిగిన దర్యాప్తును బట్టి అసలు సూత్రధారి మధుసూదన్‌రెడ్డి అని అంతా భావించారు. ఇప్పుడు బెంగళూరులో విద్యార్థి వీసాపై ఉన్న నైజీరియన్ ఈ డ్రగ్స్‌ను సరఫరా చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. అతడితో మధుసూదన్‌రెడ్డికి మంచి సంబంధాలు ఉన్నట్టు తెలుస్తోంది. మధుసూదన్‌రెడ్డి మాదకద్రవ్యాలను కొనుగోలుచేసే వారితో ఒక వాట్సాప్ గ్రూపు నడిపేవాడు. ఆర్డర్లను బట్టి డ్రగ్స్‌ను అందిస్తూ, డబ్బులను పేమెంట్ యాప్‌ల ద్వారా స్వీకరించేవాడు. ఆర్డర్ ప్రకారం నైజీరియన్‌కు వాట్సాప్‌లో హాయ్ అని సందేశం పంపేవాడు. స్పందన రాగానే ఆర్డర్ విషయాన్ని చెప్పేవాడు. అతడు స్కానర్‌ను వాట్సాప్‌లో పంపగానే డ్రగ్స్ ఆర్డర్‌కు సంబంధించిన మొత్తాన్ని చెల్లించేవాడు. ఈ డ్రగ్స్‌ను మధుసూదన్‌రెడ్డికి అందజేయడానికి నైజీరియన్ కొన్ని డ్రాపింగ్ పాయింట్లను ఏర్పాటు చేసుకునేవాడని పోలీసులు తెలిపారు.

వైసీపీ విద్యార్థి నేత కొండారెడ్డితో మధుసూదన్‌రెడ్డి బంధం..

ఎండీఎంఏను తరలిస్తూ పట్టుబడిన ప్రేమికుల కేసులో వైజాగ్‌కు చెందిన వైసీపీ విద్యార్థి విభాగ నాయకుడు కొండారెడ్డి పేరు అనూహ్యంగా తెరపైకి వచ్చింది. కొద్దిరోజుల క్రితమే వైజాగ్‌లోని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎండీఎంఏతో కొండారెడ్డి, మరికొంతమందిని అరెస్టు చేశారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు. ఈగల్, టాస్క్‌ఫోర్స్ పోలీసులకు తాజాగా కొత్త పురోగతి కనిపించింది. సెప్టెంబరులో ట్రావెల్స్ బస్సులో డ్రగ్స్‌ను వైజాగ్‌కు తీసుకెళ్తూ ఇంజనీరింగ్ విద్యార్థి అర్జు శ్రీవాత్సవ్, అతడి ప్రియురాలు హావిలా డిలైట్ పట్టుబడడం, వారిపై కేసు నమోదు చేయడం తెలిసిందే. దర్యాప్తులో వైజాగ్‌కు చెందిన జోగా లోహిత్ యాదవ్, స్వరూపరాజు అనే ఇద్దరు యువకుల పాత్ర ఈ కేసులో ఉన్నట్టు తెలిసింది. మత్తు ప్రేమికులు దొరికిపోగానే స్వరూపరాజు అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. లోహిత్ యాదవ్‌ను పట్టుకున్న తర్వాత తాజాగా బెంగళూరులో పోలీసులకు చిక్కిన మధుసూదన్‌రెడ్డి పేరు బయటపడింది. ఈ నిందితుల కాల్స్ డేటాను టాస్క్‌ఫోర్స్ పోలీసులు విశ్లేషిస్తున్న క్రమంలోనే కొండారెడ్డి ఉపయోగించిన ఫోన్ నంబరును గుర్తించారు. లోహిత్ యాదవ్‌తో కొండారెడ్డి పలుమార్లు వాట్సాప్ కాల్స్ ద్వారా మాట్లాడినట్టు తెలిసింది. వైజాగ్ కేంద్రంగా జరిగిన పార్టీలకు అవసరమైన డ్రగ్స్‌ను కొండారెడ్డి మధుసూదన్‌రెడ్డి నుంచి రప్పించినట్టు తెలుస్తోంది. లోహిత్ ఫోన్‌లో ఉన్న కొండారెడ్డి ఫోన్ నంబరును గుర్తించిన టాస్క్‌ఫోర్స్, సెంట్రల్ జోన్ పోలీసులు...వైజాగ్‌లోని టాస్క్‌ఫోర్స్‌లను సంప్రదిస్తూ తదుపరి అడుగులు వేయడానికి సిద్ధమవుతున్నారు.

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతి పరుగు!

- నేడు మరో 4 ఎంఎస్ఎంఈ పార్కులకు ప్రారంభోత్సవం
- మరో 48 నియోజకవర్గాల్లో పార్కుల అభివృద్ధికి శంకుస్థాపన
- ఇప్పటికే 11 నియోజకవర్గాల్లో పూర్తి.. 40 చోట్ల పనులు



అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గానికో పారిశ్రామిక పార్కు.. ఇంటికో పారిశ్రామికవేత్త' లక్ష్య సాధన దిశగా రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టిస్తోంది. రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసి.. అక్కడ సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఈ) నెలకొల్పాలని సంకల్పించిన సర్కారు.. రెండో విడతగా మరో 4 ఎంఎస్ఎంఈ పార్కులను అభివృద్ధి చేసింది. ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం లింగన్నపాలెం, చిత్తూరు నియోజకవర్గం వెంకటాపురం, శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గం పైడిభీమవరం, విశాఖపట్నం జిల్లా గాజువాక నియోజకవర్గం పెదగంట్యాడలో అభివృద్ధి చేసిన నాలుగు పార్కులను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రారంభించనున్నారు. ప్రకాశం జిల్లా కనిగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొని.. అక్కడి ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభిస్తారు. అక్కడి నుంచే మిగిలిన మూడు పార్కులకు వర్చువల్‌గా ప్రారంభోత్సవాలు చేస్తారు. మరో 48 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల అభివృద్ధికి శంకుస్థాపనలు కూడా చేయనున్నారు.

శంకుస్థాపనల జాబితాలోని నియోజకవర్గాలు..

పెందుర్తి, నర్సీపట్నం, అనంతపురం, కోడూరు, రాయచోటి, తంబళ్లపల్లి, పాడేరు, రంపచోడవరం, వేమూరు, రేపల్లె, చీరాల, పుంగనూరు, నగరి, కుప్పం, అమలాపురం, నిడదవోలు, గోపాలపురం, రాజమండ్రి రూరల్, ఏలూరు, ప్రత్తిపాడు (గుంటూరు జిల్లా), పత్తిపాడు (కాకినాడ జిల్లా), తుని, మచిలీపట్నం, మంత్రాలయం, ఆలూరు, పాణ్యం, ఆళ్లగడ్డ, సర్వేపల్లి, విజయవాడ సెంట్రల్, విజయవాడ తూర్పు, మైలవరం, జగ్గంపేట, గురజాల, సత్తెనపల్లి, సంతనూతలపాడు, ఎర్రగొండపాలెం, కొండపి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, విశాఖపట్నం తూర్పు, విశాఖపట్నం పశ్చిమ, పొద్దుటూరు, పులివెందుల, మైదుకూరు నియోజకవర్గాల్లో ప్రభుత్వం అభివృద్ధి చేయనున్న ఎంఎస్ఎంఈ పార్కులకు, పాయకరావుపేట, పెందుర్తి, గన్నవరం నియోజకవర్గాల్లో అభివృద్ధి చేయనున్న ప్రైవేట్ పారిశ్రామిక పార్కులకు చంద్రబాబు శంకుస్థాపనలు చేస్తారు. ఆయా నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు పాల్గొంటారు. కాగా, తొలివిడతగా 11 నియోజకవర్గాల్లో అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్కులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ఏడాది మే 1న ప్రారంభించిన సంగతి తెలిసిందే. అదేరోజు మరో 40 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపనలు కూడా చేశారు. అక్కడ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి.

ఏటా 2 వేల కొత్త యూనిట్లకు ప్రణాళిక

ఎంఎస్ఎంఈ పార్కుల్లో ఆక్వా, అగ్రికల్చర్, హార్టికల్చర్ ప్రాసెసింగ్, బయోటెక్నాలజీ, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, డ్రోన్ మాన్యుఫాక్చరింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, జెమ్స్ అండ్ జ్యువెలరీ, లెదర్, ఫుట్‌వేర్, ఫార్మాస్యూటికల్స్, సెమీ కండక్టర్, ఎలక్ట్రానిక్స్, టెక్స్‌టైల్స్, టాయ్స్ తదితర ఉత్పత్తులకు సంబంధించిన యూనిట్లు నెలకొల్పేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. సూక్ష్మ, మధ్య, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి సరసనమైన ధరలకే భూకేటాయింపులు చేయడంతోపాటు అన్నివిధాలా ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించింది. ఏపీఐఐసీ ద్వారా ప్రతి నియోజకవర్గంలో కనిష్ఠంగా 15 నుంచి 150 ఎకరాల వరకు భూములు సేకరించి పారిశ్రామిక పార్కులను అభివృద్ధి చేస్తోంది. 15 ఎకరాలలోపు ఉన్న పార్కుల్లో సూక్ష్మ పరిశ్రమలు, 10 నుంచి 100 ఎకరాలలోపు విస్తీర్ణంలో అభివృద్ధి చేసే పార్కులలో చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, 100 నుంచి 1,000 ఎకరాల పార్కుల్లో భారీ పరిశ్రమలు, 1,000 ఎకరాలకు పైగా అభివృద్ధి చేసే పార్కులలో మెగా పరిశ్రమలను నెలకొల్పేలా ప్రణాళికలు సిద్ధం చేసింది. ఆయా పార్కుల్లో ఏటా 2 వేలకు పైగా కొత్త యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించింది. కొత్తగా ఏర్పాటు చేసే యూనిట్లకు రూ.10,586 కోట్లు ప్రోత్సాహకాలుగా అందించేందుకు ఇప్పటికే అంచనాలు సిద్ధం చేసింది. కొత్తగా ఎంఎస్ఎంఈ పార్కుల్లో నెలకొల్పే పరిశ్రమల ద్వారా రూ.4 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించాలని లక్ష్యంగా నిర్ణయించింది. దీన్ని సాధించేందుకు వీలుగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు వేగంగా తమ యూనిట్లను గ్రౌండ్ చేసేందుకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటోంది.

ఎంఎస్ఎంఈ సదస్సులో 36 ఎంఓయూలు

- విశాఖలో ముగిసిన రెండు రోజుల సదస్సు

విశాఖపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల(ఎంఎస్ఎంఈ) ఎగుమతుల అభివృద్ధి సదస్సు-2025లో వివిధ సంస్థల మధ్య 36 అవగాహన ఒప్పందాలు కుదిరాయని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ టి.శివశంకరరావు వెల్లడించారు. విశాఖ మారియట్ హోటల్‌లో ఆదివారం ప్రారంభించిన రెండ్రోజుల సదస్సు సోమవారం సాయంత్రం ముగిసింది. శివశంకరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ మార్కెటింగ్ ఎలా చేసుకోవాలో పలువురికి అవగాహన కలగడంతోపాటు వ్యాపార సంబంధాలు ఏర్పడ్డాయని చెప్పారు. 171 బీటుబీ చర్చలు జరిగాయన్నారు. వ్యవసాయం, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమోటివ్, ఫార్మా, బయోటెక్, గార్మెంట్స్, ఇంజనీరింగ్, ఐటీ, రెన్యూవబుల్ ఎనర్జీ తదితర రంగాల్లో ఒప్పందాలు జరిగాయని తెలిపారు. కోస్టారికా, ఈజిప్ట్, హంగేరి, కెన్యా, నేపాల్, న్యూజిలాండ్, రష్యా, శ్రీలంక, టాంజానియా, టోగో, ఉగాండా, జింబాబ్వే నుంచి 35 మంది అంతర్జాతీయ కొనుగోలుదారులు హాజరు కాగా, వారిలో 60% మంది తొలిసారి ఎగుమతి చేస్తున్నవారేనని చెప్పారు. మహిళల నేతృత్వంలో పనిచేస్తున్న సంస్థలు 22% ఉన్నాయన్నారు. 3నెలల కృషి వల్ల ఈ సదస్సు విజయవంతమైందని ఇండియన్ ఎస్ఎంఈ ఫోరం అధ్యక్షుడు వినోద్‌కుమార్ అన్నారు.



సదస్సుకు హాజరైన ఎంఎస్ఎంఈ ప్రతినిధులు, అంతర్జాతీయ కొనుగోలుదారులతో కార్పొరేషన్ చైర్మన్ శివశంకరావు

నేడు ప్రకాశంలో సీఎం పర్యటన ఇలా..

ఒంగోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు మంగళవారం ఉదయం 10.30 గంటలకు ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గం పీసీపల్లి మండలం జి.లింగన్నపాలెం చేరుకుంటారు. అక్కడ అభివృద్ధి చేసిన ఎంఎస్ఎంఈ పార్కును ప్రారంభించనున్నారు. పైలాన్ ఆవిష్కరణ తర్వాత ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతో ముఖాముఖి నిర్వహిస్తారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు. తిరిగి 12.30 గంటలకు బయలుదేరి వెళ్తారు. కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో సీఎం పర్యటన ఏర్పాట్లు సాగుతున్నాయి.

దేశభక్తితో దేశాభివృద్ధి

- నాడు నలిగిపోతున్న జాతిని వందేమాతరం మేల్కొల్పింది: సీఎం



వందేమాతరం ఆలాపన సమయంలో నిల్చున్న సీఎం చంద్రబాబు తదితరులు

విజయవాడ సిటీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): దేశభక్తి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుందని, జాతీయ గేయమైన వందేమాతరం స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశభక్తితో మెలగాలని సీఎం చంద్రబాబు సూచించారు. సోమవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన వందేమాతర గేయం 150 వసంతాల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బ్రిటిష్ పాలనలో నలిగిపోతున్న జాతిని వందేమాతరం మేల్కొలిపిందని ఈ సందర్భంగా చెప్పారు. '1875 నవంబరు 7వ తేదీన బెంగాల్‌లోని గంటలపారా అనే చిన్న గ్రామంలో పుట్టిన ఈ గేయం భారత జాతిని ఐక్యం చేసింది. బ్రిటిష్ పాలనలో ప్రజలు అణచివేత, భానిసత్వం, నిరాశ, నిస్పృహల్లో ఉన్న సమయంలో బంకిం చంద్ర ఛటర్జీ తన కలం ద్వారా దేశాన్ని జాగృతం చేశారు. బ్రిటిష్ పాలకులు దీనిని నిషేధించడంతో పాటు ఎంతో మంది ఉద్యమకారులను అరెస్టు చేశారు. తూటాలు పేల్చారు. అయినప్పటికీ పలువురు యోధులు మరణించే చివరి క్షణాల్లో కూడా వందేమాతరం అంటూ ప్రాణాలు విడిచారు. 1907లో బిపిన్ చంద్రపాల్ తెలుగు నేలపై ఈ గేయాన్ని పాడారు. ఆ సమయంలో గాదిచర్ల హరిసర్వోత్తమరావు రాజమండ్రిలో పెద్ద ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ నెల 7 నుంచి 2026 నవంబరు 7 వరకు ఏడాది పాటు వందేమాతర ఉత్సవాలను జరుపుకొంటున్నాం. మొత్తం 4దశలుగా నిర్వహిస్తాం. మొదటి దశను నవంబరు 7-14 వరకు ప్రారంభ వారోత్సవంగా.. రెండో దశ 2026 జనవరి 19-26 వరకు గణతంత్ర వేడుకలుగా, మూడో దశ ఆగస్టు 7-15 వరకు హర్‌ఘర్ తిరంగా వారోత్సవాలుగా, నాలుగో దశ నవంబరు 1- 7 వరకు ముగింపు వారోత్సవంగా జరుపుతాం' అని చెప్పారు.

ఎమ్మెల్యేల పెత్తనం పెరిగిపోతోంది!

(మొదటి పేజీ తరువాయి)

> ఏ పార్టీ ఎమ్మెల్యే తప్పు చేసినా జిల్లా ఇన్‌చార్జి మంత్రులు గట్టిగా వ్యవహరించి సరిచేయాలి. వారు వినకుంటే నా దృష్టికి తీసుకురావాలి.
> - సీఎం చంద్రబాబు

> భూవివాదాల్లో ఇరు పక్షాలు రాజీకి సిద్ధంగా ఉన్నా,, కొందరు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుంటుండడంతో అవి పరిష్కారం కావడం లేదు. నేను స్వయంగా ఓ ఎమ్మెల్యేను హెచ్చరించాను. అయినా ప్రయోజనం లేదు.
> - పవన్ కల్యాణ్

ఎమ్మెల్యేలు వేలు పెడుతున్నారని పవన్ కల్యాణ్ ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంలో ఎమ్మెల్యేలందరినీ ముఖ్యమంత్రి గట్టిగా హెచ్చరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎర్రచందనం అక్రమ రవాణా, ఆక్రమణలు కూడా చాలా తీవ్రమైన అంశమని, ఆయన ఆక్రమణలను స్వయంగా వీడియో తీశానని, త్వరలోనే విడుదల చేస్తానని తెలిపారు. సీఎం మాట్లాడుతూ.. కూటమి ఎమ్మెల్యేలు ఎవరైనా తప్పు చేస్తుంటే ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకుని చక్కదిద్దాలని సూచించారు. రెవెన్యూ సమస్యల పరిష్కారమే ఎజెండాగా వారు పనిచేయాలని కోరారు. అనంతపురంలో రెవెన్యూ సమస్యల పరిష్కారంలో భిన్నంగా ముందుకెళ్లామని ఆర్థిక మంత్రి పయ్యావుల క్యాబినెట్ దృష్టికి తీసుకొచ్చారు. కలెక్టర్, ఆర్డీవోలు, ఇతర రెవెన్యూ అధికారులందరినీ కూర్చోబెట్టి 22ఏ లాంటి సుమారు 400 సమస్యలను పరిష్కరించామని ఆయన చెప్పగా.. ఇలాంటివాటిని ఆదర్శంగా తీసుకుని మంత్రులందరూ పనిచేయాలని సీఎం సూచించారు. ఎర్రచందనం విషయంలో క్షేత్రస్థాయిలో పర్యటించి పవన్ కల్యాణ్ బాగా చేస్తున్నారని అభినందించారు.

ఇళ్ల స్థలాలు అందరికీ దక్కాలి

పేదలందరికీ ఇళ్లు కల్పించే విషయంలో మంత్రులు, ఎమ్మెల్యేలు బాధ్యత తీసుకోవాలని సీఎం కోరారు. నివాస స్థలం లేని వారందరి జాబితా రూపొందించి అందరికీ ఇళ్ల స్థలాలు దక్కేలా చూడాలన్నారు. ఏడాదిలోగా నివాస స్థలం లేని వారికి లబ్ధి చేకూరేలా ప్రభుత్వ చర్యలు ఉండాలన్నారు. ప్రభుత్వం చేసే మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో మంత్రులతోపాటు ఎమ్మెల్యేలు కూడా బాధ్యత తీసుకునేలా ఇన్‌చార్జి మంత్రులు చొరవ చూపాలని సూచించారు.

మనం ఏం చేస్తున్నామో యువతకు తెలియాలి

విశాఖ భాగస్వామ్య సదస్సు ద్వారా యువతకు మనం ఏం చేస్తున్నామో తెలియాలని చంద్రబాబు అన్నారు. 'రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చేందుకు ఎంత కష్టపడుతున్నాం.. ఎన్ని ఉద్యోగాలు వస్తాయనేది హైస్కూల్ స్థాయి పిల్లలకూ తెలియాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. యువత భవిష్యత్‌కు మనమేం చేస్తున్నామో వారికి తెలియాల్సిన అవసరం ఉంది' అని పేర్కొన్నారు.

పార్టీ ఆఫీసులు కట్టుకోవాలి..

జనసేన కార్యాలయాలకు ప్రభుత్వ స్థలాలివ్వాలని మంత్రి కందుల దుర్గేశ్ కోరగా.. అది పాలసీ మేటర్ అని ఆ పార్టీకే చెందిన మరో మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పారు. సీఎం స్పందిస్తూ.. పార్టీ కార్యాలయాలు ఏర్పాటు చేసుకోవలసిందేనన్నారు. సుదీర్ఘ కాలంగా రాజకీయాల్లో ఉన్నా.. అన్ని జిల్లాల్లో పార్టీ కార్యాలయాలు కట్టేందుకు తనకు 45 ఏళ్లు పట్టిందని చెప్పారు. ఈ విషయంలో బీజేపీ వాళ్లను అభినందించాలన్నారు. అన్ని జిల్లాల్లో కార్యాలయాలు ఏర్పాటు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు.

తుఫాన్‌లో బాగా పనిచేశారు..

మొంథా తుఫాన్ సమయంలో బాగా పనిచేశారని మంత్రులను సీఎం ప్రత్యేకంగా అభినందించారు. ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో ఉండి.. బాధితులకు తక్షణ సాయం అందేలా చూశారని.. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు అధికార యంత్రాంగం పూర్తి సమన్వయంతో పనిచేయడం వల్లే సహాయ చర్యలు వేగంగా అందాయని తెలిపారు. ఆర్టీజీఎస్ నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ.. టెక్నాలజీ సాయంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించగలిగామన్నారు. మంత్రులు, అధికారులు టీమ్ స్పిరిట్‌తో పనిచేస్తే ఇటువంటి మంచి ఫలితాలే వస్తాయని చెప్పారు. జిల్లాస్థాయిలో సమీక్ష సమావేశాలు కచ్చితంగా నిర్వహించాలని ఇన్‌చార్జి మంత్రులకు స్పష్టంచేశారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్ నిర్వహించాలని.. ప్రతి మంత్రీ నెలకోసారి పార్టీ కార్యాలయానికి రావాలని సీఎం సూచించారు.

జూనియర్లకు సీనియర్ల అవగాహన

మంత్రివర్గ సమావేశానికి ముందు ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో టీడీపీ మంత్రులతో మంత్రి లోకేశ్ అల్పాహార సమావేశం నిర్వహించారు. తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలకు సీనియర్ ఎమ్మెల్యేలు, నేతలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని ఆయన ఈ సందర్భంగా అన్నారు. 'సీనియర్ ఎమ్మెల్యేలు కొత్తలో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారు.. వాటిని ఎలా అధిగమించి, ఈ స్థాయికి వచ్చారో వారికి చెప్పాలని సూచించారు. 14, 15 తేదీల్లో విశాఖ వేదికగా జరిగే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సును కలిసికట్టుగా విజయవంతం చేద్దామని మంత్రులకు చెప్పారు. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, వీటి ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ప్రతి మంత్రీ తమ తమ శాఖల పరిధిలోని ఒప్పందాలకు సంబంధించి బాధ్యతతో వ్యవహరించాలని.. రేపు ఎంఎస్ఎంఈ పార్కుల ప్రారంభ కార్యక్రమంలో విధిగా పాల్గొనాలని కోరారు. తమ తమ జిల్లాల పరిధిలో సంస్థలు గ్రౌండ యేలా మంత్రులు, ఇన్‌చార్జి మంత్రులు బాధ్యత తీసుకోవాలని, ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పన హామీని త్వరగా నెరవేరుద్దామని లోకేశ్ వ్యాఖ్యానించారు.

ఆర్డీటీ సేవలు యథాతథం!

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న లోకేశ్

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): లక్షలాది పేదల బతుకుల్లో వెలుగు నింపిన ఆశా కిరణం ఆర్డీటీ(రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్) సేవలు యథాతథంగా కొనసాగేందుకు మార్గం సుగమమైంది. పాదయాత్రలో ఆర్డీటీ సేవలను పరిశీలించిన లోకేశ్, సంస్థ ప్రజలకు అందిస్తున్న సేవలు అద్భుతమని ప్రశంసించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయంతో ఆర్డీటీ వంటి మానవతా సంస్థకు తాత్కాలికంగా ఎదురైన ఇబ్బందులను పరిష్కరించే బాధ్యత తనదని, ఆర్డీటీ నిర్వాహకుడు మాంఛో ఫెర్రర్‌కు లోకేశ్ మాటిచ్చారు. ఆ మేరకు కేంద్రంతో మాట్లాడి ఆర్డీటీ ఎఫ్‌సీఆర్ఏ లైసెన్సు పునరుద్ధరించేందుకు ఉన్న అడ్డంకులన్నింటినీ తొలగించారు. ఒకటి రెండు రోజుల్లో ఆర్డీటీ కార్యకలాపాలకు ఏర్పడిన ఇబ్బందులన్నీ తొలగిపోనున్నాయి. కేంద్రంతో మాట్లాడి సమస్య పరిష్కరించిన లోకేశ్‌కు సంస్థ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

పండుగ వాతావరణంలో ప్రమాణాలు: పల్లా

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం నుంచి జరగనున్న టీడీపీ సంస్థాగత కమిటీల ప్రమాణస్వీకారాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పార్టీ శ్రేణులను ఆదేశించారు. సోమవారం పార్టీ ముఖ్య నేతలతో ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ.. మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే మండల, క్లస్టర్, యూనిట్, గ్రామ, బూత్ కమిటీల ప్రమాణస్వీకార కార్యక్రమాలను ప్రతి నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయిలో బాగా నిర్వహించాలన్నారు. కొత్తగా నియమితులైన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు.

వైవీ బ్యాంకు వివరాలు ఎందుకు ఇవ్వరు?: పట్టాభి

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రసాయనాలతో తయారు చేసిన నెయ్యిని శ్రీవారి ప్రసాదంలో ఉపయోగించి ఇంకా సమర్థించుకుంటారా? అని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ వైసీపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ధనదాహంతో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో అపవిత్రం చేశారని తెలిసి కోట్లాది మంది భక్తులు బాధపడ్డారని తెలిపారు. ఈ ఉదంతంలో వైవీ సుబ్బారెడ్డికి కమీషన్లు ముట్టింది వాస్తవమన్నారు. ఆయన సచ్ఛీలుడైతే తన బ్యాంకు ఖాతాల వివరాలను సిట్‌కు ఇవ్వకుండా ఎందుకు కోర్టును ఆశ్రయించారని ప్రశ్నించారు.

సీఎం కృషి విశాఖలో ఆవిష్కృతం: నీలాయపాలెం

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రజల దశదిశను మార్చేందుకు 17 నెలలుగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేసిన కృషి ఈ నెల 14, 15 తేదీల్లో విశాఖలో ఆవిష్కృతం కానుందని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు చైర్మన్ నీలాయపాలెం విజయ కుమార్ సోమవారం చెప్పారు.

భోలేబాబా మాయ!

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్న 'సిట్'... కీలక నిందితుడు అజయ్ కుమార్ సుగంధ్ (ఏ16)ను అరెస్టు చేసింది. సోమవారం నెల్లూరు ఏసీబీ కోర్టులో ఆయనను హాజరుపరిచింది. ఈ సందర్భంగా కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో అనేక కీలక అంశాలను పొందుపరిచింది. దీని ప్రకారం...

జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానానికి (టీటీడీ) ఆవు నెయ్యి సరఫరా చేసే కాంట్రాక్ట్‌లో భారీ గోల్‌మాల్‌లు జరిగాయి. సొంతంగా డెయిరీ ఉండి, పాలసేకరణ, నెయ్యి, వెన్న తయారీలో సుదీర్ఘ అనుభవమున్న కంపెనీలకు మాత్రమే ఈ టెండర్‌లో పాల్గొనే అర్హత ఉంటుంది. కానీ... జగన్ సర్కారు కాలంలో ఇవేవీ పట్టించుకోలేదు. శ్రీవైష్ణవీ డెయిరీ (పెనుబాక), ఏఆర్ డెయిరీ ఫుడ్స్ (దిండుగల్)తో పాటు పలు సంస్థలు టెండర్లు దక్కించుకున్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ కూడా ఈ జాబితాలో ఉంది. విచిత్రమేమిటంటే... భోలేబాబా డెయిరీ ఒక్క పాల చుక్క కూడా సేకరించలేదు. వెన్నా తియ్యలేదు. అయినా... టన్నుల కొద్దీ నెయ్యిని తయారు చేసింది. టీటీడీకి సరఫరా చేసింది. అంతేకాదు... ఇదే కేసులో కుట్రదారులైన ఏఆర్ డెయిరీ, శ్రీవైష్ణవీ డెయిరీ తదితర సంస్థలూ భోలేబాబా నుంచి వచ్చిన కల్తీ నెయ్యినే టీటీడీకి పంపించాయి.

అంతా కల్తీ...

యూపీలోని భగవాన్‌పూర్‌లో ఉన్న భోలేబాబా ఆర్గానిక్ డెయిరీ యజమానులే... అక్కడికి సమీపంలో 'హర్ష్ ఫ్రెష్' పేరుతో మరో డెయిరీ ఏర్పాటు చేశారు. పోనీ... ఆ సంస్థైనా పాలు సేకరించిందా అంటే అదీలేదు. అది చేసిన పనల్లా పాలకు బదులు పామోలిన్ ఆయిల్, పామ్ కెర్నెల్ ఆయిల్, ఇతర రసాయనాలను సేకరించడమే! ఢిల్లీ కేంద్రంగా ఉన్న బడ్జెన్ అండ్ బడ్జెన్ అనే కంపెనీతోపాటు... అజయ్ కుమార్ సుగంధ్‌కు చెందిన 'సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్', ఇతర సంస్థల నుంచి వీటిని కొనుగోలు చేశారు. మోనో గ్లిసరైడ్స్, ఎసిటిక్ యాసిడ్ ఈస్టర్, ల్యాక్టిక్ యాసిడ్, కృత్రిమంగా నెయ్యి వాసన తెప్పించే రసాయనాలు (ఘీ ఎసెన్స్) వంటివి ఢిల్లీ నుంచి తొలుత హర్ష్ ఫ్రెష్ డైరీకి చేరాయి. అక్కడి నుంచి... భోలేబాబా ఆర్గానిక్ డెయిరీకి తరలించారు. వీటిని కలిపేసి కల్తీ నెయ్యిని తయారు చేసి... టీటీడీకి నిరాటంకంగా సరఫరా చేశారు. టీటీడీ అంచనా ప్రకారం... ఏకంగా 68 లక్షల కిలోల కల్తీ నెయ్యిని భోలేబాబా డెయిరీ తయారు చేసింది. ఈ కల్తీ నెయ్యి విలువ నికరంగా రూ.250 కోట్లు! ఇందులో 137 కోట్ల విలువైన 37.38 లక్షల కిలోల కల్తీ నెయ్యిని భోలే బాబా సంస్థ శ్రీ వైష్ణవీ డెయిరీ స్పెషాలిటీస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ6)కు పంపింది. అదే నెయ్యిని శ్రీ వైష్ణవీ డెయిరీ టీటీడీకి సరఫరా చేసింది. భోలేబాబా పక్క కల్తీ నెయ్యిని తయారు చేయగా... అక్కడి నుంచి వచ్చిన అదే కల్తీ నెయ్యిని శ్రీవైష్ణవీ డెయిరీ, ఏఆర్ డెయిరీ ఫుడ్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏ1)లు టీటీడీకి పంపించాయి. ఆ కల్తీ నెయ్యినే పవిత్రమైన శ్రీవారి ప్రసాదాల తయారీకి వినియోగించారు.

నాడు కుట్ర అని గగ్గోలు

జగన్ హయాంలో తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేసినట్టు 2024 సెప్టెంబరులోనే కూటమి ప్రభుత్వం చెప్పింది. దీంతో... అప్పుడే వైసీపీ 'రివర్స్ డ్రామా' మొదలుపెట్టింది. చంద్రబాబు దేవుడితో రాజకీయాలు ఆడుతున్నారని, జగన్‌ను పాపుగా చేయాలనుకుంటున్నారని వైసీపీ నేతలు, వారి అనుకూల నీలి మీడియా గగ్గోలు పెట్టింది. నాడు కూటమి ప్రభుత్వం చెప్పింది నిజమని ఇప్పుడు రుజువైంది. సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఈ కేసును దర్యాప్తు చేస్తున్న... సీబీఐ భాగస్వామిగా ఉన్న 'సిట్' ఈ సంగతి తేల్చింది. దీంతో... నిజాన్ని ఒప్పుకోలేక, సీబీఐని విమర్శించలేక మళ్లీ రాజకీయ కుట్రలు అంటూ జగన్ రోత మీడియా రకరకాల విన్యాసాలు చేస్తోంది. సోమవారం గంటల కొద్దీ డ్రామాలు నడిపింది. నిజానికి... కల్తీ నెయ్యి గుట్టును రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని పోలీసులే నిగ్గు తేల్చారు. అయితే... అప్పటి 'సిట్' చంద్రబాబు చేతిలో కీలుబొమ్మ అని, ఆయన కోరుకున్నట్లుగానే విచారణ నివేదిక ఉంటుందని తప్పుడు ప్రచా రం చేశారు. దీనిపై సుప్రీం కోర్టుదాకా వెళ్లారు. దీంతో... రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్‌లో సీబీఐని కూడా భాగస్వామిని చేస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఇదేదో సీఎంకు, కూటమి ప్రభుత్వానికి భారీ ఎదురు దెబ్బలా జగన్ మీడియా రచ్చ చేసింది. "టీటీడీకి పంపిన నెయ్యిలో కల్తీ జరిగిందా... లేదా? లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వాడారా... లేదా?" అనే రెండు మౌలిక ప్రశ్నలపై సిట్ దృష్టి సారించింది. జగన్ బాబాయ్, నాటి టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి తీరు కూడా అనుమానాస్పదమే అని సీబీఐ భాగస్వామిగా ఉన్న 'సిట్' తేల్చింది. ఆయన పీఏగా వ్యవహరించిన చిన్న అప్పన్న నేరుగా రంగంలోకి దిగి... భోలేబాబాతో 'డీల్స్' మాట్లాడినట్లు కూడా తేలింది. వివరాలన్నింటినీ 'సిట్' స్వయంగా కోర్టుకు సమర్పించింది. ఆ విషయాలను జగన్ రోత మీడియా దాచిపెట్టి... వాస్తవాలకు వక్రీకరణలు జోడిస్తూ వచ్చింది. ఇప్పుడు ఏ16 అజయ్ కుమార్ సుగంధ్ అరెస్టుతో మరిన్ని సంచలన నిజాలు బయటకొచ్చాయి. నెల్లూరు కోర్టు ముందుకు ఏ16 రిమాండ్ రిపోర్టు రాకముందే... 'అసలు కల్తీ నెయ్యే లేదు" అని రోత మీడియాలో సీరియల్ నడిపారు. రిమాండ్ రిపో ర్టు వెలుగులోకి వచ్చాక... 'నెయ్యిలో కల్తీ జరిగింది కానీ, దానిని తిరుమలలో వాడలేదు' అంటూ నాలుక మడతేశారు.

ఎవరీ అజయ్ కుమార్?

కల్తీ నెయ్యి కేసులో ఏ16... అజయ్ కుమార్ సుగంధ్! ఢిల్లీకి చెందిన 'సుగంధ్ ఆయిల్స్ అండ్ కెమికల్స్' యజమాని. భోలేబాబా యజమానులతో అజయ్ కుమార్ కుమ్మక్కై... కల్తీ నెయ్యి తయారీకి అవసరమైన రసాయనాలను సరఫరా చేశారు. ఢిల్లీలోని 'సుగంధ్ కెమికల్స్' గోదాముల్లో 'సిట్' అధికారులు తనిఖీలు జరిపారు. కొరియా నుంచి దిగుమతి చేసుకున్న మోనో గ్లిజరైడ్‌ను, ఇతర రసాయనాలను గుర్తించారు. ఎలాంటి లేబుల్స్‌లేని నీలిరంగు డ్రమ్ముల్లో (200 కిలోల చొప్పున) నింపి... సరఫరా చేశారు. 2022-23 నుంచే ఈ లావాదేవీలు జరిగాయి. సుగంధ్ ఆయిల్ అండ్ కెమికల్స్ నుంచి తమకు సరఫరాలు జరిగినట్లు భోలేబాబా డెయిరీ ఉద్యోగులు కూడా అంగీకరించారు. పామాయిల్, కొబ్బరినూనె, కెర్నల్ ఆయిల్ పేరుతో ఇన్వాయిస్‌లు సృష్టించి... రసాయనాలు పంపినట్లు తేలింది. అయితే... అజయ్ కుమార్ సుగంధ్‌ను ఈనెల 7న సిట్ అధికారులు అరెస్టు చేశారు. విచారణలో ఆయన తమకు సహకరించలేదని... మొబైల్ ఫోన్, ల్యాప్‌టాప్ ఎలక్ట్రానిక్ పరికరాలు పరిశీలించేందుకు అంగీకరించలేదని సిట్ వెల్లడించింది.

అటవీ సిబ్బంది భద్రతకు 'సంజీవని': పవన్



అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): "అడవుల్ని రక్షించేందుకు కృషి చేస్తున్న అటవీ సిబ్బంది ప్రతిఒక్కరికీ అండగా నిలుస్తాం. వారికి భద్రత కల్పించేందుకు ప్రభుత్వం 'సంజీవని' ద్వారా అవసరమైన చర్యలు చేపడుతుంది" అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రకటించారు. సోమవారం రాష్ట్ర అటవీ అమర వీరుల దినోత్సవం సందర్భంగా ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'అటవీ సంపదను, వన్య ప్రాణులను రక్షించే క్రమంలో విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన అమర వీరులందరికీ నివాళులు అర్పిస్తున్నా. ప్రతి అమర వీరుని వెనుక ఒక కుటుంబం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాల పక్షాన నిలిచి, వారి సంక్షేమం కోసం కృషి చేస్తుంది' అని పవన్ పేర్కొన్నారు.

సీఎంకు బార్ కౌన్సిల్ కృతజ్ఞతలు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా చనిపోయిన 1150 మంది న్యాయవాదుల కుటుంబాలను ఆదుకునేందుకు ఒక్కో కుటుంబానికి రూ.4లక్షల చొప్పున ప్రభుత్వం రూ.46కోట్లు మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయడంపై ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ నల్లారి ద్వారకానాథ్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో సొమ్ము విడుదల చేసినందుకు న్యాయవాదులు, బార్ కౌన్సిల్ తరఫున సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్‌పై విచారణ వాయిదా

న్యూఢిల్లీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ నాయకుల హత్య కేసులో వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకటరామిరెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణను సుప్రీం కోర్టు మరోసారి వాయిదా వేసింది. ఏపీ ప్రభుత్వం నుంచి తగిన సూచనలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నందున వాయిదా వేయాలని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా విజ్ఞప్తి చేశారు. ఆ విన్నపాన్ని పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అప్పటి వరకు పిన్నెల్లి సోదరులకు గతంలో కల్పించిన మధ్యంతర రక్షణ కొనసాగుతుందని తెలిపింది. సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

రబీ పంటల బీమాకు 44 కోట్లు విడుదల

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద ఈ ఏడాది రబీ సీజన్‌లో పంటల బీమాను సకాలంలో అమలుచేయడానికి ప్రభుత్వం రూ.44.06 కోట్ల విడుదలకు అనుమతించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీఅయ్యాయి. ఎస్క్రో ఖాతాలో జమ చేయాల్సిన ముందస్తు ప్రీమియం సబ్సిడీలో 50 శాతానికి ఈ మొత్తం సమానమని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, విజయవాడలో మార్కెటింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరుగా పనిచేస్తున్న వై.శ్రీనివాసరావుకు తాత్కాలిక పదోన్నతి కల్పించి, సెంట్రల్ మార్కెట్ ఫండ్ సర్వీస్ కింద ఉన్న గుంటూరు మార్కెటింగ్ శాఖ డైరెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీఅయ్యాయి.

మీడియా రిలేషన్స్ పోర్టల్ ప్రారంభం

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు రెండేళ్ల కాలపరిమితితో కూడిన అక్రిడిటేషన్లు జారీచేసేందుకు సంబంధించిన మీడియా రిలేషన్స్ పోర్టల్‌ను సోమవారం అమరావతి సచివాలయంలో మంత్రి కొలుసు పార్థసారథి లాంఛనంగా ప్రారంభించారు. ఈ మేరకు సచివాలయంలోని ప్రచార విభాగంలో జరిగిన మీడియా సమావేశంలో వెబ్‌సైట్‌ను సమాచార శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్‌తో కలసి ప్రారంభించారు. గతంలో జారీ చేసిన జర్నలిస్టుల అక్రిడిటేషన్ల గడువు ఈ నెల 30తో ముగియనున్న నేపథ్యంలో వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్లకై అర్హులైన మీడియా ప్రతినిధులు అందరూ ఈ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు విధివిధానాలను మంగళవారం తెలియజేస్తామని చెప్పారు.

ఐటీ సంస్థలకు 125 కోట్ల రాయితీలు విడుదల

విశాఖపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీ కంపెనీలకు ఇవ్వాల్సిన రాయితీ బకాయిలు రూ.125 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. ఈమేరకు ఏపీడీటీఐ నెట్‌వర్క్ చైర్మన్ శ్రీధర్ కొసరాజు సోమవారం తెలిపారు. గతంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటి నుంచి కొన్ని బకాయిలు ఉండిపోయాయి. వైసీపీ ప్రభుత్వం వాటిని చెల్లించలేదు. ఆ పార్టీకి చెందిన సానుభూతిపరులకు మాత్రమే ఇచ్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక వాటిపై దృష్టి పెట్టి సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసిన వాటిలో రూ.125 కోట్లు విడుదల చేసింది.

సునీత పిటిషన్‌పై విచారణ 13కు వాయిదా

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతుగా దర్యాప్తు చేయాలంటూ ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది. నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టులో గత నెల 22న ఆమె వేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరగాల్సి ఉండగా.. న్యాయస్థానం గురువారాని(13వ తేదీ)కి వాయిదా వేసింది. మరోవైపు ప్రధాన కేసులో.. ఏ-8గా ఉన్న కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి, అప్రూవర్‌గా మారిన ఏ-4 దస్తగిరి తప్ప మిగిలిన నిందితులందరూ సోమవారం కోర్టుకు హాజరయ్యారు.

జగన్ మెమోపై నేడు విచారణ

హైదరాబాద్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): అక్రమాస్తుల కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న మాజీ సీఎం వైఎస్ జగన్ భవిష్యత్‌లో ఎలాంటి విదేశీ పర్యటనలకు వెళ్లకుండా ఆదేశాలివ్వాలని సీబీఐ వేసిన పిటిషన్‌పై నాంపల్లి సీబీఐ ప్రత్యేక కోర్టులో సోమవారం విచారణ జరిగింది. ఈనెల 14వ తేదీలోపు జగన్ వ్యక్తిగతంగా కోర్టులో హాజరు కావాలని గతంలో న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై ఆయన మెమో దాఖలు చేయడం తెలిసిందే. తాను వ్యక్తిగతంగా కోర్టుకు హాజరైతే రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాల్సి వస్తుందని, ఆన్‌లైన్‌లో హాజరవుతానని అందులో విజ్ఞప్తిచేశారు. దీనిపై కౌంటర్ వేయాలని సీబీఐని కోర్టు ఆదేశించింది. ఆయన మెమోపై మంగళవారం మరోసారి విచారణ జరుగనుంది.

కి'లేడీ' కస్టడీ పిటిషన్ నేటికి వాయిదా

విజయవాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలిప్పిస్తానని చెప్పి విజయవాడకు చెందిన వృద్ధుడి దగ్గర నుంచి రూ.లక్షలు వసూలు చేసిన కి'లేడీ' నిడిగుంట అరుణ కస్టడీ పిటిషన్‌ను ఒకటో ఏసీఎంఎం కోర్టు మంగళవారానికి వాయిదా వేసింది. సోమవారం జరిగిన విచారణకు ఆమె తరఫున న్యాయవాది హాజరై వాదనలను రాతపూర్వకంగా తెలియజేస్తానని చెప్పారు. దీంతో కోర్టు మంగళవారానికి విచారణను వాయిదా వేసింది. అరుణను విచారించడానికి రెండు రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సూర్యారావుపేట పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

ఏసీబీ పేరుతో డబ్బులు డిమాండ్

- నకిలీలపట్ల జాగ్రత్త: అవినీతి నిరోధక శాఖ

విజయవాడ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ఏసీబీ అధికారులం అంటూ కొందరు నకిలీలు ప్రభుత్వ ఉద్యోగులకు ఫోన్లు చేస్తున్నారు. ఏసీబీ రైడ్ జరగబోతుంది. దాడి జరగకుండా ఉండాలంటే తాము చెప్పే ఫోన్ నంబరుకు డబ్బులు పంపించాలి అని డిమాండ్ చేస్తున్నారు. అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలి' అని ఏపీ అవినీతి నిరోధక శాఖ ప్రజా పౌరసంబంధాల అధికారి సోమవారం తెలిపారు. ఇటువంటి ఫేక్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులకు లేదా ఏసీబీ టోల్ ఫ్రీ నంబరు 1064కు తెలియపరచాలని తెలిపారు.

సీఎం, డిప్యూటీ సీఎంలపై అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యక్తి అరెస్టు

గుంటూరు కార్పొరేషన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సోషల్‌మీడియాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీసీఎం పవన్ కల్యాణ్‌తో పాటు ఇతరులపై అనుచిత వ్యాఖ్యలు, అసభ్యకర పోస్టులను పెట్టిన వ్యక్తిని గుంటూరు పోలీసులు అరెస్టు చేశారు. గుంటూరు ఈస్ట్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ ఆ వివరాలను సోమవారం తెలిపారు. 'గాలి సతీష్ బాబు అనే వ్యక్తి తన ఎక్స్‌లో అనుచిత వ్యాఖ్యలు పోస్టు చేశారు. దీనిపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఏడాది సెప్టెంబరు 7న కేసు నమోదు చేశాం. నిందితుడు గాలి సతీశ్ బాబును సోమవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నాం' అని తెలిపారు.

క్వాంటమ్ బొనాంజా..!

- రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ ఏర్పాటుకు సానుకూల వాతావరణం కల్పించే దిశగా చర్యలు
- పరిశోధనలు, హార్డ్‌వేర్ పార్కులు, స్టార్టప్‌లకు ప్రోత్సాహం
- ప్రత్యేక క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం



మంత్రి వర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు, అధికారులు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర భవిష్యత్తును మార్చనున్న క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సానుకూల వాతావరణం సృష్టించేలా కీలక ముందడుగు పడింది. క్వాంటమ్ కంప్యూటింగ్‌లో పరిశోధనలు, అధ్యయనాలు, అవగాహన, పాఠ్య ప్రణాళిక, హార్డ్‌వేర్ పార్కుల అభివృద్ధి, స్టార్టప్‌ల ఏర్పాటును ప్రోత్సహించేందుకు వీలుగా ప్రత్యేక క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని క్యాబినెట్ సోమవారం ఆమోద ముద్ర వేసింది. రాజధాని అమరావతి కేంద్రంగా వచ్చే ఏడాది జనవరి 1న క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌ను ప్రారంభించనున్న రాష్ట్ర ప్రభుత్వం... ఆలోగా ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థ ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాలను వేగంగా విస్తరించే దిశగా ఈ చర్యలు చేపట్టింది. ఐబీఎం క్వాంటమ్ సిస్టమ్ త్వరలోనే అమెరికాలోని క్లీవ్‌ల్యాండ్స్ నుంచి రాష్ట్రానికి రానుంది. అమరావతిలో 90 లక్షల చదరపు అడుగుల్లో క్వాంటమ్ హబ్‌ను నిర్మించేలోగా ఐబీఎం క్వాంటమ్ కంప్యూటింగ్‌ను 'విట్' యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన భవంతిలో ఏర్పాటు చేస్తారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ స్థాపనకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం సుమారు 80 వేల మంది పనిచేసేందుకు వీలుగా క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్ (టవర్) నిర్మాణం జరుగుతుంది. అలాగే 100 ఎకరాల్లో క్వాంటమ్ కంప్యూటింగ్ హార్డ్‌వేర్ పార్కును నిర్మిస్తారు. ఈ క్వాంటమ్ వ్యాలీలో ప్రతియేటా క్వాంటమ్ కంప్యూటింగ్ ఈవెంట్లు, క్వాంటమ్ కంప్యూటింగ్‌పై హ్యాకథాన్ నిర్వహిస్తారు. నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేలా అకడమిక్ రిసెర్చ్‌తోపాటు విద్యాసంస్థల్లో బోధించేలా క్వాంటమ్ కంప్యూటింగ్ పాఠ్య ప్రణాళికలను రాష్ట్రమంతా అమలు చేస్తారు. వీటి కోసం కొన్ని ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది.

ఇవీ ప్రోత్సాహకాలు

- క్వాంటమ్ కంప్యూటింగ్ పరిశోధన విభాగంలో ఎంపిక చేసిన స్టార్టప్‌లు, అకడమిక్ ప్రాజెక్టులకు రూ.30 లక్షల దాకా ప్రోత్సాహకాలు అందిస్తారు. లేదా 1:1 మ్యాచింగ్ గ్రాంట్‌ను అందజేస్తారు.
- క్వాంటమ్ కంప్యూటింగ్ సెంటర్లలో పరిశోధనల అభివృద్ధి కోసం సీడ్ ఫండింగ్ కింద రూ.కోటి వరకు అందిస్తారు. మార్కెటింగ్ సపోర్టు కింద క్వాలిటీ షేరింగ్ విధానంలో రూ.5 లక్షల వరకూ ఇస్తారు.
- ఇంటర్వెన్షన్ ఐపీ సపోర్టు కింద 75శాతం రీయింబర్స్‌మెంట్ లేదా దేశీయ సంస్థలకు రూ.4 లక్షల వరకూ, విదేశీ సంస్థలకు రూ.20 లక్షల వరకూ అకడమిక్ రిసెర్చ్ సపోర్టు ఉంటుంది.
- గుర్తింపు పొందిన క్వాంటమ్ కంప్యూటింగ్ వర్క్‌స్టేషన్లకు అద్దె సబ్సిడీ. మార్కెటింగ్ సపోర్టు కింద రూ.10 లక్షల వరకూ రీయింబర్స్ చేస్తారు.
- క్వాంటమ్ హార్డ్‌వేర్ పార్కులు ఏర్పాటు చేసేందుకు సంస్థల సామర్థ్యం, పెట్టుబడి ఆధారంగా భూ కేటాయింపుల్లో రాయితీలు అందిస్తారు.
- ముందుగా ఏర్పాటు చేసే పది హార్డ్‌వేర్ పార్కులకు ఎర్లీబర్డ్ పథకం కింద 50 శాతం క్యాపిటల్ సబ్సిడీని రెండేళ్ల వరకూ అందిస్తారు. ఈ సబ్సిడీ రూ 50 కోట్ల పెట్టుబడి పెట్టిన సంస్థలకు వర్తిస్తుంది. రూ.50కోట్లకు పైగా పెట్టుబడి పెట్టిన సంస్థలకు ఐదేళ్లపాటు 30 శాతం క్యాపిటల్ సబ్సిడీ అందిస్తారు.
- హార్డ్‌వేర్ పార్కుల్లో పనిచేసే పూర్తి నైపుణ్యం కలిగిన ఉద్యోగులకు నెలకు రూ.30,000, సెమీస్కిల్డ్ వారికి రూ.15,000 ఆరు నెలలపాటు రిక్రూట్‌మెంట్ అసిస్టెన్స్ కింద అందిస్తారు. ఐదేళ్లపాటు పన్ను రాయితీ ఉంటుంది. ఐదేళ్ల పాటు విద్యుత్ యూనిట్ ఒక రూపాయికే సరఫరా చేస్తారు. క్వాంటమ్ హార్డ్‌వేర్ పార్కులకు స్టాంప్ డ్యూటీ పూర్తి మినహాయింపు ఉంటుంది.
- రూ.10 కోట్ల పెట్టుబడితో క్వాంటమ్ హార్డ్‌వేర్ పార్కులను స్థాపించే సంస్థలకు వర్క్‌స్టేషన్లలో రూ.10,000 దాకా ఐదేళ్లపాటు రెంటల్ సబ్సిడీ వర్తిస్తుంది.
- ఐటీ హార్డ్‌వేర్‌లో 50శాతం సబ్సిడీ గరిష్ఠంగా రూ.10 కోట్ల దాకా వర్తిస్తుంది. 50 శాతం క్యాపిటల్ సబ్సిడీ, దిగుమతి సుంకంలో రాయితీ రూ.10 కోట్ల దాకా వర్తిస్తుంది. వాణిజ్య పన్నుల్లో రాయితీ రూ.6లక్షల వరకూ ఉంటుంది.

సొంత ఊర్లో ఐటీ ఉద్యోగం..!

- మండలానికో వర్క్‌స్పేస్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
- కనీసం 1000 గజాల్లో 610 మంది పనిచేసేలా సదుపాయాలు
- హైస్పీడ్ ఇంటర్నెట్, వీడియో కాన్ఫరెన్స్ సౌకర్యం
- రాష్ట్రంలో వర్క్‌స్పేస్ పాలసీకి క్యాబినెట్ ఆమోదం

సొంత ఊర్లోనే ఉంటూ ఐటీ ఉద్యోగం చేసుకునేందుకు వీలుగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ 'వర్క్‌స్పేస్' విధానాన్ని తీసుకువచ్చింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి మండల కేంద్రంలోనూ అతితక్కువ వ్యయంతోనే వర్తక, వాణిజ్య లావాదేవీలు చేపట్టేందుకు అనుకూలంగా తీసుకొచ్చిన ఈ పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలోని క్యాబినెట్ సోమవారం ఆమోదముద్ర వేసింది. ఐటీ రంగంలో విశేష అనుభవం ఉన్నా వర్తక, వాణిజ్య వ్యవహారాలకు సంబంధించిన అన్ని సదుపాయాలనూ సమకూర్చుకునే స్థోమత అందరిలోనూ ఉండదు. ప్రత్యేకంగా మారుమూల ప్రాంతాల్లో హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం అందుబాటులో ఉండదు. ఇలాంటి సమస్యలకు పరిష్కారం చూపేలా ప్రతి మండలంలోనూ వర్క్‌స్పేస్ సదుపాయాన్ని కల్పించడం ద్వారా అందరికీ సమానావకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో వర్క్‌స్పేస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా వర్క్‌స్పేస్ సౌకర్యాలు కల్పించేవారికి ప్రత్యేక ప్రోత్సాహకాలిస్తూ రాష్ట్ర ఐటీ శాఖ రూపొందించిన 'వర్క్‌స్పేస్' పాలసీని మంత్రి మండలి ఆమోదించింది.

కనీసం 610 మంది పనిచేసేలా...

మండల స్థాయిలో వర్క్‌స్పేస్ కోసం కనిష్ఠంగా 1000 చదరపు గజాల్లో 610 మంది పనిచేసేలా సదుపాయాలు ఉండాలని ఐటీ శాఖ పాలసీలో పొందుపరిచింది. వీడియో కాన్ఫరెన్స్‌లకు వీలుగా హైస్పీడ్ బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ ఉండాలని, బిజినెస్ సమావేశాల నిర్వహణ కోసం ప్రత్యేక గది, స్కానింగ్, ప్రింటింగ్, లాకర్ సదుపాయాలు ఉండాలని పేర్కొంది. రోజంతా విద్యుత్ సరఫరా ఉండాలని సూచించింది. విద్యార్థులు, నిపుణులకు డిజిటల్ స్కిల్స్ నేర్పేందుకు కావలసిన సదుపాయాలన్నీ ఉండాలని పేర్కొంది. పాలసీలో భాగంగా మండలాల్లో ప్రభుత్వ భవనాల్లో ఏర్పాటుచేసిన వర్క్‌స్పేస్‌లకు నామమాత్రపు అద్దెలో 100 శాతాన్ని ఐదేళ్లపాటు రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ప్రైవేటు భవనాల్లో ఏర్పాటుచేసే వర్క్‌స్పేస్‌లకు ఏటా రూ.6 లక్షలకు మించకుండా 50 శాతం అద్దెను భరిస్తుంది. ఎర్లీ బర్డ్ పాలసీ కింద ముందుగా వచ్చే వారికి పెట్టుబడి రాయితీ రూ.15 లక్షలకు మించకుండా 60 శాతం వరకూ ఇవ్వనుంది. హైస్పీడ్ బ్రాడ్‌బాండ్ కోసం 50 శాతం కనెక్షన్ చార్జీలను చెల్లించనుంది.

ముందు అవగాహన... తర్వాతే చలానా వసూళ్లు

- రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టండి
- తక్షణమే రహదారుల మరమ్మతులు చేపట్టండి
- ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో సంపూర్ణ అవగాహన కల్పించండి. ఆ తరువాతే నిబంధనలు ఉల్లంఘించినవారి నుంచి చలానాలు వసూలు చేయండి' అని పోలీసు అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. వెలగపూడి సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ(ఆర్‌టీజీఎస్) సమీక్షను నిర్వహించారు. 'రవాణ, పోలీస్ యంత్రాంగం రోడ్డు ప్రమాదాల నివారణపై పూర్తి ఫోకస్ పెట్టాలి. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపేవారికి పూర్తి అవగాహన కల్పించాలి. చలానాల పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురి చేయవద్దు. నిబంధనలు ఉల్లఘిస్తున్నారంటూ ముందస్తుగా హెచ్చరికలతో కూడిన మెసేజ్‌లను పంపాలి. వాటిద్వారా ట్రాఫిక్ పోలీసుల దృష్టి తమపై ఉందన్న అభిప్రాయం వాహనదారుల్లో పెరుగుతుంది. మెసేజ్‌లను పంపుతున్నా ఆ వాహనదారుడిలో మార్పు రాకపోతే అప్పుడు ట్రాఫిక్ పోలీసులు చలానాలు వేయాలి' అని సీఎం స్పష్టం చేశారు. భారీ ఎత్తున చలానాలు వేయాలన్న అధికారుల ప్రతిపాదనలను ఆయన నిర్ద్వందంగా తిరస్కరించారు. ఇటీవల కాలంలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండటంపై సీఎం మాట్లాడుతూ... 'ఈ ప్రమాదాలపై అధ్యయనం చేయాలి. ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు చేపట్టాలి. దేవాలయాలు, జనసమ్మర్ద ప్రాంతాల్లో తొక్కిసలాటలు జరగకుండా ముందస్తు నివారణా చర్యలు తీసుకోవాలి. క్రౌడ్ మేనేజ్‌మెంట్‌ను సమర్థవంతంగా అమలు చేయాలి' అని స్పష్టం చేశారు. గుంతల రోడ్డు కనిపించకూడదని రహదారుల శాఖను సీఎం ఆదేశించారు. 'రోడ్లు బాగాలేవన్న ఫీడ్ బ్యాక్ వస్తోంది. రహదారుల మరమ్మతులు యుద్ధప్రాతిపాదికన చేపట్టాలి. ఇదే విధంగా డ్రైనేజీల నిర్వహణ కూడా చేపట్టాలి. వీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో మురుగునీటి కాలువల నుంచి నీరు రోడ్డుపైకి వచ్చేస్తుంది. మునిసిపల్, పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్వహణ లోపం లేకుండా చూసుకోవాలి. డ్రైనేజీలు, నీటి నిర్వహణ, ఉద్యోగ, ఉపాధికల్పన, పంటలకు మద్దతు ధర నా ప్రధాన్యాలు. ప్రభుత్వ ప్రాధామ్యాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి. ప్రభుత్వం అందించే పౌర సేవల్లో అవినీతి మాట వినిపించకూడదు' అని సీఎం స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్, రేషన్, దీపం సిలెండర్ల అమలు తీరుపై సీఎం సమీక్షించారు. గతంతో పోల్చుకుంటే రిజిస్ట్రేషన్ సేవల్లో మెరుగైన మార్పు కనిపిస్తోందన్నారు. సమావేశంలో మంత్రి పార్థసారథి, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.

లక్ష కోట్ల పెట్టుబడులు

(మొదటి పేజీ తరువాయి)

అనేక నూతన విధానాలను రూపొందించిన ఫలితంగా ప్రపంచంలోని అనేక దిగ్గజ సంస్థలు రాష్ట్రం వైపు చూస్తున్నాయని తెలిపారు.

మంత్రివర్గ నిర్ణయాలివీ..

- ఏపీ క్వాంటమ్ కంప్యూటింగ్ విధానం 2025-30కి ఆమోదం. క్యాంటింగ్ కంప్యూటింగ్ సెంటర్ల ఏర్పాటుకు స్టార్టప్‌లు, విద్యా సంస్థలు, తయారీదారులకు ఆర్థిక ప్రోత్సాహకాలకు అంగీకారం. బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడం లక్ష్యం.
- నైబర్‌హుడ్ వర్క్‌స్పేస్ విధానానికి ఆమోదం. ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్ స్టేషన్ల ఏర్పాటుకు నిర్ణయం.
- విశాఖలో రియల్టీ, రహేజా, ఏఎన్ఎస్ఆర్ గ్లోబల్ కార్పొరేషన్, క్యూఎంట్ గ్రిడ్ లిమిటెడ్ తదితర ఐటీ సంస్థలకు భూముల కేటాయింపు.
- రూ.550 కోట్లతో శ్రీసిటీలో పీసీబీఏ, బీఎల్‌డీసీ మోటార్లు, కాపర్ ట్యూబ్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఎస్‌సీఐసీ వెంచర్స్‌కు అనుమతి.
- క్రయాన్ టెక్నాలజీ శ్రీసిటీలో ఏర్పాటుచేస్తున్న ఐటీ ఎన్‌క్లోజర్లు, పీసీబీ బేర్ బోర్డుల తయారీ పరిశ్రమకు ప్రోత్సాహకాలు.
- కుప్పంలో రూ.2081 కోట్ల పెట్టుబడితో యానోడ్ మెటీరియల్ తయారీ సౌకర్యం ఏర్పాటు చేయడానికి ఎన్‌పీఎస్‌పీఎల్ అడ్వాన్స్ మెటీరియల్స్ సంస్థకు అనుమతి. 60 శాతం మూలధన రాయితీ, విద్యుత్ రాయితీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడానికి ఆమోదం.
- కర్నూలు జిల్లా ఓర్వకల్లులో ఇండిచిప్స్ సెమీకండక్టర్స్ లిమిటెడ్‌కు 150 ఎకరాలు.
- ఓర్వకల్లు డ్రోన్ సిటీలో 50 ఎకరాల్లో డెడికేటెడ్ డ్రోన్ పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం.
- ఓర్వకల్లులో రూ.1,090 కోట్లతో సింథటిక్ ఆర్గానిక్ ప్లాంట్ ఏర్పాటు కోసం సిగాచి ఇండస్ట్రియల్ లిమిటెడ్‌కు 100 ఎకరాలు.
- నెల్లూరులో ఫైబర్ సిమెంట్ ప్లాంట్ కోసం బిర్లా లిమిటెడ్‌కు 48.47 ఎకరాలు.
- అనకాపల్లి జిల్లాలో రూ.489 కోట్లతో రక్షణ పరికరాల తయారీ కోసం భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌కు 160 ఎకరాలు.
- ఇదే జిల్లో రూ.1,234 కోట్లతో భారీ భూమి తవ్వే పరికరాలు, విడిభాగాలు తయారీ పరిశ్రమ ఏర్పాటుకు డూస్కో ఇండియాకు 150 ఎకరాలు.
- కృష్ణా జిల్లాలో 40 ఎకరాల ఎంఎస్ఎంపీ పారిశ్రామిక పార్క్‌కు శ్రీవేదా ఇన్నోవేషన్ పార్క్ ప్రైవేట్ లిమిటెడ్‌కు అనుమతి.
- అనంతపురంలో రూ.1,247 కోట్లతో సమీకృత టీఎంటీ బార్ ప్లాంట్ ఏర్పాటుకు సుగుణ స్పాంజ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 308 ఎకరాలు.
- రూ.8,570 కోట్లతో విజయనగరంలో సమీకృత ఉక్కు ప్లాంటు ఏర్పాటుకు సూపర్‌స్మెల్టర్స్ లిమిటెడ్‌కు 1,085 ఎకరాలు.
- కుప్పంలో రూ.898 కోట్లతో తోలుకాని ఫుట్‌వేర్ తయారీ కోసం వ్యాసెంగ్ ఫుట్ వేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 103.19 ఎకరాలు.
- నాయుడుపేట సెజ్‌లో రూ.1,743 కోట్లతో 4జీడబ్ల్యూ సోలార్ సెల్, మాడ్యూల్ తయారీ పరిశ్రమకు వోల్ట్‌సన్ ల్యాబ్స్‌కు 40 ఎకరాలు.
- రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ ఏర్పాటుకు ఏఎం గ్రీన్ మెటల్స్ అండ్ మెటీరియల్స్‌కు అదనంగా 250 ఎకరాలు.
- కంప్రెస్డ్ బయో-గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం పులపత్తూరులో 50 ఎకరాలు, గుండ్లూరులో 100 ఎకరాలు లీజుపై అప్పగింత.
- కృష్ణా జిల్లా మచిలీపట్నం టౌన్ మాచవరం ప్రాంతంలో టీడీపీ జిల్లా కార్యాలయం నిర్మాణానికి 1.60 ఎకరాల ప్రభుత్వ భూమి.
- తిరుపతి అవిలాలలో టీడీపీ కార్యాలయానికి 2 ఎకరాల ప్రభుత్వ భూమి.
- సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు శ్రీసత్యసాయి జిల్లా దిమ్మనాయనిపేట, నందిపాడు, ఇరువరం గ్రామాల్లో 38.10 ఎకరాలు.
- ఈ నెల 14-15 తేదీల్లో విశాఖ భాగస్వామ్య సదస్సులో పర్యావరణ అనుకూల పట్టణ పరిపాలన, డిజిటల్ పరిపాలన మానవనరుల అభివృద్ధి, సుస్థిర ఆర్థికాభివృద్ధి వంటి రంగాల్లో సింగపూర్ ప్రభుత్వంతో అవగాహనా ఒప్పందం కుదుర్చుకునేందుకు ఆమోదం.
- ఉండవల్లి వద్ద మరో పంపింగ్ స్టేషన్ ఏర్పాటుకు ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నుంచి రూ.595 కోట్ల రుణం తీసుకునేందుకు ఆమోదం.
- రాజధాని అమరావతిలో కృష్ణాయపాలెం వెంకటపాలెం, పెనుమాక, ఉండవల్లి జోన్-8 ప్రాంతంలో, పెనుమాక లే అవుట్‌లో ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో అనుసంధానంగా ఉండే 'రోడ్లు, డ్రైనేజీలు, నీటి సరఫరా, మురుగునీరు, విద్యుత్ ఐసీటీ కోసం యుటిలిటీ డక్టులు, రీయూజ్ అవెన్యూ ప్లాంటేషన్' కోసం రూ.1,863.00 కోట్లతో టెండర్లు పిలిచి కాంట్రాక్టు ఇచ్చేందుకు ఆమోదం.
- అమరావతిలోని ఎల్‌పీఎస్ జోన్-4, 9, 12ల అభివృద్ధి కోసం నేషనల్ బ్యాంక్ ఫర్ ఫైనాన్సింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ (న్యాబ్‌ఫిడ్) నుంచి రూ.7,500 కోట్ల రుణం పొందేందుకు సీఆర్‌డీఏ కమిషనర్‌కు అనుమతి.
- ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ కింద బాపట్ల జిల్లా బల్లికురవ మండలం, ఎస్ఎల్ .గుడిపాడు, ముక్తేశ్వరం గ్రామాల్లోని కుందూరు (తూర్పు) గ్రామం, సంతమాగులూరు మండలంలో దాదాపు 1,000 ఎకరాల్లో పునరుత్పాదక ఇంధనం మాన్యుఫాక్చరింగ్ జోన్ ఏర్పాటుకు ఆమోదం.
- రాష్ట్ర ప్రభుత్వ విద్యుత్ యుటిలిటీల నిర్వహణ అవసరాలకు, బొగ్గు కొనుగోలు, విద్యుత్ కొనుగోలు వంటి అవసరాలకు రాష్ట్ర ప్రభుత్వానికి ముందుగా అప్పుగా ఇవ్వడానికి ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు నుంచి టర్మ్ లోన్ పొందేందుకు రూ.1,000 కోట్లకు ప్రభుత్వ గ్యారెంటీ.
- మెగా హ్యాండ్‌లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు ధర్మవరంలోని మార్కెట్ యార్డు ప్రాంగణంలో అద్దెకు 9.84 సెంట్ల ప్రభుత్వ భూమి.
- 2025-26 ఖరీఫ్‌లో ధాన్యం సేకరణకు ప్రభుత్వ గ్యారెంటీ గరిష్ఠ పరిమితి రూ.39 వేల కోట్ల నుంచి రూ.44,000 కోట్లకు పెంపు.

త్వరలో గవర్నర్ ఆమోదానికి అసైన్డ్ ఆర్డినెన్స్!

అసైన్డ్ భూముల వినియోగం విషయంలో మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. సోలార్, విండ్, ఇతర విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల ఏర్పాటుకు అవసరం ఉన్న చోట అసైన్డ్ భూములు కేటాయించేలా ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977 (పీఓటీ యాక్ట్)లో చేపట్టిన కీలక సవరణలకు ఆమోదం తెలిపింది. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాలు జరిగే అవకాశం లేకపోవడంతో దీనిపై ఆర్డినెన్స్ తీసుకురావాలన్న ప్రతిపాదనకు కూడా ఆమోదం తెలిపింది. విద్యుదుత్పత్తి కేంద్రాలకు, ఇతర పారిశ్రామిక అవసరాల కోసం ప్రభుత్వ భూములు కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. అవసరం ఉన్న చోట ప్రైవేటు భూములు సేకరిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో అసైన్డ్ భూములు కూడా తీసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతోంది. అయితే ఇందుకు అసైన్డ్ చట్టం అనుమతించడం లేదని.. వాటిని కూడా సేకరించేందుకు చట్ట నిబంధనలను మార్చి ఆర్డినెన్స్ జారీ చేయాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. మంత్రివర్గం ఆమోదించిన నేపథ్యంలో త్వరలో ఆర్డినెన్స్‌ను గవర్నర్ ఆమోదానికి పంపించనున్నారు.



విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, సీఎస్

విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!

- 'వీఈఆర్' రాష్ట్రానికి గ్రోత్ హబ్‌గా ఉండాలి
- పోర్టుల ద్వారా రవాణా భారీగా పెరగాలి
- ఈ రీజియన్‌లో 15 ఉత్పాదక హబ్‌లకు అవకాశం
- సుమారు 10 లక్షల కోట్ల మేర పెట్టుబడుల అంచనా: సమీక్షలో సీఎం

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న విశాఖ ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్) అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో వచ్చే పెట్టుబడులు, పరిశ్రమలు, ప్రాజెక్టుల కోసం అవసరమైన విధానాలు రూపొందించాలని సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ అభివృద్ధిపై సోమవారం సచివాలయంలో చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీఎస్ కె.విజయానంద్‌తో పాటు ఆర్థిక, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల కల్పన, పర్యాటక, ఐటీ, మున్సిపల్, పరిశ్రమలు, వ్యవసాయ, ప్రణాళికా శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. వీఈఆర్ ప్రాంతాన్ని రాష్ట్రానికి గ్రోత్ హబ్‌గా తీర్చిదిద్దడంపై ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం నుంచి కోనసీమ వరకూ ఉన్న వివిధ జిల్లాలను వీఈఆర్‌గా అభివృద్ధి చేసేందుకు స్థానికంగా ఉన్న ఆర్థిక వ్యవస్థ, పెట్టుబడులు, ప్రజల జీవన ప్రమాణాలు, సుస్థిరాభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకొని ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని సూచించారు. ఏడు అంశాల ఆధారంగా వీఈఆర్ గ్లోబల్ ఎకనమిక్ హబ్‌గా మారుతుందని సీఎం పేర్కొన్నారు. పోర్టుల ద్వారా రవాణాతో పెద్దఎత్తున లావాదేవీలు జరగాల్సి ఉందన్నారు. పోర్టుల నుంచి ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా, మధ్యప్రదేశ్ లాంటి ప్రాంతాలకు చెందిన కార్గోను కూడా రవాణా జరిగేలా చూడాలని సూచించారు. మూలపేట పోర్టు నుంచి దుగరాజపట్నం పోర్టు వరకూ షిప్ బిల్డింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యేలా చర్యలు ఉండాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణాది రాష్ట్రాలను కలుపుతున్న ఏపీ ఇక ఈస్ట్‌వెస్ట్ కారిడార్‌గానూ మారాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. 12-15 ఉత్పాదక హబ్‌లు ఉండేలా వీఈఆర్ రూపాంతరం చెందుతుందన్నారు. ప్రత్యేకించి ఈ రీజియన్‌లో క్లీన్, గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి ప్రాజెక్టులపై దృష్టి సారించాలని సూచించారు. విశాఖ లాంటి ప్రాంతాలు తర్వాతి తరం ఐటీ డేటా సెంటర్, ఏఐ ఇన్నోవేషన్ కేంద్రంగా మారుతున్నాయని.. ఈ రీజియన్‌లోని ఇతర ప్రాంతాలు జాతీయ, అంతర్జాతీయ హెల్త్‌కేర్ హబ్‌గా మార్చాల్సి ఉందన్నారు. అలాగే పట్టణ ప్రాంతాల్లో స్లమ్ క్లస్టర్ అభివృద్ధి కోసం ప్రత్యేక విధానం రూపొందించాలని చంద్రబాబు ఆదేశించారు.

రైల్వేలైన్లతో పోర్టుల అనుసంధానం

విశాఖ ఎకనమిక్ రీజియన్‌లో 100-115 బిలియన్ డాలర్ల (సుమారు రూ.8.8 లక్షల కోట్ల నుంచి రూ.10.1 లక్షల కోట్ల మధ్య) పెట్టుబడులు వచ్చేందుకు ఆస్కారం ఉందని సీఎం పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు ప్రకటించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా 15 బిలియన్ డాలర్ల మేర, ప్రైవేటు, కార్పొరేట్ సంస్థల ద్వారా 85 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. ఈ ప్రాంతంలోని పోర్టులను రైల్వే లైన్లతో అనుసంధానం చేయనున్నట్లు వెల్లడించారు. త్వరలోనే ఈ మార్గంలోని రైల్వే మార్గాలను నాలుగు లేన్లుగా విస్తరించేందుకు కేంద్రం ప్రణాళికలు చేస్తోందని తెలిపారు. ఈ జిల్లాలో వచ్చే ప్రాజెక్టులను క్లస్టర్ అప్రోచ్‌తో గుర్తించి అభివృద్ధి చేయాలని ఆయా శాఖల అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ఆరోగ్య సంరక్షణ పాలసీతో మెడికల్ టూరిజాన్ని లింక్ చేయాలని సూచించారు. సీఎం అధ్యక్షతన వీఈఆర్ అథారిటీ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులు ప్రతిపాదించారు. దీనిపై స్పందించిన సీఎం.. వీఈఆర్ అభివృద్ధికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేసి అమలు చేయాలని ఆదేశించారు.

ప్రజలివ్వని ప్రతిపక్ష హోదా జగన్‌రెడ్డికి నేనెక్కడ నుంచి తెచ్చిస్తా..!



» వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను: స్పీకర్ అయ్యన్న

అనపర్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను. నా 44 సంవత్సరాల రాజకీయ జీవితంలో ఇటువంటి రాజకీయాలు నేనెప్పుడూ చూడలేదు' అని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం పెడపర్తిలోని పార్వతి రామలింగేశ్వరస్వామి ఆలయంలో సోమవారం నిర్వహించిన రుద్రయాగ, నవ చండీయాగంలో ఆయన కుటుంబంతో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. 'మాజీ సీఎం జగన్‌కి ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా పక్కన పెట్టారు. రాజ్యాంగాన్ని కాదని నేనెక్కడి నుంచి తెచ్చిస్తాను? దేశంలో ఎక్కడా లేని విధంగా 11 సీట్లు వచ్చిన పార్టీ ప్రతిపక్ష హోదా అడగడం విడ్డూరంగా ఉంది. ఎన్నో దేశాలను కాదని గూగుల్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేస్తుంటే గర్వించాల్సింది పోయి దానిపైనా విమర్శలు చేయడం వారి నైజాన్ని తెలియజేస్తుంది. రాష్ట్రం రాక్షసుల బారిన పడకుండా చూడాలని శివయ్యను కోరుకుని పెడపర్తి యాగంలో పాల్గొన్నా' అని అయ్యన్న అన్నారు.

న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్



అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఏపీ న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ నియమితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టులో రెండో స్థానంలో ఉన్న న్యాయమూర్తిని న్యాయసేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా నియమించడం సాంప్రదాయంగా వస్తోంది. హైకోర్టు సీజేను సంప్రదించిన తర్వాత ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌ను గవర్నర్ నామినేట్ చేస్తారు.

మంత్రి డోలాతో యునిసెఫ్ ప్రతినిధుల భేటీ

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామితో యునిసెఫ్ ప్రతినిధులు సోమవారం సచివాలయంలో భేటీ అయ్యారు. అంబేద్కర్ గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, డిజిటల్ అక్షరాస్యతపై ఉపాధ్యాయులకు, పోషకాహారం తయారీపై వంట మనుషులకు శిక్షణ, నీటి శుద్ధి, మెరుగైన పారిశుధ్యం తదితరాలకు యునిసెఫ్ తరపున సాంకేతిక సహకారం అందించే అంశంపై చర్చ జరిగింది. యునిసెఫ్ ప్రతినిధులు డాక్టర్ జిలాలెం, డాక్టర్ సాలిమా, ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి ప్రసన్నవెంకటేష్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి పెట్టుబడులు వైసీపీకి ఇష్టం లేదు

» పారిశ్రామిక సదస్సులో 401 ఒప్పందాలు, 9.8 లక్షల కోట్ల పెట్టుబడులు: ఎంపీ శ్రీభరత్

విశాఖపట్నం, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం అభివృద్ధి చెందడం వైసీపీకి ఇష్టం లేదని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ ఆరోపించారు. సోమవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'గత ఏడాది జరిగిన ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా వైసీపీలో మార్పు రాలేదు. వారికి చిత్తశుద్ధి ఉంటే రుషికొండపై ప్యాలెస్ నిర్మాణానికి చేసిన ఖర్చుతో ఉత్తరాంధ్రలో వైద్య కళాశాలలు పూర్తి చేసి ఉండేవారు. ఈనెల 14, 15 తేదీల్లో జరగనున్న పెట్టుబడిదారుల సదస్సులో సుమారు 401 ఒప్పందాలు జరుగుతాయి. వాటి ద్వారా రూ.9.8 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తున్నాం' అని ఎంపీ శ్రీభరత్ తెలిపారు.

బియ్యానికి గోడౌన్లు సిద్ధం చేయండి

» అధికారులకు మంత్రి నాదెండ్ల ఆదేశం

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ అవసరాల కోసం సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లను ముందుగానే సిద్ధం చేయాలని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో పౌర సరఫరాల శాఖకు 20 లక్షల టన్నులు, భారత ఆహార సంస్థకు 14 లక్షల టన్నుల సీఎంఆర్ బియ్యం నిల్వ కోసం గోడౌన్లు అవసరమవుతాయని తెలిపారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబర్‌లో రాష్ట్ర రైస్ మిల్లర్ల ప్రతినిధులతో మంత్రి సమావేశం నిర్వహించారు. పౌరసరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్‌గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రచారానికి సుప్రీంకోర్టు వేదిక కాదు

» కేఏ పాల్ తీరుపై న్యాయస్థానం అసహనం

» మెడికల్ కాలేజీల పీపీపీపై పిటిషన్ డిస్మిస్

న్యూఢిల్లీ, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ తీరుపై సుప్రీంకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రచారానికి సుప్రీంకోర్టు వేదిక కాదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను నిర్మించాలన్న ఏపీ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ గత నెల 15న కేఏ పాల్ వేసిన పిటిషన్ సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. పిటిషన్‌కు విచారణార్హత లేదని ధర్మాసనం తేల్చి చెప్పింది. మీడియాలో ప్రచారం కోసం పిటిషన్లు వేస్తున్నారని అసహనం వ్యక్తం చేసింది. ఏమైనా అభ్యంతరాలు ఉంటే హైకోర్టును ఆశ్రయించాలంటూ పిటిషన్‌ను డిస్మిస్ చేసింది.

10 పరీక్షల ఫీజు చెల్లింపునకు 25 వరకు గడువు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మార్చిలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థులు ఫీజు చెల్లింపునకు సంబంధించిన షెడ్యూలును ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ సోమవారం విడుదల చేశారు. రెగ్యులర్ విద్యార్థులు, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు ఎలాంటి ఆలస్య రుసుము లేకుండా ఈనెల 13 నుంచి 25 వరకు ఫీజు చెల్లించవచ్చు. ఆ తర్వాత రూ.50 ఆలస్య రుసుముతో డిసెంబరు 3 వరకు, రూ.200 ఆలస్య రుసుముతో డిసెంబరు 10 వరకు, రూ.500 ఆలస్య రుసుముతో డిసెంబరు 15 వరకూ పరీక్ష ఫీజు చెల్లించడానికి అవకాశం ఉంది. రెగ్యులర్ విద్యార్థులు అన్ని సబ్జెక్టులకు కలిపి రూ.125, ఒకసారి ఫెయిల్ అయిన విద్యార్థులు 3 కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125, మూడు సబ్జెక్టుల వరకు రూ.110, వృత్తి విద్యా విద్యార్థులు అదనంగా రూ.60, వయసు నిర్ధారణ రుసుము రూ.300 చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పైన పేర్కొన్న గడువు తేదీల్లో ఏవైనా ప్రభుత్వ సెలవు దినాలుగా ప్రకటిస్తే తర్వాతి పని దినాన్ని గడువు తేదీగా పరిగణిస్తారు. https://bse.ap.gov.inలో అందుబాటులో ఉన్న పాఠశాల లాగిన్ ద్వారా మాత్రమే విద్యార్థులు ఫీజు చెల్లించాలి. సీఎఫ్‌ఎంఎస్ లేదా బ్యాంకు చలాన్ల ద్వారా చెల్లింపులను అంగీకరించరు.

ఎర్రచందనం ఎగుమతికి పరిమితులు

అమరావతి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం ఎగుమతి విధానంలో కేంద్ర ప్రభుత్వం కొన్ని సవరణలు చేసింది. ఈ మేరకు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ తాజాగా నోటిఫికేషన్ జారీచేసింది. పట్టా భూముల్లో సాగైన ఎర్రచందనం ఎగుమతికి రాష్ట్రాలకు వార్షిక కోటాలు వర్తించనున్నాయి. ఏపీకి 280, తమిళనాడుకు 900, కర్ణాటకకు 10, గుజరాత్‌కు 100 టన్నులుగా కేంద్రం నిర్ణయించింది. ఏప్రిల్ నుంచి మార్చి వరకు వార్షిక సంవత్సరంగా పరిగణించనున్నారు.

'రాజంపేట'లో కోవర్టుల రాజ్యం

గత ఎన్నికల్లో రాష్ట్రమంతా కూటమి గాలి బలంగా వీచింది. వైసీపీ కేవలం 11 సీట్లకే పరిమితమైంది. అన్నమయ్య జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలలో రెండుచోట్ల టీడీపీ ఓడిపోయింది. కోవర్ట్ ఆపరేషన్ వల్లే తంబళ్లపల్లె, రాజంపేటలలో టీడీపీ ఓటమి పాలైందని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారు.

కొందరు తమ్ముళ్లు మోసేది పసుపుజెండా.. పెద్దిరెడ్డి ప్రయోజనాలే రహస్య అజెండా

» లోక్‌సభ స్థానం పరిధిలో 'ఫిక్సింగ్' రాజకీయం

» 2024 ఎన్నికల్లో వైసీపీ గెలుపు కోసం కృషి

» వైసీపీ అభ్యర్థులకు ఆర్థికసాయం

» నాడు పెద్దిరెడ్డి అరాచకాలు, అక్రమాలు

» 2023లో చంద్రబాబుపై వైసీపీ శ్రేణుల రాళ్లదాడి

» అక్రమార్కులకు కొందరు టీడీపీ నేతల సహకారం

» ఇప్పటికీ టీడీపీ, వైసీపీ నేతలు చెట్టాపట్టాల్

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

మనం పెంచుకున్న కోడి రోజూ మన ఇంట్లో తింటూ.. గుడ్డు మాత్రం పొరుగింట్లో పెడితే ఎలా ఉంటుంది? అచ్చం ఇలాంటి పరిస్థితే రాజంపేట లోక్‌సభ స్థానం పరిధిలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాలలో తెలుగుదేశం పార్టీలో కనిపిస్తోంది. ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్రస్థాయి పదవుల్లో ఉన్న నాయకులు, నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు, పదవులు ఉన్న కొందరు నాయకులు వైసీపీతో లోపాయికారీ ఒప్పందంతో పనిచేస్తున్నారు. పార్టీ కోసం ప్రాణాలను సైతం పణంగా పెట్టే కార్యకర్తలు, ద్వితీయశ్రేణి నాయకుల మనోభావాలతో సంబంధం లేకుండా వైసీపీ నాయకులతో ఆర్థిక, వ్యాపార సంబంధాలు నెరుపుతున్నారు. రహస్యంగా సంబంధాలు కొనసాగిస్తున్నారు. వైసీపీ హయాంలో టీడీపీ అధినేత చంద్రబాబును అక్రమ కేసులో అరెస్టు చేసి 52 రోజులు జైలులో ఉంచిన సంగతి తెలిసిందే. 2024 ఎన్నికల్లో టీడీపీ చావో రేవో అనే రీతిలో పోరాడింది. అయితే గత ఎన్నికల్లో అన్నమయ్య జిల్లాలో కొందరు జిల్లా, రాష్ట్ర స్థాయి టీడీపీ నాయకులు మాత్రం వైసీపీ అభ్యర్థులకు ఆర్థిక సాయం చేయగా.. మరికొందరు పట్టుబట్టి సొంత పార్టీ అభ్యర్థి ఓటమికి గట్టిగా కృషి చేశారు. అయినా వీళ్లే ప్రస్తుత ప్రభుత్వంలో కీలక స్థానాలలో ఉన్నారు. వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలపై ఎప్పుడూ నోరెత్తరు. పైకి మోసేది పసుపు జెండా, లోలోపల పెద్దిరెడ్డి కుటుంబ ప్రయోజనాలే రహస్య అజెండాగా పనిచేస్తున్నారు. టీడీపీలో ఉంటూ వైసీపీకి కోవర్టులుగా పనిచేస్తున్నారు. అధిష్ఠానం ఇప్పటికైనా మేలుకోకపోతే రాబోయే రోజుల్లో పార్టీకి కష్టాలు తప్పవని అంటున్నారు.

పెద్దిరెడ్డి అక్రమాలపై నోరే మెదపరు

వైసీపీ పాలనలో అన్నమయ్య జిల్లాలో పెద్దిరెడ్డి కుటుంబం, వాళ్ల అనుచరులు ఎన్నో అక్రమాలకు పాల్పడ్డారు. పేదల భూములు ఆక్రమించారు. ఇతరుల పేరుతో ఎన్నో సంవత్సరాలుగా నడుస్తున్న క్వారీలను స్వాధీనం చేసుకున్నారు. ఇసుకను రేయింబవళ్లూ బెంగళూరుకు తరలించి వందల కోట్లు అక్రమంగా సంపాదించారు. ఫ్రీహోల్డ్ పేరుతో వందల ఎకరాలను అక్రమంగా రెగ్యులర్ చేయించుకున్నారు. తవ్వేకొద్దీ ఈ అక్రమాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. ఈ పాపాలు బయట పడకూడదనే మదనపల్లె సబ్‌కలెక్టర్ కార్యాలయానికే ఆయన మనుషులు నిప్పుపెట్టి కీలక డాక్యుమెంట్లను కాల్చివేశారనే ఆరోపణలున్నాయి. ఈ సంఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణ చేయిస్తోంది. తంబళ్లపల్లె, పీలేరు, మదనపల్లె, రాయచోటి, రాజంపేట నియోజకవర్గాలలో దాదాపు కంకర క్వారీలు వీళ్ల కనుసన్నల్లోనే నడిచాయి. ఇసుక, కంకర అక్రమంగా తరలించేందుకు పీఎల్‌ఆర్ పేరుతో వందలాది టిప్పర్లు జిల్లాలో రాత్రిపగలూ తిరిగాయి. వాటి మీద కనీసం ఒక కేసు కూడా నమోదైన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం రాగానే వాటి జాడే లేదు. ఒకటి, రెండు నియోజకవర్గాలకు చెందిన నాయకులు తప్ప మిగిలిన ముఖ్య నాయకులు ఎవరూ వీటి గురించి మాట్లాడరు. గతంలో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయరు. పోలీసులకు ఫిర్యాదులు చేయరు. పార్టీ జిల్లా అధ్యక్షుడితో సహా ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు ఎవరూ పెద్దిరెడ్డి అక్రమాల గురించి మాట్లాడే సాహసం చేయరు. ఎప్పుడైనా అధిష్ఠానం నుంచి ఆదేశాలు వచ్చినపుడు మాత్రమే మాట్లాడతారు. ఆ తర్వాత ఆ ఊసే ఎత్తరు.

అంతా కోవర్ట్ రాజకీయమే

తంబళ్లపల్లె నియోజకవర్గంలో గతంలో టీడీపీ చాలా బలంగా ఉండేది. టీడీపీ నాయకులు రాజకీయంగా ఒకప్పటి కాంగ్రెస్ పార్టీతో గట్టిగా పోరాడేవాళ్లు. 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోదరుడు ద్వారకనాథరెడ్డి గెలవడం, వైసీపీ అధికారంలోకి రావడంతో ఈ పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. డబ్బు మాత్రమే పనిచేయడం మొదలు పెట్టింది. దీంతో టీడీపీలోని ముఖ్య నాయకులు సైతం ఆ ఐదేళ్లూ వైసీపీకి వ్యతిరేకంగా గొంతు విప్పలేదనే ఆరోపణలు ఉన్నాయి. వాస్తవానికి 2019 నుంచి 2024 వరకు తంబళ్లపల్లె నియోజకవర్గంలో తాలిబాన్ తరహా పాలన జరిగింది. అనేక అక్రమాలు జరిగాయి. భూములు ఆక్రమించారు. అక్రమ కేసులు పెట్టి హింసించారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దాడులు సైతం చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండానే రూ.700 కోట్లతో ముదివేడు వద్ద పెద్దిరెడ్డి కుటుంబం ఒక రిజర్వాయర్‌నే నిర్మించింది. భూములు కోల్పోయిన నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వకుండానే ఈ పనులు జరిగాయి. 2023లో తంబళ్లపల్లె నియోజకవర్గ పర్యటనకు వచ్చిన చంద్రబాబుపై వైసీపీ నాయకులు, కార్యకర్తలు రాళ్లదాడికి తెగించారు. తంబళ్లపల్లె, మదనపల్లె, పీలేరు నియోజకవర్గాలకు చెందిన సుమారు 750 మంది టీడీపీ నాయకులు, క్రియాశీల కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించారు. వందల ఎకరాలను వైసీపీలో అతి ముఖ్యనాయకులు ఆక్రమించారు. అయినా వీటి గురించి తంబళ్లపల్లె నియోజకవర్గానికి చెందిన ముఖ్య నాయకులు ఎవరూ ఇప్పుడు నోరు మెదపడం లేదు. లోలోపల వైసీపీ ముఖ్య నాయకులతో లాలూచీ పడడంతోనే ఎవరూ బాధితుల పక్షాన నిలబడలేదని టీడీపీ కార్యకర్తలు వాపోతున్నారు. ఒక్కసారి కూడా టీడీపీ జెండా మోయని దాసరిపల్లె జయచంద్రారెడ్డికి 2024 ఎన్నికల్లో టీడీపీ టికెట్ ఇచ్చారు. ఆయన పెద్దిరెడ్డి కుటుంబానికి చెందిన వ్యక్తి అని, వైసీపీ కోవర్ట్ అని అప్పట్లో నియోజకవర్గంలోని టీడీపీ క్యాడర్ మొత్తం వ్యతిరేకించినా వినలేదు. పార్టీ టికెట్ తెచ్చుకున్న ఆయన ఎన్నికల్లో తన గెలుపు కోసం పూర్తి స్థాయిలో కష్టపడలేదన్న ప్రధాన ఆరోపణ ఉంది. కొన్ని మండలాల్లో కనీసం ఒకరోజు కూడా ప్రచారం చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత వైసీపీ పాలనలో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని అందరూ ఊహించారు. అయితే ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు అవుతున్నా.. అక్రమార్కులపై కనీసం ఈగ కూడా వాలలేదని టీడీపీ కార్యకర్తలు వాపోతున్నారు. కీలక స్థానాలలో ఉన్న కొందరు నాయకులు వారికి సహకరిస్తున్నారని, అంతేగాక వర్గాల పేరుతో టీడీపీకి ఓటు వేసిన వారిపైనే కేసులు బనాయిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

వైసీపీ అభ్యర్థికి 'తమ్ముళ్ల' సాయం

రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గంలో అయితే మరీ విచిత్రమైన పరిస్థితి. టీడీపీలో చాలా ఏళ్లుగా ఉంటూ చంద్రబాబు, లోకేశ్ వెంట తిరిగే నాయకులు.. గత ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డికి ఆర్థిక సాయం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సుమారు రూ.6 కోట్లు వడ్డీకి ఇచ్చినట్లు చెబుతున్నారు. ఆ డబ్బుకు గ్యారెంటీగా వైసీపీ అభ్యర్థి కుటుంబసభ్యుల పేరిట రాజంపేట మండలం బ్రాహ్మణపల్లెలో సర్వే నంబరు-111కు పైన.. 120 లోపు ఉన్న భూముల్లో 17 ఎకరాలకు పైగా టీడీపీ నాయకుడు తన పేరిట రిజిస్టర్ చేయించుకున్నారు. ఇదంతా 2024 ఏప్రిల్ నుంచి జూలైలోపు జరిగింది. వైసీపీ అభ్యర్థికి డబ్బు సర్దుబాటు చేసిన నాయకుడు.. పార్టీకి రాష్ట్రంలో చేసిన సేవ చాలదని, అమెరికాలోనూ ఇదేవిధంగా చేస్తున్నారనే ప్రచారం ఉంది. ఆయనే గాక టీడీపీలో జిల్లా స్థాయి పదవులో ఉన్న ఓ నాయకుడు టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యంఓటమికి గట్టిగా పనిచేశారనే ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ అభ్యర్థికి లోపాయికారీగా సహకరించి, టీడీపీ అభ్యర్థికి ఎన్నికల సమయంలో డబ్బు సర్దుబాటు కాకుండా చక్రం తిప్పారనే విమర్శలు ఉన్నాయి. అంతేగాక ఆయనకు వ్యతిరేకంగా అధిష్ఠానానికి తప్పుడు నివేదికలు పంపించారనే ఆరోపణలు ఉన్నాయి. అయినా పార్టీ ఓటమికి కారకులైన వాళ్లపై చర్యలు తీసుకోకపోగా పదవులు, బాధ్యతలు కట్టబెట్టారు.

ఆదుకోండి

మొంథాతో అంచనాకు మించి అపార నష్టం

» రూ.901.4 కోట్ల తక్షణ సాయం అందించండి

» కేంద్ర బృందానికి రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి

» ప్రకాశం, ఏలూరు, కృష్ణా, 'తూర్పు'లో పర్యటన



కృష్ణా జిల్లా కంకిపాడు మండలంలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

(ఆంధ్రజ్యోతి - న్యూస్‌నెట్‌వర్క్)

మొంథా తుఫాన్ ఏపీకి అంచనాలకు మించిన నష్టాన్ని కలిగించిందని, తక్షణ సాయంగా రూ.901.4 కోట్లు అందించాలని కేంద్ర బృందాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరింది. తుఫాన్ వల్ల రూ.6,384 కోట్ల నష్టం వాటిల్లిందని వివరించింది. తుఫాన్ నష్టాన్ని మదింపు వేయడానికి కేంద్ర హోంశాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమీ బసు నేతృత్వంలోని బృందం రాష్ట్రానికి వచ్చింది. సోమవారం ఉదయం సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో తుఫాన్ ప్రభావం, నష్టం, సహాయచర్యలపై రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, విపత్తు నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ ఇచ్చిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను కేంద్ర బృందం తిలకించింది. అనంతరం పలు జిల్లాల్లో పర్యటించి తుఫాన్ నష్టాన్ని అంచనా వేసింది. మొంథా తుఫాన్ రాష్ట్రంలోని 24 జిల్లాల పరిధిలోని 443 మండలాల్లో ప్రభావం చూపిందని, ముగ్గురు చనిపోయారని తెలిపారు. వ్యవసాయ రంగానికి తీవ్ర నష్టం కలిగిందని, కోతదశలో ఉన్న పంటలను ముంచేసిందని తమ ప్రజెంటేషన్‌లో జయలక్ష్మి, ప్రఖర్ జైన్ తెలిపారు. 1.61 లక్షల హెక్టార్లలో వరి, పత్తి, మినుము, మొక్కజొన్న, 6,250 హెక్టార్లలో ఉద్యానవన పంటలు, 17.72 హెక్టార్లలో మలబరీ తోటలు, 3,063 హెక్టార్లలో చేపల చెరువులు ధ్వంసమయ్యాయని తెలిపారు. 4,566 ఇళ్లు, 1,853 పాఠశాలలు, 4,794 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రోడ్లు, 311 వంతెనలు, కల్వర్టులు, 3,437 మైనర్ ఇరిగేషన్ చెరువులు, 2,417 మేజర్, మీడియం ఇరిగేషన్ ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని తెలిపారు. 58 మున్సిపల్ పట్టణాల్లో మౌలికవసతులు దెబ్బతిన్నాయని వివరించారు. యుద్ధ ప్రాతిపదికన సహాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. 9,960 ఇళ్లు నీట మునిగాయని, 1,11,402 మంది నిరాశ్రయులయ్యారని పేర్కొన్నారు.

జిల్లాల్లో కేంద్ర బృందం పర్యటన

కేంద్ర బృందం సభ్యులు రెండు టీమ్‌లుగా ఏర్పడి, ఒకటి ప్రకాశం జిల్లాలో, రెండోది ఏలూరు, కృష్ణా, తూర్పుగోదావరి జిల్లాల్లో పర్యటించి నష్టం తీవ్రత అంచనా వేశారు. తుఫాన్ నష్టాలపై ప్రకాశం కలెక్టర్ రాజాబాబు వివరించారు. అనంతరం కొత్తపట్నం, నాగులుప్పలపాడు మండలాల్లో దెబ్బతిన్న పంటలు, ఆక్వా చెరువులను బృందం పరిశీలించింది. ఏలూరు జిల్లాలో పలు చోట్ల దెబ్బతిన్న పంటలను, పరిశీలించి వివరాలు నమోదు చేసుకుంది. 5,703 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయని కలెక్టర్ వెట్రిసెల్వి నివేదించారు. 80 శాతం పంట దెబ్బతిందని కృష్ణా జిల్లా అధికారులు వివరించారు.

అందెశ్రీ హఠాన్మరణం



» తెలంగాణ రాష్ట్ర గీతం సృష్టికర్త, వాగ్గేయకారుడు మృతి

» ప్రభుత్వ లాంఛనాలతో నేడు అంత్యక్రియలు

హైదరాబాద్ /అమరావతి నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కవి, వాగ్గేయకారుడు, తెలంగాణ రాష్ట్ర గీతాన్ని సృజించిన అందెశ్రీ (64) ఇకలేరు. హైదరాబాద్ లాలాపేటలోని తన నివాసంలో సోమవారం ఉదయం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఇంట్లోనే ఉదయం 7 గంటల ప్రాంతంలో కుప్పకూలిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన తుదిశ్వాస విడిచినట్లు వైద్యులు ప్రకటించారు. ఆయనకు భార్య, కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. అందెశ్రీ అంత్యక్రియలను అధికార లాంఛనాలతో నిర్వహించనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. ఆయన అంత్యక్రియలను మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్‌లోని ఔటర్ జంక్షన్‌లో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందెశ్రీ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. లాలాపేటలోని ఆయన ఇంటి నుంచి అంతిమ యాత్ర ప్రారంభం కానుంది.

అశ్రద్ధే ప్రాణాలు తీసిందా?

ఆరోగ్యం విషయంలో కొద్దిపాటి అశ్రద్ధ చేయడమే అందెశ్రీ ప్రాణా లు తీసిందని ఆయన సన్నిహితు లు చెబుతున్నారు. ఆదివారం ఆయన ఘట్‌కేసర్ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో నిర్మాణంలో ఉన్న తన ఇంటి వద్దకు వెళ్లారు. పనులను పర్యవేక్షించారు. సాయంత్రానికి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు. అప్పుడే ఆయన తనకు ఒంట్లో బాగోలేదని, అలసటగా ఉందని, రెండు రోజులుగా కళ్లు తిరుగుతున్నాయని చెప్పినట్లు సన్నిహితులు వివరిస్తున్నారు. కాగా, అందెశ్రీ హైపర్ టెన్షన్‌తో బాధపడుతున్నారని, మందులు సరిగా వేసుకోలేదని గాంధీ ఆస్పత్రి ప్రొఫెసర్ సునీల్ కుమార్ తెలిపారు.

అందెశ్రీకి చంద్రబాబు నివాళి

డాక్టర్ అందెశ్రీ మరణవార్త దిగ్భ్రాంతిని కలిగించిందని ఏపీ సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగు సాహితీలోకానికి ఇది తీరని లోటని, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. మంత్రి లోకేశ్ కూడా అందెశ్రీ మృతికి సంతాపం తెలిపారు.

కేసును ఎలా రాజీ చేశారు?

» మీకు తెలియకుండా జరిగే వీలు లేదు

» ఎవరైనా అధికారి లేక నేత ఒత్తిడి చేశారా?

» దొరికింది 12 నోట్లయితే, తొమ్మిదే చూపారేం?

» డాలర్ విలువ పెంచి నమోదు చేశారేం?

» 'పరకామణి' కేసులో అప్పటి సీఐ జగన్మోహన్ రెడ్డి, ఎస్ఐ లక్ష్మీరెడ్డి, వీజీవో గిరిధర్‌పై సీఐడీ ప్రశ్నలవర్షం



విచారణ అనంతరం వెళుతున్న నాటి వీజీవో గిరిధర్, విచారణకు వస్తున్న నాటి ఎస్ఐ లక్ష్మీరెడ్డి

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుమల 'పరకామణి' చోరీ కేసులో సీఐడీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసు లోక్ అదాలత్‌లో రాజీ అయిన సమయంలో తిరుమలలో పనిచేసిన సీఐ జగన్మోహన్ రెడ్డి (ప్రస్తుతం వీఆర్), వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మీరెడ్డి (ఇప్పుడు వీఆర్), విజిలెన్స్ ఆఫీసర్ (వీజీవో) గిరిధర్ (ప్రస్తుతం నెల్లూరు పీటీసీ డీఎస్పీ)లను సోమవారం తిరుపతిలోని పద్మావతి అతిథి గృహంలో వేర్వేరుగా విచారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కేసును రాజీ చేయడంలో అధికారులు లేక రాజకీయ నాయకుల ఒత్తిడి ఏమైనా ఉందా అని ముగ్గురినీ సీఐడీ అధికారులు ప్రశ్నించారు. తొలుత జగన్మోహన్‌రెడ్డిని దాదాపు రెండు గంటల పాటు విచారించారు. 'జిల్లాలో ఎంతకాలం పనిచేశారు...గత ప్రభుత్వంలో ఎక్కడెక్కడ పనిచేశారు...తిరుమలకు మిమ్మల్ని సిఫారసు చేసింది ఎవరు... అక్కడకు సీఐగా వచ్చాక ఎన్నాళ్లకు పరకామణి కేసు బయటకు వచ్చింది...అప్పుడు ఎస్పీ ఎవరు...ఆయన ప్రోద్బలంతోనే రాజీ చేశారా...ఈ కేసు ఎవరు నమోదు చేశారు...అంటూ ప్రశ్నలవర్షం కురిపించారు. ఈ కేసుతో తనకు సంబంధం లేదని, అప్పటి వన్‌టౌన్ ఎస్ఐ లక్ష్మీరెడ్డి కేసు నమోదు చేసి, విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారని ఆయన సమాధానమిచ్చినట్లు సమాచారం. దీనిపై ఏకీభవించని దర్యాప్తు అధికారులు.. "మీరు అక్కడ ఎస్ఐ కంటే పెద్ద అధికారి.. మీ పరిధిలోనే అతను పనిచేస్తున్నారు..అలాంటి సమయంలో లోక్ అదాలత్‌లో కేసు రాజీ జరిగిన తతంగం మీకు తెలియకుండా ఎలా ఉంటుంది" అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. రవికుమార్‌తో మీకెలా పరిచయం.. కేసు రాజీ విషయంలో ఎంతమొత్తం చేతులు మారాయని ప్రశ్నించినట్లు సమాచారం. రవికుమార్ ఒకసారి స్టేషన్‌కు వచ్చారని, అంతకుమించి తనకు పరిచయం లేదని ఆయన చెప్పినట్టు తెలిసింది. తిరుమలలో, వన్‌టౌన్‌లో ఎంత కాలం పనిచేశారంటూ ఎస్ఐ లక్ష్మీరెడ్డిని సీఐడీ ప్రశ్నించారు. పరకామణి కేసును మీరేనా రిజిస్టర్ చేసిందని అడిగారు. అప్పటి ఏవీఎస్‌వో సతీశ్‌కుమార్ సీఐ జగన్మోహన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారని, సీఐ ఎండార్స్ చేయడంతో కేసు నమోదు చేశానని లక్ష్మీరెడ్డి చెప్పినట్లు తెలిసింది. కేసు దర్యాప్తులో భాగంగా రవికుమార్‌ను పిలిపించి మాట్లాడానని, అందరినీ విచారించాక చార్జిషీటు వేసినట్లు తెలిపారు. ఏ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు? ఆ సెక్షన్లు ఏం చెబుతున్నాయి? కేసు రాజీకి మీపై ఒత్తిడి వచ్చిందా? అని ప్రశ్నించారు. తనపై ఎవరి ఒత్తిడీ లేదని, వాళ్లు రాజీకి పోయినట్టుగానీ, కేసు క్లోజ్ చేసినట్టుగానీ తనకు తెలియదని ఎస్ఐ చెప్పినట్లు తెలిసింది.

ఎందుకలా చూపారు?

తనిఖీల్లో రవికుమార్ వద్ద 112 నోట్లు దొరికినట్టు ఫిర్యాదులో ఉండగా, రికార్డుల్లో మాత్రం తొమ్మిది నోట్లే ఎలా చూపించారని జగన్మోహన్ రెడ్డి, లక్ష్మీరెడ్డిలను సీఐడీ అధికారులు ప్రశ్నించారు. పరకామణిలో కాజేసిన సొమ్ముతో రవికుమార్ రూ.కోట్లకు పడగలెత్తాడని ఆరోపణలున్న నేపథ్యంలో అప్పటి నేతలు, ప్రజాప్రతినిధుల కల్పించుకుని లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేయించారా అని అడిగినట్లు తెలిసింది. అయితే, పలు ప్రశ్నలకు జగన్మోహన్ రెడ్డి, లక్ష్మీరెడ్డి ఇచ్చిన సమాధానాలకు పొంతన లేదు. దీంతో 'మీ మాటల్లో చాలా అనుమానాలున్నాయ'ని దర్యాప్తు అధికారులు చెప్పినట్లు తెలిసింది. ఈ విచారణ మొత్తాన్ని వీడియో రికార్డింగ్ చేసినట్లు తెలిసింది. కాగా, తాను భగవంతుడిపై ప్రమాణం చేసి చెబుతున్నానని, ఈ కేసుతో తనకేమీ సంబంధం లేదని దర్యాప్తు అధికారులకు జగన్మోహన్‌రెడ్డి చెప్పినట్లు సమాచారం. ఒకవేళ ప్రభుత్వ ఒత్తిడితో తనను ఇరికించాలని చూస్తే భగవంతుడే చూసుకుంటాడని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

ఏవీఎస్‌వో ఫిర్యాదుపై ఎలా రాజీ చేశారు? గిరిధర్‌ను ప్రశ్నించిన అధికారులు

తిరుమలలో వీజీవోగా ఎన్నేళ్లు పనిచేశారు... మీకు పోస్టింగ్ ఇప్పించింది ఎవరు..విజిలెన్సు అధికారులు ఇచ్చిన ఫిర్యాదును పోలీసులు, రాజకీయ నాయకులు కలసి లోపాయకారీ ఒప్పందంతో ఎలా రాజీ చేశారు' అంటూ నాటి వీజీవో గిరిధర్‌ను సీఐడీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. అయితే, తనకేం తెలియదని ఆయన సమాధానమిచ్చినట్టు సమాచారం. రవికుమార్ ఆస్తుల వివరాలు, ఆయన టీటీడీకి రాసిచ్చిన ఆస్తుల విలువ ఎంత...లోక్ అదాలత్‌లో రాజీ చేసిన వారెవరనే విషయాలపై సమగ్రంగా ఈవోకు నివేదిక అందచేశానని, మిగిలిన విషయాలు తనకు తెలియదని ఆయన చెప్పినట్లు తెలిసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.